www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 24-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 310 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి సా. 6.01 తదుపరి పాడ్యమి; నక్షత్రం: మఖ రా. 10.21 తదుపరి పుబ్బ; వర్జ్యం: ఉ 8.53-10.41; దుర్ముహూర్తం: ఉ. 6.41-8.14; అమృతఘడియలు: రా. 7.39-9.27; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.41; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఓట్ల కుట్రపై ఎట్టకేలకు కేసు

విశాఖ 'పశ్చిమ'లో

భారీగా తొలగింపునకు కుట్ర

తప్పుడు ఫారం-7లు

సమర్పించిన పది మందిపై కేసు

2



నా వారాణసీ బిడ్డలను తాగుబోతులంటారా?

ఇదేం భాష..? యూపీ యువతను అవమానించడమే

12 కాంగ్రెస్ నేత రాహుల్‌పై ప్రధాని మోదీ ధ్వజం

సొంత నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో ప్రధాని

సీఎం యోగితో కలిసి అర్ధరాత్రి రోడ్డు ఆకస్మిక తనిఖీ



2

నిందితురాలిగా కవిత!

ఢిల్లీ మద్యం కేసులో ఇప్పటిదాకా ఆమెను సాక్షిగా పరిగణించిన సీబీఐ

అప్రూవర్ రాఘవరెడ్డి ఇచ్చిన సమాచారంతో నిందితురాలిగా మార్పు

ఇదే కేసులో త్వరలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్టు చేసే అవకాశం

అదే సమయంలో కవిత అరెస్టు కూడా?

బీఆర్‌ఎస్ పట్ల బీజేపీ వైఖరి మారిన దృష్ట్యానే ఈ పరిణామాలు!

కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోవద్దని బెదిరించడానికే కేజ్రీవాల్ అరెస్టుకు చర్యలు

అరెస్టు చేసినా పొత్తు ఆగదు: ఆప్



11

పులివెందుల గడ్డపైనే ఉంటా

జగన్ ఇంటి పక్కనే ఉంటా.. ఏం చేసుకుంటారో చేసుకోండి

ఎన్ని స్కెచ్‌లు వేసినా ఎవరికీ భయపడేది లేదు

తప్పు దిద్దుకునేందుకే అప్రూవర్‌గా మారా

వైసీపీ గుట్టు రట్టవుతుందనే తప్పుడు కేసులు

'సిద్ధం'లో వివేకా హత్యపై జగన్ మాట్లాడరేం?

అవినాశ్, జగన్ ఓట్ల కోసం వెళ్తే రాళ్లేస్తారు

బెయిలుపై విడుదలైన దస్తగిరి వ్యాఖ్యలు



2

విశ్రాంత ఐఏఎస్ అధికారి

జన్నత్ హుస్సేన్ కన్నుమూత

కలెక్టరు నుంచి స్పెషల్ సీఎస్ వరకు..

ఉమ్మడి రాష్ట్రంలో వివిధ హోదాల్లో సేవలు

ఎక్సైజ్ కమిషనర్‌గా అక్రమ మద్యంపై కొరడా

వైఎస్‌కు ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు

ఉచిత విద్యుత్ స్కీం రూపకల్పనలో కీలక పాత్ర

కొన్నేళ్లుగా అల్జీమర్స్‌తో బాధపడుతున్న జన్నత్

సూళ్లూరుపేట నివాసంలో కన్నుమూత

జాగ్రత్త.. యుద్ధానికి దూరంగా ఉండండి

త్వరలోనే స్వదేశానికి రప్పిస్తాం

రష్యా-ఉక్రెయిన్ పోరులో ఇరుక్కున్న భారతీయులకు కేంద్రం భరోసా 12

సరోగసీ నిబంధనల్లో సవరణలు

ఇకపై దాతల నుంచీ అండం, వీర్యం: కేంద్రం 12

ఉద్యమం తప్పదు

జూలై నాటికి ఈ ప్రభుత్వం ఉంటుందా?

భృతి ఇమ్మంటే పీఆర్సీ అంటున్నారు

డీఏ సహా ఏదడిగినా మాట మారుస్తున్నారు

ఇన్నిసార్లు ఏ ప్రభుత్వంతోనూ భేటీ కాలేదు

ఉద్యోగ సంఘాల నేతల ఆగ్రహం



ఉద్యోగ సంఘాలతో చర్చలు జరుపుతున్న మంత్రి బొత్స, సలహాదారు సజ్జల, సీఎస్

అయ్యో.. ఐఆర్!

పీఆర్సీ ఇస్తుంటే ఐఆర్ ఎందుకంటూ సర్కారు ఝలక్

భృతి ఇచ్చేది లేదన్న జగన్ సర్కార్

ఉద్యోగ సంఘాల నేతలకు స్పష్టం చేసిన మంత్రుల కమిటీ

గత సంప్రదాయాలకు తూట్లు

ఉత్తుత్తి చర్చలు.. ఉపన్యాసాలు

ఉద్యోగులకు ఒరిగింది శూన్యం

జూలైలో పీఆర్సీ ఇస్తామని ప్రకటన

పీఆర్సీ ఇస్తున్నప్పుడు ఐఆర్ ఎందుకన్న మంత్రి బొత్స

వచ్చే ప్రభుత్వంలో అమలు చేసే దానిపై హామీలా?

ఉద్యోగ నేతల తీవ్ర ఆగ్రహం

చర్చలు విఫలం.. ఉద్యమం తప్పదని వెల్లడి

అటు మంత్రివర్గ ఉప సంఘం.. ఉద్యోగ సంఘాల నేతలు! మరో 'చాయ్ బిస్కట్' సమావేశం ముగిసింది. 'అదిగో పీఆర్సీ' అంటూ మబ్బుల్లో నీళ్లు చూపించి... ఇప్పుడు ఐఆర్ ఇచ్చేది లేదని సర్కారు తేల్చింది. ఎన్నికల తర్వాత ఏమవుతుందో ఎవరికీ తెలియదు. కానీ... జూలైలో పీఆర్సీ ఇస్తున్నామని, ఐఆర్ ఎందుకని మెలిక పెట్టింది. ఇతర డిమాండ్లపైనా ఎలాంటి స్పందనా కనిపించలేదు. దీంతో.. రెండు నెలలకోసారి జరిగే ఉత్తుత్తి చర్చల్లాగే.. శుక్రవారం నాటి భేటీ కూడా విఫలమైంది. ఉద్యమం ఆగదని సంఘాలు స్పష్టంచేశాయి.

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రతి అయిదేళ్లకొకసారి ఉద్యోగులకు ప్రభుత్వం పీఆర్సీ ఇవ్వడం సాధారణం. ఇది ఆలస్యమైతే మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వడం సంప్రదాయమే. ఈ సంప్రదాయానికి జగన్ సర్కార్ స్వస్తి పలికింది. వచ్చే జూలైలో పీఆర్సీ ఇస్తామని, ఇక ఐఆర్ ఎందుకని ప్రశ్నిస్తోంది. జూలైలోనే పీఆర్సీ పూర్తిగా చెల్లిస్తామని, ఐఆర్ ఇవ్వబోమని శుక్రవారం అమరావతి సచివాలయంలో జరిగిన చర్చల్లో ఉద్యోగ సంఘాలకు మంత్రుల కమిటీ తేల్చి చెప్పింది. దీంతో నివ్వెరపోయిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని ఉద్యోగ సంఘాలు.. ఇదేం సంప్రదాయం అంటూ మంత్రుల కమిటీని నిలదీశాయి. అయితే, 'ఇది మా ప్రభుత్వ కొత్త సంప్రదాయం' అంటూ మంత్రుల కమిటీ సెలవిచ్చింది. దీంతో ప్రభుత్వం-ఉద్యోగ సంఘాల నేతల మధ్య చర్చలు

మిగతా 11వ పేజీలో...

బుర్ర ఉందా.. లేదా?

ఉద్యోగులపై బొత్స, సజ్జల అసహనం

'పీఆర్సీ'కి ఉద్యోగుల కేటాయింపు

8 నెలలకు మేల్కొన్న సర్కారు.. ఎన్నికల వేళ జగన్మాయ: ఉద్యోగులు

టీడీపీ-జనసేన తొలి జాబితా నేడే

65 మంది అభ్యర్థుల ప్రకటన!

తెలుగుదేశం నుంచి 50-52 మంది

జనసేన తరపున 15 మంది

ఉదయం 11.40కి ఉమ్మడిగా విడుదల చేయనున్న బాబు, పవన్

కుప్పం బరిలో టీడీపీ అధినేత

భీమవరంలో జనసేనాని పోటీ

టెక్కలి-అచ్చెన్న, మంగళగిరి-లోకేశ్

తెనాలి నాదెండ్ల మనోహర్‌కు

100కిపైగా చోట్ల కసరత్తు పూర్తి

బీజేపీ రాకతో ప్రకటన వాయిదా

మాఘ పౌర్ణమి కావడంతో ఇబ్బందుల్లేని సీట్లలో అభ్యర్థుల వెల్లడి

బీజేపీ నాయకత్వానికీ సమాచారం

కొందరు లోక్‌సభ అభ్యర్థుల పేర్లు కూడా వెల్లడించే చాన్సు

ఎల్లుండి టీడీపీలోకి వైసీపీ ఎంపీ లావు, ఎమ్మెల్యేలు వసంత, పార్థసారథి

ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి కూడా

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో పోటీచేసే టీడీపీ, జనసేన అభ్యర్థుల తొలి జాబితా వచ్చేస్తోంది. శనివారం మాఘ పౌర్ణమి మంచి రోజు కావడంతో మొదటి విడత అభ్యర్థుల పేర్లు వెల్లడించాలని నిర్ణయించినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. ఉదయం 11.40 నుంచి 11.47 గంటల మధ్య ముహూర్తం బాగుందని పండితులు చెప్పడంతో.. రెండు పార్టీల అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి ఉమ్మడిగా దీనిని విడుదల చేస్తారని సమాచారం. జాబితాలో 65 మంది వరకు అభ్యర్థులు ఉండే అవకాశం ఉంది. వీరిలో టీడీపీ నుంచి 50-52 మంది, జనసేన నుంచి సుమారు 15 మంది ఉంటారని అంటున్నారు. చంద్రబాబు శుక్రవారం సాయంత్రం ఇక్కడి ఉండవల్లి నివాసానికి చేరుకున్నారు. పవన్ కల్యాణ్ కూడా మంగళగిరిలోని తన నివాసానికి వచ్చారు. ఉదయం ఉండవల్లికి రావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఆ పార్టీ సీనియర్లు యనమల

మిగతా 11వ పేజీలో...

రామభక్తులు హామీలు మరవడం మోసం కాదా? 11

తిరుపతిలో పదేళ్లపాటు హోదా ఇస్తానన్న మోదీ ఎందుకివ్వలేదు?

హోదా కోసం రాజీనామాలన్న జగన్ ఒక్కరితో అయినా చేయించారా?

రాష్ట్ర ప్రయోజనాలు తాకట్టు పెట్టి జగన్ అధికారాన్ని అనుభవిస్తున్నారు

టీడీపీ, వైసీపీల్లాంటి బలమైన పార్టీలను ఢీ కొట్టేందుకే పొత్తులు: షర్మిల

నదులు గుల్ల

రాష్ట్రంలో పర్యావరణ విధ్వంసం

2021 నుంచే అడ్డగోలుగా

ఇసుక తవ్వకాలు



నదీ ప్రవాహాలు దారి మళ్లింపు

అడుగడుగునా నిబంధనల ఉల్లంఘన

పర్యావరణ పరిరక్షణలో నోడల్ ఏజెన్సీగా గనుల శాఖ వైఫల్యం

ఎన్‌జీటీ ఉత్తర్వులూ బేఖాతర్

నాడు జేపీ వెంచర్స్ నుంచి నేడు ప్రతిమ, జీసీకేసీ వరకు అక్రమాలదారే

అంతర్రాష్ట్ర సరిహద్దులోనూ మైనింగ్

కేంద్ర నివేదికల్లో విస్తుపోయే నిజాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి) 'రాష్ట్రంలో పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ ఇసుక తవ్వకాలు జరిగాయి. ఎన్నో నిబంధనలు ఉల్లంఘించారు. నదీ ప్రవాహాలను దారి మళ్లించి మరీ అక్రమ మైనింగ్ చేశారు. ఆక్రమాలను అడ్డుకుని, పర్యావరణాన్ని కాపాడాల్సిన గనుల శాఖ ఘోరంగా విఫలమైంది'.. ఇవి ఎవరో చెప్పిన మాటలు కాదు.. ప్రతిపక్షాల విమర్శలు అంతకన్నా కాదు.. కేంద్ర ఏజెన్సీలు, జాయింట్ కమిటీలు

మిగతా 12వ పేజీలో...

నదీ ప్రవాహాన్ని మార్చేలా ఇసుక తవ్వకాలు ఉండకూడదన్నది మైనింగ్ నిబంధనల్లో అతి స్పష్టమైన రూల్. కానీ దీన్ని ఉల్లంఘించారు. అనేక రీచ్‌ల్లో నదీ ప్రవాహాన్ని మార్చారు. ఇసుక రవాణా కోసం రీచ్‌ల్లో ఏర్పాటు చేసిన రహదారులు, ఇతర ఏర్పాట్ల వల్ల నది తన ప్రవాహ దిశను మార్చుకోవడాన్ని అనేక రీచ్‌ల్లో గమనించాం.

ఇసుక రీచ్‌ల పరిధిలో నిర్దిష్టమైన పర్యావరణ పరిరక్షణకు గనుల శాఖ ఎలాంటి ప్రత్యేక విభాగాన్నీ ఏర్పాటు చేయలేదు. అనుభవజ్ఞులైన వారితో పర్యావరణ పరిరక్షణ సెల్‌ను నెలకొల్పాలి. కానీ గనుల శాఖ ఆ పనీ చేయలేదు.

ఇసుక రీచ్‌ల్లో మీటర్‌కు మించి తవ్వకూడదు. కానీ సగటున ఐదారు మీటర్లపైనే ఇసుక తవ్వేశారు. నిర్దేశించిన రీచ్‌లను దాటి ఇంకా ఐదారు కిలోమీటర్ల మేర తవ్వకాలు జరిపారు.

- ఎన్జీటీకి కేంద్ర ఏజెన్సీలు, జాయింట్ కమిటీలు ఇచ్చిన నివేదికల్లోని ముఖ్యాంశాలివి



ఒంగోలులో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న సీఎం జగన్

పేదల సాక్షిగా పచ్చి అబద్ధాలు!

ఒంగోలు సభలో సీఎం జగన్ వింత వ్యాఖ్యలు

స్థలాలపై కోర్టులో కేసు వేసింది వైవీ అనుచరుడే

కానీ.. చంద్రబాబు వేయించారన్న జగన్

భువనేశ్వరి వ్యాఖ్యల వక్రీకరణ

సభకు డ్వాక్రాలు, మహిళల తరలింపు

సీఎం ప్రసంగిస్తుండగానే వెనుదిరిగిన జనం

ఆర్టీసీ, స్కూలు బస్సులను లాక్కోవడంతో అవస్థలు పడిన విద్యార్థులు, ప్రయాణికులు

ఒంగోలు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేదల సాక్షిగా ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అలవోకగా పచ్చి అబద్ధాలను చెప్పారు. ఒంగోలులో నివాస స్థల పట్టాల పంపిణీపై హైకోర్టులో వైసీపీ నేత పిల్ వేయగా, చంద్రబాబే కోర్టుకు వెళ్లినట్లుగా జనాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. ఒంగోలులో సుమారు 21వేల మందికి నివాసస్థల పట్టాల పంపిణీ కార్యక్రమంలో శుక్రవారం సీఎం జగన్ ప్రసంగించారు. తొలుత ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. పట్టాల పంపిణీని

మిగతా 11వ పేజీలో...



"ఇల్లు లేని నా పేద అక్కచెల్లెమ్మలకు జగనన్న లే-అవుట్లలో ఉచితంగా స్థలాలిస్తాం. ఇల్లు కట్టుకోవడానికి ఆర్థిక సాయం అందిస్తాం. అయినా తాము సొంతంగా ఇల్లు కట్టుకోలేమని అంటే ఆ బాధ్యతను కూడా ప్రభుత్వమే తీసుకుని నిర్దేశిత నమూనా ప్రకారం ఇల్లు కట్టించి నా అక్కచెల్లెమ్మలకు స్థిరాస్తిగా అందజేస్తాం"

..ఇదీ సీఎం జగన్ ఇచ్చిన హామీ. మరి వాస్తవంలో ఏం జరుగుతోంది? ఆ హామీ నెరవేరుతోందా? మీరే చదవండి..

గూడు.. గోడు!

పేదల ఇళ్ల నిర్మాణంపై జగన్ సర్కారు కపటం

కట్టుకోలేనివారికి ప్రభుత్వమే కట్టి ఇస్తుందన్న జగన్

ఆప్షన్-3 కింద కట్టాల్సినవి 3.5 లక్షలపైగా గుర్తింపు

ఐదేళ్లలో కట్టినవి కేవలం 28,587 గృహాలు

ఇంకా పునాదులు కూడా దాటని ఇళ్లు 2.48 లక్షలు

ఎన్నికల వేళ మిగతా ఇళ్ల నిర్మాణంపై నీలినీడలు

సొంతింటి కల తీరదేమోనని పేదల్లో గుబులు



(అమరావతి-ఆంధ్రజ్యోతి) 'నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు' ... దేశంలోనే ఎక్కడా లేని అత్యంత గొప్ప పథకమని జగన్ గొప్పలు చెప్పారు. పేదలకు ఇళ్లస్థల పట్టాల పంపిణీ కార్యక్రమాలతో ఎక్కడా లేని ఆర్భాటం చేశారు. తన ఐదేళ్ల పాలనలో 30 లక్షలకు పైగా పక్కాఇళ్లు నిర్మించి ఇస్తామని ఊదరగొడుతూ ప్రజలను నమ్మించారు. తీరా చూస్తే...జగన్ ఐదేళ్ల పదవీ కాలం ముగింపు దశకు వచ్చేసింది. జగన్ హామీ ఇచ్చిన 30 లక్షల

మిగతా 2వ పేజీలో...

గుంటూరులో గుట్కాయస్వాహా

గుంటూరు పేరు వినగానే ఠక్కున మిర్చి గుర్తుకొస్తుంది. జిల్లాలోని ఆ కీలక నియోజకవర్గం ఎమ్మెల్యే పేరు వినగానే స్థానికులకు వెంటనే గుట్కా గుర్తుకొస్తుంది. గుట్కా తయారీ, విక్రయాల్లో గుట్కా కింగ్‌గా ఆయన బాగా ఫేమస్ అయ్యారు. గంజాయి విక్రయాల్లోనూ ఆయన దగ్గరి బంధువు పేరు వినిపించింది. అయితే అధికారాన్ని అడ్డుపెట్టుకుని కేసుల నుంచి బయటపడ్డారు. ఇక విలువైన భూములను కబ్జా చేయడంలో సదరు నేత దిట్ట.

- **ఫ్యామిలీ ప్యాకేజీ**

వైసీపీ అధికారంలోకి వచ్చాక కీలక పదవులన్నీ ఆ ఎమ్మెల్యే తన కుటుంబీకులకు ఇప్పించుకున్నారు. కుమార్తె, సోదరుడు, అల్లుడు, బాబాయి కొడుకు.. నామినేటెడ్, రాజకీయ పదవుల్లో కొనసాగుతున్నారు. అంటే.. ఫ్యామిలీ ప్యాకేజీ అన్నమాట. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయనని ప్రకటించిన సదరు నేత.. తన వారసురాలిని పోటీకి దింపుతున్నారు.



అక్రమాలకు అడ్డాగా నియోజకవర్గం

ఎమ్మెల్యే సొంత గోదాముల్లోనే కోట్ల విలువ చేసే గుట్కా స్వాధీనం

దాడి చేసి కేసు పెట్టిన నాటి ఎస్పీ

గంటల్లోనే ఎస్పీపై బదిలీ వేటు

తప్పుడు పత్రాలతో తప్పించుకున్న నేత

గంజాయి అమ్మకాల్లో నేత బంధువు

దోపిడీకి అడ్డాగా ప్రభుత్వాస్పత్రి

నగరంలో ఖరీదైన స్థలాలు కబ్జా

వక్ఫ్ ఆస్తుల అన్యాక్రాంతం

(గుంటూరు-ఆంధ్రజ్యోతి) ఆ ఎమ్మెల్యే మాటలు, చూపులు, చేష్టలు ఎంతో అమాయకంగా కనిపిస్తాయి. అతి దగ్గరగా చూసే వారికి మాత్రం ఆయనలో దాగి ఉన్న మరో మనిషి కనిపిస్తాడు. 2014లో మొట్ట మొదటిసారి వైసీపీ అభ్యర్థిగా గెలుపొంది చట్టసభలోకి అడుగు పెట్టారు. అప్పట్లో పార్టీ అధికారంలోకి రాకపోవటంతో ఆయన ఐదేళ్లూ అందరికీ సాధుజీవిలానే కనిపించారు. ప్రవర్తన కూడా అలానే ఉండేది. టీడీపీ నేతలతోనే గాక అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబుతో కూడా ప్రభుత్వ కార్యక్రమాల సందర్భంగా సన్నిహితంగా మెలిగేవారు. సదరు నేత తీరును చూసి టీడీపీలో చేరతారనే

మిగతా 2వ పేజీలో...

నిందితురాలిగా కవిత!

- ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఇప్పటిదాకా సాక్షిగా పరిగణించిన సీబీఐ
- అప్రూవర్ రాఘవరెడ్డి ఇచ్చిన సమాచారంతో నిందితురాలిగా మార్పు
- 41ఏ కింద తాజా నోటీసులు.. 26న హాజరు కావాలన్న దర్యాప్తు సంస్థ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను సీబీఐ నిందితురాలిగా చేర్చింది. గతంలో కవితను సాక్షిగానే ప్రశ్నించిన దర్యాప్తు సంస్థ.. తాజాగా 41 ఏ నిబంధన కింద నోటీసులు జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ నెల 26న తమ ముందు విచారణకు హాజరు కావాలని సీబీఐ కవితకు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. మాగుంట రాఘవరెడ్డి అప్రూవర్‌గా మారి దర్యాప్తు అధికారులకు వెల్లడించిన విషయాలే కవితను ఈ కేసులో నిందితురాలిగా చేర్చేందుకు వీలు కల్పించాయని భావిస్తున్నారు. రాఘవరెడ్డితో పాటు కవిత పీఏ అశోక్ కౌశిక్ వాంగ్మూలం కూడా దర్యాప్తులో కీలకం కానుంది. 2023 ఫిబ్రవరి 10న రాఘవరెడ్డిని ఈడీ అరెస్టు చేసిన తర్వాత ఆరు నెలలకు బెయిల్‌పై ఆయన విడుదలయ్యారు. అక్టోబర్ 3న ఆయన అప్రూవర్‌గా మారి సీఆర్‌పీసీ సెక్షన్ 161, 164(2)ల కింద ఈడీకి కీలక సమాచారం అందించారు. దీని వల్లే ఆయన ముందస్తు బెయిల్‌ను తాము వ్యతిరేకించలేదని సీబీఐ తెలిపింది. అదే విధంగా కవిత పీఏ కౌశిక్ ఇచ్చిన వాంగ్మూలాన్ని 164 సీఆర్‌పీసీ కింద రికార్డు చేశారు. నిందితుల నేరం గురించి తమ వద్ద విశ్వసనీయ సమాచారం ఉన్నప్పుడు, 41ఏ కింద నోటీసులు జారీ చేసే అధికారం దర్యాప్తు సంస్థలకు ఉంది. ఆ నోటీసులు స్వీకరించిన వ్యక్తి తప్పనిసరిగా విచారణకు హాజరు కావాల్సి ఉంటుందని, హాజరు కాకపోతే కోర్టు ద్వారా ఆ వ్యక్తిని అరెస్టు చేసే అధికారం సీబీఐకి ఉంటుందని అధికార వర్గాలు తెలిపాయి. నోటీసులకు అనుగుణంగా హాజరైనా కూడా తగిన కారణాలు ఉంటే సదరు వ్యక్తిని అరెస్టు చేయవచ్చని పేర్కొన్నాయి.

సుప్రీంకోర్టులో పిటిషన్

మహిళకు ఈడీ సమన్లు జారీ చేయకూడదని, ఇంటి వద్దే విచారించాలని వాదిస్తూ కవిత గతంలో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇదే తరహా పిటిషన్‌ను నళినీ చిదంబరం కూడా వేశారు. ఈ నేపథ్యంలో ఏడాదిగా ఈడీ సమన్ల నుంచి కవితకు రక్షణ లభిస్తోంది. కాగా కవిత, నళినీ చిదంబరం కేసులు వేర్వేరని, రెండింటికీ ముడిపెట్టలేమని ఇటీవల సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బేలా త్రివేది స్పష్టం చేసి కవిత కేసు విచారణను ఫిబ్రవరి 28వ తేదీకి వాయిదా వేశారు. ఈ నేపథ్యంలో సీబీఐ ముందు 26న హాజరు కావడంతో పాటు తర్వాతి రోజుల్లో ఈడీ ముందుకూ వెళ్లాల్సి ఉంటుందని న్యాయనిపుణులు భావిస్తున్నారు.

మారిన బీజేపీ వైఖరి

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన బీఆర్ఎస్ పట్ల బీజేపీ వైఖరి మారిందని, దాని పర్యవసానమే ప్రస్తుత పరిణామాలని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. తెలంగాణలో బీఆర్ఎస్-బీజేపీ మధ్య మ్యాచ్ ఫిక్సింగ్ ఉన్నదనే ప్రచారంలో నిజం లేదని చెప్పటానికే కవితపై ఢిల్లీ మద్యం కేసులో దర్యాప్తులు వేగవంతం అవుతున్నాయని ఆ వర్గాలు పేర్కొంటున్నాయి. బీఆర్ఎస్ బలహీనపడితే బీజేపీకే లాభమని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో తాము అత్యధిక స్థానాలు గెలుచుకుంటామని బీజేపీ ఆశిస్తోంది. ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను మద్యం కేసులో త్వరలో అరెస్టు చేసే అవకాశాలున్నాయని, కవితను కూడా అదే సమయంలో అరెస్టు చేయవచ్చని సమాచారం.

ఢిల్లీ పర్యటన మానుకున్న కేసీఆర్!


తన కుమార్తె కవిత విషయంలో సీబీఐ దూకుడు చూసిన తర్వాత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఢిల్లీ పర్యటనను రద్దు చేసుకున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో పొత్తు కోసం ప్రయత్నించాలని ఆయన తొలుత భావించారని, కానీ కేంద్రం వైఖరి స్పష్టం కావడంతో ఆయన ఆ దిశగా ప్రయత్నాలు చేయలేదని సమాచారం. ఇంకోవైపు.. మద్యం పాలసీ కేసులో తమ పార్టీ అధినేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను సీబీఐ త్వరలో అరెస్టు చేయవచ్చని ఆమ్‌ఆద్మీపార్టీ (ఆప్) తెలిపింది. కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకోకుండా ఆపటానికే ఈ అరెస్టు తతంగమని.. పొత్తు వార్తలు వెలువడగానే కేజ్రీవాల్‌కు ఈడీ ఏడోసారి సమన్లు పంపిందని గుర్తు చేసింది.

విశ్రాంత ఐఏఎస్ జన్నత్ హుస్సేన్ కన్నుమూత



సూళ్లూరుపేట/నెల్లూరు, ఫిబ్రవరి 23: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన జన్నత్ హుస్సేన్ (73) అనారోగ్యంతో కన్నుమూశారు. ఆయన కొన్నేళ్లుగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్నారు. శుక్రవారం తెల్లవారుజామున తిరుపతి జిల్లా సూళ్లూరుపేట కీర్తి ఎన్‌క్లేవ్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. 1977 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన.. ఉత్తరప్రదేశ్‌లో లఖ్‌నవూ సమీపాన ఓ కుగ్రామంలో 1951లో రైతు కుటుంబంలో జన్మించారు. చిన్నతనం నుంచి సామాన్య జీవితం గడిపిన ఆయన 1977లో ఐఏఎస్ సాధించి ఆంధ్రప్రదేశ్ కేడర్‌లో నియమితులయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వివిధ జిల్లాల్లో పనిచేశారు. నిజాయితీపరుడిగా, నిగర్విగా, అందరికీ అండగా ఉంటూ మంచిపేరు తెచ్చుకున్నారు. 1985-87లో నెల్లూరు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి శాఖల కమిషనర్‌గా, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా సేవలందించారు. సాంఘిక సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖలకు ముఖ్య కార్యదర్శిగా వ్యవహరించారు. ఎక్సైజ్ కమిషనర్‌గా ఉన్నప్పుడు మంచి పేరు తెచ్చుకున్నారు. అక్రమ మద్యంపై ఉక్కుపాదం మోపారు. వ్యాపారులను దారికి తెచ్చారు. ఫలానా పోస్టింగ్ కావాలని ఏ ఒక్క సీఎంనూ అడుగలేదు. అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, నిజాయితీతో నిర్వర్తించారు. అందుకే వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎం అయినప్పుడు ఆయన్ను సీఎంవోలోకి తీసుకున్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పథకం విధివిధానాల రూపకల్పనలో జన్నత్ ముఖ్య పాత్ర పోషించారు. రోశయ్య హయాంలో 2010 డిసెంబరు 31న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో రిటైరయ్యారు. అనంతరం రాష్ట్ర సమాచార ప్రధాన కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టారు. 2014లో రాష్ట్ర విభజన వరకు ఆ పదవిలో కొనసాగారు. పదవులు, పైరవీలకు దూరంగా ఆయనో 'బ్రాండ్'గా ప్రఖ్యాతి పొందారు. రిటైరయ్యాక తిరుపతి జిల్లా సూళ్లూరుపేటలో ఆయన స్థిరపడ్డారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమారులిద్దరూ విదేశాల్లో ఉండగా.. కుమార్తె హైదరాబాద్‌లో ఉంటున్నారు. మృతదేహాన్ని బంధువులు హైదరాబాద్‌కు తరలించారు. శనివారం అక్కడే అంత్యక్రియలు నిర్వహించనున్నారు. జన్నత్ మరణంపై టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలియజేశారు.

లోకం తీరు



గూడు.. గోడు!

(మొదటి పేజీ తరువాయి)

ఇళ్లలో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఇప్పటివరకు చచ్చీ చెడీ చెమటోడ్చి కేవలం ఐదు లక్షల ఇళ్లను పూర్తి చేయగలిగామనిపించింది. అవి కూడా లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకున్నవే. ప్రభుత్వం రాయితీ కింద ఇచ్చే సొమ్ములు పునాదులకూ సరిపోని పరిస్థితుల్లో లబ్ధిదారులు అప్పులు చేసుకుని కట్టుకున్న ఇళ్లు ఇవీ. సీఎం జగన్ ఈ గృహాలకే సామూహిక గృహప్రవేశాలు అంటూ హడావుడి చేసి ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకున్నారు. మిగిలిన 25 లక్షల మంది లబ్ధిదారుల సొంతింటి కలను ఎప్పుడు నెరవేరుస్తారు? ప్రభుత్వమే కట్టి ఇస్తానన్న ఇళ్ల నిర్మాణం మాటేమిటి? ఈ ఆప్షన్ కింద 3.5 లక్షల దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఎన్నికలకు త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానుంది. ఇప్పటికే అందరూ ఎన్నికల హడావుడిలో పడిపోయారు. దీంతో ఎక్కువమంది లబ్ధిదారులు ఆందోళనకు గురి అవుతున్నారు.

నిండా ముంచేశారు..

జగనన్న ఇళ్ల పథకం ప్రారంభిస్తూ లబ్ధిదారులకు మూడు ఆప్షన్లు ప్రభుత్వం ఇచ్చింది. ప్రభుత్వం ఇచ్చే రాయితీ సొమ్ముపోను మిగతా డబ్బులు తాము వేసుకుని ఇళ్లు కట్టుకునేవారినీ, ఇంటి నిర్మాణానికి అవసరమైన పరికరాలు, సామగ్రి ప్రభుత్వం అందిస్తే డబ్బులు తాము వేసుకునే ఇళ్ల నిర్మాణం చేసుకునేవారిని ఆప్షన్ 1,2 కింద విభజించారు. ఇక.. రాయితీ సొమ్ములతో ప్రభుత్వం దగ్గరుండి ఇళ్లు నిర్మించి ఇవ్వడం ఆప్షన్ 3. ఈ ఆప్షన్‌ను ఎంపిక చేసుకున్న లబ్ధిదారులకు రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ మేసన్లను సమీకరించి వారికి ఇళ్లు కట్టించి ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కానీ ఆ బరువుబాధ్యతలను మోయలేమంటూ హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు చేతులెత్తేశారు. దీంతో ప్రభుత్వమే కాంట్రాక్టర్లను రంగంలోకి దించింది. నిర్దేశిత నిబంధనల మేరకు 'ఆప్షన్-3' ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించే బాధ్యతను ఆయా జిల్లాలవారీగా కాంట్రాక్టర్లకు అప్పగించారు. అయితే సాధారణంగా ఏ ప్రభుత్వ శాఖలోనైనా రూ. 5 లక్షలకు మించిన పనులు చేపట్టాలంటే ముందుగా నిబంధనల ప్రకారం టెండర్లు పిలుస్తారు. ఆ టెండర్లలో పాల్గొన్న కాంట్రాక్టర్లలో ఎవరు తక్కువ కోట్ చేస్తే వారికే వర్క్ ఆర్డర్లు ఇస్తారు. ఇలా వర్క్ ఆర్డర్లు తీసుకున్న కాంట్రాక్టర్లు పనులు నాసిరకంగా చేయడం, పనులు ఆలస్యం చేయడం.. కొన్ని సందర్భాల్లో నష్టాలొస్తున్నాయని పనులు చేయకుండా మధ్యలోనే వదిలేసిపోవడం వంటి ఉదంతాలు జరుగుతుంటాయి. అందువల్ల టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ల నుంచి ఆయా పనుల అంచనా వ్యయంతో 2 శాతం సొమ్మును ముందుగానే ఫైనాన్స్ సెక్యూరిటీ డిపాజిట్ (ఎఫ్ఎస్‌డీ) కింద కట్టించుకుంటారు. అయితే పేదల కోసం చేపట్టిన సర్కారు వారి ఇళ్ల నిర్మాణ పనుల్లో మాత్రం ఎలాంటి నిబంధనలూ పాటించలేదు. కనీసం ఎఫ్ఎస్‌డీ లు కూడా కట్టించుకోకుండా ఊరూ పేరూ లేని సంస్థల పేరు మీద రూ. వేల కోట్ల విలువైన ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణ పనులను అప్పగించేశారు. కాంట్రాక్టర్లను ఎక్కడా బైండోవర్ చేయడానికి వీల్లేని రీతిలో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 893 మందికి 3,83,541 ఇళ్ల నిర్మాణ కాంట్రాక్టులను కట్టబెట్టేశారు.

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణాల తీరిదీ!

కాంట్రాక్టర్లకు అప్పగించిన ఆప్షన్-3 ఇళ్లు	3,83,541
ఇప్పటివరకు పూర్తయినవి	28,587
బేస్‌మెంట్ లెవెల్‌లో ఉన్నవి	49,827
ప్రీకాస్ట్ కాంక్రీట్ లెవెల్‌లో ఉన్నవి	17,145
పీబీ లెవెల్‌లో ఉన్నవి	59,844
బేస్‌మెంట్ లెవెల్	1,21,920
లింటల్ లెవెల్	6,675
రూఫ్ లెవెల్	27,944
ఆర్‌సీ లెవెల్	37,649
ఆర్‌సీఎం లెవెల్	29,494
ఇంకా ప్రారంభం కూడా కానివి	4,456

అత్త సొమ్ము అల్లుడు దానం....

పేదల ఇళ్లకు ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం (పీఎంఏవై) కింద కేంద్ర ప్రభుత్వం రూ. 1.50 లక్షలు రాయితీగా అందిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద మరో రూ. 30 వేలు రాయితీగా చెల్లించాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను ఇవ్వడం లేదు. కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్రానికి విడుదల చేస్తున్న నిధులనే ఇళ్ల లబ్ధిదారులకు పని దినాల కింద చెల్లిస్తున్నట్లుగా జగన్ ప్రభుత్వం జమ చేస్తోంది. పావలా వడ్డీతో రూ.35 వేలు రుణం మాత్రం మంజూరు చేసి చేతులు దులుపుకొంటోంది. ఈ మాత్రానికే 'జగనన్న పేదల ఇళ్లు' అంటూ కలరింగ్ ఇస్తోంది.

రూ. 2,663 కోట్లు కొల్లగొట్టేశారు!

ఆప్షన్-3 ఇళ్ల నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్లు బేస్‌మెంట్ వరకు పని పూర్తి చేస్తే మొదటి బిల్లు కింద రూ. 53 వేలు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ కాంట్రాక్టర్లతో కుమ్మక్కై వాటాలు మాట్లాడుకున్న హౌసింగ్ కార్పొరేషన్‌లోని కొందరు అధికారులు ఆ మొదటి స్టేజ్ పేమెంట్‌ను ఒకేసారి రూ.70 వేలు చేశారు. అది కూడా పనులు చేపట్టకముందే అడ్వాన్సుల కింద ఈ మొత్తం చెల్లించేశారు. లబ్ధిదారులకు ఇచ్చిన స్థలాల్లో మొదటి స్టేజ్ కింద కాలమ్ ఫుట్టింగ్స్ సహా ప్లింత్ బీమ్ వేయడానికి రూ. 30నుంచి 40వేలకు మించి ఖర్చు కాదని ఇంజనీర్లు చెబుతున్నారు. ఇలా ఇప్పటివరకు రూ.2,663 కోట్లకు పైగా అస్మదీయ కాంట్రాక్టర్లకు దోచిపెట్టేశారని సమాచారం. దీనికి ప్రతిఫలంగా రూ.కోట్లు హౌసింగ్ అధికారులకు కమీషన్ల రూపంలో ముట్టాయనే ఆరోపణలున్నాయి.

ఎట్టకేలకు కదిలిన పోలీసులు

- విశాఖ 'పశ్చిమ'లో ఓట్ల తొలగింపునకు కుట్ర
- తప్పుడు దరఖాస్తులు సమర్పించిన పది మందిపై కేసు

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో ఓట్ల తొలగింపునకు ఉద్దేశపూర్వకంగా తప్పుడు దరఖాస్తులు (ఫారం-7) సమర్పించిన పది మందిపై పోలీసులు ఎట్టకేలకు చర్యలకు ఉపక్రమించారు. కంచరపాలెం, ఎయిర్‌పోర్టు, గోపాలపట్నం, మల్కాపురం పోలీస్ స్టేషన్‌లలో కేసు నమోదు చేశారు. పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, విశాఖపట్నం ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ ఫిర్యాదు మేరకు గీశాల నూకరాజు, గొల్లపల్లి కావ్య, సక్కురి సత్యవతి, కొలచిన రవి, నమ్మి లీలానాగవల్లి, సుండి సుజాత, తిరుకోవల్లూరి యశ్వంతరావు, కాండ్రేగుల సత్తిబాబు, బత్తుల రంగనాయకమ్మ, రొంగలి సుధ అనే వారిపై ఐపీసీ 171, 181, 182, 192, 193, ఐటీఏ ఆఫ్ 2000-2008లోని 66-సి, 66-డి, ఆర్‌పీఏ ఆఫ్ 1950లోని 31 (ఎ) సెక్షన్ల కింద కేసులు నమోదుచేశారు. పశ్చిమ నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరుల ఓట్ల తొలగింపునకు అధికార పార్టీ మద్దతుదారులుగా భావిస్తున్న కొందరు భారీ స్కెచ్ వేశారు. తమ పార్టీకి ఓటు వేయరని గుర్తించిన వారి పేర్లు జాబితా నుంచి తొలగించాలంటూ తప్పుడు దరఖాస్తులు అప్‌లోడ్ చేశారు. ఈ విషయమై ఎమ్మెల్యే గణబాబు ఫిర్యాదు మేరకు కలెక్టర్ స్పందించి విచారణ కోసం ముగ్గురి సభ్యులతో కమిటీ వేశారు. ఓటర్లు ఉన్నప్పటికీ ...లేరంటూ పేర్కొన్న పది మందిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు విచారణ కమిటీ అధికారి హుస్సేన్ సాహెబ్ నివేదిక ఇచ్చారు. ఈ మేరకు పది మందిపై పీపుల్స్ యాక్టు 1950లో సెక్షన్ 31 ప్రకారం క్రిమినల్ కేసు నమోదు చేయాలని నగర పోలీసులకు కలెక్టర్ సిఫారసు చేశారు. అయితే అధికార పార్టీ నేతల ఒత్తిడితో వారం రోజులైనా పోలీసులు కేసు నమోదు చేయలేదు. దీనిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు ఎమ్మెల్యే గణబాబు సిద్ధం కావడంతో గురువారం సాయంత్రం పోలీసులు కేసు నమోదుచేశారు.

గుంటూరులో గుట్కాయస్వాహా



(మొదటి పేజీ తరువాయి)

ప్రచారం అప్పట్లో జరిగింది. 2019 ఎన్నికల్లో ఆయన తిరిగి గెలవటం, వైసీపీ అధికారంలోకి రావటంతో ఈ ఉస్తాద్ తన విశ్వరూపం నియోజకవర్గ ప్రజలకు చూపటం మొదలెట్టారు. పైసంపాదన కోసం దేనినీ వదలకుండా తన కుటుంబీకులను, అనుయాయులను రంగంలోకి దించారు.

నియోజకవర్గ పరిధిలోనే రాష్ట్రంలోనే పేరొందిన గుంటూరు ప్రభుత్వాస్పత్రి ఉండటంతో సదరు నేత అక్రమ సంపాదనకు దాన్ని ప్రధాన అడ్డాగా మార్చేశారు. ఆస్పత్రి ప్రాంగణంలో అప్పటి వరకు ఉన్న వ్యాపారాలన్నీ హస్తగతం చేసుకొన్నారు. దీంతో అప్పటి వరకు వ్యాపారాలు నిర్వహించిన వారు ఉన్నపళంగా వాటిని వదిలేసి బయటకు రావాల్సి వచ్చింది. జీజీహెచ్‌లో సైకిల్ స్టాండ్, ఫుడ్ సప్లై, ఎలుకల నిర్మూలన, తాగునీరు, కమర్షియల్ క్యాంటీన్, మెడికల్ షాపు వంటివన్నీ తన మనుషుల ద్వారా ఆధీనంలోకి తీసేసుకొన్నారు.

గుట్కా తయారీ.. గంజాయి విక్రయాలు

అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలో నిషేధంలో ఉన్న గుట్కాను తానే సొంతంగా తయారు చేసి మార్కెట్ చేశారన్న ఆరోపణలు వినిపించాయి. అప్పట్లో పోలీసులు దాడులు చేసి ఎమ్మెల్యే గోడౌన్‌లలో గుట్కా మిషన్‌లు, ఉత్పత్తులను సీజ్ చేసి తయారీదారులపై కేసులు నమోదు చేశారు. అప్పటి ఎస్పీ స్వయంగా ఈ దాడుల్లో పాల్గొన్నారు. ఈ ఘటన అప్పట్లో రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది. అయితే తాను గోడౌన్‌లను అద్దెకు ఇచ్చానని, అందులో ఏం చేస్తున్నారో తనకేం తెలియదని ఎమ్మెల్యే సమర్థించుకునే ప్రయత్నం చేశారు. ఈ పరిణామాలతో పార్టీకి చెడ్డ పేరొస్తుందని భావించిన తాడేపల్లి ప్యాలెస్ పెద్దలు జిల్లా ఎస్పీని బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది. సదరు ఎమ్మెల్యే ఇలాకాలో గంజాయి విక్రయాలు వెలుగులోకి వచ్చాయి. ఎమ్మెల్యే దగ్గరి బంధువు ఒకరు ఏకంగా గంజాయితో పట్టుబడ్డారు. గంజాయి విక్రయాలు చేస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. పోలీసులు ఆయన్ను డ్రగ్స్ కేసులో బాధితుడిగా చేర్చి నేర తీవ్రతను తగ్గించారు.


విలువైన భూములు కబ్జా

సదరు ఎమ్మెల్యే విలువైన భూములను కబ్జా చేశారన్న ఆరోపణలున్నాయి. నగరంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం పక్కనున్న దేవదాయ శాఖకు చెందిన స్థలాన్ని సొంతం చేసుకున్నారు. బినామీ పేర్లతో టెండరు దక్కించుకున్నారన్న ఆరోపణలున్నాయి. అంతేగాక నియోజకవర్గంలో ఆర్య వైశ్య సామాజికవర్గానికి చెందిన ఒకరి స్థలాన్ని సైతం కబ్జా చేశారన్న ఆరోపణలు వచ్చాయి. నియోజకవర్గంలో సొంత పార్టీ నేతలతోనే ఎమ్మెల్యేకు విభేదాలు ఉన్నాయి. నగర పాలక సంస్థలో కీలక పదవిలో ఉన్న ఓ నాయకురాలు, ఆమె తండ్రి.. ఎమ్మెల్యేకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడప్పుడు వీరి మధ్య ఆధిపత్య పోరు రచ్చకెక్కటం పార్టీలో చర్చనీయాంశంగా మారుతోంది.

పదవులన్నీ కుటుంబీకులకే

సదరు నేత రెండోసారి ఎమ్మెల్యే అయిన తర్వాత నామినేటెడ్, రాజకీయ పదవులన్నీ తన కుటుంబీకులకే ఇప్పించుకొన్నారు. తన సోదరుడ్ని ఓ సంస్థకు కేర్ టేకర్ కమిటీ ప్రెసిడెంట్‌గా నియమించి వాటి ఆస్తులను అన్యాక్రాంతం చేయడం మొదలు పెట్టారు. వక్ఫ్‌బోర్డుకు చెందిన వందల ఎకరాల భూములను లీజుకు ఇచ్చేందుకు చేయని ప్రయత్నం అంటూ లేదు. అయితే ప్రతిపక్ష పార్టీలకు చెందిన మైనార్టీ నాయకులు ఎక్కడికక్కడ అడ్డుకొంటున్నారు. లేకుంటే ఈ పాటికే చాలా స్థలాలు అన్యాక్రాంతం అయ్యేవి. ఇక ఎమ్మెల్యే తన అల్లుడికి మిర్చియార్డు పాలకవర్గంలో సభ్యుడిగా పదవి ఇప్పించారు. బాబాయి కుమారుడు ఓ సంస్థలో డైరెక్టర్. తన కుమార్తెకు నియోజకవర్గ సమన్వయకర్త పదవిని ఇప్పించుకొన్నారు. వచ్చే ఎన్నికల్లో తాను పోటీ చేయటం లేదని ఎమ్మెల్యే ఇప్పటికే బహిరంగంగా ప్రకటించారు. వచ్చే ఎన్నికల్లో అదే నియోజకవర్గం నుంచి తన బదులు తన వారసురాలు వైసీపీ అభ్యర్థిగా బరిలో దిగుతున్నారని చెప్పారు. పార్టీ అధినేత, సీఎం జగన్ కూడా ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు.

రోడ్డు ప్రమాదంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే లాస్య దుర్మరణం



హైదరాబాద్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యే(కంటోన్మెంట్) లాస్య నందిత(37) ఔటర్ రింగ్ రోడ్డుపై శుక్రవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. శామీర్‌పేట నుంచి ముత్తంగి ఔటర్ జంక్షన్ వైపు వస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరిగింది. సుల్తాన్‌పూర్ ఎగ్జిట్ దాటిన తరువాత పటాన్‌చెరు శివారులో కారు అతివేగంగా.. గుర్తుతెలియని వాహనాన్ని వెనక నుంచి ఢీకొనిఅదుపు తప్పి రోడ్డుకు ఎడమవైపు దూసుకెళ్లి రెయిలింగ్‌ను బలంగా ఢీకొంది. ప్రమాదం తీవ్రతకు వాహనం ముందువైపు ఎడమ భాగం నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న ఆమె పీఏ ఆకాశ్ (26) తీవ్రంగా గాయపడ్డారు. రెండు కాళ్లూ విరిగిపోవడంతో ఆయన కారులోనే ఇరుక్కుపోయారు. డ్రైవర్ పక్కసీట్లో కూర్చున్న నందిత సీటు బెల్ట్ పెట్టుకున్నా, ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకున్నా.. ఆమె తలకు, ముఖానికి, కాళ్లకు తీవ్రగాయాలై అక్కడికక్కడే దుర్మరణం చెందారు. గురువారం ఆమె తన కుటుంబసభ్యులతో కలిసి సదాశివపేట మండలం ఆరూర్‌లోని మిస్కిన్ షా దర్గాను సందర్శించారని.. శుక్రవారం తెల్లవారుజామున ఇంటికి చేరుకునే క్రమంలో టిఫిన్ చేసేందుకు మరోమారు సంగారెడ్డి వైపునకు తిరుగు ప్రయాణం అయ్యారని పటాన్‌చెరు పోలీసులు తెలిపారు. ముత్తంగి జంక్షన్ వద్ద ఉన్న టిఫిన్ సెంటర్ల వద్దకు వెళ్లే క్రమంలో ప్రమాదం జరిగిందని పేర్కొన్నారు. ప్రమాదవార్త తెలియగానే ఘటనాస్థలికి చేరుకున్న పటాన్‌చెరు పోలీసులు.. తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్‌ను మియాపూర్ శ్రీకర ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే లాస్య నందితను పటాన్‌చెరులోని అమేధా ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే ఆమె మృతి చెందారని వైద్యులు నిర్ధారించారు. డ్రైవర్ సీట్‌లో ఉన్న ఆకాశ్ నిద్రమత్తులోకి జారుకోవడంవల్లే ప్రమాదం జరిగిందని జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ వెల్లడించారు. ప్రమాద సమయంలో వారి కారు 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో లాస్య తలకు బలమైన గాయమై మరణించినట్టు పోస్ట్‌మార్టమ్ నిర్వహించిన వైద్యులు నిర్ధారణకు వచ్చారు. లాస్య తండ్రి మాజీ ఎమ్మెల్యే జి.సాయన్న గత ఏడాది ఫిబ్రవరి 19న అనారోగ్యంతో మరణించారు. అంతలోనే ఆయన కుమార్తె లాస్య నందిత కూడా మృతిచెందడంతో.. వారి కుటుంబం కన్నీరుమున్నీరవుతోంది.

వివాదాలకు తావు లేకుండా కౌంటింగ్ కేంద్రాలు

- ఈసీఎంఎస్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి
- ఎన్నికల ఏర్పాట్లపై సీఈవో మీనా సమీక్ష



జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఈవో ఎంకే మీనా

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వివాదాలకు ఆస్కారం లేకుండా ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటూ ఈ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. శుక్రవారం అమరావతి సచివాలయం నుంచి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఓటర్ల నమోదు, తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి అందే ఫిర్యాదులను పరిష్కరించడంలో పారదర్శకంగా వ్యవహరించాలని, నిర్ణీత కాలవ్యవధిలో ఆ ఫిర్యాదులను పరిష్కరించి తీసుకున్న చర్యలపై నివేదికను సంబంధిత పార్టీల ప్రతినిధులకు, ఫిర్యాదుదారులకు అందజేయాలని సీఈవో మీనా ఆదేశించారు. దినపత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తాంశాలపై కూడా తగు చర్యలు తీసుకుని, సంబంధిత వివరాలను ప్రతి వారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించే సమావేశంలో వివరించాలని సూచించారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్మెంట్ సిస్టమ్ యాప్(ఈసీఎంఎస్) ఇప్పటికే సిద్ధంగా ఉందని, ఆ యాప్ ట్రయల్ రన్‌ను మార్చి మొదటి వారంలో నిర్వహిస్తామని తెలిపారు. ఈ లోపు ఆ యాప్‌ను సంబంధిత అధికారులందరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని, ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులతోపాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, స్టాటిక్ సర్వేలెన్స్ టీములు లాగిన్ అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉద్యోగుల సెలవులపై ఆంక్షలు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉద్యోగుల సెలవులపై ఆంక్షలు విధిస్తూ ప్రభుత్వం సర్క్యులర్ జారీ చేసింది. ఎన్నికల విధులకు ఎలాంటి ఆటంకాలూ ఏర్పడకూడదన్న ఉద్దేశంతో ఇలాంటి ఆంక్షలు విధిస్తారు. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం ఫిబ్రవరి, మార్చి నెలలు ప్రభుత్వానికి చాలా కీలకమని, ఈ సమయంలో నవరత్నాల పథకాలను పకడ్బందీగా అమలు చేయాలంటూ తన ప్రచార పిచ్చికి వాడుకోవడంపై ఉద్యోగుల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రానికి మోదీ తీరని ద్రోహం

- హోదా, విభజన హామీలపై పార్టీలు స్పష్టమైన విధానం వెల్లడించాలి: చలసాని



విజయవాడ (ధర్నాచౌక్), ఫిబ్రవరి 23: రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా తీరని ద్రోహం చేసిన మోదీకి రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్షాలు సాగిలపడుతున్నాయని ప్రత్యేక హోదా, విభజన హామీల సాధన సమితి అధ్యక్షుడు చలసాని శ్రీనివాస్ విమర్శించారు.. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ నెల 29 లోగా రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల అమలు, విశాఖ ఉక్కు, కేజీ బేసిన్ నుంచి మొదలైన ముడి చమురు, ఇంతకుముందు గ్యాస్ విలువలో 50 శాతం రాయల్టీ రాష్ట్రానికి రావాలనే దానిపై రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టాలని, ఆయా అంశాలపై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, యువజన సంఘాలు త్వరలో చేపట్టబోయే ఉద్యమాలకు మద్దతిస్తామని ప్రకటించారు. వేలాది కోట్ల పరిశ్రమలను మోదీ గుజరాత్‌కు తరలించుకుపోతున్నా సీఎం జగన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ హోదా ఉద్యమం గత పదేళ్లలో ఎన్నడూ ఆగలేదని, భవిష్యత్‌లో కూడా కొనసాగుతుందని చెప్పారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వైవీ రావు తదితరులు పాల్గొన్నారు.

టెట్.. దరఖాస్తులు ఫట్!

- సగానికి సగం పడిపోయిన అభ్యర్థులు
- 2022లో టెట్‌కు 5.25 లక్షల దరఖాస్తులు.. ఇప్పుడు 2.67 లక్షలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఇచ్చిన డీఎస్సీ ప్రకటనపై ఉద్యోగార్థులు పెదవి విరుస్తున్న విషయం తెలిసిందే. మెగా అని చెప్పి దగా డీఎస్సీ ఇచ్చారని మండిపడుతున్నారు. ఈ క్రమంలో చాలామంది అభ్యర్థులు దీనికి దూరంగా ఉన్నారు. ముఖ్యంగా టెట్ పరిస్థితి మరింత టఫ్‌గా మారింది. డీఎస్సీ ఇస్తారో లేదో తెలియకపోయినా 2022లో అభ్యర్థులు పెద్దఎత్తున టెట్‌కు దరఖాస్తు చేసుకుని పరీక్ష రాశారు. కానీ ఇప్పుడు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చినా టెట్ రాసేవారి సంఖ్య సగానికి సగం పడిపోయింది. 2022లో 5,25,803 మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారిలో 4 లక్షలకు మంది టెట్ రాశారు. ఇప్పుడు పరిస్థితి చూస్తే 3,17,950 మంది మాత్రమే టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం ఎస్జీటీ పోస్టులకు అర్హతలను మార్చడంతో చివరికి 2,67,559 మందే అర్హులుగా మిగిలారు. మొత్తంగా అసలు దరఖాస్తు స్థాయిలోనే అభ్యర్థులు ఆసక్తి చూపలేదని స్పష్టమైంది. 2022లో రాసిన టెట్ సర్టిఫికెట్‌కు జీవితకాల వ్యాలిడిటీ ఇచ్చారు. అంతకముందు టెట్ రాస్తే ఏడేళ్ల వ్యాలిడిటీ ఉండేది. కానీ 2018లో టెట్ రాసినవారు వ్యాలిడిటీ ఉన్నప్పటికీ 2022 మళ్లీ రాశారు. కానీ, ఈసారి ప్రభుత్వం వేసిన మినీ డీఎస్సీ కారణంగా టెట్ రాయడం కూడా దండగే అని అంచనాకు వచ్చి దరఖాస్తుల స్థాయిలోనే ఆగిపోయారు.

కొన్ని జిల్లాల్లో జీరో పోస్టులు

ఎన్ని ఎక్కువ పోస్టులు ఉంటే అభ్యర్థుల్లో అంత పోటీ పెరుగుతుంది. కానీ, ఐదేళ్లు ఊరించి ప్రకటించిన మినీ డీఎస్సీలో నామమాత్రపు పోస్టులే ఉన్నాయి. మొత్తం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వగా అందులో 25శాతం పోస్టులు ఒక్క ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే ఉన్నాయి. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఖాళీలు చాలా తక్కువగా భర్తీ చేస్తున్నారు. ఉదాహరణకు శ్రీకాకుళం జిల్లాలో స్కూల్ అసిస్టెంట్(ఎస్ఏ) తెలుగు పోస్టులు 4, హిందీ 3, ఫిజికల్ సైన్స్ 1 ఉన్నాయి. సోషల్ స్టడీస్‌కు ఒక్క పోస్టు కూడా లేదు. విజయనగరం జిల్లాలో తెలుగు 1 ఉంటే, హిందీ, ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్, సోషల్ స్టడీస్‌కు ఒక్క పోస్టు కూడా లేదు. దీంతో ఆ జిల్లాలో ఆయా సబ్జెక్టులు చదివిన అభ్యర్థులు తాజా డీఎస్సీని వదిలేసుకున్నారు. విశాఖపట్నం జిల్లాలో సోషల్ స్టడీస్‌కు 1 పోస్టు మిగిలింది. పశ్చిమగోదావరి జిల్లాలో ఫిజికల్ సైన్స్ 6, బయలాజికల్ సైన్స్ 7, సోషల్ 1 ఉన్నాయి.

నమ్మించి మోసం!

జగన్ ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచిందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. రాష్ట్రంలో బీఈడీ, డీఈడీ కోర్సులు చేసినవారు సుమారు 7లక్షలకు పైగా ఉంటారని అంచనా. 2022లో 5.25లక్షల మంది టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఈ కోర్సులు చదివినవారు, అంతకముందే పూర్తి చేసినవారు కలిపితే 7 లక్షలు దాటే అవకాశముంది. ఎన్నికలకు ముందు జగన్ హామీ ఇచ్చినట్లుగా మెగా డీఎస్సీ వేస్తారని అందరూ ఆశించారు. కానీ, ప్రతిపక్షంలో ఉండగా 23 వేల టీచర్ ఖాళీలున్నాయని చెప్పిన జగన్... అధికారంలోకి వచ్చిన ఐదేళ్ల తర్వాత కేవలం 6,100 పోస్టులతో సరిపెట్టారు.

టెట్, టీఆర్‌టీ షెడ్యూల్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం

- పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఏపీ టెట్, ఏపీ టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ) మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. షెడ్యూల్ మార్చేలా ఆదేశాలివ్వాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని తెలిపింది. ప్రతివాదులు కౌంటర్ వేసిన తరువాత వ్యాజ్యంపై తుది విచారణ జరుపుతామని పేర్కొంది. విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం తీర్పు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన టెట్, ఏపీటీఆర్‌టీ మధ్య సముచిత సమయం ఉండేలా ఆదేశాలివ్వాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎం.పెద్దిరాజు, మరో నలుగురు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై బుధవారం వాదనలు ముగియడంతో మధ్యంతర ఉత్తర్వుల జారీకి నిర్ణయాన్ని వాయిదా వేశారు. పిటిషనర్లు కోరిన విధంగా ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని న్యాయమూర్తి శుక్రవారం ప్రకటించారు.



విద్యాసాగర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సీఆర్‌పీఎఫ్ ఉన్నతాధికారులు

అమర జవాన్ల పిల్లలకు ట్యూషన్ ఫీజు రాయితీ

పెదకాకాని, ఫిబ్రవరి 23: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన జవాన్ల పిల్లలకు ట్యూషన్ ఫీజు లేకుండా ఒక సీటు కేటాయించినట్టు ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కాలేజీ మెనేజ్‌మెంట్ అసోసియేషన్.. అసోసియేషన్ ప్రెసిడెంట్, వీవీఐటీ ఛైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం గుంటూరులో సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్స్ గోపాలకృష్ణ, ఉదయభాస్కర్ విద్యాసాగర్‌ను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కాలేజీ మెనేజ్‌మెంట్ అసోసియేషన్ జనవరి 21న నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలకు అండగా ఉండాలని భావించి కళాశాలల యజమాన్యాలు ఈ నిర్ణయం తీసుకున్నట్టు వెల్లడించారు. ఈ నిర్ణయం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ఇంజనీరింగ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్‌లో సభ్యత్వమున్న ప్రతి కళాశాల ఒక సీటును సీఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తూ అమరులైన, గ్యాలంటరీ పురస్కారాలు పొందిన జవాన్ల పిల్లలకు కేటాయించనున్నట్టు వివరించారు. కళాశాలలో సీటు పొందిన విద్యార్థులకు ఆ కళాశాల ట్యూషన్ ఫీజు రాయితీ ఇస్తుందని పేర్కొన్నారు. ఇటువంటి మంచి పనికి ముందుకు వచ్చిన అసోసియేషన్‌లో భాగమైన కళాశాలలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

అప్పన్న సేవలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

సింహాచలం, ఫిబ్రవరి 23: సింహాచలంలోని వరాహలక్ష్మీ నృసింహ స్వామిని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీనరసింహ దంపతులు శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ శ్రీనివాసమూర్తి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండపం ప్రదర్శన తరువాత అంతరాలయంలో అర్చకులు న్యాయమూర్తి గోత్రనామాలతో పూజలు చేసి, శేషవస్త్రాన్ని పర్యవేట్టంగా చుట్టారు. గోదాదేవి సన్నిధిలో పూజల అనంతరం స్వామివారి ఫొటో, ప్రసాదాలను ఈవో అందజేశారు.



కప్పస్తంభం వద్ద జస్టిస్ శ్రీనరసింహ దంపతులు

విద్యుత్ సంస్థలకు ఆపరేషనల్ డైరెక్టర్ల నియామకం

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్), ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్)కు అపరేషనల్ డైరెక్టర్లను నియమిస్తూ ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వు జారీ చేశారు. ఏపీఈపీడీసీఎల్‌కు సి.శ్రీనివాసమూర్తి, ఏపీఎస్పీడీసీఎల్‌కు టి.వనజను ఆపరేషన్ డైరెక్టర్లుగా నియమిస్తూ శుక్రవారం ఉత్తర్వు జారీ చేశారు. డైరెక్టర్ పదవిలో వీరిద్దరూ రెండేళ్లపాటు కొనసాగుతారు.

ఇంటర్ హాల్ టికెట్లు విడుదల

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తెచ్చినట్టు ఇంటర్ విద్యామండలి కార్యదర్శి సౌరబ్ గౌర్ ఓ ప్రకటనలో తెలిపారు. కాలేజీల ప్రిన్సిపాళ్ల లాగిన్లతో పాటు https://bieap.apcfss.in/ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు నేరుగా హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. నేరుగా డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టిక్కెట్లపై ప్రిన్సిపల్ సంతకం అవసరం లేదని స్పష్టంచేశారు.

అందుబాటులోకి టెట్ హాల్ టికెట్లు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): టెట్ హాల్ టికెట్లను అభ్యర్థులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీటెట్ వెబ్‌సైట్ నుంచి అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఎస్జీటీ పోస్టులకు బీఈడీ చేసిన వారు అనర్హులని స్పష్టంచేశారు. అందువల్ల ఎస్జీటీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు వారి నగదును తిరిగి వారి ఖాతాల్లోకి జమ చేస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 120 కేంద్రాల్లో టెట్ జరుగుతుందన్నారు. ఎస్జీటీకి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల్లో 76.5శాతం మందికి వారి మొదటి ఎంపిక పరీక్షా కేంద్రాన్ని కేటాయించినట్టు తెలిపారు.

ఏకపక్ష ఎన్నికలకు జగన్ ప్రభుత్వం కుట్ర

తెలుగు తమ్ముళ్లపై అక్రమ కేసులు, నిర్బంధాలు: భువనేశ్వరి

- మునివేలు కుటుంబానికి పరామర్శ..
- 3 లక్షల సాయం అందజేత
- ముగిసిన ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన... 15 కుటుంబాలకు పరామర్శ

చిత్తూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 'టీడీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి నిర్బంధాలు, అరెస్టులతో బయటకు రాకుండా చేయాలని వైసీపీ కుట్ర చేస్తోంది. ఇలా చేసి వచ్చే ఎన్నికల్లో ఏకపక్షంగా ఓట్లు వేయించుకుని గెలవాలని జగన్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోంది' అని టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి అన్నారు. 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఆమె నాలుగు రోజుల పర్యటన శుక్రవారం ముగిసింది. చివరి రోజున చిత్తూరు రూరల్ మండలం ముత్తుకూరులో మోహన్‌నాయుడు, ఎస్‌ఆర్‌పురం మండలం గంగమ్మగుడి గ్రామంలో ఆంజనేయ నాయుడు, తిరుపతి జిల్లాలోని నారాయణవనం మండలం తుమ్మూరులో మునివేలు కుటుంబాన్ని పరామర్శించారు. రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించారు. మోహన్‌నాయుడు పిల్లల్ని ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా చదివిస్తామని హామీనిచ్చారు. తుమ్మూరులో తనకు సంఘీభావం తెలుపుతూ వచ్చిన టీడీపీ కార్యకర్తలు, మహిళల్ని ఉద్దేశించి ఆమె మాట్లాడారు. 'జగన్ పాలనలో ఇప్పటివరకు వేలాది మంది టీడీపీ కార్యకర్తలను తప్పుడు కేసులతో, అక్రమ అరెస్టులతో ఇబ్బందులు పెట్టారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు టీడీపీ కార్యకర్తలంతా 'సిద్ధం' అనేవాళ్లకు దీటుగా సై అంటూ ముందుకు కదలాలి' అని పిలుపునిచ్చారు. కాగా, తుమ్మూరులో సత్యవేడు వైసీపీ తిరుగుబాటు ఎమ్మెల్యే ఆదిమూలం కుటుంబీకులతో కలిసి భువనేశ్వరికి సారె అందించారు. ఇక, శుక్రవారం ఉదయాన్నే కాణిపాకంలోని వినాయక స్వామిని, ఆంజనేయస్వామిని దర్శించుకుని అక్కడి గోశాలలో గోవులకు భువనేశ్వరి పూజ చేసి పర్యటన ప్రారంభించారు. ఈ నాలుగు రోజుల పర్యటనలో ఆమె కుప్పం, పలమనేరు, పుంగనూరు, పూతలపట్టు, చిత్తూరు, జీడీనెల్లూరు, సత్యవేడు నియోజకవర్గాల్లోని 15 బాధిత కుటుంబాలను పరామర్శించారు. వీరందరికీ రూ.3 లక్షల చొప్పున చెక్కులు అంజేశారు. కుప్పం నియోజకవర్గంలో మూడు అన్న క్యాంటీన్లను ప్రారంభించారు. ప్రతిచోటా ఆమెకు పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, స్థానికుల నుంచి ఘన స్వాగతం లభించింది.



నారాయణవనం మండలం తుమ్మూరులో మునివేలు కుటుంబీకులతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

ఎర్రన్నాయుడికి టీడీపీ నేతల ఘన నివాళి

టెక్కలి, ఫిబ్రవరి 23: శ్రీకాకుళం మాజీ ఎంపీ కింజరాపు ఎర్రన్నాయుడి 67వ జయంతిని పురస్కరించుకుని శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద టీడీపీ నాయకులు శుక్రవారం ఘన నివాళి అర్పించారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, టెక్కలి ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు, వారి కుటుంబసభ్యులు, టీడీపీ ముఖ్య నాయకులు, ఎమ్మెల్యేలు, కార్యకర్తలు, అభిమానులు, టీడీపీ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఎర్రన్నాయుడు ఆశయాలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, జిల్లా ప్రజలపై ఆయనది చెరగని ముద్ర అని అన్నారు. నిమ్మాడ నుంచి ఐక్యరాజ్యసమితి వరకు తన గళం వినిపించిన ఎర్రన్నాయుడు ఏ పదవిలో ఉన్నా ఆ పదవికే వన్నె తెచ్చారన్నారు. కార్యక్రమంలో ఎర్రన్నాయుడి సతీమణి విజయలక్ష్మి, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, కేంద్ర మాజీ మంత్రి గౌతు శివాజీ తదితరులు పాల్గొన్నారు.



నిమ్మాడలో ఎర్రన్న ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న అచ్చెన్నాయుడు, రామ్మోహన్ నాయుడు తదితరులు

బీజేపీతోపాటు వైసీపీనీ గద్దె దింపాలి

- ఐద్వా జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి



ఐద్వా జాతీయ మహాసభల్లో ప్రసంగిస్తున్న పీకే శ్రీమతి

విశాఖపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): బీజేపీ పాలిత రాష్ట్రాలతోపాటు ఆ పార్టీకి మద్దతు ఇస్తున్న పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాల్లో మహిళలు, రైతులు, కార్మికులకు రక్షణ కరవైందని 'ఐద్వా' జాతీయ అధ్యక్షురాలు పీకే శ్రీమతి అన్నారు. విశాఖపట్నంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం ఐద్వా జాతీయ మహాసభల ప్రారంభం సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తొమ్మిదిన్నరేళ్ల పాలనలో దేశంలో పెట్టుబడిదారీ అనుకూల విధానాలను అవలంబిస్తూ కార్మికులు, రైతులు, మహిళలకు వ్యతిరేకంగా చట్టాలు తీసుకురావడం దుర్మార్గమని దుయ్యబట్టారు. 'సబ్‌కా సాథ్ సబ్‌కా వికాస్' అని మోదీ ప్రభుత్వం చెబుతోందని, అది కేవలం కార్పొరేట్ సంస్థలకే వెలుగునిస్తోందని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి రైతులు పోరాటం చేస్తుంటే వారిపై కాల్పులు జరిపి ప్రాణాలు బలి తీసుకోవడం రైతుల పట్ల కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధిని తెలియజేస్తోందని ఆరోపించారు. ఏపీలో వైసీపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మహిళా లోకం పెద్దఎత్తున ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఐద్వా కార్యదర్శి మరియం ధావలే మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో బీజేపీతోపాటు ఆ పార్టీకి మద్దతిస్తున్న వైసీపీ వంటి పార్టీలకు బుద్ధిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎట్టకేలకు సర్దుబాట్లు

అహంకారాలను పక్కనబెట్టి, అనుమానాలకు స్వస్తిచెప్పి, సీట్ల సర్దుబాటు విషయంలో ఇండియా కూటమి అడుగులువేయడం ఆరంభించింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో కాంగ్రెస్–సమాజ్‌వాదీపార్టీ మధ్య ఎంతోకాలంగా నానుతున్న వ్యవహారం ఎట్టకేలకు కొలిక్కివచ్చింది. ఎవరు రాజీపడ్డారో, ఎవరు లాభపడ్డారో తెలియదు కానీ, కాంగ్రెస్‌కు అఖిలేశ్ యాదవ్ దాదాపు నాలుగోవంతు స్థానాలు ఇచ్చి ఆనందింపచేశారు. ఢిల్లీ, మహారాష్ట్రలో కూడా చర్చలు జోరందుకున్నాయని, పోతేపొండి అని గర్జించిన బెంగాల్ మమతతో కూడా కాంగ్రెస్ మళ్ళీ మంతనాలు ఆరంభించిందని వార్తలు వస్తున్నాయి. జాతీయ స్థాయిలో కాంగ్రెస్‌తో చేతులు కలిపి, ఇండియా కూటమిలో ఉంటున్న ప్రాంతీయ పార్టీలకు రాష్ట్రస్థాయిలో కాంగ్రెస్ శత్రువైనప్పుడు ఇచ్చిపుచ్చుకోవడం సహజంగానే మరీ కష్టం.

ప్రియాంకాగాంధీ రంగంలోకి దిగితే తప్ప యూపీలో లెక్కలు ఒక కొలిక్కిరాలేదట. యూపీలో 80 లోక్‌సభ స్థానాల్లో కాంగ్రెస్ 17 చోట్ల పోటీచేస్తుంది. ఆదినుంచీ అఖిలేశ్ అదే మాటమీద నిలబడిపోవడంతో మొదట్లో 20 స్థానాలకు పట్టుబట్టిన కాంగ్రెస్ మూడింటిని వదులుకుంది. ఇందుకు బదులుగా తాను బలంగా ఆశిస్తున్న కొన్ని స్థానాల విషయంలో అఖిలేశ్‌ను కాంగ్రెస్ ఒప్పించగలిగిందని అంటున్నారు. రాహుల్, అఖిలేశ్, ప్రియాంక మధ్య చర్చోపచర్చల తరువాత కుదిరిన ఈ ఒప్పందంతో పాటు, మధ్యప్రదేశ్ లెక్కలను సైతం రెండు పార్టీలు తేల్చుకున్నాయి. అక్కడ ఒక సీటు సమాజ్‌వాదీకి దక్కింది. ఇక, యూపీలో కాంగ్రెస్ పోటీచేయబోతున్న పదిహేడు స్థానాల్లో అది గత సార్వత్రిక ఎన్నికల్లో ఓడిపోయినవి ఎన్నో బీజేపీ నాయకులు గుర్తుచేస్తున్నారు. కాంగ్రెస్ ఎక్కడెక్కడ, ఎన్ని ఓట్లు తెచ్చుకుందో వివరిస్తూ అఖిలేశ్ కాంగ్రెస్‌ను నిండాముంచాడని అంటున్నారు. కానీ, ఇప్పటిలెక్కలూ ఈసారి వ్యూహాలు వేరని ఎస్పీ–కాంగ్రెస్ గట్టిగా నమ్ముతున్నాయి. అసలే యోగి, ఆపైన అయోధ్యతో ఈ మారు పోటీ మరింత బలంగా ఉంటుందనడంలో సందేహం లేదు.

ఢిల్లీలో కాంగ్రెస్–ఆమ్ ఆద్మీపార్టీ మధ్య ఇప్పటికే అవగాహన కుదిరిందని, నాలుగు సీట్లలో ఆప్, మిగతా మూడింటిలో కాంగ్రెస్ పోటీచేయబోతున్న ప్రకటన త్వరలోనే వెలువడుతుందని అంటున్నారు. ఈ రెండు పార్టీలూ గుజరాత్‌లో ఒక సీటు విషయంలో ఏర్పడిన వివాదాన్ని, హర్యానాలో వాటాలనూ కూడా పరిష్కరించుకున్నాయట. మహారాష్ట్రలో శరద్‌పవార్, ఉద్ధవ్‌ఠాక్రే, ప్రకాష్ అంబేడ్కర్ మధ్య పంపకాలు, కాంగ్రెస్ వాటాలూ కోటాలూ ఇప్పటికే ఓ కొలిక్కివచ్చాయని, వారంలో తేలిపోతాయని అంటున్నారు. పశ్చిమబెంగాల్‌లో కాంగ్రెస్–తృణమూల్ మధ్య మళ్ళీ చర్చలు జరుగుతున్నాయన్న వార్తలు ఆశ్చర్యకరమైనవే. రెండేరెండు సీట్లు అని మమత అనడం, కాంగ్రెస్ ఆగ్రహించడం, ఆ పైన మమత కాంగ్రెస్‌కు అహంకారం ఎక్కువంటూ రాహుల్ న్యాయ యాత్రను సైతం విమర్శించడం తెలిసినవే. మమత అంటేనే మండిపడే అధిర్‌రంజన్ నిత్యం ఆమెమీద విమర్శనాస్త్రాలు ఎక్కుపెడుతూనే ఉంటారు. ఈ పరిస్థితుల్లో మళ్ళీ చర్చలు జరుగుతున్నా చివరకు కాంగ్రెస్ సర్దుకుపోవాల్సివస్తుందా, మమతే ఓ మెట్టుదిగుతారా అన్నది చూడాలి. తమిళనాడులో గతంలో మాదిరిగానే కాంగ్రెస్‌కు 9 స్థానాలు ఇవ్వడానికి డీఎంకె నిజానికి ఎప్పుడో సిద్ధపడింది. పోటీచేసినవాటిలో ఎనిమిదింటిని గెలుచుకున్న కాంగ్రెస్ ఈసారి అదనంగా మరికొన్నిటికోసం ప్రయత్నిస్తోంది.

నిజానికి మోదీ ఎప్పుడో సార్వత్రిక యుద్ధం ఆరంభించేశారు. రామమందిరం, భారతరత్నలు, ప్రాజెక్టులతో సహా ప్రతీ అడుగూ ఎప్పటినుంచో ఆ దిశగానే పడుతోంది. దేశాన్ని ఇండియా కూటమి కులం ప్రాతిపదికన చీల్చాలని అనుకుంటోందని కులగణనమీద కూడా విమర్శలు చేస్తున్నారు. మరోపక్క పార్టీనేతలకు వందరోజుల కార్యాచరణ అందిస్తున్నారు. ఎన్నికల ప్రకటన దగ్గరపడుతున్న తరుణంలో ఇప్పటికి ఇండియా కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కివస్తున్నట్టుంది. కూటమికి పునాదులు వేసిన నితీశ్‌కుమార్ ఎన్డీయేలో చేరిపోవడం ఆదిలోనే దానికి తగిలిన పెద్ద ఎదురుదెబ్బ. ఆయన నిష్క్రమణతో బిహార్‌లో మహాగడ్బంధన్‌కు మరింత ప్రయోజనం చేకూరుతుందన్న వాదనలు కూడా లేకపోలేదు. మిత్రపక్షాలతో ఇచ్చిపుచ్చుకొనే విషయంలో కాంగ్రెస్ తన భేషజాలు పక్కనబెట్టి సర్దుబాటు ధోరణి కనబరుస్తున్నందున పంపకాలు సాధ్యపడుతున్నప్పటికీ, ఎన్నికల చివరి అంకంవరకూ, ఓట్లసాధనలోనూ ఇదే సయోధ్య నిలబెట్టుకోవడం మరింత ముఖ్యం.

సార్థకం కాని స్వయం సంకీర్తనలు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిత్యం తనను తాను ఉత్తమ పురుషలో సూచించుకోవడం కద్దు. ఆయనకు గల ఈ విలక్షణ అలవాటు ఒక వాస్తవాన్ని తిరుగులేని రీతిలో ధ్రువీకరించింది: నరేంద్ర మోదీయే భారత ప్రభుత్వం; ప్రభుత్వ మంచీ చెడుకు మోదీ మాత్రమే బాధ్యుడు మిగతా అందరూ– అమిత్ షా మినహా సుమా! – మంత్రులు, పార్టీ నాయకులు, ఎంపీలు, ముఖ్యమంత్రులు– అప్రధాన వ్యక్తులుగా తగ్గించివేయబడ్డారు. విచిత్రమేమిటంటే తాము అసంగత వ్యక్తులుగా మిగిలి పోవడంపట్ల వారు సంతోషంగా ఉన్నారు! కనుక మనం ఏ విజ్ఞప్తులనైనా గౌరవనీయ ప్రధానమంత్రికి మాత్రమే చేయాలి; ఏ విమర్శలు అయినా సరే మాన్యులు ప్రధానమంత్రిని ఉద్దేశించి మాత్రమే చేయాలి.

ప్రధానమంత్రి కొద్ది కాలం క్రితం ఒక కొత్త నినాదాన్ని సృష్టించి దేశం మీదకి వదిలారు. అదే 'వికసిత్ భారత్' లేదా అభివృద్ధి చెందిన భారత్. 'అచ్చే దిన్ ఆనేవాలే హై'తో ప్రారంభమైన నినాదాల పరంపరలో 'వికసిత్ భారత్' అనేది చివరిది అని నేను భావిస్తున్నాను. మోదీ సృష్టించిన చాలా నినాదాలు దారి పక్కన పడిపోయాయి. 'వికసిత్ భారత్' అనేది ఒక లక్ష్యం. 2047 నాటికి మనం ఆ లక్ష్యాన్ని సాధించాలని నరేంద్ర మోదీ నిర్దేశించారు. 2024–2047 మధ్య ప్రభుత్వంలో ఎవరు ఉన్నప్పటికీ భారత్ ప్రస్తుతానికంటే మరింత అభివృద్ధి చెందిన దేశంగా ఉంటుంది. 1947లో కంటే 2024లో భారత్ ఎంతగా అభివృద్ధి చెందిందో, ఇప్పటి కంటే 2047లో ఈ దేశం మరింత అభివృద్ధి చెందిన దేశంగా ఉండడం ఖాయం.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

సరే, దేశం అభివృద్ధి చెందడమంటే ఏమిటి? 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందడమేనని నరేంద్ర మోదీ అన్నారు. ఈ లక్ష్యాన్ని 2023–24 ఆర్థిక సంవత్సరాని కల్లా సాధించాలని మోదీ తొలుత నిర్దేశించారు. అయితే క్రమంగా ఆ లక్ష్య పరిపూర్తి గడువును 2027–28 ఆర్థిక సంవత్సరానికి తీసుకువెళ్లారు! 2023–24 ఆర్థిక సంవత్సరాంతానికి భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) 172 లక్షల కోట్ల రూపాయలుగా ఉంటుంది. అది ప్రస్తుత మారకం రేటు ప్రకారం 3.57 ట్రిలియన్ డాలర్లకు సమానం. మారకం రేటు ప్రస్తుతమున్న విధంగానే ఉండిపోతే విభిన్న వృద్ధి రేట్లతో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ స్వప్నం విభిన్న సంవత్సరాలలో సాకారమవుతుంది 6 శాతం వృద్ధిరేటు సాధించడానికి ఆరు సంవత్సరాల వ్యవధి పడుతుంది. ఈ లక్ష్యాన్ని 2029–30 ఆర్థిక సంవత్సరంలో చేరగలుగుతాము. 7 శాతం వృద్ధిరేటును సాధించేందుకు ఐదు సంవత్సరాల సమయం పడుతుంది. ఈ లక్ష్యాన్ని 2028–29 ఆర్థిక సంవత్సరంలో సాధించగలుగుతాము. 8 శాతం వృద్ధిరేటును నాలుగున్నర సంవత్సరాలలో సాధించగలుగుతాము. ఈ లక్ష్యం సెప్టెంబర్ 2028లో పరిపూర్తి కాగలదు. డాలర్ : రూపీ మారకం రేటు దిగసిల్లిపోతే లక్ష్య సాధన సంవత్సరం మరింత వెనక్కి వెళ్లుతుంది.

గత పదేళ్లుగా బీజేపీ/ ఎన్డీఏ ప్రభుత్వ పాలన స్ఫూర్తిదాయకంగా లేదు. నిజమైన అభివృద్ధికి దోహదం చేయలేదు. కొత్త లెక్కల ప్రకారం యూపీఏ పదేళ్ల పాలనలో సగటు వార్షిక వృద్ధిరేటు 6.7 శాతం కాగా (పాత లెక్కల ప్రకారం ఇది 7.5 శాతం) ఎన్డీఏ ప్రభుత్వ పదేళ్ల పాలన సగటు వార్షిక వృద్ధిరేటు 5.9 శాతంగా మాత్రమే నమోదయింది. మరి బీజేపీ ప్రభుత్వం సగటు వృద్ధిరేటు పెరుగుదలను సాధించగలదా? ప్రభుత్వంలోని వారు గానీ, పార్టీలోని వారు గానీ ఈ ప్రశ్నకు సమాధానమివ్వలేకపోతున్నారు. వృద్ధిరేటు పెరుగుదల అనేది బాహ్య కారణాలతో పాటు ఆర్థిక వ్యవస్థను దేశీయంగా నిర్వహిస్తున్న తీరుతెన్నుల పైన ఆధారపడి ఉంటుంది. ఆర్థిక వ్యవస్థ అభివృద్ధిలో అనిశ్చితి ఎలా ఉన్నప్పటికీ నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి సార్వత్రిక ఎన్నికలలో విజయం సాధించగలగడంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ 8 శాతం వార్షిక వృద్ధిరేటుతో మోదీ మూడో విడత పాలన ఆఖరి సంవత్సరంలో మాత్రమే భారత్ జీడీపీ 5 ట్రిలియన్ డాలర్ల స్థాయికి చేరగలుగుతుంది.





2028–29లో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 150 కోట్ల జనాభాతో భారత్ తలసరి ఆదాయం 3333 డాలర్లుగా ఉంటుంది. ఆ తలసరి ఆదాయం భారత్‌ను దిగువ మధ్య స్థాయి ఆదాయ ఆర్థిక వ్యవస్థల శ్రేణిలో చేర్చుతుంది. 'అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ', 'ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ' ఇత్యాది ఆత్మ స్తుతులు సత్యదూరమైనవి.

2028–29 ఆర్థిక సంవత్సరంలో భారత్ ఆర్థిక వ్యవస్థ 5 ట్రియన్ డాలర్ల స్థాయికి చేరిందని అనుకుందాం. అప్పుడు భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా పరిగణన పొందుతుందా? 2028–29లో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ, 150 కోట్ల జనాభాతో భారత్ తలసరి ఆదాయం 3333 డాలర్లుగా ఉంటుంది. ఆ తలసరి ఆదాయం భారత్‌ను దిగువ మధ్య స్థాయి ఆదాయ ఆర్థిక వ్యవస్థల శ్రేణిలో చేర్చుతుంది. ప్రపంచ దేశాలలో భారత్ ప్రస్తుతం 140వ స్థానంలో ఉన్నది. 2028–29లో కొంచెం మెరుగైన స్థానంలో భారత్ ఉండగలదు. ఇవన్నీ నేను ఎందుకు ఏకరువు పెడుతున్నాను? 'అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ', 'ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థిక వ్యవస్థ' ఇత్యాది స్వయం సంకీర్తనలు సత్యదూరమైనవి. ఇవేవీ నన్ను ఏ మాత్రం ఉత్తేజపరచడం లేదు.

కొన్ని ఉపయుక్తమైన ప్రశ్నలను పాఠకుల ముందుంచదలిచాను. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో వాటిపై చర్చ జరిగి తీరాలి:

(1) 22 కోట్ల మంది ప్రజలు దారిద్ర్య రేఖకు దిగువనే నివసిస్తుండడం భారత్ ప్రతిష్ఠకు తీరని కళంకం కాదా? ఈ కళంకాన్ని మన దేశం ఎప్పటికి తొలగించుకోగలుగుతుంది? యూఎన్‌డీపీ ప్రకారం 2005–15 సంవత్సరాల మధ్య 27 కోట్ల మంది భారత ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారు. మరి 22 కోట్ల మంది పేదలను దారిద్ర్యం నుంచి ఎప్పటికి విముక్తం చేస్తారు? (2) ప్రస్తుత నిరుద్యోగిత రేటు (8.7 శాతం) లక్షలాది ప్రజల బతుకులను అతలాకుతలం చేస్తోంది విద్యావంతులు, పాక్షిక నైపుణ్యాలు కలవారు వలస వెళ్ళే అగత్యాన్ని కలిగిస్తోంది. నేరాలు పెచ్చరిల్లిపోవడానికి కారణమవుతోంది. యువజనులు తమ అర్హతలకు తగ్గ ఉద్యోగాలను ఎప్పుడు పొందగలుగుతారు? వాచ్‌మాన్, రైల్వే గ్యాంగ్ మ్యాన్ ఉద్యోగాలకు పిహెచ్‌డి ఉన్నవారు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, దరఖాస్తు చేస్తున్న శోచనీయ స్థితి ఎప్పుడు తొలగిపోతుంది? (3) కార్మిక–జనాభా నిష్పత్తి (లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) ఎప్పుడు 50 లేదా 60 శాతానికి పైగా పెరుగుతుంది? కార్మిక శ్రేణులలో మహిళల భాగస్వామ్యం ప్రస్తుత 25 శాతం నుంచి మరింతగా ఎప్పుడు పెరుగుతుంది? (4) ప్రైవేట్ వినియోగం ఎప్పుడు పెరుగుతుంది? కుటుంబ అవసరాలకు సరిపడా తిండిగింజలను కొనుగోలు చేసుకోగలగడం పేదలకు ఎప్పటికి సాధ్యమవుతుంది? (5) నిజ వేతనాలు ఎప్పుడు పెరుగుతాయి?

నిరుద్యోగం, ద్రవ్యోల్బణం మన దేశ ప్రజలను తీవ్రంగా వేధిస్తున్న సమస్యలు. గౌరవనీయ ప్రధానమంత్రి ఆ సమస్యల గురించి చివరిసారి ఎప్పుడు మాట్లాడారో నాకు జ్ఞాపకం లేదు చైనా పైన, మణిపూర్ గురించి, రాజకీయ ఫిరాయింపుల గురించి, రాజకీయ పార్టీలను చీల్చడం గురించి, గోప్యత హక్కు గురించి, నైతిక పోలీసింగ్ గరించి బుల్డోజర్ న్యాయం గురించి ప్రధానమంత్రి చివరిసారి ఎప్పుడు మాట్లాడారో కూడా నాకు జ్ఞాపకం లేదు. రాజకీయ పార్టీలు ఈ సమస్యలను పదే పదే ప్రస్తావించాలి. బహిరంగ చర్చలు జరపాలి. ప్రజలకు ఎంతో ముఖ్యమైన ఈ అంశాలపై తన ఉద్దేశపూర్వక మౌనాన్ని విడనాడేలా ప్రధానమంత్రిని బలవంత పెట్టాలి. భారతీయ జనతా పార్టీలో ప్రాధాన్యమున్న ఒకే ఒక్క నాయకుడు ప్రధానమంత్రి నరేంద్ర మోదీయే గనుక నేను లేవనెత్తిన అంశాలపై ఆయన తప్పక మాట్లాడాలి.

పెత్తందారీ కేంద్రంపై రాష్ట్రాల పోరు

ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని భారతీయ జనతాపార్టీ 2019లో మరింత మెజారిటీతో మళ్లీ అధికారానికి వచ్చినప్పటి నుంచీ కేంద్ర ప్రభుత్వం, బీజేపీ అధికారంలో లేని రాష్ట్రాల మధ్య ఘర్షణలు తీవ్రమయ్యాయి. ముఖ్యంగా మూడు రాష్ట్రాలు –పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ– ఈ ఘర్షణలకు కేంద్రంగా ఉన్నాయి. ఈ మూడు రాష్ట్రాలలోను గవర్నర్లు కేంద్రంలోని అధికారపార్టీ తరఫున పక్షపాత ధృక్పథంతో తమ విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కేంద్రం, మోదీ సర్కార్‌పై పలు ఆరోపణలు చేశారు. తమ రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన నిధులు రావడం లేదని, తమ రాష్ట్ర విలక్షణ, సమున్నత సంస్కృతి, అస్తిత్వాన్ని కేంద్రం అలక్ష్యం చేస్తోందని వారు విమర్శిస్తున్నారు.

బెంగాల్, కేరళ, తమిళనాడులోని బీజేపీయేతర ప్రభుత్వాలు–కేంద్రంలోని మోదీ సర్కార్ మధ్య పోరాటాలు కటువుగా ఉంటున్నాయి. ఏ పక్షమూ తన వాదనల నుంచి వెనక్కి తగ్గడం లేదు.

ఇటీవలి నెలల్లో మరో రెండు రాష్ట్రాలు కూడా మోదీ ధిక్కార కూటమిలో చేరాయి. అవి: ఆమ్ ఆద్మీ పార్టీ పాలనలో ఉన్న పంజాబ్, కాంగ్రెస్ పాలనలో ఉన్న కర్ణాటక. పంజాబ్ గవర్నర్ తరచు ముఖ్యమంత్రి భగవంత్‌సింగ్ మాన్‌తో ఘర్షిస్తున్నారు. గత మేలో కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో అనేక అంశాలపై తీవ్రంగా విభేదిస్తూ వస్తోంది. పన్నుల ఆదాయంలో తమ రాష్ట్రానికి సహేతుకమైన వాటా ఇవ్వడంలో మోదీ సర్కార్ వివక్ష చూపుతున్నదని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్ తరచు విమర్శిస్తున్నారు. కేంద్రం వివక్షకు వ్యతిరేకంగా సిద్ధరామయ్య, శివకుమార్‌లు ఇటీవల ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఆ తరువాత కేరళ ముఖ్యమంత్రి సైతం అదే విధమైన నిరసన తెలిపారు.

కేంద్రం– మూడు రాష్ట్రాల ఘర్షణ గురించి పత్రికలలో వార్తలు వస్తున్నప్పటికీ వాటికి సరైన ప్రాధాన్యాన్ని ఇవ్వడం లేదు. కేరళ, తమిళనాడు బెంగాల్ ప్రజలు మొత్తంగా 30 కోట్ల మందికి పైగా ఉన్నారు. ఆ మూడు రాష్ట్రాల ప్రజలకు సొంత అస్తిత్వం, విలక్షణ సంస్కృతి, సమున్నత చరిత్ర ఉన్నది. తమిళ, మలయాళ, కన్నడ, బెంగాలీ, పంజాబీ ప్రజలు తమ మాతృభాషను, సాహిత్య సంపదను, సాంస్కృతిక వారసత్వం సమున్నతమైనదిగా సహేతుకంగా గర్విస్తారు. ఈ వాస్తవాన్ని హిందీ, గుజరాతీ ప్రజలు అర్థం చేసుకోలేరు.

విద్య ఆరోగ్య సదుపాయాలు, జెండర్ సమానత్వం విషయంలో కేరళ, తమిళనాడులు దేశంలోనే అత్యంత ప్రగతిశీల, అగ్రగామి రాష్ట్రాలు. పారిశ్రామిక రంగంలో తమిళనాడు అద్వితీయమైన అభివృద్ధిని సాధించింది. వైజ్ఞానిక పరిశోధనలలో కర్ణాటక అగ్రగామిగా ఉన్నది. ఇటీవలి కాలంలో ఐటి, బయో టెక్నాలజీ రంగాలలో ఆ రాష్ట్రం అద్భుతమైన పురోగతి సాధించింది. మన దేశం బ్రిటిష్ వారి పాలనలో ఉన్నప్పుడు బెంగాల్ నుంచి మహోన్నత స్వాతంత్ర్య వీరులు, సంఘ సంస్కర్తలు, సాహితీవేత్తలు, వైజ్ఞానికులు ప్రభవించారు. స్వాతంత్ర్యానంతరం భారత దేశ ఉత్కృష్ట సంగీతవేత్తలు, చలన చిత్ర స్రష్టలు, పండితులలో అత్యధికులు వంగ భూమి నుంచి వచ్చినవారే. పంజాబ్ భూమి పుత్రులు అయిన సిక్కులు దేశానికి ఆహార భద్రత కల్పించడంలో అనుపమాన సేవలు అందిస్తున్నారు. దేశ సాయుధ బలగాలలో అత్యధిక సంఖ్యలో ఉండడం ద్వారా భారతదేశ రక్షకులుగా వారు పేరు పొందారు.



> సమాఖ్య పాలన భవిష్యత్తు విషయమై ప్రజాస్వామ్య వివేచనా పరులు శ్రద్ధ చూపడం అవసరం. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మూడోసారి విజయం సాధిస్తే కేంద్రం–బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణలు మరింతగా తీవ్రమవుతాయి. ఇది మన రిపబ్లిక్ భవిష్యత్తుకు ఎంతమాత్రం మంచిదికాదు.

పంజాబ్, బెంగాల్, కేరళ, కర్ణాటక, తమిళనాడులు గతంలోనూ, వర్తమానంలోనూ భారతదేశానికి వైవిధ్యపూరితమైన, విలక్షణమైన సేవలు అందించాయి. ఇప్పుడు ఈ ఐదు రాష్ట్రాలు ఐదు విభిన్న పార్టీల పాలనలో ఉన్నాయి. అవన్నీ బీజేపీయేతర పార్టీలు కావడం విశేషం. మరి ఈ ఐదు రాష్ట్రాలు, కేంద్రం మధ్య చోటు చేసుకుంటున్న ఘర్షణలు ఈ దేశ ప్రయోజనాలకు దోహదం చేస్తాయా?

మరో కొత్త పరిణామం చూద్దాం. తదుపరి సార్వత్రిక ఎన్నికల ఫలితాలు భారతీయ జనతా పార్టీకి వరుసగా మూడోసారి భారీ మెజార్టీని సమకూర్చేవిగా ఉండకూడదని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇటీవల ఆకాంక్షించారు. ఫిబ్రవరి తొలివారంలో రాష్ట్ర శాసనసభలో మాట్లాడుతూ, కేంద్రంలో అధికారంలోకి వచ్చే రాజకీయ పక్షం ప్రభుత్వం ఏర్పాటుకు ఇతర పార్టీల మద్దతుపై ఆధారపడినప్పుడే ఆంధ్రప్రదేశ్‌కు 'ప్రత్యేక హోదా' డిమాండ్ నెరవేరేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. కొద్దిరోజుల అనంతరం రాష్ట్ర గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చకు సమాధానమిస్తూ జగన్ తన ఆకాంక్షను మరోసారి ఉద్ఘాటించారు.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్నడూ నరేంద్రమోదీ, బీజేపీ, కేంద్ర ప్రభుత్వం పట్ల ఘర్షణాత్మక వైఖరిని అనుసరించలేదు. పూర్తివిధేయుడు కానప్పటికీ మోదీ, బీజేపీ, కేంద్రం నిర్దేశించినదాన్ని తుచ తప్పకుండా పాటించే వ్యక్తి. అధికరణ 370 రద్దు సహా చాలా నిర్ణయాలను ఆయన ఉత్సాహంగా సమర్థించారు. అసాధారణ పాలనాదక్షతను ప్రదర్శిస్తున్న నాయకుడుగా నరేంద్రమోదీని ప్రశంసించడంతో పాటు ఆయనను దార్శనికుడు అని కూడా జగన్ ప్రస్తుతించారు. ప్రధాని మోదీతో తనకు దృఢ సంబంధాలు ఉన్నాయని కూడా జగన్ చెప్పుకున్నారు. అదే జగన్ ఇప్పుడు మోదీ సర్కార్ వ్యవహారశైలిపట్ల కలవరం ప్రకటిస్తున్నారు. సమాఖ్య పాలనా విధానం సక్రమంగా అమలవ్వాలంటే కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వాలు ఉండడం మంచిదన్న ఆయన అభిప్రాయం సహేతుకమైనది. గతంలో నేను ఇదే కాలమ్‌లో వాదించినట్టు న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తికి, పత్రికా స్వేచ్ఛకు సంకీర్ణ ప్రభుత్వాలే మరింత సానుకూలంగా ఉంటాయి. సంకీర్ణ సర్కార్లు మాత్రమే సమతౌల్య ఆర్థికాభివృద్ధిని సాధించగలుగుతాయి.

కేంద్రం పట్ల జగన్‌రెడ్డి మృదువైఖరి, సానుకూల వ్యవహరణ ఇకపై సమరశీలంగా మారుతుందా అన్నది ఇదమిత్థంగా చెప్పలేం. అలాగే పన్నుల ఆదాయంలో మరింత వాటాను డిమాండ్ చేయడంలో తెలంగాణ కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటకలో అధికారంలో ఉన్న తమ పార్టీ సహచరులతో జట్టు కడతారా అనేదీ ఇప్పుడే స్పష్టంగా చెప్పలేం. ఆంధ్ర, తెలంగాణ ముఖ్యమంత్రులు కేంద్రంతో ఘర్షణాత్మక వైఖరికి దూరంగా ఉన్నప్పటికీ బీజేపీ ఆధ్వర్యంలోని కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీయేతర పార్టీల పాలనలో ఉన్న బెంగాల్, కేరళ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్‌ల మధ్య కొనసాగుతున్న విభేదాలు, ఘర్షణలు బాగా కలవరపరుస్తున్నాయి.

ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి ప్రకటనలు, చర్యలను నిశితంగా గమనిస్తే ప్రస్తావిత రాష్ట్రాల డిమాండ్లను బీజేపీ ఎంత మాత్రం అంగీకరించబోదనే విషయం స్పష్టమవుతుంది. బీజేపీయేతర పార్టీల పాలనలోని రాష్ట్ర ప్రభుత్వాల ఆకాంక్షలు, ప్రయోజనాలకు వ్యతిరేకంగా తమ ప్రాబల్యాన్ని, పెత్తనాన్ని కొనసాగించుకునేందుకు బీజేపీ, మోదీ సర్కార్ మూడు ఎత్తుగడలకు పాల్పడే అవకాశమున్నది. వాటిలో మొదటిది ప్రస్తుతం అనుసరిస్తున్న వైఖరికే మోదీ ప్రభుత్వం మరింత దృఢంగా కట్టుబడి ఉండడం. అంటే బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల విన్నపాలను కేంద్రం రవ్వంత కూడా ఆలకించే అవకాశం ఉండదు. కొవిడ్ విలయం నాటి నుంచి రాజ్యాంగ విరుద్ధంగా స్వాధీనం చేసుకున్న రాష్ట్రాల అధికారాలను మరింతగా పెంచుకుని ప్రతిపక్షాల పాలనలోని రాష్ట్రాలకు నిధుల పంపిణీని నిరాకరించడం, తద్వారా రాష్ట్రాల స్వతంత్ర ప్రతిపత్తిని మరింతగా కుదించివేయడం; రెండోది– 'డబుల్ ఇంజన్ సర్కార్'ను ఎన్నుకున్న రాష్ట్రాలకు మాత్రమే కేంద్రం సకల సహాయ సహకారాలను అందిస్తుందని హామీ ఇవ్వడం; మూడోది కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరచడం ద్వారా ఇతర పార్టీల ఎమ్మెల్యేలు బీజేపీలో చేరేలా పురిగొల్పడం.

మోదీ ప్రభుత్వం ఈ మూడు పద్ధతులను తరచు సంయుక్తంగా అనుసరించడం జరిగింది, లక్ష్యసాధనలో చాలా వరకు సఫలమయింది కూడా. రెండు లేక అంతకంటే ఎక్కువ ప్రతిపక్షాలతో కూడిన సంకీర్ణ కూటమి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాలను బీజేపీ కూల్చివేస్తుంది. 2019లో కర్ణాటకలో, 2022లో మహారాష్ట్రలో, ఇటీవల బిహార్‌లో ఇలానే జరిగింది. అయితే గణనీయమైన మెజారిటీతో బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల (బెంగాల్, కేరళ, తమిళనాడులలో వలే)లో ప్రభుత్వాలను కూలగొట్టడంలో బీజేపీ పూర్తిగా విఫలమయింది. బెంగాల్, కేరళ, తమిళనాడులలో రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన ప్రభుత్వాల పట్ల మోదీ ప్రభుత్వ స్పష్టమైన వ్యతిరేకత బెంగాలీలు, మలయాళీలు, తమిళులలో తీవ్ర మనస్తాపం కలిగిస్తోంది. బీజేపీ పట్ల ఆ రాష్ట్రాల ప్రజలలో వ్యతిరేకతను తీవ్రం చేస్తోంది.

భారతదేశ సమాఖ్య పాలనావ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్ళు, సమస్యల గురించి గోదీ మీడియా (ప్రభుత్వ అనుకూల పత్రికలు, ఛానెళ్లు)లో ఎలాంటి చర్చ జరగడం లేదు. సమాఖ్య పాలన భవిష్యత్తు విషయమై ప్రజాస్వామ్య వివేచనాపరులు తగుశ్రద్ధ చూపడం అవసరం. రాబోయే సార్వత్రిక ఎన్నికలలో బీజేపీ మూడోసారి విజయం సాధిస్తే కేంద్రం–బీజేపీయేతర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఘర్షణలు కొనసాగడమే కాదు, మరింతగా తీవ్రమవుతాయి. ఇది మన రిపబ్లిక్ భవిష్యత్తుకు ఎంతమాత్రం మంచిదికాదు.

మరింత రగిలిన కృష్ణాజలాల వివాదం!

తెలంగాణలో ప్రభుత్వం మారినందున రెండు రాష్ట్రాల మధ్య సామరస్యం నెలకొంటుందని భావిస్తున్న నేపథ్యంలో, కేసీఆర్ ఓటమి నుంచి తేరుకొనేందుకు, కాళేశ్వరం లొసుగులపై వెల్లువెత్తుతున్న విమర్శలను మరుగుపర్చేందుకు తిరిగి సెంటిమెంట్ రాజకీయం మొదలుపెట్టారు. కృష్ణాజలాల వివాదాన్ని మరింత రగిల్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం తామూ తక్కువలో లేమని చెప్పేందుకు, కేసీఆర్‌కు చెక్ పెట్టేందుకు బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించబోమని శాసనసభలోనే తీర్మానం చేసింది. కేసీఆర్ తలరాత బాగా లేక ఎన్నికల సమయంలోనే మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంలోని లోపాలు బయటపడ్డాయి. అధికార మార్పిడి జరిగింది. లక్ష కోట్ల కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా లక్ష ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని కొత్త ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దాడి మొదలుపెట్టగానే... కృష్ణాజలాల అంశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరి తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉందని కేసీఆర్ ఎదురు దాడి ప్రారంభించారు. ఈ దాడిని తిప్పి కొట్టేందుకు కేసీఆర్ అధికారంలో ఉన్నపుడే అప్పగింతకు పునాది పడిందంటూ అధికార పార్టీ ఒక నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టింది. కృష్ణానదిపై ఉన్న ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించేందుకు రెండు రాష్ట్రాలు అంగీకరించాయనే మినిట్స్ బహిర్గతం కావడంతో రభస మొదలైంది. తెలంగాణ అంగీకారంపై రెండుపక్షాలు పరస్పరం దుమ్మెత్తి పోసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ప్రవేశపెట్టిన నివేదికలో రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. కృష్ణ బేసిన్‌లోని ఉమ్మడి ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడానికి మాన్యుయల్ ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిందని 2015లోనే అప్పటి ఇంజనీర్–ఇన్–చీఫ్ లేఖ రాసిన విషయం ఈ నివేదికలో పొందుపర్చారు. కాగా, 2023 డిసెంబర్ 1న అప్పటి నీటిపారుదల శాఖ కార్యదర్శి స్మితా సభర్వాల్ లేఖ రాస్తూ ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించడానికి సూత్రప్రాయంగా అంగీకారం తెలిపిన అంశాన్ని ఈ నివేదికలో పేర్కొన్నారు.



> ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సామరస్యంగా, ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో వ్యవహరిస్తే తప్ప అటు దక్షిణ తెలంగాణకు గాని, ఇటు గొంతెండుతున్న రాయలసీమకు గాని వృథాగా సముద్రం పాలౌతున్న కృష్ణా 'వరద జలాలు' సద్వినియోగం చేసుకొనే అవకాశం లేదు. రెండు రాష్ట్రాల మధ్య ఏ సమస్య పరిష్కారం కావాలన్నా రాష్ట్ర విభజన చట్టం మాత్రమే కరదీపిక.

ఉభయ తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు సామరస్యంగా, ఇచ్చి పుచ్చుకొనే ధోరణిలో వ్యవహరిస్తే తప్ప అటు దక్షిణ తెలంగాణకు గాని, ఇటు గొంతెండుతున్న రాయలసీమకు గాని వృథాగా సముద్రం పాలౌతున్న కృష్ణా 'వరద జలాలు' సద్వినియోగం చేసుకొనే అవకాశం లేదు. రెండు రాష్ట్రాల మధ్య ఏ సమస్య పరిష్కారం కావాలన్నా రాష్ట్ర విభజన చట్టం మాత్రమే కరదీపిక. రాష్ట్ర విభజన చట్టంలో నీటి పంపిణీ గురించి స్పష్టత లేదంటూ బీఆర్ఎస్ నేతలు, వారి అనుయాయులు చేస్తున్న ప్రచారం అవాస్తవం. రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 85లో పూర్తి స్పష్టత ఉంది. సెక్షన్ 85 సబ్ సెక్షన్ (8)(a)లో "ది రెగ్యులేషన్ ఆఫ్ సప్లయ్ ఆఫ్ వాటర్ ఫ్రమ్ ది ప్రాజెక్ట్స్ టు ది సక్సెసర్ స్టేట్స్ హావింగ్ రిగార్డ్ టు" అంటూ కొనసాగింపుగా (1)లో "అవార్డ్స్ గ్రాంటెడ్ బై ది ట్రిబ్యునల్స్ కాన్‌స్టిట్యూటెడ్ అండర్ ది ఇంటర్ స్టేట్ రివర్ వాటర్ డిస్ప్యూట్ యాక్ట్ 1956" అని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ గురించి అమలులో ఉన్న ట్రిబ్యునల్స్ అవార్డుల మేరకు పంపిణీ జరగాలని విభజన చట్టంలో స్పష్టంగా ఉంది. ప్రస్తుతం బచావత్ ట్రిబ్యునల్ అవార్డు అమలులో ఉన్నందున, విభజన తర్వాత ఏపీకి 510 టియంసిలు, తెలంగాణకు 299 టియంసిలుగా రెండు రాష్ట్రాల మధ్య 2015లోనే ఒప్పందం కుదిరింది. ఒకవేళ తెలంగాణకు నీటి వాటాల విషయంలో అన్యాయం జరిగివుంటే అది బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య నీటి పంపిణీ జరిగినప్పుడు తప్ప, రాష్ట్ర విభజన తర్వాత కాదు. ఆ మాట కొస్తే అవశేష ఆంధ్రప్రదేశ్‌లో వున్న రాయలసీమకు ప్రాజెక్టులతో పాటు నీటి వాటాల్లోనూ అన్యాయం జరిగింది. 1956లో అంతర్ రాష్ట్ర జల వివాదాల చట్టం అమలులోకి వచ్చాక, దేశంలో ఏ నదీ జలాలనైనా ట్రిబ్యునళ్లు తప్ప కేంద్ర ప్రభుత్వం, తుదకు సుప్రీంకోర్టుకు కూడా పంపిణీ చేసే అధికారం లేదు.

ఈ నేపథ్యంలో కృష్ణాజలాల పంపకం గురించి కేంద్ర ప్రభుత్వం వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లాలని కోరడం, పైగా ట్రిబ్యునల్‌కు సవాళ్లు విసరడం ఓటమి తర్వాత కేసీఆర్‌లో నెలకొన్న నిస్పృహకు నిదర్శనం. ఓటమి నుంచి బయటపడేందుకు కేసీఆర్ తిరిగి నల్లగొండ సభలో తెలంగాణ భావోద్వేగాల రాజకీయాలు ఆరంభించారు. ఇందులో సీఎం రేవంత్ రెడ్డి చిక్కుకుంటే మున్ముందు పాలమూరు–రంగారెడ్డి, డిండి ఎత్తిపోతల పథకాలకు ఎట్టి పరిస్థితుల్లోనూ నీటిని తరలించలేరు. ఒకవేళ ఇప్పుడు విచారణ చేపట్టిన బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా రాష్ట్ర విభజన చట్టం 11వ షెడ్యూల్లో పేర్కొన్న పథకాలకు మిగులు నీరు ఉంటే పంపిణీ చేస్తుంది తప్ప, కొత్త ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేసే అవకాశమే లేదు. పైగా పంపిణీ చేసేందుకు కృష్ణలో మిగులు నీళ్లు కూడా లేవు.

గత పదేళ్లుగా చెరి యాభై శాతం నీటిని వాడుకోవాలని కేసీఆర్ చేస్తున్న వాదననే ప్రస్తుతం రేవంత్ రెడ్డి దొరకబుచ్చుకోవడం సరికాదు. బచావత్ ట్రిబ్యునల్ కూడా 1969లో నిర్మితమైన ప్రాజెక్టులను, నిర్మాణంలో వున్న వాటితో సహా పరిగణనలోకి తీసుకొని బేసిన్ మొత్తం మీద నీటి కేటాయింపులు చేసింది. పైగా తాను కేటాయించిన నీళ్లు ఆయా రాష్ట్రాల్లో వినియోగంలో వుంటే.. తదుపరి వచ్చే ట్రిబ్యునల్ కూడా మార్పు చేయకూడదని రక్షణనిస్తూ తుది తీర్పు చాప్టర్ 7 క్లాజు 14లో స్పష్టంగా పేర్కొన్నది. ఫలితంగానే 2004లో నియమితమైన బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ కూడా బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపుల జోలికి వెళ్లలేదు. 65 శాతం నీటి లభ్యత కింద నికర జలాలను, సరాసరి కింద మిగులు జలాలను లెక్కించి మొత్తం 448 టిఎంసిలను బేసిన్‌లోని అన్ని రాష్ట్రాల మధ్య పంపిణీ చేసింది. పైగా రాష్ట్ర విభజన చట్టం సెక్షన్ 89 మేరకు విచారణ చేపట్టిన సమయంలో బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్ ముందు రాష్ట్ర విభజన చట్టం 11వ షెడ్యూల్లో పేర్కొన్న ప్రాజెక్టులకు నీటి కేటాయింపులు చేయమని రెండు రాష్ట్రాలు కోరితే... పంపిణీకి క్యారీ ఓవర్ కింద ఉన్న 150 టిఎంసిలు తప్ప, నీళ్లు లేవని నిరాకరించింది. రెండు రాష్ట్రాల అభ్యర్థన మేరకు తిరిగి విచారణాంశంగా అంగీకరించింది. ప్రస్తుతం తెలంగాణ అభ్యర్థన మేరకు విచారణ చేపట్టిన బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ కూడా తెలంగాణ డిమాండ్ చేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్‌లో వినియోగంలో వున్న నీటిని తప్పించి, తెలంగాణకు ఏ ప్రాతిపదికన కేటాయిస్తుంది? ఈ విషయం కేసీఆర్‌కు తెలుసు. అందుకే నల్లగొండ సభలో ట్రిబ్యునల్‌కు, కేంద్ర ప్రభుత్వానికి 'వార్నింగ్' అంటూ మాట్లాడారు. ఈ పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ పన్నిన వలలో చిక్కుకొంటారా, న్యాయపరమైన అంశాలు, సహజన్యాయసూత్రాలకనుగుణంగా వ్యవహరిస్తారా అన్నది చూడాలి.

■ వి. శంకరయ్య
విశ్రాంత పాత్రికేయులు

మళ్లీ అప్రెంటిస్ విధానమా?

రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ 2024 కోసం జీవో 56ను విడుదల చేసింది. దాని ప్రకారం ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికయ్యే అభ్యర్థులు కచ్చితంగా రెండేళ్ల అప్రెంటిస్ విధానాన్ని పూర్తి చేయాలి. దీంతో పోరాటాలు చేసిన ఉపాధ్యాయ సంఘాలు, నిరుద్యోగ సంఘాలు ఒక్కసారిగా అవాక్కయ్యాయి. గతంలో ఉపాధ్యాయ సంఘాలు సాధించిన పోరాట ఫలితాలు వృథా అయ్యాయి. గతంలో అప్రెంటిస్ విధానం 1994 డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా అమలులోకి వచ్చింది. 1995 జూన్‌లో విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు మొదటి సంవత్సరం 1200, రెండవ సంవత్సరం 1500 గౌరవ వేతనం చెల్లించారు. స్కూల్ అసిస్టెంట్లు స్థాయి వారిని 1500, 1800 గౌరవ వేతనంతో విధుల్లో చేర్చుకున్నారు. అప్రెంటిస్ విధానం 2012వ సంవత్సరం వరకు కొనసాగింది.

2012 డీఎస్సీ ద్వారా ఎంపికైన ఉపాధ్యాయులందరికీ రెగ్యులర్ వేతనాలు చెల్లించారు. 18 ఏళ్లపాటు కొనసాగిన ఈ అప్రెంటిస్ విధానం రద్దు కావడానికి ఉపాధ్యాయ సంఘాలు చేసిన పోరాటమే కారణం. 2008లో జరిగిన 13 రోజుల ఉపాధ్యాయ సమ్మె దీనికి తార్కాణం. సమ్మె ఫలితంగా అప్రెంటీస్ విధానానికి రెండు నోషనల్ ఇంక్రిమెంట్లు పొందడం, పలు ఉద్యమాలతో 2012 నుంచి అప్రెంటిస్ లేని ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విధానం 2023 వరకు కొనసాగింది. ప్రస్తుత డీఎస్సీ నోటిఫికేషన్‌తో తిరిగి ఈ విధానం మళ్లీ అమలులోకి వచ్చింది. గతంలో నాలుగేళ్లకు అప్రెంటిస్ విధానాన్ని పెంచినప్పుడు ఉద్యమస్ఫూర్తితో ముందుకు సాగి వాటిని రద్దు చేయించుకున్న చరిత్ర ఉపాధ్యాయ సంఘాలకు ఉన్నది. ప్రస్తుతం ఆ స్ఫూర్తి కొరవడింది. ప్రభుత్వాలకు సంఘం ప్రతినిధులు కొమ్ము కాస్తున్నంత వరకు ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతూనే ఉంటుంది.

అప్రెంటిస్ విధానం పునరుద్ధరణతో రెండేళ్ల పాటు కొత్త ఉపాధ్యాయులు ఈ విధానంలో పని చేయాలి. వీరికి మొదటి సంవత్సరం మూలవేతనంలో 50 శాతం (సగం), రెండవ సంవత్సరం 60 శాతం వేతనంగా చెల్లించనున్నారు. ఎటువంటి అలవెన్సులు, ఇతర పారితోషికాలు ఉండవు. ప్రభుత్వ నిబంధనల మేరకు అప్రెంటిస్ విధానాన్ని పూర్తి చేసిన వారిని మాత్రమే రెగ్యులర్ ఉపాధ్యాయులుగా నియమిస్తారు. ఈ కాలంలో పలు అంశాలపై శిక్షణ ఇస్తారు.

ఉదాహరణకు సెకండరీ గ్రేడు ఉపాధ్యాయుల కనీసం మూల వేతనం రూ.32,670 ఉంది. దీంట్లో సగం నెలసరి వేతనంగా చెల్లిస్తారు. అదే మాదిరి స్కూల్ అసిస్టెంట్ల కనీస మూలవేతనం రూ.44,570 ఉంది, దీంట్లో సగం వేతనంగా చెల్లిస్తారు. రెండవ సంవత్సరం సదరు మూలవేతనాలలో వేతనాన్ని 60 శాతానికి పెంచుతారు. దీంతో నెలవారిగా రావాల్సిన వేతనంలో 30 నుంచి 40 వేల వరకు కోత విధించినట్లే. వీరికి సెలవులు వినియోగించడంలో కూడా పరిమితులు ఉంటాయి. ఎఫ్ఆర్ 104 ప్రకారమే అదర్ దాన్ క్యాజువల్ లీవ్‌లు వాడుకోవలసి ఉంటుంది. ఉద్యోగ భద్రత ఉండదు. ఎంటిఎస్ ఉపాధ్యాయుల కంటే వెట్టిచాకిరే అవుతుంది. రెండేళ్లకు నోషనల్ ఇంక్రిమెంట్‌లు ఇస్తారా లేదా అన్న విషయం తాజా ఉత్తర్వుల్లో తెలియపరచకపోవడం కొసమెరుపు. వీటన్నిటి కోసం మళ్లీ పోరాటాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

18 ఏళ్ల పాటు ధర్నాలు, ఆమరణ నిరాహార దీక్షలు, సమ్మెలు చేయడం ద్వారా అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయించుకుని, నోషనల్ ఇంక్రిమెంట్లు పొందారు. కానీ నేడు తిరిగి అప్రెంటిస్ విధానాన్ని ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలి, రెగ్యులర్ వేతనాలు చెల్లించాలి, ఉపాధ్యాయ ఖాళీల సంఖ్యను పెంచాలి, నిరుద్యోగ ఉపాధ్యాయులను నిరాశ నిస్పృహల నుంచి విముక్తి చెందించాలి. సత్ఫలితాలు ఇచ్చే ఉద్యమాలకు ఊపిరి పోయాల్సిన సంఘాలు మేల్కోవాలి. లేకుంటే సాధించుకున్న ప్రయోజనాలు చేజారిపోతాయి. ఎన్నికల కాలం.. ఎన్నయినా సాధించుకోవచ్చు.

– సి.వి ప్రసాద్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఏపీటీఎఫ్ అమరావతి





● కల్యాణం.. కమనీయం..

- 6లో..

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ, గోపయ్య కల్యాణ మహోత్సవం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై ఉత్సవ మూర్తులను ఉంచి పురోహితులు వివాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. మేళతాళాలు, వేదమంత్రాల నడుమ కల్యాణం కనులపండువగా జరిగింది.

వెకిలి చేష్టలు.. వెక్కిరింతలు

జలవనరుల శాఖ స్పెషల్ డివిజన్‌లో ఓ ఉద్యోగి వింత ప్రవర్తన

- మహిళా ఉద్యోగి పట్ల అసభ్య ప్రవర్తన
- తండ్రి వద్ద విలపించిన బాధితురాలు
- కార్యాలయానికి వచ్చి ఉద్యోగి చెంప చెళ్లుమనిపించిన తండ్రి



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : ఎదురుగా జలవనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం. వెనుక వైపు జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయం. ఆ చెంతనే చీఫ్ ఇంజనీర్ ఆఫీసు. ఇంత వీఐపీ ప్రదేశానికి మధ్యలో ఉన్న స్పెషల్ డివిజన్ కార్యాలయంలో కీచకపర్వం నడుస్తోంది. కొంతమంది అధికారులు మహిళా ఉద్యోగులపై అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారు. విధినిర్వహణలో వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. ముఖ్యంగా ఈ డివిజన్‌లో నాల్గోస్థాయి అధికారి వ్యవహరిస్తున్న తీరు సర్వత్రా విమర్శలకు తావిస్తోంది. ద్వంద్వార్థాలు వచ్చే పదాలను ఉపయోగిస్తూ మహిళలతో మాట్లాడుతున్నాడు. ఆ అధికారి చేష్టలకు విసుగుపోయిన ఓ మహిళా ఉద్యోగి తండ్రితో వ్యధను పంచుకుంది. కన్న కుమార్తె కన్నీటిని చూసిన ఆ తండ్రి నేరుగా కార్యాలయానికి వచ్చి వేధింపులకు దిగిన అధికారి చెంపను చెల్లుమనిపించాడు. గురువారం జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

ఆది నుంచి అంతేనా...

జలవనరుల శాఖలో కృష్ణా తూర్పు, కృష్ణా సెంట్రల్, డ్రెయినేజ్, స్పెషల్ డివిజన్లు ఉన్నాయి. ఇవన్నీ జలవనరుల శాఖ సర్కిల్ కార్యాలయ ప్రాంగణంలోనే ఉంటాయి. ఒక్కో డివిజన్‌లో ఈఈ, డీఈ, ఏఈలు ఉంటారు. స్పెషల్ డివిజన్ కార్యాలయంలో ఏఈల తర్వాత స్థాయి అధికారి.. మొత్తం కార్యాలయంలోని ఉద్యోగుల విధులను పర్యవేక్షిస్తుంటాడు. సిబ్బంది సెలవులు, అనుమతులు, వారి నుంచి వెళ్లే ఫైళ్లను ఈయన పరిశీలించి పై అధికారుల టేబుల్‌పైకి పంపుతాడు. ఈ డివిజన్‌లో పురుష ఉద్యోగులతో పాటు మహిళా ఉద్యోగులు ఎదురెదురు వరుసల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. ఈ డివిజన్‌లో ఉన్న ఓ మహిళా ఉద్యోగిని ఈ అధికారి కొన్నాళ్లుగా వేధిస్తున్నాడు. ఆమె ఏదైనా ఫైలు తీసుకెళ్లినా, సెలవు చీటీలు ఇచ్చినా ద్వంద్వార్థాలు వచ్చేలా, వెకిలిగా మాట్లాడుతున్నాడనే ఆరోపణలు ఉన్నాయి. చాలారోజుల పాటు ఆమె ఈ బాధను భరిస్తూ వచ్చింది. చివరికి సహనం నశించడంతో కార్యాలయంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇంటి వద్ద తండ్రికి వివరించి కన్నీటి పర్యంతమైంది. ఇంతకాలం లైంగికంగా ఆమె ఎదుర్కొంటున్న ఇబ్బందులను విన్న ఆయనకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. గురువారం కుమార్తెను తీసుకుని విధులకు వచ్చాడు. ఆమెను వేధిస్తున్న అధికారి కార్యాలయంలోకి రాగానే వెళ్లి చెంపచెల్లుమనిపించాడు. మహిళా ఉద్యోగి తండ్రి ఇలా చేయెత్తడంతో అక్కడున్న ఉద్యోగులు, అధికారులు షాక్ అయ్యారు. వెంటనే ఆయన్ను అడ్డుకుని బయటకు పంపించారు. తర్వాత అసలేం జరిగిందని అధికారులు ఆరా తీసి కారణాలు తెలుసుకున్నారు. ఈ ఘటన బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచారు. ఎదురుగా జలవనరుల శాఖ మంత్రి క్యాంపు కార్యాలయం, వెనుక వైపు సీఈ, ఎస్ఈ కార్యాలయాలు ఉండటంతో విషయాన్ని బయటకు రానివ్వలేదు. ప్రస్తుతం ఈ ఘటనపై జలవనరుల శాఖ ప్రాంగణంలో చర్చ జోరుగా నడుస్తోంది. మంత్రి క్యాంపు కార్యాలయం, మంత్రి బొత్స సత్యనారాయణ నివాసం, ఉన్నతాధికారుల చాంబర్లు ఉండడంతో విషయం బయటకు రాకుండా అధికారులు జాగ్రత్త తీసుకుంటున్నారు. ఈ ఘటనపై అధికారులు అంతర్గత విచారణకు ఆదేశించినట్టు సమాచారం.

గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు

రేపే పరీక్ష.. నగరంలో 54 పరీక్షా కేంద్రాలు

4,373 మంది అభ్యర్థులు : ఆర్డీవో సమీక్ష

- 6లో..




ఒకటికి రెండు

వీలైతే మూడు.. అవసరమైతే నాలుగు

గన్నవరంలో దొంగ ఓట్ల బాగోతం

టీడీపీ పరిశీలనలో బయటపడిన నిజాలు

ఎప్పుడో పాతకాలం నాటి ఫొటోతో ఒక ఓటు.. తాజా ఫొటోతో మరో ఓటు.. కళ్లజోడు పెట్టుకుని ఒక ఓటు.. తీసేసి ఇంకో ఓటు.. షర్ట్ మార్చి ఒకటి.. టీషర్టుతో ఇంకొకటి.. అబ్బో తవ్వేకొద్దీ గన్నవరం నియోజకవర్గంలో దొంగ ఓట్లు బయటపడుతూనే ఉన్నాయి. ఫొటోల్లో తేడా చూపించి ఒక వ్యక్తికి ఒకటికి నాలుగు ఓట్ల వరకు నమోదు చేస్తున్నారు. ఎన్ని అక్రమాలకు పాల్పడ్డా పేర్లు మాత్రం మార్చడం కుదరదు కదా.. ఆ పేర్లే ఇప్పుడు గన్నవరంలో భారీగా నమోదైన వైసీపీ దొంగ ఓట్లను బయటపెడుతున్నాయి.




1226 | 4 | UOG2363935

ఓటరు పేరు : బొర్లవ సాయి తేజ

తండ్రి పేరు: శంకర రావు తేలు

ఇంటి సంఖ్య : 2-89ఏ

వయస్సు : 19 లింగము : పు



768 | UOG2227692

ఓటరు పేరు : బొర్లవ సాయి తేజ

తండ్రి పేరు: శంకర రావు తేలు

ఇంటి సంఖ్య : 2-89/ఏ

వయస్సు : 19 లింగము : పు


ఫొటోను లాంగ్‌షాట్‌లో, జూమ్‌చేసి వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఒకే వ్యక్తి పేరిట ఉన్న ఓట్లు

- ఒక వ్యక్తికి రెండు, మూడు, నాలుగు ఓట్లు
- తెలివిగా ఫొటోలో తేడాలు చూపించి..
- ఇప్పటికే 4 వేలకు పైగా, తాజాగా మరో 1,500
- చాలామంది సమీప నియోజకవర్గాల్లోని వైసీపీ కార్యకర్తలే..
- ఎన్నికల సంఘానికి యార్లగడ్డ ఫిర్యాదు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : గన్నవరంలో ఓట్ల అక్రమాలు భారీగా బయటపడుతున్నాయి. దొంగ ఓట్లపై దృష్టి సారించిన ప్రతిపక్షాలు.. అధికార పార్టీ ఓట్ల అక్రమాలను బహిర్గతం చేస్తున్నాయి. గన్నవరంలో ఇతర నియోజకవర్గాల నుంచి చేర్చిన ఓటర్లు, డబ్లింగ్ ఓటర్లపై టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధారాల సహా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీంతో అసలు విషయాలు బయటకు వచ్చాయి.

అక్రమాలు ఇలా..


గన్నవరం నియోజకవర్గంలో ఇప్పటికే 4 వేలకు పైగా దొంగ ఓట్లను టీడీపీ గుర్తించింది. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేసింది. తాజాగా మరో 1,500 పైచిలుకు బోగస్ ఓట్లపై ఫిర్యాదు చేశారు. సమీపంలోని నియోజకవర్గాలకు సంబంధించిన 934 మంది ఓటర్లు గన్నవరం నియోజకవర్గంలోకి వచ్చారని, మరో 724 ఓట్లు డబుల్ ఎంట్రీలుగా నమోదయ్యాయని ఈ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా ఎన్ని వేలసంఖ్యలో దొంగ ఓట్లను నమోదు చేశారన్న దానిని టీడీపీ నాయకులు పరిశీలిస్తున్నారు. తూర్పు, పశ్చిమ, సెంట్రల్ నియోజకవర్గాలకు చెందిన ఓటర్లను గన్నవరంలో చేర్చారు. విజయవాడలో స్థానికంగా ఆయా నియోజకవర్గాల్లో ఓట్లను కలిగి ఉండటమే కాకుండా, గన్నవరంలో కూడా ఓటు కల్పించారు. వీరంతా వైసీపీ కార్యకర్తలే కావడం గమనార్హం. అలాగే, సమీపంలోని నూజివీడు, ఏలూరు, దెందులూరు, గుడివాడ, పామర్రు నియోజకవర్గాలకు చెందిన వైసీపీ ఓటర్లను కూడా గన్నవరంలో ఓటర్లుగా నమోదు చేశారు.



943 | 5 | UOG2436384

ఇంటి సంఖ్య : 10-25

వయస్సు : 43 లింగము : పు



91 | UOG1438449

ఇంటి సంఖ్య : 1-68

వయస్సు : 43 లింగము : పు

షర్ట్ మార్చి పాత, కొత్త ఫొటోలతో ఒకే వ్యక్తి పేరిట ఉన్న రెండు ఓట్లు

దొంగ ఓట్ల పేర్లే బయటపెట్టాయి..

సమీప నియోజకవర్గాలకు చెందిన వారిని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండల ఓటర్ల జాబితాలో చేర్చారు. సమీప నియోజకవర్గాల నుంచి తీసుకొచ్చిన వారికి రెండు నుంచి నాలుగు వరకు ఓట్లుగా నమోదు చేశారు. ఇందుకోసం చాలా తెలివి ఉపయోగించారు. మల్టిపుల్ బూత్ యాడింగ్ పేరిట.. ఒకే ఓటరును వేర్వేరు బూత్‌ల పరిధిలోకి తీసుకొస్తారు. దీంతో ఏ బూత్‌కు ఆ బూత్‌లో కొత్త ఓటరుగా నమోదై ఉంటారు. ఓటర్ల జాబితాలో ఈ మల్టిపుల్ యాడింగ్ ఓటర్లను గుర్తించకుండా ఉండటానికి ఫొటోలను తెలివిగా వాడారు. ఒక్కో బూత్‌లో ఒక్కో రకంగా ఫొటోను వాడారు. పాత ఫొటోలు, కొత్త ఫొటోలు ఇలా వాడారు. కొన్ని ఫొటోలు జూమ్ అవుట్ చేసి.. మరికొన్ని ఫొటోలు జూమ్ ఇన్ చేసి.. వాడారు. కొన్ని ఫొటోలకు కళ్లజోళ్లు పెట్టి, మరికొన్నింటికి కళ్లజోళ్లు తీసేసి డబ్లింగ్ ఓట్లుగా నమోదు చేశారు. ఒక నియోజకవర్గంలో వేర్వేరు బూత్‌లలో ఉన్న వీరంతా ఒకరేనన్న భ్రమ కల్పించటానికి వీలుగా ఈ ఎత్తుగడ ఎన్నుకున్నారు. ఫొటోలను మార్చినంత తేలిగ్గా పేర్లను మార్చలేరు కదా. ఈ పేర్ల దగ్గర ఓట్ల దొంగలు దొరికారు. బూత్ లెవల్‌లో ఎనలైజేషన్ విధానాన్ని ప్రతిపక్షాలు ఎప్పుడైతే అవలంబించాయో అధికార పార్టీ దొంగ ఓట్లు వెలుగులోకి వస్తున్నాయి. గన్నవరం నియోజకవర్గంలో దాదాపు 7వేల నుంచి 8వేల వరకూ దొంగ ఓట్లను నమోదు చేయించినట్టుగా తెలుస్తోంది.



తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీలో ఏడు జేసీబీలతో జరుగుతున్న ఇసుక లోడింగ్

ప్లేసు మారినా.. తీరు మారలే

ఇసుక అక్రమాలు పెచ్చుమీరుతున్నాయి. నిబంధనలను తుంగలో తొక్కి ఇసుకాసురులు ఇష్టారీతిన తవ్వి తరలిస్తున్నారు. పర్యావరణ అనుమతులు లేకపోయినా పట్టించుకోవడం లేదు. తవ్వకాలను అధికారులు అడ్డుకున్నా ఆగడం లేదు. ఎవరినీ రానీయకుండా బాడీగార్డును పెట్టి భారీ యంత్రాలతో ఇసుకను తోడి.. వందలాది లారీల్లో నిర్విరామంగా తరలిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీలో ఈ అక్రమం మూడు పూలు.. ఆరు కాయలు అన్నట్టుగా సాగుతోంది. ఈ అక్రమం వెనుక అత్యున్నత స్థాయి ప్రజాప్రతినిధి ఉండటం వల్లే తవ్వకాలవైపు ఉన్నతాధికారులు కన్నెత్తి చూడకపోవడానికి కారణమని తెలుస్తోంది. మంత్రి జోగి రమేశ్ పెడన నుంచి పెనమలూరుకు ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచి ఇసుక తవ్వకాలు ముమ్మరమయ్యాయి.

- 6లో..

- రొయ్యూరులో ఇసుకాసురులంతా మంత్రి జోగి అనుచరులే!
- పెడన నుంచి పెనమలూరు ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచీ క్వారీలు హస్తగతం
- రోజుకు 500 లారీల ఇసుక అక్రమంగా తరలింపు
- రేవుకెళ్లే దారిలో చెక్‌పోస్టు, బాడీగార్డు ఏర్పాటు
- అక్రమార్కుల అడుగుల్లోనే అధికారులూ..

తెలుగు యువత నాయకుడిపై దాడి



- మొక్కు తీర్చుకునే ఏర్పాట్లలో ఉండగా... పిలిచి మరీ కొట్టారు
- టీడీపీ కార్యకర్తల మధ్య గొడవగా సోషల్ మీడియాలో రివర్స్ ట్రోల్
- బాపులపాడు మండలంలో ఘటన
- కౌంటర్‌గా కేసు నమోదు చేసిన పోలీసులు

- 6లో..

◄ రక్తం కారుతూ, కంటి వద్ద కమిలిపోయిన స్థితిలో చెరుకూరి హరికృష్ణ

నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

కొండ చుట్టూ ఆది దంపతుల నగరోత్సవం

- 6లో..



కమనీయం.. గోపయ్య, తిరుపతమ్మ కల్యాణం

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 23: పెనుగంచిప్రోలులో గోపయ్యస్వామి, తిరుపతమ్మ కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. దేవస్థానం నుంచి అమ్మవారు, స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ వేదిక వరకు శోభాయాత్రగా భక్తులు గోవిందనామస్మరణలతో తీసుకువచ్చారు. పురోహితులు శివరాంభొట్ల ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మర్రిబోయిన గోపీబాబు కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను, ఆలయ చైర్మన్ జంగాల శ్రీనివాసరావు, ఇవో కె.రమేష్‌నాయుడు, నెడ్‌క్యాప్ చైర్మన్ వేల్పుల రవికుమార్, నందిగామ ఏసీపీ రవికిరణ్ దంపతులు పీటలపై కూర్చున్నారు. ఎంపీపీ మార్కపుడి గాంధీ, జడ్పీటీసీ ఊట్ల నాగమణి, గూడపాటి శ్రీనివాసరావు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

ఇరుముడులు సమర్పించిన భక్తులు

పెనుగంచిప్రోలు తిరుపతమ్మ పెద్ద తిరునాళ్లు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈవో రమేష్‌నాయుడు, ట్రస్టుబోర్డు చైర్మన్ జంగాల శ్రీనివాసరావులు ప్రత్యేక పూజలు నిర్వహించి, అంకమ్మ అమ్మవారి వద్ద అఖండ దీపాన్ని వెలిగించి తిరునాళ్లను ప్రారంభించారు. మునేటిలో పుణ్యస్నానాలు ఆచరించి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. తిరుపతమ్మ దీక్షాస్వాములు స్థానిక శివాలయంలో ఇరుముడులు కట్టించుకుని శోభాయాత్రగా వచ్చి అమ్మవారి ఇరుముడులు సమర్పించుకున్నారు. మునేటి అవతల మామిడితోటల్లో దీక్షాస్వాములకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచి దీక్షాస్వాముల రాకతో పెనుగంచిప్రోలు ఎరుపెక్కింది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అదనపు శానిటేషన్‌ను సర్పంచ్ పద్మకుమారి, ఇవో శ్యాంలు పర్యవేక్షించారు. సీఐ జానకీరాం ఆధ్వర్యంలో ఎస్సై వి.రాంబాబు పర్యవేక్షణలో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటుచేశారు.



ఇరుముడి సమర్పణకు తరలుతున్న దీక్షాస్వాములు

నేడు ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షిణ

వన్‌టౌన్, ఫిబ్రవరి 23 : మాఘపౌర్ణమి సందర్భంగా శనివారం ఉదయం 5.55 నిముషాలకు ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ నుంచి ఇంద్రకీలాద్రి గిరిప్రదక్షణ ప్రారంభమవుతుందని దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఘాట్‌రోడ్డు టోల్‌గేట్ నుంచి నాలుగుస్తంభాల సెంటర్, సొరంగం జంక్షన్, కబేళా రోడ్డు, చనుమోలు వెంకట్రావు బ్రిడ్జి, మిల్క్‌ప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి, రథం సెంటర్ మీదుగా తిరిగి కొండపైకి చేరుతుంది.దుర్గగుడిలో అన్నవితరణకు ఏలూరు జిల్లా జీలుగుమిల్లికి చెందిన అంజూరి నవీన్‌కుమార్, కుటుంబసభ్యులు రూ.1,16,150లను చెక్కు రూపంలో విరాళంగా అందజేశారు.





రాయనపాడు మత్స్యకార సొసైటీ, ఈలప్రోలు మత్స్యకార సొసైటీ

రెండు మత్స్యకార సొసైటీలు టీడీపీ కైవశం

గొల్లపూడి/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 : విజయవాడరూరల్ మండలం రాయనపాడు మత్స్యకార సొసైటీని టీడీపీ గెలుచుకున్నట్టు టీడీపీ గ్రామ అధ్యక్షుడు శీలంనేని సాంబశివరావు తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు జనసేన, సీపీఎం, సీపీఐలు మద్దతు తెలిపినట్టు సాంబశివరావు తెలిపారు. మత్స్య సొసైటీ అధ్యక్షునిగా జొన్నకూటి దుర్గారావు, ఉపాధ్యక్షునిగా మందా సుబ్బారావు, కార్యదర్శిగా బోళ్ల రమేష్‌బాబు, సభ్యులుగా పాగోలు రాములు, ఎస్.కోటేశ్వరరావు, పి.వెంకటరత్నం, మందా మాధవరావు, మందా చిన్న వెంకటేశ్వరరావు, నెమలికంటి కోటేశ్వరరావులను ఎన్నుకున్నారు.

ఇబ్రహీంపట్నం మండలం ఈలప్రోలు మత్స్యకార సహకారం సంఘాన్ని టీడీపీ దక్కించుకుంది. ఎంపీపీ స్కూల్ ఆవరణలో నిర్వహించిన ఎన్నికల్లో అధ్యక్షునిగా మిరియాల లక్ష్మణరావు, ఉపాధ్యక్షునిగా పిల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా మండల మోహన్‌రావులతో పాటు ఆరుగురు డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు మత్స్యశాఖ అధికారి బి.శ్యామ్ లెనిన్‌బాబు తెలిపారు.

ప్లేసు మారినా..తీరు మారలే..!

- రొయ్యూరులో ఇసుకాసురులంతా మంత్రి జోగి అనుచరులే!
- పెడన నుంచి పెనమలూరు ఇన్‌చార్జిగా వచ్చినప్పటి నుంచీ క్వారీలు హస్తగతం
- రోజుకు 500 లారీల ఇసుక తరలింపు
- అక్రమార్కులకు అడుగుల్లోనే అధికారులు

తోట్లవల్లూరు : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు క్వారీ వద్ద జోగి మనుషులు పెత్తనం చెలాయిస్తున్నారు. క్వారీకెళ్లే దారిలో చెక్‌పోస్టు ఏర్పాటుచేసి బాడీగార్డును పెట్టారు. గతంలో గుడివాడ మంత్రి కొడాలి నాని అనుచరులు రొయ్యూరు, లంకపల్లి క్వారీలను గుప్పెట్లో పెట్టుకుని కోట్లాది రూపాయల ఇసుకను దోచుకుంటే ఇపుడు మంత్రి జోగి ఆ పాత్రను పోషిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

● 7 యంత్రాలు.. వందలాది లారీలు

రొయ్యూరు క్వారీలో ఏడు యంత్రాలు దించారు. వందల లారీలతో ఇసుకను తరలిస్తున్నారు.పర్యావరణ అనుమతులు రాకుండానే జనవరి 12 నుంచి ఇసుక అక్రమానికి తెరదీశారు. ప్రతిరోజూ సుమారు 500 లారీల ఇసుక తరలిస్తున్నారు. ఇసుక తవ్వకాలను తహసీల్దార్ మూడుసార్లు అడ్డుకున్నారు. అయినా లెక్కచేయకుండా మళ్లీ యథేచ్ఛగా తవ్వకాలను కొనసాగిస్తున్నారు. రాష్ట్రంలో పర్యావరణ అనుమతులు లేకుండా ఇసుక అక్రమాలు జరుగుతున్నాయని జాతీయ గ్రీన్‌ట్రిబ్యునల్ (ఎన్జీటీ) నివేదిక ఇచ్చినా అదురూ బెదురు లేకుండా రొయ్యూరులో ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయంటే రాష్ట్ర ప్రభుత్వ పెద్దల సహకారం ఉండబట్టేనని విమర్శలు వస్తున్నాయి.

● అధికారుల వత్తాసు

ఎన్జీటీకి ఫిర్యాదు చేయడంతో ఇటీవల కలెక్టర్ రాజబాబు ఆధ్వర్యంలో అధికారులు ఇసుక తవ్వకాలను పరిశీలించేందుకు వచ్చారు. తవ్వకాలు సాగే రొయ్యూరు క్వారీని పరిశీలించకుండా ఎప్పుడో మూతపడిన నార్తువల్లూరు క్వారీని పరిశీలించడం హాస్యాస్పదంగా ఉంది. సంబంధిత శాఖల అధికారులు అక్రమాలకు ఎంతగా వత్తాసు పలుకుతున్నారో దీనిని బట్టి తేటతెల్లమవుతోంది.

● టోల్‌గేట్ ఏర్పాటు

కరకట్ట నుంచి రొయ్యూరు క్వారీకి వెళ్లే రహదారిలో కొత్తగా ఓ టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసి అక్కడ ఓ బాడీగార్డును నియమించారు. మీడియా అని అనుమానం వస్తే 'ఎవరు మీరు? ఎక్కడికి వెళ్లాలి?' అని ప్రశ్నించి వచ్చినవారి సమాచారాన్ని లోపల ఉన్న వ్యక్తులకు బాడీగార్డు అందిస్తాడు. గతంలో అక్రమాలు నడిచినా విలేకరులు ధైర్యంగా క్వారీలోకి వెళ్లి ఫొటోలు తీసే పరిస్థితి ఉండేది. మంత్రి అనుచరులు వచ్చాకే ఈ బాడీగార్డు ఏర్పాటు వల్ల రొయ్యూరు క్వారీలోకి వెళ్లి రావడం సాహసమవుతోంది.

● స్థానికులకు తాయిలాలు

ఎవరూ ఫిర్యాదు చేయకుండా రొయ్యూరు గ్రామస్తులను ఇసుక క్వారీ నిర్వాహకులు మచ్చిక చేసుకున్నారు. ఓ సొసైటీ వ్యక్తులు అభ్యంతరం చెప్పటంతో రూ.3 లక్షలు ఇచ్చినట్టు తెలిసింది. గ్రామంలోని ట్రాక్టర్లు, లారీలు ఇసుక కోసం వస్తే 50 శాతం రాయితీతో వెంటనే లోడుచేసి పంపుతున్నారు. దీంతో స్థానిక బలం పెంచుకుని అడ్డూఅదుపు లేకుండా నిర్వాహకులు ఇసుక దోపిడీ సాగిస్తున్నారు.

● తవ్వకాలకు అనుమతులు రాలేదు

పర్యావరణ అనుమతి వచ్చిందని అంటున్నారు. అయితే ఆ కాపీ మాకు అందలేదు. ఇసుక ఎక్కడ ఎంత విస్తీర్ణంలో తవ్వాలో హద్దులు చూపేందుకు మమ్మల్ని ఎవ్వరూ అడగలేదు. **- ఎం.కుసుమకుమారి, తహసీల్దార్**

గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా అధికారులతో ఆర్డీవో సమీక్ష

వన్‌టౌన్, ఫిబ్రవరి 23 : ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్టు ఆర్డీవో భవానీ శంకర్ చెప్పారు. కలెక్టరేట్ సమావేశమందిరంలో శుక్రవారం సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. 25వ తేదీ ఉదయం 10.30 నుంచి 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, మొత్తం 24373 మంది పరీక్షలు రాయనుండగా.. 54 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో తెలిపారు. అన్నిశాఖల సమన్వయంతో ఎక్కడా అవకతవకలు జరగకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. రూట్ ఆఫీసర్‌లు, లయజన్ ఆఫీసర్‌లు, వెన్యూ సూపర్‌వైజర్‌లు వారి విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. 26 రూట్లను ఏర్పాటు చేసామని, 26 మంది సీనియర్ జిల్లాస్థాయి అధికారులను రూట్ ఆఫీసర్లుగా నియమించినట్టు తెలిపారు. సెక్షన్ 144 అమలులో ఉంటుందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు. వైద్య శిబిరాలలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర మందులను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద జిరాక్స్ సెంటర్‌లను మూసివేయాలన్నారు. మౌలిక సదుపాయాలు, రూమ్‌లలో ఏర్పాట్లు ముందురోజే సరిచూసుకోవాలన్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థులు సకాలంలో వారికి కేటాయించిన కేంద్రాల వద్దకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయాలన్నారు. 9.30 గంటలకే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందని, హాల్‌టికెట్‌తో పాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తెచ్చుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, డిజిటల్ పరికరాలు అనుమతించరాదని తెలిపారు.



అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీశంకర్

గ్రూప్-2 పరీక్షకు ఏర్పాట్లు చేయండి

- కృష్ణా జేసీ గీతాంజలి శర్మ

మచిలీపట్నం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఆదివారం జరగనున్న గ్రూప్-2 పరీక్ష ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా జేసీ గీతాంజలి శర్మ అధికారులు ఆదేశించారు. జిల్లాపరిసత్ సమావేశపుహాలులో ఛీఫ్ సూపరింటెండెంట్లు, లైజనింగ్ ఆఫీసర్లు, రూట్‌ఆఫీసర్లతో శుక్రవారం ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో 17241 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరవుతారని, గుడివాడ, మచిలీపట్నం, ఉయ్యూరు డివిజన్‌లో 51 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పరీక్షాకేంద్రాల వద్ద తాగునీరు, ఫర్నిచర్, వైద్యసిబ్బందిని అందుబాటులో ఉంచాలని, విద్యుత్‌రఫరాకు అంతరాయం లేకుండా చూడాలన్నారు. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సులను ఏర్పాటుచేయాలన్నారు. ఏఎస్పీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పరీక్షాకేంద్రాల వద్ద పటిష్టపోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో మచిలీపట్నం, ఉయ్యూరు ఆర్డీవోలు ఎం.వాణి, డి.రాజు, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, ఏపీపీఎస్సీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ గీతాంజలి శర్మ

ఎన్నికల విధుల్లో జిల్లా యంత్రాంగం

- నోటిఫికేషన్ నాటికి ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణ ప్రయత్నాలు
- రాజకీయ పార్టీల నేతలతో సమీక్ష సమావేశాలు.. సత్వర చర్యలు
- పోలింగ్ సిబ్బంది ఎంపిక, శిక్షణ, ఓటర్ల నమోదులపైనా బిజీ బిజీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మార్చి రెండో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనున్న నేపథ్యంలో, ఎన్టీఆర్ జిల్లా యంత్రాంగం ఎన్నికల ఏర్పాట్లకు సంసిద్ధమౌతోంది. ఎన్నికల షెడ్యూల్‌కు ముందుగా రాజకీయ పార్టీల నుంచి వస్తున్న అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ఓటర్ల స్వచ్ఛీకరణ ప్రక్రియను నూరుశాతం పూర్తి చేయాలని భావిస్తోంది. తుది ఓటర్ల జాబితాలను విడుదల చేసినప్పటి నుంచి ఈ ప్రక్రియలో భాగంగా రాజకీయ పార్టీల నేతలతో జిల్లా ఎన్నికల అధికారి ఢిల్లీరావు వరుస సమీక్షలు నిర్వహిస్తున్నారు. సూక్ష్మస్థాయిలో ఓటర్ల జాబితాలను పరిశీలిస్తూ తమ దృష్టికి వచ్చిన వాటిని కలెక్టర్ దృష్టికి, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టికి తీసుకు వెళ్లటం జరుగుతోంది. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం వాటిని ప్యూరిఫికేషన్ చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) అనంతరం వెలుగు చూసిన ఫిర్యాదులపైనా ప్రత్యేక దృష్టి సారించారు. కొత్తఓటర్ల నమోదుకు జిల్లా యంత్రాంగం స్వీప్ వంటి కార్యక్రమాల ద్వారా విస్తృత అవగాహన ద్వారా ప్రయత్నాలు జరిపింది. ఎన్నికల ప్రక్రియకు అవసరమైన అంశాలపైనా దృష్టి సారించారు. పోలింగ్ సిబ్బందికి శిక్షణతో పాటు, ఎలక్షన్ గోడౌన్ల తనిఖీలు, వీవీప్యాట్‌ల పరిశీలనలు క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 1781 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇటీవల ఓటర్ల సౌలభ్యాలను దృష్టిలో ఉంచుకుని కొన్ని పోలింగ్ కేంద్రాలను పెంచటం జరిగింది. బ్యాలెట్ యూనిట్స్, సెంట్రల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ వంటివి ఎన్నికల నిర్వహణకు అనుగుణంగా ఉండటంతో పాటు, 25 శాతం మేర రిజర్వులో ఉన్నాయి. పోలింగ్ నిర్వహణకు సిబ్బంది ఎంపిక ప్రక్రియను దాదాపుగా సిద్ధం చేసుకోవటం జరిగింది. జిల్లా పరిధిలో ఎనిమిది మంది రిటర్నింగ్ ఆఫీసర్లు, 44 మంది సహాయ రిటర్నింగ్ అధికారులు, ఏడు ఈఆర్‌వోలు, 36 ఏఈఆర్‌వోలు, 169 మంది సెక్టార్ ఆఫీసర్లు, 169 మంది సెక్టార్ పోలీస్ ఆఫీసర్స్, 2137 మంది ప్రిసైడింగ్ ఆఫీసర్స్, 10866 మంది పోలింగ్ ఆఫీసర్స్, 1863 మంది బీఎల్‌వోలు, 16 మంది నోడల్ ఆఫీసర్లకు సరిపడా ఇప్పటికే పోలింగ్ సిబ్బందిని ఎంపిక చేయటం జరిగింది. వీరితో పాటు ఎన్నికల నిర్వహణకు సంబంధించి 6200 మంది పోలీసు బలగాలు అవసరమున్నదని అభిప్రాయపడ్డారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మక పోలింగ్ ప్రాంతాలపై ఇప్పటికే దృష్టి సారించారు. సరిహద్దు ప్రాంతాలపై నిఘా ఉంచారు. దాదాపుగా జిల్లా యంత్రాంగం పూర్తిగా ఎన్నికల విధుల్లో తలమునకలుగా ఉంది.



రాష్ట్ర ఎన్నికల అధికారి మీనాతో వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఢిల్లీరావు, జేసీ సంపత్, కమిషనర్ స్వప్నిల్

తెలుగుయువత నేతపై వైసీపీ మూక దాడి

- మొక్కు తీర్చుకునే ఏర్పాట్లలో వుండగా.. పిలిచి చితకబాదారు
- టీడీపీ కార్యకర్తల మధ్య గొడవగా సోషల్ మీడియాలో రివర్స్ ట్రోల్స్

విజయవాడ/హనుమాన్‌జంక్షన్ రూరల్, ఫిబ్రవరి 23 : గన్నవరం నియోజకవర్గంలోని బాపులపాడు మండలంలో టీడీపీ శ్రేణులే లక్ష్యంగా భౌతికదాడులకు వైసీపీ తెగబడుతోంది. బాపులపాడు తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణను ముక్కు, మొహం పగిలేలా చితకబాదిన ఘటన గురువారం అర్ధరాత్రి గ్రామంలో జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరు రోడ్డులో నివసిస్తున్న చెరుకూరి హరికృష్ణకు ఇటీవలే ఆడపిల్ల పుట్టింది. ఆదివారం మొక్కుబడులు చెల్లించేందుకు ఏర్పాట్లు చేసుకుని గురువారం తిరిగి ఇంటికి వస్తుండగా బాపులపాడు సూరమ్మచెరువు వాటర్‌ట్యాంకు వద్ద గూడవల్లి జగదీష్, గూడవల్లి సత్యనారాయణ తదితరులు పిలిచారని తెలిపారు. ఎందుకు పిలిచారని అడగ్గా సంగ్రామ్‌పై దాడి చేసిన పోతుమర్తి హేమంత్ అలియాస్ బాబి కేసు ఎందుకు పెట్టించావని, వాడ్ని కొడితే నువ్వు కాపాడతావా అంటూ ఇప్పుడు నిన్ను కొడితే ఎవడు కాపాడతాడంటూ దుర్భాషలాడుతూ ముఖంపై పిడిగుద్దులు గుద్దుతూ బైక్‌పై ఉన్న తనను కిందపడేసి కాళ్లతో తన్నారని బాధితుడు వివరించారు. పెనుగులాటలో తన జేబులో ఉన్న 10 వేల రూపాయలు, బుల్లెట్ తాళం కనబడలేదని, కుటుంబసభ్యుల సాయంతో ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ ఓపీలో ఉంచి వైద్యం చేస్తున్నారని బాధితుడు పోలీసులకు ఇచ్చిన వాగ్మూలంలో పేర్కొన్నాడు. ఘటనలో హరికృష్ణ ముఖంపైనా, నోటిపైనా, కంటిలో రక్తం వచ్చేలా కొట్టారని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

సోషల్‌మీడియాలో రివర్స్‌ట్రోల్స్

ఈ ఘటన జరిగిన కొద్దిసేపటికే టీడీపీకి చెందిన యువకుల మధ్య చెలరేగిన ఘర్షణను వైసీపీకి అంటించి బురదజల్లుతున్నారంటూ సోషల్‌మీడియాలో రివర్స్‌ట్రోల్స్ పెట్టారని టీడీపీ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం సేవిస్తుండగా తమ వద్దకు వచ్చి హరికృష్ణ రెచ్చగొట్టాడని, అందుకే చేయి చేసుకోవాల్సి వచ్చిందంటూ రివర్స్ కేసు పెట్టేందుకు ప్రయత్నించడంతో పాటు పబ్లిక్ ప్రాంతాల్లో మద్యం సేవిస్తూండగా జరిగిన గొడవగా కేసును నీరుగార్చేందుకు అధికారపార్టీ వారు ప్రయత్నిస్తున్నారని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కౌంటర్ కేసు నమోదు

వైసీపీ కార్యకర్తల దాడిలో తీవ్రంగా గాయపడిన చెరుకూరి హరికృష్ణ ఫిర్యాదుపై జంక్షన్ ఎస్సై జనార్దన్ శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హరికృష్ణ ఫిర్యాదుపై దాడికి పాల్పడిన వైసీపీ కార్యకర్తలు గూడవల్లి జగదీష్, గూడవల్లి సత్యనారాయణపై సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. కాగా నిందితులు ఇచ్చిన కౌంటర్ ఫిర్యాదుపై కూడా హరికృష్ణ మీద సెక్షన్ 324 కింద కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు. హరికృష్ణపై దాడికి పాల్పడిన నిందితులు గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ కౌంటర్ ఫిర్యాదు చేసినట్టు ఎస్సై తెలిపారు.



డాక్టర్‌తో మాట్లాడుతున్న జడ్పీటీసీ

తీరు మార్చుకోకపోతే జిల్లా అధికారులకు ఫిర్యాదు చేస్తా

- జడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ

కోడూరు, ఫిబ్రవరి 23 : రోగుల విషయంలో పనితీరు మార్చుకోకపోతే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని జడ్పీటీసీ సభ్యులు యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. శుక్రవారం కోడూరు శివారు స్వతంత్రపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యం చేయించుకోవటానికి వచ్చిన రోగుల పట్ల వైద్యులు, సిబ్బంది సక్రమంగా నడుచుకోవటం లేదని, గత కొద్ది రోజులుగా ఆసుపత్రికి వచ్చిన రోగులతో సరైన పద్ధతితో నడుచుకోవటం లేదని పలువురు ఫిర్యాదు చేస్తున్నారన్నారు. దెబ్బలు తగిలిన రోగులు కట్టుకట్టమంటే వారిని కూడా చిన్న చూపు చూస్తున్నారని, మీ పద్ధతి ఇలాగే కొనసాగితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.

భౌతికదాడులు అమానుషం

- యార్లగడ్డ వెంకట్రావు, చలమలశెట్టి రమేశ్

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : వైసీపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న మీడియాపై, టీడీపీ శ్రేణులపై భౌతికదాడులకు దిగడం అమానుష చర్య అని టీడీపీ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాపులపాడు తెలుగు యువత అధ్యక్షుడు చెరుకూరి హరికృష్ణను శుక్రవారం జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబుతో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా హరికృష్ణపై దాడిచేసిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోకపోతే విపత్కరపరిస్థితులు ఎదుర్కోవాల్సివస్తుందని చలమలశెట్టి రమేశ్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నవరం నియోజకవర్గంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, అరాచకశక్తులు రాజ్యమేలుతున్నాయని మండిపడ్డారు. జిల్లా ఎస్పీకి ఫోన్ ద్వారా సమాచారం అందించిన యార్లగడ్డ బాధితుడికి న్యాయం జరిగేలా చూడాలని కోరారు. మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, మూల్పూరి సాయికళ్యాణి, అట్లూరి శ్రీనివాస్, గార్లపాటి రాజేశ్వరరావు, తెలుగుయువత నాయకులు తదితరులు హరికృష్ణను పరామర్శించారు.



ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న హరికృష్ణను పరామర్శిస్తున్న టీడీపీ, జనసేన నేతలు

తప్పుడు నివేదికలకు మూల్యం తప్పదు

ఇసుక మాఫియాకు సహకరించిన కృష్ణా, గుంటూరు జిల్లాల కలెక్టర్లు

- నెట్టెం రఘురాం ఆరోపణ

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23 : ఇసుక మాఫియాకు సహకరిస్తూ ఎన్జీటీకి తప్పుడు నివేదికలు ఇచ్చిన కృష్ణా, గుంటూరు జిల్లా కలెక్టర్లు మూల్యం చెల్లించక తప్పదని మాజీ మంత్రి, విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం ధ్వజమెత్తారు. జగన్ రెడ్డి తన అక్రమాలకు సహకరించేందుకు గనులశాఖ డైరెక్టర్,ఏపీఎండీసీ ఎండీగా వెంకటరెడ్డిని నియమించుకుని వేలకోట్లు దోచుకున్నాడని ఆరోపించారు. ఆయన శుక్రవారం తన నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ బృందానికి కనబడిన ఇసుక దందా జిల్లా కలెక్టర్లకు కనపడకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. పలుసార్లు ఇసుక దందాపై ఎన్జీటీ ప్రభుత్వానికి గనులశాఖకు లేఖలు రాసినా ఏమీలేదని తోసిపుచ్చటం దారుణమన్నారు. వైఎస్ ప్రభుత్వ హయాంలో ఐఏఎస్‌లు తప్పుడు పనులు చేసి కోర్టులో దోషులుగా తిరుగుతున్నారని, అయినా జిల్లా అధికారులు గుడ్డిగా నివేదికలు ఇవ్వటం దుర్మార్గమని, ఇప్పటి వరకు టీడీపీ ఆరోపణలు కొట్టివేసిన జగన్‌రెడ్డి ఇప్పుడేమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి అరాచకాలకు, సహకరించిన వారు భవిష్యత్‌లో మూల్యం చెల్లించక తప్పదన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు ముల్లంగి రామకృష్ణారెడ్డి, కన్నెబోయిన రామలక్ష్మి, మేకా వెంకటేశ్వర్లు, కట్టా నరసింహారావు, గింజుపల్లి రమేష్, అన్వర్, శ్రీనివాసరావు, కర్రి చిన్నా తదితరులు ఉన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న నెట్టెం రఘురాం తదితరులు



రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణా జిల్లా జట్లు

రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణాజిల్లా జట్ల ఎంపిక

గుడివాడ, ఫిబ్రవరి 23 : సామర్లకోటలో ఈనెల 24 నుంచి 26వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు కృష్ణాజిల్లా జట్లను ఎంపికచేసినట్టు రాష్ట్ర అసోసియేషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. కోచ్ మేనేజర్లుగా కె.అనురాధ, ఎన్.సుధీర్, పి.ఎస్ సోమేశ్వరరావు, డి.రాజ్‌కుమార్‌లు వ్యవహరించనున్నారు.

మహిళల జట్టు: కె.కుమారి, టి.ఝాన్సీరాణి, కె.చైతన్య, అఖిల, ఎం.దుర్గాభవాని, బి.మౌనిక, బి.నాగసుశీల, జి.దీప్తి, ఎ.దేవి, హురున్నీసా, ఎం.లావణ్య బి.శివ స్వప్న, ఎన్.ధనలక్ష్మి, జి.అనిత, డి.చరితశ్రీ, కె.ఊర్వ, అభిజ్ఞ.

పురుషుల జట్టు: కె.కొండలరావు, బి.వినయ్, టి.తిమోతి, సీహెచ్ అజయ్‌కుమార్, జి.హస్సల్, సీహెచ్ గణేష్, రాకేష్, జె.నాగేష్, డి.షణ్ముఖ శ్రీనివాస్, ఆసిఫ్ ఖాన్, కె.జగదీష్, కె.జయసూర్యతేజ, పి.అభిషేకం, డి.దుర్గాప్రసాద్, సీహెచ్ రేవంత్‌కుమార్, యు.నాగరాజు, గణేష్‌నాయుడు, భరత్‌కుమార్.

వైసీపీకి కంచికచర్ల ఎంపీటీసీ గుడ్‌బై



కంచికచర్ల రూరల్, ఫిబ్రవరి 23 : నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు అంటూ జగన్ మమ్మల్నే మోసం చేస్తున్నాడని వైసీపీని ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు వీడుతున్నారు. కంచికచర్ల ఎంపీటీసీ సభ్యుడు మాడుగుల మధు వైసీపీకి గుడ్‌బై చెప్పారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తనపై ఇతరులు పెత్తనం చేస్తూ అవమానిస్తున్నారని, తనకు తెలియకుండానే వలంటీర్లను నియమించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విలువ, గౌరవం లేని పార్టీలో కొనసాగటం అవమానకరంగా భావిస్తూ వైసీపీని వీడుతున్నట్టు ఆయన పేర్కొన్నారు.

దివ్యాంగులకు జాబ్‌మేళా

వన్‌టౌన్ : దివ్యాంగులకు ఈనెల 26వ తేదీన జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు గ్రో (జీఆర్ఓ) సంస్థ నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ చదివిన 18 నుంచి 34 సంవత్సరాల వయస్సు గల దివ్యాంగులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. వివరాల కోసం 7331149646లో సంప్రదించవచ్చన్నారు.



భోజనం వడ్డిస్తున్న టీడీపీ నేతలు

జగ్గయ్యపేట అన్నా క్యాంటీన్‌కు 600 రోజులు

- దిగ్విజయంగా పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23 : జగ్గయ్యపేటలో అన్నా క్యాంటీన్ 600 రోజులు దిగ్విజయంగా పూర్తి చేసుకుంది. మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో పట్టణంలో విజయవాడ రోడ్డులో పాత అన్నా క్యాంటీన్‌కు సమీపంలో ప్రారంభించారు. ప్రజలకు అందుబాటులో ఉండటంతో మంచి ఆదరణ లభిస్తున్నది. కనీసం రోజుకు 1000 మంది ఆహారం స్వీకరిస్తున్నారు. శ్రీరాం తాతయ్య ప్రత్యేక శ్రద్ధ వహించి పర్యవేక్షిస్తున్నారు. దాతల నుంచి స్పందన లభిస్తున్నది. దివ్యాంగులు, అనాధలు, వృద్ధులకు ఆహార పొట్లాలను వారి ఇళ్ల వద్దకే అందిస్తున్నారు.



అన్న క్యాంటీన్‌లో ఆహారం స్వీకరిస్తున్న పేదలు

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	159, 168, 179
చికెన్ విత్ స్కిన్	308
చికెన్ స్కిన్‌లెస్	316



నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

ఘనంగా వేంకటేశ్వరుని రథోత్సవం

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: బ్రాహ్మణవీధి వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో శుక్రవారం ఘనంగా రథోత్సవాన్ని నిర్వహించారు.
భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆలయ అర్చకుడు సంబంధిత పూజాదికాలను పూర్తి చేసి హారతులు సమర్పించారు. కార్యక్రమాన్ని ఈవో ఘంటసాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.



దుష్టపాలన అడ్డుకోవడానికే చంద్రబాబు, పవన్ కలయిక

బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, ఫిబ్రవరి 23: వైఎస్ జగన్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన తరువాత అన్యాయం, అరాచకాలు విపరీతంగా పెరిగాయని, అన్ని వర్గాల ప్రజలు నిత్యం భయంతో బతకాల్సిన పరిస్థితులు దాపురించాయని, దానిని అడ్డుకోవడానికే చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలయిక అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 3వ డివిజన్ గుణదల ఏరియాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం తోట నీల కుమారికి స్వయం ఉపాధి నిమిత్తం టిఫిన్ బండిని జనసేన నాయకుడు గుత్తికొండ కృష్ణమోహన్ చేతుల మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న దారుణాలను సెంట్రల్ ఇంటెలిజెన్స్ ద్వారా తెలుసుకున్న కేంద్రంలోని బీజేపీ చంద్రబాబును ఎన్‌డీఏలోకి ఆహ్వానించారని చెప్పారు. కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన జగన్ ఇపుడు తానే మెడలు వంచాడన్నారు. జనసేన నాయకుడు గుత్తికొండ కృష్ణమోహన్ మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో టీడీపీ -జనసేనను బలపరచి గద్దె రామ్మోహన్‌ను 40వేల ఓట్ల మెజారిటీతో గెలిపించుకుందామని చెప్పారు. డివిజన్ అధ్యక్షుడు తాడి బాబురావు, కొండిశెట్టి మురళీ, కొత్తపల్లి హరిబాబు, సోదాబత్తుల భాను, విజయ్, భాను, కిరణ్, మారుతీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గద్దె రామ్మోహన్

టీడీపీ-జనసేన ప్రభుత్వం రావాలని దర్గాలో ప్రార్థన

భవానీపురం: రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలంటే టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం అధికారం రావాలని కోరుతూ పశ్చిమ మైనార్టీ నాయకులు ఎంఎస్ బేగ్ 41వ డివిజన్‌లో ప్రఖ్యాతి గాంచిన హజ్రత్ గాలీబ్ షహీద్ దర్గాలో శుక్రవారం ప్రత్యేక ప్రార్థన(దువా) నిర్వహించారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ అవినీతితో పాటు అక్రమాల్లో పీకల్లోతు కూరుకుపోయిన వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు సాగనంపడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ముస్లింలకు చెందిన కుటుంబాలపై వైసీపీ నేతలు భౌతిక దాడులకు పాల్పడటాన్ని బేగ్ ఖండించారు. వక్ఫ్ ఆస్తులను నాశనం చేయడంతో పాటు, ముస్లింలను ఆత్మహత్యలు చేసుకునేలా ప్రేరేపించిన వైసీపీని ముస్లింలు ఐక్యంగా గద్దె దింపాలన్నారు. షేక్ సుభాని, షేక్ అబ్దుల్ సత్తార్, సయ్యద్ ఆలీ, నజీబ్, రియాజ్, జైనుద్దీన్, అఖిల్ బాషా, మున్నిసా, కొలగాని అశోక్‌లు పాల్గొన్నారు.



గాలీబ్ షహీద్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలో పశ్చిమ మైనార్టీ నాయకుడు ఎంఎస్ బేగ్

ఎర్రన్నాయుడుకు ఘన నివాళి



ఎర్రన్నాయుడు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న టీడీపీ నాయకులు

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: టీడీపీకి ఎర్రన్నాయుడు చేసిన సేవలు మరువరానివని టీడీపీ పశ్చిమ సీనియర్ నాయకుడు ఎంఎస్ బేగ్ అన్నారు. శుక్రవారం టీడీపీ పశ్చిమ కార్యాలయంలో ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ ఆయన ప్రజాప్రతినిధులకు ఆదర్శమన్నారు. ప్రతినిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలను పరిష్కరించడమే ఆయనకు కీర్తి శిఖరాలను తెచ్చి పెట్టిందన్నారు. బి.కనకారావు, బి.నాగబాబు, ఏ.రామారావు, సయ్యద్ ఇమ్రాన్, మైలవల్లి రాజు, ధనేకుల కృష్ణ ఇంకా పలువురు నాయకులు పాల్గొన్నారు.

విద్యాధరపురం: మొగల్రాజపురంలోని కేశినేని శివనాథ్ (చిన్ని) కార్యాలయంలో జరిగిన ఎర్రన్నాయుడు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. ఆయన గుణ గణాలను కొనియాడుతూ, ఆయన పార్టీ కార్యకర్తలు, ప్రజల హృదయాలలో గూడుకట్టుకు న్నారని తెలిపారు. నాయకులు మరక శ్రీనివాస యాదవ్, సొంగా సంజయ్ వర్మ, నమ్మి భానుప్రకాష్, రేపాకుల శ్రీనివాస్, కొట్టేటి హనుమంతరావు, పావర్తి కిషోర్‌బాబు, మహమ్మద్ ఇర్ఫాన్, పలువురు నాయకులు పాల్గొన్నారు.



దుర్గగుడిలో ధర్మపథం వేదికపై

కూచిపూడి నాట్యప్రదర్శన

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో శుక్రవారం ధర్మపథం వేదికపై సప్పా శివశంకర్ ఆధ్వర్యంలోని వాగ్దేవి కూచిపూడి నృత్యాలయ బృందం నాట్యప్రదర్శన ఇచ్చింది. పలు కీర్తనలకు హావభావ నటనలతో నృత్యం చేశారు. 16 మంది కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కనకదుర్గానగర్‌లోని గోశాలకు నీటివసతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: కొద్దికాలం క్రితం కనకదుర్గానగర్‌లో పెర్గోలా దిమ్మెల తొలగింపు సమయంలో పగిలిపోయిన నీటి పంపులను శుక్రవారం మరమ్మతులు చేసి పక్కనే ఉన్న గోశాలకు నీటి వసతి కల్పించారు. గత రెండు మూడు రోజులుగా గోశాలకు నీరు లేకపోవడంతో నిర్వాహకులు దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థాన ఈవో కేఎస్ రామారావుకు లేఖ రాశారు. వెంటనే స్పందించిన ఈవో మరమ్మతులకు ఆదేశించారు. నీటి పంపులను బాగుచేసి నీటి సదుపాయం కల్పించారు.

కమ్యూనిస్టుల హయాంలోనే నగరాభివృద్ధి

సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 23: గతంలో, నేడు పనిచేసిన వైసీపీ, తెలుగుదేశం ప్రజాప్రతినిధులు చేతగాని దద్దమ్మలుగా మిగిలారని సీపీఎం జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ అన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు నేతృత్వంలో జనశంఖారావం యాత్ర రెండో రోజు శుక్రవారం మధురానగర్, పసుపుతోట, ముత్యాలంపాడు మధ్య కట్టలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టుల హయాంలోనే నగరం, నగర పాలక సంస్థ అభివృద్ధి జరిగిందన్నారు. స్వార్థ రాజకీయాలు తప్ప నగర అభివృద్ధి ప్రజాప్రతినిధులకు పట్టలేదని, నగరాన్ని అన్ని విధాల దగా చేశారన్నారు. పేదలకు ఇళ్లు ఇస్తామని వైసీపీ ప్రభుత్వం మోసగించిందని, స్థలాలు చూపకుండా రిజిస్ట్రేషన్ అంటూ దగా చేస్తున్నారని ఆరోపించారు. మధురానగర్ రైల్వేస్టేషన్ వద్ద అండర్ బ్రిడ్జి ఆరేళ్లుగా పూర్తి కాలేదని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో నగరాన్ని అభివృద్ధి చేసిన సీపీఎంను సెంట్రల్‌లో గెలిపించాలన్నారు. సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు, సిటీ సెంట్రల్ కార్యదర్శి బీ. రమణారావు, నాయకులు సరోజ, ఎన్.సిహెచ్. శ్రీనివాస్, వై. కృష్ణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



స్థానికులతో మాట్లాడుతున్న బాబూరావు

శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించండి

హోటళ్లు, డార్మెటరీలు, లాడ్జీ నిర్వాహకులకు కృష్ణలంక సీఐ మురళీకృష్ణ సూచన

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: ఎన్‌జీవోలు, ఉద్యోగ వర్గాలు ఈ నెల 26, 27 తేదీల్లో ఆందోళనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో పోలీసులు ముందస్తుగానే కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. అయితే తాజాగా విజయవాడ పోలీసులు కొత్త పంథాలో ఎన్‌జీవోల ఆందోళనలకు అడ్డుకట్ట వేయడానికి ప్రయత్నిస్తున్నారు. కృష్ణలంక సీఐ మురళీకృష్ణ శుక్రవారం హోటల్స్ డార్మెటరీలు, లాడ్జీల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. శాంతిభద్రతలను దృష్టిలో ఉంచుకుని వ్యవహరించాలని వారికి ఆయన సూచించారు.
ఎన్‌జీవోలు ఎవరైనా డార్మెటరీ, లాడ్జీలు, హోటళ్లకు వస్తున్నట్లు అయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్ఐ షరీఫ్, సుమారు 20 మంది హోటళ్లు, లాడ్జీలు, డార్మెటరీ నిర్వాహ కులు పాల్గొన్నారు.



వెలంపల్లి...నోరు అదుపులో పెట్టుకో : పోతిన

చిట్టినగర్, ఫిబ్రవరి 23: వెలంపల్లి శ్రీనివాసరావు తన నోటిని అదుపులో పెట్టుకోవాలని జనసేన అధికార ప్రతినిధి , విజయవాడ పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన మహేశ్ హితవు పలికారు. ఇంటింటికి రాబోయే జనసేన- టీడీపీ ప్రభుత్వం నినాదంతో ఆయన శుక్రవారం 47వ డివిజన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ-జనసేన ప్రభుత్వం అవశ్యకతను తెలియచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 28న తాడేపల్లిగూడెంలో భారీ బహిరంగ సభతో వైసీపీ నాయకుల గుండెలు బద్దలు కానున్నాయని పేర్కొన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావు ఇష్టానుసారం మాట్లాడుతున్నాడని, తన నోటిని అదుపులో ఉంచుకోవాలన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ అడపా శేషు కాపు సమాజిక వర్గానికి చేసిందేదీ లేదన్నారు. వెలంపల్లి శ్రీనివాసరావును పశ్చిమంలో తంతే సెంట్రల్‌కు వెళ్లి పడ్డాడని, అక్కడ అతని ఓటమి తప్పదని పేర్కొన్నారు. ప్రజలు ఈసారి టీడీపీ- జనసేన అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఎరుపిల్ల కనకారావు, జిల్లెల్ల అనిల్, ఆకారపు విజయకుమారి, రాళ్ళపూడి గోవింద్, చిట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగుడితో మాట్లాడుతున్న పోతిన

గ్రంథాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 23: ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు, అధికారుల సమీక్షా సమావేశం శుక్రవారం ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో జరిగింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్‌పర్సన్ టి. జమలపూర్ణమ్మ అధ్యక్షత జరిగిన సమావేశంలో గ్రంథాలయ డిపాజిట్ల టార్గెట్‌లు, గ్రంథాలయ సెస్, మౌలిక వసతులు, భవనాల మరమ్మతులు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎంవీడీటీ నగేష్ జిల్లాలోని 109 గ్రంథాలయ బ్రాంచిల పనితీరును సమీక్ష జరిపారు. కార్యక్రమంలో ఠాగూర్ గ్రంథాలయాధికారి కె. రమాదేవి, 109 గ్రంథాలయ బ్రాంచిల నిర్వాహకులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జమల పూర్ణమ్మ

ఓటమి భయంతోనే మీడియాపై దాడులు

● టీడీపీ యువనాయకుడు వల్లూరు కిరణ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: ఓటమి భయంతోనే వైసీపీ శ్రేణులు మీడియాపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ యువనాయకుడు వల్లూరు కిరణ్ ఒక ప్రకటనలో విమర్శించారు. జగన్‌రెడ్డి ప్రతి సభలోను ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ5ల పేర్లు ఎత్తకుండా ముగించడం లేదని చెప్పారు. అంటే ఆ పత్రికలపై, ఆ చానళ్లపై అతనికి ఎంత అక్కసు ఉందో అర్థమవుతుందన్నారు. అన్ని దోపిడీలకు పాల్పడుతున్న వైనాన్ని వెలుగులోకి తీసుకువస్తున్న మీడియాపై దాడులు చేస్తున్నారన్నారు. ఇది నిరంకుశ పాలనకు నిదర్శనమన్నారు. అధికారంలో ఉన్నారని చెలరేగిపోయి అరాచకాలకు పాల్పడుతున్న ఏ వ్యక్తిని వదలబోమని తాట తీస్తామని ఆయన హెచ్చరించారు.

ఆర్‌యూబీ పనుల పరిశీలన

మధురానగర్, ఫిబ్రవరి 23: మధురానగర్ రైల్వే స్టేషన్ వద్ద నిర్మిస్తున్న ఆర్‌యూబీ పనులను శుక్రవారం నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైల్వే శాఖతో సమన్వయం చేసుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా పనులు చేస్తున్నామన్నారు. ఈ నెలాఖరు నాటికి అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన చెప్పారు.

స్మార్ట్ ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 23 : 58వ డివిజన్ తిలక్ రోడ్డులోని ఆరోగ్య శ్రీ లబ్ధిదారులకు కొత్త ఫీచర్స్‌తో రూపొందించిన స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డులను శుక్రవారం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ ప్రతి పేద కుటుంబం ఏడాదికి రూ. 25 లక్షల వరకు వైద్య సేవలు పొందవచ్చని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 23 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని న్యూ రాజరాజేశ్వరిపేట ప్రధాన రహదారి, సన్‌సిటీ కాలనీ, జయమ్మ కంటి ఆసుపత్రి రోడ్డు, స్మైల్ హాస్పిటల్ మెయిన్‌రోడ్డు, నూజివీడు మెయిన్‌రోడ్డు, కళ్యాణ్‌గౌరీ అపార్ట్‌మెంట్స్, చలసాని అపార్ట్‌మెంట్స్ రోడ్డు, జిమ్ రోడ్డు, మంజునాథ అపార్ట్‌మెంట్స్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

పాయకాపురం, ఫిబ్రవరి 23 : నున్న రూరల్ పోలీసులు శుక్రవారం ఆరుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. సుందరయ్యనగర్ ప్రాంతంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు నున్న రూరల్ పోలీసులకు సమాచారం అందింది. సదరు ఇంటిపై దాడులు చేసిన పోలీసులు ఆరుగురిని అదుపులోకి తీసుకుని, రూ. 16 వేలు స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసీపీకి బుద్దా దివాకర్ రాజీనామా

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: దినవహివారి సత్రం కమిటీ మాజీ ఛైర్మన్ బుద్దా దివాకర్ వైసీపీకి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను పశ్చిమ ఇన్‌చార్జి షేక్ ఆసిఫ్‌కు పంపించారు. కొందరి అబద్ధాల ప్రచారాలను విని తన మనస్సు గాయపడిందని, దీంతో తాను కొన్ని నెలలుగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో పార్టీకి పనిచేయలేకపోతున్నానని నిర్ణయించుకుని పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానన్నారు.

యువకుడి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియో అందజేత

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 23 : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై తెనాలిలో మృతి చెందిన గిరిపురంకు చెందిన చిరుగురి కిరణ్‌కుమార్(24) కుటుంబానికి ఎమ్మెల్యే మల్లాది విష్ణు శుక్రవారం ఎక్స్‌గ్రేషియో అందజేశారు. యువకుడి కుటుంబ ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఆయన అజిత్‌సింగ్‌నగర్‌లోని ఆయన కార్యాలయంలో రూ. 4 లక్షల చెక్‌ను మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు.



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

తాళం వేసిన ఇంట్లో చోరీ

పాయకాపురం, ఫిబ్రవరి 23 : తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగిన ఘటనపై నున్న రూరల్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం దేవినేని గాంధీపురం ప్రాంతానికి చెందిన గంగినేని శ్రీనివాసరావు ఈనెల 20న కుటుంబ సభ్యులతో కలసి షిరిడీకి వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి తాళం పగుల కొట్టి తలుపులు తెరచి ఉండటాన్ని గమనించాడు. లోపలికి వెళ్లి చూడగా ఇంట్లో వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో ఇంట్లో చోరీ జరిగినట్లు నిర్ధారణకు వచ్చి నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బీరువాలో ఉండాల్సిన రూ. 30 వేలు, రూ. 34 వేలు విలువైన వెండి వస్తువులు చోరీకి గురైనట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

అత్తను హత్య చేసిన అల్లుడికి జీవిత ఖైదు

పెనమలూరు, ఫిబ్రవరి 23 : అత్తను హత్య చేసిన కేసులో అల్లుడికి విజయవాడ కోర్టు జీవిత ఖైదు విధించింది. పోలీసుల వివరాల మేరకు.. ఆరేళ్ల క్రితం పెనమలూరు మండలం వణుకూరు సాయిపురం కాలనీకి చెందిన కన్నా శశిరేఖ తన తల్లి కొక్కిలిగడ్డ శివలీలను ఆసుపత్రికి తీసుకెళ్లడానికి తీసుకొచ్చింది. అప్పటికే మద్యం సేవించి ఉన్న భర్త జేజి ప్రసాద్ భార్య శశిరేఖతో ఘర్షణ కు దిగాడు. కోపం పట్టలేక ఇంట్లో ఉన్న గొడ్డలితో భార్యను నరకబోయాడు. అత్త శివలీల అడ్డుకోవడంతో ఆమెను నరికేశాడు. అత్త అక్కడికక్కడే మృతి చెందింది. భార్య ఫిర్యాదు మేరకు అప్పటి సీఐ దామోదర్ తన సిబ్బందితో కలిసి జేజి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు పంపారు. కేసు విచారించిన విజయవాడ ఏడవ అడిషనల్ న్యాయస్థానం న్యాయమూర్తి ఎన్ నాగేశ్వరరావు గురువారం నిందితుడికి జీవిత కాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

నేత్రపర్వంగా సోమేశ్వరస్వామి కల్యాణం

ఉయ్యూరు, ఫిబ్రవరి 23 : ఉయ్యూరులో జరుగుతున్న జగదాంబ సమేత సోమేశ్వరస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. పంచాహ్నిక దీక్షతో శావాగమ సంప్రదాయంలో ఐదు రోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారి కల్యాణోత్సవం నయన మనోహరంగా జరిగింది.

పిల్లబచ్చాలు మా సినిమాకు రావొద్దు



అనన్య నాగళ్ల ప్రధాన పాత్రలో నటిస్తున్న డిఫరెంట్ హారర్ థ్రిల్లర్ 'తంత్ర'. ధనుష్ రఘుముద్రి కథానాయకుడు. సలోనీ కీలక పాత్రలో నటిస్తున్నారు. శ్రీనివాస్ గోపిశెట్టి దర్శకత్వంలో నరేశ్‌బాబు పి, రవిచైతన్య నిర్మిస్తున్నారు. తమ సినిమాకు 'ఏ' సర్టిఫికెట్ రావడంపై 'తంత్ర' టీమ్ వినూత్నంగా స్పందించింది. 'మా సినిమాకు పిల్లబచ్చాలు రావొద్దు' అని పేర్కొంటూ పోస్టర్ రిలీజ్ చేసింది. హారర్ ఎలిమెంట్స్‌తో తమ సినిమా థ్రిల్ చేస్తుందనీ, త్వరలో ట్రైలర్ విడుదల చేస్తామని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: ఆర్‌ఆర్ ధ్రువన్. సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్, విజయ్ భాస్కర్ సద్దాల.

బ్యాడ్‌బాయ్స్ లవ్‌స్టోరీ



వినూత్న ప్రేమకథా చిత్రం 'వుయ్ లవ్ బ్యాడ్‌బాయ్స్'. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో పప్పుల కనక దుర్గారావు నిర్మించారు. ఇటీవలే సెన్సార్ పూర్తయిన ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు వశిష్ఠ విడుదల చేసి, యూనిట్‌కు అభినందనలు తెలిపారు. అలీ, సప్తగిరి, భద్రం ప్రధాన తారాగణం. నేటి ట్రెండ్‌కు తగినట్లు కామెడీ ఎంటర్టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కించామనీ, త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. రఘు కుంచెతో కలసి భూషణ్ జాన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: వీకే రామరాజు.

దుబాయ్‌లో గామా అవార్డుల వేడుక



తెలుగు చిత్ర పరిశ్రమ గర్వపడేలా మార్చి 3న దుబాయ్‌లో 'గామా' అవార్డుల ప్రదానోత్సవం అట్టహాసంగా నిర్వహించనున్నారు. జ్యూరీ ఛైర్మన్, సంగీత దర్శకుడు కోటి, జ్యూరీ సభ్యులు... నిర్మాత డీవీవీ దానయ్య, దర్శకుడు వీఎన్ ఆదిత్య తదితరులు శుక్రవారం ఈ వేడుకకు సంబంధించిన ట్రోఫీని ఆవిష్కరించారు. పలు విభాగాల్లో తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన వ్యక్తులకు ఈ పురస్కారాలు అందజేస్తామనీ, పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరవుతారనీ కోటి తెలిపారు. సినీ రంగంలో కొత్త ప్రతిభను ప్రోత్సహించడానికి త్రిమూర్తులు నిర్వహిస్తున్న ఈ వేడుక తెలుగు చిత్ర పరిశ్రమకు గర్వకారణమని డీవీవీ దానయ్య, వీఎన్ ఆదిత్య చెప్పారు.

మార్కెట్‌లో మహాలక్ష్మి సందడి



'కేరింత' ఫేం పార్వతీశం కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'మార్కెట్ మహాలక్ష్మి'. ప్రణీకాన్వికా కథానాయిక. వీఎస్ ముఖేశ్ యువ దర్శకత్వంలో అఖిలేశ్ కలారు నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను హీరో శ్రీ విష్ణు ఆవిష్కరించారు. "మార్కెట్ మహాలక్ష్మి' టీజర్‌లో హీరో హీరోయిన్ పాత్రలు ఫన్నీగా అనిపించాయి. పార్వతీశం కామెడీ టైమింగ్ బావుంది. దర్శకుడి ప్రయత్నాన్ని ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునే అంశాలతో ఈ చిత్రం తెరకెక్కిస్తున్నట్లు దర్శకుడు చెప్పారు. 'ఆకట్టుకునే ప్రేమకథతో పాటు కుటుంబ అనుబంధాలను మనసుకు హత్తుకునేలా తెరకెక్కిస్తున్నాం' అని నిర్మాత తెలిపారు.

ప్రపంచ సినిమాకు పెద్దన్నయ్య లాంటి హాలీవుడ్ నుంచి అగ్ర కథానాయకుల చిత్రాలతో పాటు ప్రేక్షకుల మది దోచిన పలు భారీ యాక్షన్ చిత్రాలు మార్చిలో విడుదలకు క్యూ కడుతున్నాయి.ఈ మండు వేసవిలో అలరించడానికి సిద్ధమవుతున్న ఈ చిత్రాల్లో ఎక్కువ శాతం సీక్వెల్స్ ఉండటం గమనార్హం. ఆ చిత్రాల వివరాలపై ఓ లుక్ వేద్దాం

మార్చిలో హాలీవుడ్ చిత్రాల సందడే సందడి



డ్యూన్ పార్ట్ 2: అరాకిస్ అనే వింత ప్రపంచపు నేపథ్యంలో రూపొందిన డ్యూన్ పార్ట్-1 అటు విమర్శకుల ప్రశంసలందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను కొల్లగొట్టింది. దీనికి కొనసాగింపుగా తెరకెక్కిన రెండో భాగం మార్చి 15న విడుదలవుతోంది. ఇసుక ఎడారుల్లో ఎదురైన ఊహించని ప్రమాదాలని జయించి చిత్ర కథానాయకుడు పాల్ అర్ట్రిడిస్ (తిమోథీ చాల్మెట్) ఎలా తమ కుటుంబ వారసత్వాన్ని, ప్రజల భవిష్యత్తును రక్షిస్తాడో ఇందులో చూపించనున్నారు. ఈ చిత్ర దర్శకుడు డెనిస్ విల్లెనేయు బ్లేడ్ రన్నర్ 2049, అరైవల్, ఎనిమీ, ప్రిజనర్స్ లాంటి విభిన్నమైన చిత్రాలతో భారతీయులకు పరిచయస్తుడే.



కుంగ్ ఫూ పాండా 4: అబాలగోపాలాన్ని ఆకట్టుకునే చిత్రాలు అరుదుగా వస్తుంటాయి. అ కోవలోకే చెందిన ఈ సిరీస్ విశేష ప్రేక్షకాదరణ పొందింది. ఇందులోని మొదటి మూడు భాగాల్లో కథానాయకుడు 'పో' (పాండా) చేసే విన్యాసాలు చూడ్డానికి ఎంతో గమ్మత్తుగా ఉంటాయి. తన గురువు షిఫూ బోధించే తాత్వికత ఆలోచింపజేస్తుంది. ప్రతినాయకుడు టై లుంగ్ (టైగర్) ఆగడాలను అడ్డుకోవడం లెక్కకు మించిన పనే అయినా పో ఎలా తనని అడ్డుకుంటాడనేది ఆద్యంతం ఆసక్తికరంగా, వినోదదాయకంగా మలిచారు. చిత్ర నాలుగో భాగంలో పో తాత్విక గురువుగా మారడం, అ క్రమంలో ఎదురయ్యే సవాళ్ల చుట్టూ కథనం సాగుతుంది. మైక్ మిచెల్, స్టెఫెనీ మా స్టెయిన్ సంయుక్తంగా దీనికి దర్శకత్వం వహించారు. ఈ చిత్రం కూడా మార్చి 15నే ప్రేక్షకుల్ని పలకరించనుంది.



ఆర్థర్ ది కింగ్: పెంపుడు జంతువులతో మనుషుల స్నేహం ఆధారంగా గతంలో ఎన్నో చిత్రాలు వచ్చి ప్రేక్షకులని భావోద్వేగానికి లోను చేసి కంటతడి పెట్టించాయి. సెల్లాన్ జోన్స్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రంలో ప్రముఖ నటుడు మార్క్ వాల్‌బర్గ్ నటిస్తున్నాడు. అడ్వెంచర్ రేసర్ పాత్ర పోషించే హీరో ఇందులో తన జీవితంలో ఆఖరి సారి చేసే రేసు కోసం ఓ వీధి కుక్కను(ఆర్థర్) జట్టులో చేర్చుకుంటాడు. 700 కిలోమీటర్లు.. 10 రోజుల పాటూ జరిగే ఈ రేసులో విభిన్న దశలను దాటి హీరో, ఆర్థర్‌తో ఎలా విజయ తీరాలకు చేరుతాడనేదే కథ. భావోద్వేగభరితంగా సాగే ఈ చిత్రం మానవాళికి చిరకాల మిత్రుడైన కుక్కతో ఉండే స్నేహాన్ని మరోసారి హృద్యంగా ఆవిష్కరించనుంది. ఈ సినిమా మార్చి 15న ప్రేక్షకుల హృదయాలను బరువెక్కించనుంది.

గాడ్జిల్లా x కాంగ్ - ది న్యూ ఎంపైర్: గాడ్జిల్లా, కింగ్ కాంగ్ తెలియని ప్రేక్షకులుండరంటే అతిశయోక్తి కాదు. మూడేళ్ల క్రితం విడుదలై సంచలన విజయం సొంతం చేసుకున్న గాడ్జిల్లా వర్సెస్ కాంగ్‌కు ఈ చిత్రం సీక్వెల్‌గా రాబోతోంది. 2021 విడుదలైన ఈ చిత్రంలో గాడ్జిల్లా, కాంగ్ మధ్య పోరాటం ఎంతో రసవత్తరంగా, ఒళ్ల గగుర్పొడిచేలా ఉంటుంది. ఈ సారి గాడ్జిల్లా, కాంగ్ కలిసి మానవాళి రక్షణ కోసం వింత జీవుల పని పట్టడం ఈ చిత్ర కథాంశం. ఇందులో ఉండే పోరాట ఘట్టాలు ఊహలకతీతంగా ఉంటూ.. ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తాయని ట్రైలర్‌తోనే చిత్ర బృందం హింటిచ్చింది. అదమ్ వినగార్డ్ ఈ చిత్రానికి దర్శకుడు. భారీ విజువల్ ఎఫెక్ట్స్, స్పెషల్ ఎఫెక్ట్స్, థ్రిల్లింగ్ యాక్షన్ ఎలిమెంట్స్.. ఇలా ఎన్నో ప్రత్యేక హంగులతో నిండిన ఈ చిత్రం మార్చి 29న రిలీజ్ అవుతోంది.

రోడ్ హౌస్: విలక్షణ నటుడు జేక్ గిల్లెన్హాల్ నటించిన ఈ చిత్రం 1989లో ఇదే పేరుతో వచ్చిన సినిమాకు ఓ రకంగా సీక్వెల్ అనే చెప్పాలి. యాక్షన్ ప్రధానంగా సాగే ఈ చిత్రం మార్చి 21న విడుదలవుతోంది.

రికీ స్టానికీ: వరల్డ్ రెజ్లింగ్ ఎంటర్‌టైన్‌మెంట్ (డబ్ల్యూడబ్ల్యూఈ) ద్వారా యువతరానికి సుపరిచితుడైన నటుడు జాన్ సెనా ఇందులో నటిస్తున్నాడు. కామెడీ ఫ్యాంటసీ డ్రామాగా వస్తోన్న ఈ చిత్రానికి పీటర్ ఫ్యారెల్లీ దర్శకుడు. ఈ చిత్రం మార్చి 7న విడుదలవుతోంది.

మరోసారి క్వీన్ రాక



కంగనా రనౌత్‌కు కథానాయికగా విశిష్ట గుర్తింపు తెచ్చిన బాలీవుడ్ చిత్రం 'క్వీన్'. పదేళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో పాటు విమర్శకుల ప్రశంసలు అందుకుంది. చాలాకాలంగా ప్రేక్షకులు 'క్వీన్'కు సీక్వెల్ చేయాలని కంగనను కోరుతున్నారు. వారి కోరిక త్వరలోనే నెరవేరబోతోంది. 'క్వీన్ 2' చిత్రానికి స్క్రిప్ట్ సిద్ధం చేసినట్లు దర్శకుడు వికాస్ బహల్ తెలిపారు. సీక్వెల్‌లోనూ కంగన రనౌత్ రాణీగా లీడ్ రోల్ లో కనిపించనున్నారు. త్వరలోనే ప్రీ ప్రొడక్షన్ ప్రారంభించి, ఆగస్టు కల్లా సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తామని వికాస్ తెలిపారు. నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో వెల్లడించనున్నారు.

'సట్టకం' అనే పరిమళాల లస్సీ

లవంగ వ్యోషఖండైస్తు దధినిర్మథ్య గాలితమ్!
దాడిమీ బీజసంయుక్తం చంద్రచూర్ణావ చూర్ణితమ్!
సట్టకం తు ప్రమోదాఖ్యం నలాదిభిరుదాహృతమ్!
హృద్యం సుగంధి మధురం స్నిగ్ధం వాతహరం లఘు!
పిత్తఘ్నం తృప్తిదం బల్యం సురుచ్యం సట్టకం స్మృతమ్!

సట్టకం అనేది రామ బాణం లాంటిది. మనసుకు సంతోషాన్ని కలిగించి ఒత్తిడి లాంటి మానసిక సమస్యలను నివారిస్తుంది. సొరియాసిస్ లాంటి అనేక చర్మ వ్యాధులకూ ఇది మందు. సయాటికా నడుము నొప్పికి, మైగ్రేన్ తలనొప్పికి కూడా ఔషధంలా పని చేస్తుంది. గుండెను పటిష్టం చేస్తుంది. అజీర్తి, గ్యాసు, అమీబియాసిస్, పేగుపూత, పేగులకు సంబంధించిన ఇతర సమస్యలకూ, వాతం పెరిగి చర్మం గరుకుబారటం, కీళ్ల నొప్పులు, ఇంకా అనేక వాతవ్యాధులకూ ఇది మంచి ఔషధం. అమితమైన వేడిని తగ్గించి శరీరాన్ని చల్లబరుస్తుంది. శరీరానికి పుష్టినిస్తుంది. ఆకలి పుట్టిస్తుంది. అరుచిని పోగొడుతుంది. అనేక కారణాల వల్ల మనసులో ఏర్పడే అసంతృప్తులను పోగొడుతుంది. బలకరం. జీర్ణశక్తిని పెంచి చక్కని ఆకలిని కలిగిస్తుంది. ఏ వ్యాధిలోనైనా తీసుకోదగినది.

ఎండలు ముదురుతున్నాయి. వేసవిలో శరీరానికి మనం కల్పించుకోగలిగిన గొడుగు ఏదైనా ఉంటే అది ఇదే! దీన్ని క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో 'సట్టకం' అన్నాడు. సట్టకాన్ని పానీయంలాగానూ, తినేందుకు వీలుగా రెండు రకాలుగా చేసుకోవచ్చు.

పానీయంగా:

క్షేమశర్మ పద్ధతిలో సట్టకం పానీయాన్ని ఇలా తయారు చేసుకోవాలి:

గడ్డ పెరుగుని బాగా చిలికి ఎనిమిది పొరలు వేసిన వస్త్రంలో వడగట్టండి. చిక్కటి మజ్జిగ మిగులుతుంది. అందులో శొంఠి, పిప్పళ్లు, మిరియాల పొడిని తగినంత కలపండి. ఈ మూడింటినీ మనం ఇంట్లో మిక్సీ పట్టి తయారు చేసుకోవచ్చు. లేదా 'త్రికటు చూర్ణం' అనడిగితే ఆయుర్వేద మందుల షాపుల్లో దొరుకుతుంది. ఒక కప్పు పెరుగుకి అర చెంచా త్రికటు చూర్ణం సరిపోతుంది. ఈ త్రికటు చూర్ణాన్నే 'వ్యోష' అని కూడా పిలుస్తారు.

పాలకన్నా పెరుగు మంచిది. పెరుగుకన్నా చక్కగా చిలికిన మజ్జిగ ఇంకా మంచిది. అందుకని క్షేమశర్మ చిలికి, నీటిని తీసేసిన చిక్కని మజ్జిగనే తీసుకోవాలన్నాడు. దీంట్లో 'వ్యోష'ని కలిపాక రెండు మూడు లవంగాలను పైపైన దంచి అందులో వేయండి. గుప్పెడు దానిమ్మ గింజల్ని కూడా కలిపి, చిటికెడంత పచ్చకర్పూరాన్ని దీనిపైన చల్లుకుని తాగాలన్నాడు క్షేమశర్మ. ఇదే 'సట్టకం' అనే వేసవి పానీయం. మామూలు లస్సీలో ఉప్పు గానీ, పంచదారగానీ కలిపి చిలుకుతారు. కానీ, ఇదీ తీపి, ఉప్పు కలవని లస్సీ బీపీ, షుగరు ఉన్నవారు కూడా తీసుకోదగినది.

> **సంస్కృతంలో** 'సట్టకం' అనే పదాన్ని రెండు అర్థాల్లో ఉపయోగిస్తారు. బియ్యప్పిండితో చేసిన వంటకం అని ఒక అర్థం కాగా, నాటకం, నాటికలాగానే 'సట్టకం' అనే నాటక ప్రక్రియ కూడా ఉంది. రెండూ మనోహరాలే కదా. ఒక మంచి నాటకాన్ని, ఒక కమ్మని వంటకాన్ని సమానంగానే ఆస్వాదించగలుగుతాం మనం.

చిక్కని మజ్జిగలో దానిమ్మగింజలు, త్రికటు చూర్ణం, లవంగపొడి, పచ్చకర్పూరం కలిపి తాగితే వడదెబ్బ తగలకుండా ఉంటుంది. కఫం, వాతం తగ్గుతాయి. కొందరికి మజ్జిగ వాసన పడదు. అలాంటివాళ్లు ఈ సట్టకాన్ని సూపులాగా చేసుకుని తాగితే సరిపడవచ్చు. ప్రయత్నించండి.

అన్నంగా:

'ఆప్టే' సంస్కృత నిఘంటువు 'సట్టకం' అంటే 'బియ్యప్పిండిలో నీళ్లు పోసి వండి, నెయ్యి వేసిన ముద్ద' అని అర్థాన్నిచ్చింది. దీన్నిబట్టి సట్టకాన్ని క్షేమశర్మ చెప్పిన పానీయం పద్ధతిలోనే కాకుండా, తినే ఆహార పదార్థంగా కూడా తయారు చేసుకొంటారని అర్థమవుతుంది. క్షేమశర్మ పద్ధతిలోనే ఈ నేతి ముద్దలో పెరుగు కలిపి సట్టకాన్ని ఇలా చేసుకోవచ్చు:

ఒక కప్పు బియ్యప్పిండి తీసుకుని, మూడు గ్లాసుల నీళ్లు పోసి దగ్గరకొచ్చేలా ఉడికించాలి. అందులో తగినంత నెయ్యి వేసి బాగా కలపండి. ఈ నేతి ముద్దని ఒక పళ్లెంలోకి తీసుకుని, చల్లారాక అందులో చక్కగా చిలికి వడగట్టిన చిక్కని మజ్జిగ పోయండి. అందులో వ్యోష అంటే శొంఠి, పిప్పళ్లు, మిరియాల పొడి, తగినంత సైంధవలవణం కూడా వేసి బాగా



కలపండి. మీడియం సైజు దానిమ్మకాయని వలిచి ఆ గింజల్ని ఇందులో కలిపి, చివర్లో చాలా కొద్దిగా పచ్చకర్పూరాన్ని ఈ పెరుగన్నం మీద చల్లండి. ఇది మామూలు కర్డ్ రైస్ కన్నా ఎంతో విలువైనది. దీనికి పచ్చిమిర్చి, ఉల్లిపాయలు, తాలింపు అవసరం లేదు.

ఇప్పుడంటే ఆహారానికి పరిమళాన్ని తేవటంకోసం అల్లం... వెల్లుల్లి పేస్టు కలుపుతున్నారు. పూర్వీకులు పచ్చకర్పూరం, కస్తూరి, జాజికాయ జాపత్రి, గోవజవ్వాది లాంటివి కలుపుకునేవాళ్లు.

• గంగరాజు అరుణాదేవి

శక్తినిచ్చే ద్రాక్ష



- ద్రాక్షలో విటమిన్లు, మినరల్స్, యాంటీ ఆక్సిడెంట్స్‌తో పాటు ఫ్లేవనాయిడ్స్ ఉంటాయి. ద్రాక్షను తింటే కంటిలో వచ్చే సమస్యలు తగ్గిపోతాయి.
- మైగ్రేన్‌తో బాధపడేవారు తాజా ద్రాక్ష పండ్లు లేదా రసాన్ని తాగితే ఉపశమనం లభిస్తుంది. మైగ్రేన్ తగ్గే అవకాశాలెక్కువ.
- రక్తంలోని చక్కెర శాతాన్ని నియంత్రించే గుణాలు ద్రాక్షలో ఉన్నాయి.
- తరచుగా ద్రాక్ష తినేవారు, గ్రేప్ వైన్ తీసుకునే వారిలో వయసు త్వరగా మీదపడదు.
- ఇందులో విటమిన్- సి ఉంటుంది. ముఖ్యంగా ఇందులోని యాంటీ వైరల్, యాంటీ బాక్టీరియా లక్షణాల వల్ల దగ్గు, జలుబు లాంటి సమస్యలు దరిచేరవు.
- సత్వరమే శక్తినిచ్చే మంచి ఎనర్జీ బూస్టర్.
- శరీరంలోని కొవ్వు పదార్థాలు కరిగిపోతాయి. రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. దీనివల్ల గుండె ఆరోగ్యానికి మేలు జరుగుతుంది.
- విటమిన్-కె, కాల్షియం, మాంగనీస్ ఉండటం వల్ల ఎముకల ఆరోగ్యానికి మంచిది.



ఎలా వండుకోవాలో తెలియాలే కానీ.. కాలీఫ్లవర్‌తో వంటకాలు భలే రుచిగా ఉంటాయి. తక్కువ సమయంలో, సులువుగా కాలీఫ్లవర్‌తో వింగ్స్, కర్రీ, రోస్టెడ్ గోబీ సూప్‌ను చేసుకోవచ్చు ఇలా...

భళా.. కాలీ'ఫ్లేవర్'

రోస్టెడ్ గోబీ సూప్



కావాల్సిన పదార్థాలు

కాలిఫ్లవర్- కప్పు, ఉల్లిపాయ-1 (సన్నగా తరగాలి), చిల్లీ ఫ్లేక్స్- 1 టీస్పూన్, వెల్లుల్లి రెబ్బలు-5, మిరియాల పొడి- 1 టీస్పూన్, ఉప్పు- రుచికి తగినంత, వెన్న- 2 టేబుల్ స్పూన్లు, కొత్తిమీర- టేబుల్ స్పూన్, ఆలివ్‌నూనె- 2 టేబుల్ స్పూన్లు, చీజ్- కొద్దిగా, వెన్న- కొద్దిగా, అరిగానో- కొద్దిగా, వెజ్‌స్టాక్- సరిపడ

తయారీ విధానం

బౌల్‌లో కాలిఫ్లవర్‌తో పాటు ఉల్లిపాయ ముక్కలు, మిరియాల పొడి, అరిగానో, చిల్లీ ఫ్లేక్స్ ఆలివ్‌నూనె వేసి బాగా కలపాలి. దీనివల్ల కాలిఫ్లవర్ ముక్కలకు ఆలివ్‌నూనె బాగా పడుతుంది. ప్యాన్‌లో వేయించాలి. చల్లారిన తర్వాత మిక్సీలోకి వేసిన తర్వాత వెజ్‌స్టాక్ సరిపడా వేసి మెత్తని పేస్ట్‌లా మిక్సీ పట్టాలి. క్రీమీగా పట్టుకోవాలి. అంతేకానీ.. మరీ నీళ్లలా చేసుకోకూడదు.

పాన్‌లో వెన్న వేయాలి. కరిగిన తర్వాత మిక్సీలో పట్టుకున్న మిశ్రమాన్ని పోసి గరిటెతో కలుపుతుండాలి. ఆ తర్వాత వెజ్‌స్టాక్ కొద్దిగా వేసి తగినంత ఉప్పు వేయాలి. కొద్దిగా చీజ్ వేసుకోవాలి.. అది కూడా అవసరం అనుకుంటే. గరిటెతో కలుపుతూ చిటికెడు అరిగానో వేసి కలపాలి. ఆపకుండా గరిటెతో కలుపుతూ ఉండాలి. బాగా ఉడికి పొంగులా వస్తుంది. వాసన గుబాళిస్తుంది. వెంటనే దీన్ని బౌల్‌లో వేసి కొద్దిగా అరిగానో, పెప్పర్, కొత్తిమీర, చిల్లీఫ్లేక్స్ వేసుకుని వేడివేడిగా తాగేయటమే. ఈ రోస్టెడ్ గోబీ సూప్ రుచికరంగా ఉంటుంది.

కాలీఫ్లవర్ వింగ్స్



కావాల్సిన పదార్థాలు

కాలీఫ్లవర్ ముక్కలు- 800 గ్రాములు, మైదా- అరకప్పు, బియ్యం పిండి- అరకప్పు, కార్న్‌ఫ్లోర్- అరకప్పు, మిరియాల పొడి- ముప్పావు టీస్పూన్, అరిగానో- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, కారం- ఒకటిన్నర టీస్పూన్, బ్రెడ్ కంచెస్- రెండు కప్పులు, నూనె- డీప్ ఫ్రైకి సరిపడ

తయారీ విధానం



గిన్నెలో మూడు పెద్ద గ్లాసుల నీళ్లు పోసి స్టవ్ ఆన్ చేయాలి. హైఫ్లేమ్‌లో మంట ఉంచాలి. నీళ్లు బాగా మరిగిన పొంగులా వచ్చేప్పుడే తగినంత ఉప్పు వేయాలి. ఆ తర్వాత కాలిఫ్లవర్ ముక్కలు వేయాలి. నాలుగు నిముషాలు ఉడికిన తర్వాత కాలిఫ్లవర్ ముక్కలను తీసి జాలీ గరిటెతో తీయాలి. అది కూడా నీళ్లన్ని కిందకు పడిన తర్వాతనే తీసి బౌల్‌లో వేసుకోవాలి.

బౌల్‌లో మైదా, బియ్యం పిండి, కార్న్‌ఫ్లోర్, మిరియాల పొడి, అరిగానో, ముప్పావు టీస్పూన్ కారంపొడితో పాటు తగినంత ఉప్పు వేసి కలపాలి. బాగా కలిపిన తర్వాత కొద్ది కొద్దిగా నీళ్లు పోసుకుంటూ దోశపిండిలా మెత్తగా కలపాలి.

ఆ తర్వాత బౌల్‌లో బ్రెడ్ క్రంచెస్‌లో మిగిలిన కారంపొడి, సరిపడ ఉప్పు, చిటికెడు మిరియాల పొడి వేసి కలపాలి ఈ మిశ్రమాన్ని పక్కన ఉంచుకోవాలి. కాలీఫ్లవర్ ముక్కలు చల్లబడిన తర్వాత ప్రతి ముక్కను ముందుగా తయారు చేసుకున్న మిశ్రమంలో ముంచి.. ఆ తర్వాత బ్రెడ్ క్రంచ్‌ల్లో వేసి కలపాలి. కాలీఫ్లవర్ ముక్కమీద కోటింగ్‌గా బ్రెడ్ ముక్కలు వస్తాయి. ఈ ముక్కలను చల్లని నీళ్లలో అద్ది రెండోసారి కూడా బ్రెడ్ ముక్కల్లో ఉంచి కలపాలి. దీనివల్ల రెండోసారి కోటింగ్ అవుతుంది. ఇలా మిగతా కాలీఫ్లవర్ ముక్కలను తయారు చేసుకోవాలి. చివరగా డీప్‌ఫ్రైకి సరిపడ నూనె తీసుకుని వేడి చేయాలి. ఆ నూనెలో కాలిఫ్లవర్ వింగ్స్‌ను వేయించాలి.. అది కూడా హైఫ్లేమ్‌లో. రంగుమారేంత వరకు వేయించుకోవాలి. ఈ కాలీఫ్లవర్ వింగ్స్‌ను టమోటా కెచప్‌తో తింటే రుచిగా ఉంటాయి.

కాలీఫ్లవర్ కర్రీ

కావాల్సిన పదార్థాలు

మీడియమ్ సైజ్ కాలీఫ్లవర్- 1 (ముక్కలుగా కట్ చేసుకోవాలి), నూనె- రెండు టేబుల్ స్పూన్లు, ఉల్లిపాయ- 1 (సన్నగా తరగాలి), పచ్చి మిరపకాయలు- 8 (సన్నగా తరగాలి), పుదీనా- టేబుల్ స్పూన్, కొత్తిమీర- గుప్పెడు, టొమాటోలు-2, నూనె- 3 టేబుల్ స్పూన్లు, జీలకర్ర- టీస్పూన్, దాల్చిన చెక్క-1, బిర్యానీ ఆకు-1, జింజర్, గార్లిక్ పేస్ట్- టీస్పూన్, పసుపు- కొద్దిగా, ఉప్పు- తగినంత, జీలకర్ర పొడి- 2 టీస్పూన్స్, ధనియాల పొడి- 2 టేబుల్ స్పూన్లు, గరం మసాలా- పావు టీస్పూన్, పెరుగు- కప్పు

తయారీ విధానం

ఒక గిన్నెలో నీళ్లు పోసి బాగా మరిగిన తర్వాత కొద్దిగా ఉప్పు వేశాక.. కాలీఫ్లవర్ ముక్కలు వేసి నాలుగు నిముషాల పాటు ఉడికించాలి. ఆ తర్వాత జాలీ గరిటెతో నీళ్లు పోనిచ్చి కాలీఫ్లవర్ ముక్కలను ప్లేట్‌లో వేసుకోవాలి.

ప్యాన్‌లో రెండు టీ స్పూన్ల నూనె వేయాలి. నూనె వేడయ్యాక ఉల్లిపాయ ముక్కలు వేసి రంగు మారేంత వరకు వేయించాలి. పచ్చి మిరపకాయలు వేసి రెండు నిముషాలు కలిపాక పుదీనా, కొత్తిమీర వేసి కలిపితే ఆకుకూర మెత్త పడుతుంది. టొమాటో ముక్కలు వేసి కలపాలి. టొమాటోలు వేగిన తర్వాత ఈ మిశ్రమాన్ని మిక్సీ పట్టుకోవాలి.

అదే ప్యాన్‌లో రెండు టేబుల్ స్పూన్ల నూనె వేసి దాల్చిన చెక్క, బిర్యానీ ఆకు, జీలకర్ర, కరివేపాకు వేయాలి. ఈ మిశ్రమం వేగిన తర్వాత మిక్సీ పట్టిన పేస్ట్ వేసి కలపాలి. మూడు నిముషాల పాటు వేయించిన తర్వాత జింజర్,గార్లిక్ పేస్ట్ వేయాలి. దీని వాసన పోయేదాకా కలుపుతూ ఉండాలి. నూనె పైకి తేలినట్లు వస్తే బాగా ఉడికినట్లు. వెంటనే తగినంత ఉప్పు, పసుపు వేసి కలపాలి. గరం మసాలా, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా వేసి బాగా కలపాలి. మూడు నిముషాల తర్వాత పెరుగు వేసి కలపాలి. నిముషం పాటు కలిపాక పక్కన ఉంచుకున్న కాలీఫ్లవర్ ముక్కలను ఈ మిశ్రమంలో వేసి బాగా కలపాలి. ప్యాన్ మీద మూత పెట్టి నూనె పైకి తేలేంత వరకూ కుక్ చేయాలి. మధ్యమధ్యలో చూసుకుంటూ ఉండాలి. ఆ తర్వాత జ్యూసీ కర్రీకి తగినట్లు కొద్దిగా నీళ్లు పోసి ప్యాన్ మీద మూత ఉంచి కుక్ చేయాలి. బాగా ఉడికిన తర్వాత ఈ కర్రీని దించేసుకోవాలి. నాన్‌వెజ్‌లా కనపడుతుంది. ఈ కాలీఫ్లవర్ కర్రీని చపాతీతో లేదా జొన్నరొట్టెతో తినొచ్చు.

శంకరీదాస్...

బిడ్డ అనారోగ్యం పాలైనప్పుడే కాదు... అతని అక్షరయాత్రలోనూ అండగా నిలబడిన అమ్మ.
ఇంటి బాధ్యతలు, ఆర్థిక ఇబ్బందుల్లో సైతం... మరణించిన కొడుకు ఆశయాన్ని పుష్కర కాలంగా ఆమె బతికిస్తున్నారు.
అతని జ్ఞాపకాలను సజీవంగా నిలుపుతున్నారు.

అమ్మ సంకల్పం... అక్షరం సజీవం



ప్రతి సంవత్సరం కోల్‌కతా పుస్తక ప్రదర్శనలో ఒక స్టాల్ తప్పనిసరిగా ఉంటుంది. అక్కడ కూర్చున్న ఒక మహిళ... సందర్శకులకు ఆ పుస్తకాల గురించి ఓపికగా వివరిస్తూ ఉంటారు. ఆమె రోజూ ముప్పై రెండు కిలోమీటర్ల దూరంలోని బారక్‌పూర్ నుంచి రైలులో హౌరా స్టేషన్‌కు, అక్కడి నుంచి ఆటోలో ప్రయాణించి... ఆ ప్రదర్శన జరిగే సెంట్రల్ పార్క్ మేళా గ్రౌండ్‌కు చేరుకుంటారు. మొదటిసారిగా పద్దెనిమిదేళ్ళ కిందట... తన కుమారుడు సోమనాథ్‌తో కలిసి ఆ ప్రదర్శనకు ఆమె వచ్చారు. ఇప్పుడు తన బిడ్డ ఆశయాన్ని కొనసాగించడం కోసం... ఏటా ఒక కొత్త సంచికను ప్రచురిస్తున్నారు. ఆమె పేరు శంకరీదాస్. వయసు అరవై నాలుగేళ్ళు.

పత్రికల కట్టలు మోసుకొంటూ...

తొమ్మిదో తరగతి చదువుతున్నప్పుడు శంకరీదాస్‌కు వివాహమయింది. భర్త బిఎస్ఎఫ్ ఉద్యోగి. వారి పెద్ద కుమారుడైన సోమనాథ్ అయిదేళ్ళ వయసులోనే మైలోఫైబ్రోసిస్ అనే అరుదైన క్యాన్సర్‌కు గురయ్యాడు. రెండో బిడ్డ వైకల్యంతో పుట్టాడు. దీనితో ఆమె భర్త మానసికంగా కుంగిపోయారు. ఉద్యోగానికి రాజీనామా చేశారు. కుటుంబ భారం శంకరి మీద పడింది. ఇల్లు గడపడానికి, పిల్లల చదువు, చికిత్సల కోసం... సినిమా థియేటర్లలో పల్లీలు అమ్మారు. ఇళ్ళల్లో పనులు చేశారు. సోమనాథ్ ప్రతినెలా రక్త మార్పిడి, కీమోథెరపీ చేయించుకోవడం తప్పనిసరి కావడంతో తరచుగా ఆసుపత్రిలోనే గడపాల్సి వచ్చేది. అతనికి చదువన్నా, సాహిత్యమన్నా ప్రాణం. స్కూల్ మ్యాగజైన్ కోసం తొమ్మిదేళ్ళ వయసులోనే తొలి కవిత రాశాడు. అనారోగ్యం కుంగదీస్తున్నా భరిస్తూ.. ఎమ్మే పూర్తి చేశాడు. ఒక సాహితీ పత్రికను ప్రచురించాలనుకున్నాడు. ట్యూషన్లు చెప్పి డబ్బు పోగు చేశాడు. శంకరి కూడా కొంత సాయం చేశారు. ఆలా 2006లో 'సోమయ్యై టోమకే' అనే మ్యాగజైన్ తొలిసారిగా ప్రచురితమయింది. ఆ తరువాత ఆ పత్రిక ప్రచురణ కొనసాగించడానికి తల్లీ, కొడుకు ఎన్నో కష్టాలు పడ్డారు. రచనల ఎంపిక, ఎడిటింగ్ మొదలు లేఅవుట్ డిజైనింగ్ వరకూ అన్నీ అతనే చూసుకొనేవాడు. ప్రూఫ్ రీడింగ్,

> "సోమనాథ్ మరణించే సమయానికి అతనికి ముప్ఫయ్యారేళ్ళు. ప్రాణాంతకమైన వ్యాధి కారణంగా నా బిడ్డ ఎక్కువ కాలం బతకడని నాకు తెలుసు. కానీ తను లేకపోయినా ఆ పత్రిక కొనసాగాలన్నది అతని కోరిక. అందుకే ఆ బాధ్యతను... భారమని తెలిసినా స్వీకరించాను"

ప్రింటింగ్ లాంటి పనులన్నిటికీ శంకరి సాయపడేవారు. అతను బరువులు ఎత్తడం సాధ్యం కాకపోవడంతో... పత్రికల కట్టలను మోసుకొని అతని వెంట శంకరి వెళ్ళేవారు. తన కవితలతో కొన్ని సంకలనాలు కూడా సోమనాథ్ వెలువరించాడు. వారి శ్రమకు గుర్తింపుగా పశ్చిమబెంగాల్ సాంస్కృతిక శాఖ పురస్కారాన్ని అందజేసింది. ఆ మరుసటి ఏడాది... 2012లో సోమనాథ్ మరణించాడు.



పెడధోరణులు లేకుండా...

"సోమనాథ్ మరణించే సమయానికి అతనికి ముప్ఫయ్యారేళ్ళు. ప్రాణాంతకమైన వ్యాధి కారణంగా నా బిడ్డ ఎక్కువ కాలం బతకడని నాకు తెలుసు. కానీ తను లేకపోయినా ఆ పత్రిక కొనసాగాలన్నది అతని కోరిక. అందుకే ఆ బాధ్యతను... భారమని తెలిసినా స్వీకరించాను" అని చెబుతారు శంకరి. ఈ ఏడాదికి ఆ మ్యాగజైన్ పద్దెనిమిదేళ్ళు పూర్తి చేసుకుంది. పాత, కొత్త సంచికలతో పాటు సోమనాథ్ కవితా సంకలనాలను కూడా కోల్‌కతా పుస్తకోత్సవానికి ఏటా శంకరి తీసుకువస్తారు. కొత్త సంచికల ప్రచురణ కోసం సాహితీవేత్తలతో కూడిన ఒక సంపాదక వర్గం ఉంది. కానీ ప్రతిదీ ఆమె క్షుణ్ణంగా పరిశీలిస్తారు. 'కోల్‌కతా లిటిల్ మ్యాగజైన్ లైబ్రరీ అండ్ రీసెర్చ్ సెంటర్' వ్యవస్థాపకుడు సందీప్ దత్తా 2021లో ఆమెకు 'లిటిల్ మ్యాగజైనర్ మా' అనే బిరుదు ప్రదానం చేశారు. "ప్రారంభం నుంచి ఇప్పటివరకూ పూర్తి వాస్తవాలతో, ఎలాంటి పెడధోరణులు లేకుండా మా పత్రికను ప్రచురిస్తున్నాం. మా అబ్బాయి కోరుకున్నది కూడా అదే. నాకు వయసు మీదపడుతోంది. ఇదివరకటిలా ఓపిక ఉండడం లేదు. నా భర్త, వైకల్యంతో ఉన్న రెండో బిడ్డ సంరక్షణ పూర్తిగా నా మీదే ఉంది. ప్రస్తుతం వెయిట్రెస్‌గా పని చేస్తున్నాను. ఈ ఒత్తిడిలో నాకు ఉన్న ఉపశమనం... మా అబ్బాయి కలను కొనసాగించడం. ఆ పత్రికను, అతని కవితా సంకలనాలను చేతుల్లోకి తీసుకున్నప్పుడల్లా... సోమనాథ్‌ను ఎత్తుకున్నట్టనిపిస్తుంది. ఈ పత్రిక ఇప్పుడు నాకు మరో బిడ్డగా మారిపోయింది. వాటిని చదివినవారు మెచ్చుకుంటూ ఉంటే... ఎనలేని ఉత్సాహం వస్తుంది. శక్తి ఉన్నంతకాలం ప్రచురణ కొనసాగిస్తాను. నేను బతికున్నంతకాలం నా బిడ్డ కలను సజీవంగా ఉంచుతాను" అంటున్నారు శంకరి.

మేకప్

మేకప్‌లో ఉపయోగించే బ్రష్‌లు, అప్లికేటర్లు నాణ్యంగా ఉన్నప్పుడే ముఖ చర్మం పది కాలాల పాటు ఆరోగ్యంగా ఉంటుంది. కాబట్టి మీ మేకప్ కిట్‌లో ఈ సౌందర్య సాధనాలకు తప్పనిసరిగా చోటు కల్పించండి.

కిట్ కట్టుదిట్టంగా..

క్రయో స్టిక్స్

చర్మం నునుపుగా, బిగుతుగా ఉంటే, మేకప్ ముఖం మీద సమంగా పరుచుకుంటుంది. కాబట్టి చర్మపు ఇన్‌ఫ్లమేషన్‌ను తగ్గించి, మృదువుగా, బిగుతుగా మార్చే క్రయో స్టిక్స్‌తో మేకప్‌కు ముందు చర్మాన్ని మర్దన చేసుకోవాలి.

మేకప్ అప్లికేటర్

అప్లికేటర్ మేకప్ ఉత్పత్తిని పీల్చుకునేలా ఉండకూడదు. మేకప్‌ను ముఖ చర్మం మీద బ్లెండ్ చేసేలా ఉండాలి. కాబట్టి కాంపాక్ట్ అద్దుకోవడం కోసం సాధారణ స్పాంజ్‌కు బదులుగా మేకప్ అప్లికేటర్‌ను ఎంచుకోవాలి.

ఫౌండేషన్ బ్రష్

ఫౌండేషన్ అద్దుకోవడానికి డ్యుయల్ ఎండెడ్ బ్రష్‌ను ఉపయోగించడం వల్ల ఫౌండేషన్ ముఖమంతా సమంగా పరుచుకుంటుంది. రెండు పరిమాణాల్లో ఉండే ఈ బ్రష్‌ను అవసరాన్ని బట్టి ముఖంలోని వేర్వేరు ప్రదేశాల్లో ఉపయోగించుకోవచ్చు.

ఐల్యాష్ కర్లర్

కనురెప్పలు వింజామరల్లా ఒత్తుగా మారాలంటే ఐల్యాష్ కర్లర్‌ను తప్పక ఉపయోగించాలి. కనురెప్పల్లోని వెంట్రుకలన్నీ సమంగా వంపు తిరిగడానికి ఈ పరికరం ఉపయోగపడుతుంది.

బాడీ బ్రష్

బాడీ బ్రాంజర్ అద్దుకోడానికి స్పాంజ్, సాధారణ బ్రష్‌లకు బదులుగా బాడీ బ్రష్‌ను ఉపయోగించాలి.

బ్లాటింగ్ పేపర్స్

మేకప్ చెదిరిపోకుండా అదనపు మేకప్ మెరుపును తొలగించడానికి బ్లాటింగ్ పేపర్లు అద్భుతంగా ఉపయోగపడతాయి.

మేకప్ రిమూవర్ ప్యాడ్స్

రీయూజబుల్ మైక్రోఫైబర్‌తో తయారైన మేకప్ రిమూవర్ ప్యాడ్స్‌తో చర్మ రంధ్రాల్లో ఇంకిపోయిన మేకప్ సైతం చక్కగా తొలగిపోతుంది.



నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/PddVICVలో చదవండి.

బిజినెస్

స్పైసెస్ విభాగంలోకి సంగం డెయిరీ



చేబ్రోలు: సంగం డెయిరీ.. స్పైసెస్ విభాగంలోకి ప్రవేశించింది. శుక్రవారం వడ్లమూడి సంగం డెయిరీలో సంస్థ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ సంగం మసాలా ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. సంగం డెయిరీ గుంటూరు జిల్లాలో రైతుల ఉత్పత్తులను మార్కెటింగ్ చేసేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన కారం, దుగ్గిరాల పసుపుతో పాటు సాంబారు పౌడర్, గరం మసాల పౌడర్, చికెన్ మసాలాలను కోప్యాకింగ్‌తో మార్కెటింగ్ చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎనిమిది వేల మంది డిస్ట్రిబ్యూటర్లు, ఏజెంట్ల సహకారంతో పలు ఉపఉత్పత్తులను మార్కెట్లోకి ప్రవేశపెడుతున్నట్లు చెప్పా రు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సహకారంతో వివిధ ఉత్పత్తులను సంగం కో ప్యాకింగ్ పేరుతో వీటిని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు వివరించారు.

● డిజిటల్ రియల్ ఎస్టేట్ ప్లాట్‌ఫామ్ హౌసింగ్ డాట్‌కామ్.. విశాఖపట్నంలో తన కార్యకలాపాలను మరింతగా విస్తరించింది. విశాఖలో నివాస గృహాల మార్కెట్ ఏటా 10.15 శాతం వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని వివరించింది. వచ్చే మూడేళ్ల కాలంలో వేగంగా వృద్ధి చెందుతున్న మార్కెట్లకు విస్తరించటం ద్వారా ఏటా రెండంకెల వృద్ధిని నమోదు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,730 ▲	57,600 ▲	76,000 ▼
ముంబై	62,008 ▼	56,799 ▼	69,653 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



23వ తేదీ		విజయవాడ	515
హైదరాబాద్	520	విశాఖపట్నం	525
24వ తేదీ		వరంగల్	522
చిత్తూరు	588	డజను గుడ్లు రూ.72	
గోదావరి	515		

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. **వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



హైదరాబాద్	140	గోదావరి	144
వరంగల్	140	విజయవాడ	144
కరీంనగర్	140	గుంటూరు	144
మహబూబ్‌నగర్	140	ఒంగోలు	144
కర్నూలు	140	చిత్తూరు	144
విశాఖపట్నం	127		

విదేశీ విమానాశ్రయాలపై
జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ నజర్



గ్రీస్ ప్రధానితో జీఎం రావు భేటీ

ప్రస్తుతం భారత పర్యటనలో ఉన్న గ్రీస్ ప్రధాని కిరియాస్కో విట్సోటాకిస్ శుక్రవారం ఢిల్లీ విమానాశ్రయాన్ని సందర్శించారు. జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ జీఎం రావు, జీఎంఆర్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్స్ బిజినెస్ చైర్మన్ బొమ్మిడాల శ్రీనివాస్, తదితరులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఎయిర్‌పోర్టు ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఏఓసీసీ)ని సందర్శించిన ఆయన విమానాశ్రయ నిర్మాణ శైలిని ప్రశంసించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్టు ప్రపంచ దేశాలకు, భారత దేశానికి ద్వారం లాంటిదని పేర్కొన్నారు.

హైదరాబాద్: జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. దేశ,విదేశాల్లో తన వ్యాపార విస్తరణపై దృష్టి పెట్టింది. విదేశీ విస్తరణలో భాగంగా పశ్చిమాసియా, దక్షిణాసియా, ఆగ్నేయాసియా దేశాలపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఈ దేశాల్లో కొత్త విమానాశ్రయాల నిర్మాణం, నిర్వహణ లేదా పాత విమానాశ్రయాల ఆధునికీకరణ, నిర్వహణ చేపట్టేందుకు సిద్ధమవుతోంది. కోటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ నిర్వహించిన ఎనలిస్టుల సదస్సులో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నతాధికారులు ఈ విషయం వెల్లడించారు. ఆయా దేశాల రెగ్యులేషన్లపై పూర్తి అవగాహన ఉన్న స్థానిక కంపెనీలతో కలిసి ఈ ప్రాజెక్టులు చేపడతామని వారు తెలిపారు.

ఇప్పటికే రెండు ప్రాజెక్టులు: జీఎంఆర్ గ్రూప్ ఇప్పటికే ఫిలిప్పీన్స్, ఇండోనేషియా దేశాల్లో రెండు విమానాశ్రయాలు నిర్వహిస్తోంది. కొత్తగా గ్రీస్ ప్రధాని కిరియాస్కో మిట్సోటాకిస్ సొంత పట్టణం క్రీట్‌లో.. అతి పెద్ద విమానాశ్రయం నిర్మిస్తోంది. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా ఎయిర్‌పోర్టు ఆధునీకరణ, విస్తరణ, నిర్వహణ కోసం కూడా బిడ్ దాఖలు చేసింది.

స్వదేశంలో: భారత్‌లోనూ ప్రైవేటీకరించే విమానాశ్రయాల కోసం పోటీపడాలని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ భావిస్తోంది. అయితే ఏటా కనీసం 50 లక్షల మంది విమాన ప్రయాణికులు రాకపోకలు సాగించే విమానాశ్రయాలపై మాత్రమే తమకు ఆసక్తి ఉందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ అధికారులు ఈ సదస్సులో చెప్పారు. జీఎంఆర్ గ్రూప్ ఇప్పటికే ఢిల్లీ, హైదరాబాద్, గోవా విమానాశ్రయాలను నిర్వహిస్తోంది. వీటికి తోడు ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం వద్ద కొత్త విమానాశ్రయాన్ని నిర్మిస్తోంది. అలాగే గోవా, ఢిల్లీ విమానాశ్రయాల సామర్థ్యాన్ని మరింత విస్తరిస్తోంది.

పేటీఎం యూపీఐ హ్యాండిల్ యూజర్లను ఇతర బ్యాంకులకు బదిలీ చేయండి..

'ఎన్‌పీసీఐ'కి ఆర్‌బీఐ సూచన

ముంబై: పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) సేవలను ఉపయోగించుకుంటున్న కస్టమర్లు, వాలెట్ హోల్డర్లు, వర్తకుల ప్రయోజనార్థం భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) శుక్రవారం అదనపు చర్యలు చేపట్టింది. '@ పేటీఎం' యూపీఐ హ్యాండిల్‌ను ఉపయోగిస్తున్న పీపీబీఎల్ కస్టమర్లను ఇతర బ్యాంకులకు బదిలీ చేసే అవకాశాలను పరిశీలించాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)ను ఆర్‌బీఐ కోరింది. వీరిని ఒకే బ్యాంక్‌కు కాకుండా 4-5 బ్యాంకులకు బదిలీ చేయాలని సూచించింది. ఈ ఏడాది మార్చి 15 నుంచి పీపీబీఎల్ ఖాతాదారులు, వాలెట్ హోల్డర్లు, మర్చంట్ కస్టమర్ల ఖాతాల్లో డిపాజిట్లు, క్రెడిట్‌పై నిషేధం అమలులోకి రానున్న విషయం తెలిసిందే. పీపీబీఎల్ వెబ్‌సైట్ డేటా ప్రకారం.. బ్యాంక్ నిర్వహణలో 30 కోట్ల వాలెట్లు, 3 కోట్ల బ్యాంక్ ఖాతాలున్నాయి. పేటీఎం యాప్‌లో యూపీఐ కార్యకలాపాలను కొనసాగించేందుకు తమ సంస్థ థర్డ్ పార్టీ అప్లికేషన్ ప్రొవైడర్ (టీపీఏపీ) గా యూపీఐగా మారేందుకు అనుమతించాలన్న వన్97 కమ్యూనికేషన్ లిమిటెడ్ (ఓసీఎల్) అభ్యర్థనను పరిశీలించాలని కూడా ఎన్‌పీసీఐకి ఆర్‌బీఐ సూచించింది. పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ అయిన ఓసీఎల్.. పీపీబీఎల్‌లో 49 శాతం వాటా కలిగి ఉంది. ఒకవేళ ఓసీఎల్‌కు టీపీఏపీ హోదాను మంజూరు చేసిన సందర్భంలో 'ఎట్ పేటీఎం' యూపీఐ హ్యాండిల్ వినియోగదారులను ఎలాంటి అవాంతరం లేకుండా పీపీబీఎల్ నుంచి కొత్తగా ఎంపిక చేసిన బ్యాంకులకు బదిలీకి నిర్దేశించవచ్చని ఆర్‌బీఐ తన ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుత యూజర్లను కొత్త యూపీఐ హ్యాండిల్స్‌కు బదిలీ చేసేవరకు ఈ టీపీఏపీ కొత్త కస్టమర్లను చేర్చుకోరాదని నిర్దేశించింది. అలాగే, పేటీఎం క్యూఆర్ కోడ్‌ను వినియోగిస్తున్న వర్తకుల కోసం ఓసీఎల్ ఒకటి లేదా అంతకంటే ఎక్కువ పీఎస్‌బీ బ్యాంకులతో సెటిల్మెంట్ అకౌంట్లను ప్రారంభించవచ్చని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. పీపీబీఎల్ జారీ చేసిన ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) హోల్డర్లు మార్చి 15 లోగా ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌బీఐ సూచించింది.

ప్రజా రవాణా చెల్లింపుల్లో మరింత సౌలభ్యం

పీపీఐల జారీకి బ్యాంక్‌లు, నాన్ బ్యాంకింగ్ కంపెనీలకు అనుమతి

ప్రజా రవాణా వ్యవస్థల్లో చెల్లింపులు చేపట్టగలిగే ప్రీ-పెయిడ్ ఇన్‌స్ట్రుమెంట్స్ (పీపీఐ) జారీకి బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ కంపెనీలకు ఆర్‌బీఐ అనుమతిచ్చింది. తద్వారా ప్రయాణికులకు టికెట్ కొనుగోలు చేసేందుకు నగదుతో పాటు మరిన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులోకి వస్తాయని.. మరింత సౌలభ్యంగా, వేగంగా, భద్రంగా చెల్లింపులు జరిపే వీలుంటుందని ఆర్‌బీఐ తన ప్రకటనలో పేర్కొంది.

బైజూస్ నుంచి రవీంద్రన్ ఔట్

ఆయన కుటుంబ సభ్యులు కూడా

తీర్మానించిన వాటాదారుల ఈజీఎం

న్యూఢిల్లీ: ఎడ్యుకేషన్ స్టార్టప్ బైజూస్‌పై ఆ సంస్థ వ్యవస్థాపకుడు, సీఈఓ బైజు రవీంద్రన్, ఆయన కుటుంబ పెత్తనానికి తెరపడింది. శుక్రవారం జరిగిన కంపెనీ వాటాదారుల అసాధారణ సర్వసభ్య సమావేశం (ఈజీఎం) వారిని డైరెక్టర్ల బోర్డు నుంచి తొలగిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించింది. కంపెనీ అస్తవ్యస్థ నిర్వహణకు రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులే కారణమైనందున ఈ చర్య తీసుకున్నట్టు వాటాదారులు తెలిపారు. బోర్డు సభ్యులైన రవీంద్రన్, ఆయన భార్య, సోదరుడు ఈ ఈజీఎంకు హాజరు కాలేదు. రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యుల తొలగింపుతో పాటు కొత్త బోర్డు ఏర్పాటు కోసమూ ఈజీఎం తీర్మానం చేసింది. వీటికి తోడు బైజూస్ కొనుగోలు చేసిన కంపెనీలపై ఫోరెన్సిక్ ఆడిట్ జరిపించాలని కూడా తీర్మానించింది.

చెల్లదంటున్నా..: బైజూస్ మాతృసంస్థ థింక్ అండ్ లెర్న్ ఈక్విటీలో 32 శాతానికిపైగా వాటా ఉన్న ఆరు ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఈ ఈజీఎంకు పిలుపు ఇచ్చాయి. ఈ ఈజీఎం చెల్లదని ప్రకటించాలని రవీంద్రన్ చేసిన విజ్ఞప్తిని కర్ణాటక హైకోర్టు గురువారం తోసిపుచ్చింది. దీంతో వీరంతా శుక్రవారం ఈజీఎం నిర్వహించి రవీంద్రన్, ఆయన భార్య, సోదరుడిని బోర్డు నుంచి తొలగిస్తున్నట్టు తీర్మానించారు. ఈ సమావేశంగానీ, ఈ సమావేశం చేసే తీర్మానాలుగానీ చెల్లవని రవీంద్రన్, ఆయన కుటుంబ సభ్యులు హెచ్చరించినా.. వాటాదారులు ఈజీఎం నిర్వహించి మరీ వారిని బోర్డు నుంచి తొలగించడం విశేషం.

హైకోర్టు నిర్ణయమే తరువాయి: మరోవైపు కర్ణాటక హైకోర్టు మార్చి 13న ఈ కేసుపై విచారణ జరపనుంది. అప్పటి వరకు ఈ తీర్మానాల అమలు పక్కన పెట్టాలని హైకోర్టు కోరింది. దీంతో మార్చి 13న హైకోర్టు ఏ నిర్ణయం ప్రకటిస్తుందోనని సర్వత్రా ఆసక్తి వ్యక్తం అవుతోంది.

స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తల కోసం

యూకో బ్యాంక్ 'ఆరంభ్'



హైదరాబాద్: స్టార్టప్స్, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తోడ్పాటునందించేందుకు గాను యూకో బ్యాంక్.. ఆరంభ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, బయోనెస్ట్‌లో ఉన్న ఐకేపీ నాలెడ్జ్ పార్క్ భాగస్వామ్యంతో యూకో బ్యాంక్ దీన్ని నిర్వహించింది. స్టార్టప్స్, ఆర్థిక సంస్థల మధ్య ఉన్న అంతరాలను పూడ్చటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని యూకో బ్యాంక్ ఎంఎస్ఎంఈ డిపార్ట్‌మెంట్ జనరల్ మేనేజర్ ప్రేమ్ శంకర్ ఝా, బ్యాంక్ హైదరాబాద్ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ ఎన్ శ్రీకాంత్ వివరించారు. ఈ సందర్భంగా బ్యాంక్ అందిస్తున్న వివిధ పథకాలను బ్యాంక్ అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ నాలెడ్జ్ పార్క్ వైస్ ప్రెసిడెంట్ విశ్వనాథం, ఆస్పైర్ బయోనెస్ట్ సీఓఓ అనిల్ కే రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరంభ లాభాలు ఆవిరి

సెన్సెక్స్ 15 పాయింట్లు డౌన్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో ప్రామాణిక సూచీలు ఆద్యంతం తీవ్ర ఊగిసలాటలకు లోనయ్యాయి. ఐటీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలతో ఆరంభ లాభాలు ఆవిరై చివరికి అతిస్వల్ప నష్టాల్లో ముగిశాయి. దీంతో శుక్రవారం సెన్సెక్స్ 15.44 పాయింట్ల నష్టంతో 73,142.80 వద్ద స్థిరపడగా.. నిఫ్టీ 4.75 పాయింట్ల తగ్గుదలతో 22,212.70 వద్ద క్లోజైంది. ఇంట్రాడేలో మాత్రం సూచీ 22,297.50 వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 17 నష్టపోగా.. హెచ్‌సీఎల్ టెక్ 1.25 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బీఎస్ఈలోని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ సూచీలు మాత్రం వరుసగా 0.25 శాతం, 0.53 శాతం మేర పెరిగాయి.

● ఈ నెల 9తో ముగిసిన వారంలో విదేశీ మారక (ఫారెక్స్) నిల్వలు 524 కోట్ల డాలర్ల మేర తగ్గి 61,723 కోట్ల డాలర్లకు పరిమితమైనట్లు ఆర్‌బీఐ తెలిపింది.

జియో ఫైనాన్షియల్ @ రూ.2 లక్షల కోట్లు

మార్కెట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) ఆర్థిక సేవల అనుబంధ విభాగమైన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (జేఎఫ్ఎస్ఎల్) మార్కెట్ క్యాపిటలైజేషన్ తొలిసారిగా రూ.2 లక్షల కోట్లు దాటింది. బీఎస్ఈలో జేఎఫ్ఎస్ఎల్ షేరు ఇంట్రాడేలో 14.5 శాతం వృద్ధితో రూ.347 వద్ద సరికొత్త ఆల్‌టైం రికార్డు స్థాయిని నమోదు చేసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ సైతం రూ.27,922 కోట్ల పెరుగుదలతో రూ.2,20,459 కోట్లకు చేరుకుంది. ఎక్స్ఛేంజీలో ట్రేడింగ్ నిలిచేసరికి, కంపెనీ షేరు ధర 10.62 శాతం లాభంతో రూ.335 వద్ద ముగిసింది. దాంతో సంస్థ మార్కెట్ క్యాప్ రూ.2.12 లక్షల కోట్లుగా నమోదైంది. కాగా, ఆర్ఐఎల్ షేరు కూడా ఒక శాతానికి పైగా పెరిగి రూ.2,996.15 వద్ద సరికొత్త ఏడాది గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 0.78 శాతం లాభంతో రూ.2,986.35 వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.20.20 లక్షల కోట్లుగా నమోదైంది.



ఉల్లాసంగా ఉత్సాహంగా..

బెంగళూరు: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ఆరంభోత్సవం అట్టహాసంగా జరిగింది. ఈ వేడుకలో బాలీవుడ్ స్టార్ షారుక్ ఖాన్ ప్రధాన ఆకర్షణగా నిలిచాడు. తనదైన స్టైల్లో అందరికీ స్వాగతం పలికిన షారుక్. వేదికపై ఐదు జట్ల కెప్టెన్లతో డ్యాన్స్ చేయించాడు. ఆ తర్వాత పలు పాటలకు స్టెప్పులేశాడు. షారుక్‌తోపాటు నటులు షాహిద్ కపూర్, సిద్దార్థ్ మల్హోత్రా, వరుణ్ ధావన్, కార్తీక్ ఆర్యన్, టైగర్ ష్రాఫ్ కూడా తమదైన నృత్యాలతో అలరించారు.

ధీరజ్‌కు మూడో పతకం ఖాయం



బాగ్దాద్: ఆసియా ఆర్చరీ కప్ లెగ్-1 పోటీల రికర్వ్ వ్యక్తిగత విభాగంలో తెలుగు ఆర్చర్ బొమ్మదేవర ధీరజ్ ఫైనల్ చేరి మూడో పతకం ఖాయం చేసుకున్నాడు. అతడు ఇప్పటికే టీమ్ ఈవెంట్, మిక్స్‌డ్ ఈవెంట్లలో ఫైనల్ చేరిన సంగతి తెలిసిందే. శుక్రవారం జరిగిన పురుషుల వ్యక్తిగత విభాగం రికర్వ్ సెమీఫైనల్లో ధీరజ్ 7-1తో అమిర్‌ఖాన్ నడికొవ్ (ఉజ్బెకిస్థాన్) చిత్తుచేశాడు. ఆదివారం జరిగే ఫైనల్లో భారత్‌కే చెందిన వెటరన్ ఆర్చర్ తరుణ్‌దీప్ రాయ్‌తో అమీతుమీ తేల్చుకోనున్నాడు. మహిళల కాంపౌండ్ సెమీస్‌లో భారత ఆర్చర్ పర్నీత్ కౌర్ 148-147తో సహచర ఆర్చర్ అదితి గోపీచంద్‌ను ఓడించి ఫైనల్ చేరింది.

స్పోర్ట్స్



అమ్మ ఆశీర్వాదం తీసుకొని..

జాతీయ జట్టుకు ఎంపికవడంతో గురువారం తల్లి లదుమా దేవికి ఫోన్ చేసిన ఆకాష్. 'నేను రేపు టెస్టులో అరంగేట్రం చేస్తున్నా. నువ్వు రావాల్సిందే' అని చెప్పడంతో ఆమె మ్యాచ్‌కు హాజరైంది. కోచ్ ద్రవిడ్ చేతుల మీదుగా క్యాప్‌ను అందుకొన్న ఆకాశ్.. తర్వాత తల్లికి పాదాభివందనం చేసి ఆశీర్వాదం తీసుకున్నాడు. 'ఒకప్పుడు చాలా మంది నా కొడుకు ఎందుకూ పనికిరాడన్నారు. కానీ, ఈ రోజు మమ్మల్ని గర్వపడేలా చేశాడ'ని లదుమా సంతోషం వ్యక్తం చేసింది.

ఆఖరి బంతికి సిక్సర్

ముంబై సూపర్

హర్మన్, యాస్తిక అర్ధ శతకాలు

తొలి మ్యాచ్‌లో ఢిల్లీ ఓటమి



బెంగళూరు: ఆద్యంతం హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో సజన (6 నాటౌట్) ఆఖరి బంతికి సిక్స్ బాదడంతో.. మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో డిఫెండింగ్ చాంప్ ముంబై ఇండియన్స్ బోణీ చేసింది. శుక్రవారం జరిగిన లీగ్ ఆరంభ మ్యాచ్‌లో ముంబై 4 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఓడించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 5 వికెట్లకు 171 పరుగులు చేసింది. అలిస్ క్యాప్సీ (53 బంతుల్లో 8 ఫోర్లు, 3 సిక్స్‌లతో 75), జెమీమా రోడ్రిగ్స్ (24 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 42) దాటిగా ఆడారు. సివర్ బ్రంట్, అమేలియా కెర్ చెరో 2 వికెట్లు తీశారు. భారీ ఛేదనలో ముంబై ఓవర్లన్నీ ఆడి 173/6 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (34 బంతుల్లో 7 ఫోర్లు, సిక్స్‌తో 55), యాస్తిక భాటియా (45 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 57) అర్ధ శతకాలతో అదరగొట్టారు. అరుంధతి రెడ్డి, క్యాప్సీ చెరో 2 వికెట్లు పడగొట్టారు. చివరి ఓవర్‌లో ముంబై విజయానికి 12 పరుగులు కావాలి. అయితే, తొలి 5 బంతుల్లో 7 పరుగులిచ్చిన క్యాప్సీ.. పూజా వస్త్రాకర్ (1), హర్మన్‌ను అవుట్ చేసి ఉత్కంఠ రేపింది. చివరి బంతికి 5 రన్స్ అవసరమగా.. సజన (6 నాటౌట్) స్టన్నింగ్ సిక్స్‌తో మ్యాచ్‌ను ఫినిష్ చేసింది. హర్మన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

డబ్ల్యూపీఎల్‌లో నేడు

బెంగళూరు X యూపీ

రాత్రి 7.30 గం. నుంచి

స్పోర్ట్స్ 18, జియో సినిమాలో

సంక్షిప్త స్కోర్లు

ఢిల్లీ: 20 ఓవర్లలో 171/5 (క్యాప్సీ 75, జెమీమా 42, లానింగ్ 31, బ్రంట్ 2/33, కెర్ 2/43).

ముంబై: 20 ఓవర్లలో 173/6 (యాస్తిక 57, హర్మన్‌ప్రీత్ 55, కెర్ 24, అరుంధతి 2/27, క్యాప్సీ 2/23).

ఆసీస్‌దే టీ20 సిరీస్

రెండో మ్యాచ్‌లోనూ కివీస్ ఓటమి

ఆక్లాండ్: న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌లో వరుసగా రెండో మ్యాచ్‌లోనూ ఆస్ట్రేలియాదే పైచేయి అయింది. శుక్రవారం జరిగిన రెండో పోరులో ఆసీస్ 72 పరుగుల తేడాతో గెలిచి మరో మ్యాచ్ మిగిలుండగానే సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. మొదట ఆసీస్.. హెడ్ (45), కమ్మిన్స్ (28), మార్ష్ (26) రాణించడంతో 19.5 ఓవర్లలో 174 పరుగులకు ఆలౌటైంది. ఫెర్గూసన్ 4 వికెట్లు తీశాడు. ఛేదనలో జంపా (4/34) సహా ఆసీస్ బౌలర్లంతా సమష్టిగా సత్తా చాటడంతో కివీస్ 17 ఓవర్లలో 102 పరుగులకే కుప్పకూలింది. గ్లెన్ ఫిలిప్స్ (42) ఒక్కడే పర్వాలేదనిపించాడు.

చెలరేగిన శశికాంత్, నితీష్

ఇండోర్: పేసర్ కేవీ శశికాంత్ (4/37), ఆల్‌రౌండర్ నితీష్ రెడ్డి (3/50) చెలరేగడంతో మధ్యప్రదేశ్‌తో శుక్రవారం మొదలైన రంజీ క్వార్టర్‌ఫైనల్ పోరులో తొలి రోజు ఆంధ్ర ఆధిపత్యం కనబర్చింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన మధ్యప్రదేశ్.. మొదటి రోజు ఆట ముగిసేసరికి తొలి ఇన్నింగ్స్‌లో 81 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 234 పరుగులు చేసింది. ఓపెనర్లు యష్ దూబే (64), హిమాన్షు మంత్రి (49) రాణించారు. ప్రస్తుతం క్రీజులో సరనాష్ జైన్ (41), కుల్వంత్ (1) ఉన్నారు.

రూట్ నిలిచెన్



జో రూట్ (106 బ్యాటింగ్)

అజేయ శతకంతో అదుర్స్

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 302/7

ఆకాశ్‌కు మూడు వికెట్లు

భారత్‌తో నాలుగో టెస్టు

రాంచీ: సిరీస్ కోసం భారత్.. గెలిచి నిలిచేందుకు ఇంగ్లండ్.. ఈ రెండు జట్ల మధ్య నాలుగో టెస్టు ఆసక్తికరంగా ఆరంభమైంది. టీమిండియా పేసర్ ఆకాశ్ దీప్ (3/70) తన అరంగేట్రాన్ని చిరస్మరణీయం చేసుకున్న వేళ.. పర్యాటక జట్టు మొదటి సెషన్‌లోనే ఐదు వికెట్లు కోల్పోయిన తరుణాన.. రోజు ముగిసేలోగా రోహిత్ సేన బ్యాటింగ్ ఖాయమనిపించింది. కానీ వెటరన్ జో రూట్ (106 బ్యాటింగ్) బజ్‌బాల్‌ను పక్కనబెట్టి తన సహజశైలిని నమ్ముకుని క్రీజులో పాతుకుపోయాడు. అజేయ సెంచరీతో ఉన్న అతడికి బెన్ ఫోక్స్ (47), బెయిర్‌స్టో (38), రాబిన్సన్ (31 బ్యాటింగ్) సహకారమందించారు. ఫలితంగా తొలి రోజైన శుక్రవారం ఆట ముగిసేసరికి ఇంగ్లండ్ మొదటి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 7 వికెట్లకు 302 పరుగులు చేసింది.

ఆకాశ్ అదరహో..: టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్‌ను ఆకాశ్‌దీప్ తన పేస్‌తో బెంబేలెత్తించాడు. పది బంతుల వ్యవధిలోనే టాపార్డర్‌ను పెవిలియన్‌కు చేర్చాడు. దీంతో తొలి సెషన్ ముగిసేసరికే ఇంగ్లండ్ 112/5 స్కోరుతో కష్టాల్లో పడింది. నాలుగో ఓవర్‌లోనే ఓపెనర్ క్రాలే (42)ను ఆకాశ్ బౌల్డ్ చేసినా అది నోబ్‌గా తేలింది. అటు సిరాజ్ వేసిన ఇన్నింగ్స్ ఏడో ఓవర్‌లో క్రాలే 4,4,4,6తో 19 రన్స్ రాబట్టడంతో పరుగులు వేగంగా వచ్చాయి. పదో ఓవర్‌లో ఆకాశ్ అద్భుత బంతులతో విరుచుకుపడి డకెట్ (11), పోప్ (0) వికెట్లు తీశాడు. తన మరుసటి ఓవర్‌లోనే కచ్చితమైన లెంగ్త్‌తో విసిరిన బంతి క్రాలే బెయిల్స్‌ను ఎగరగొట్టడంతో తొలి గంటలోనే ఇంగ్లండ్ 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత బెయిర్‌స్టో వేగంగా ఆడాడు. నాలుగో వికెట్‌కు రూట్‌తో కలిసి 52 పరుగులు జోడించాక అశ్విన్ ఓవర్‌లో వెనుదిరిగాడు. ఇక జడేజా ఓవర్‌లో తక్కువ ఎత్తులో వచ్చిన బంతికి బెన్ స్టోక్స్ (3) ఎల్బీ కావడంతో జట్టు లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.

పాతుకుపోయాడు: తొలి సెషన్‌లో మన బౌలర్ల జోరు చూశాక ప్రత్యర్థి మిగిలిన ఐదు వికెట్లు నేలకూలేందుకు ఎంతో సమయం పట్టదనిపించింది. కానీ జరిగింది వేరు. సిరీస్‌లో తొలిసారిగా ఒక్క వికెట్ కోల్పోకుండా ఇంగ్లండ్ రెండో సెషన్‌ను ముగించగలిగింది. జో రూట్, ఫోక్స్ అత్యంత ఓపికతో అసలైన టెస్టు ఆటను ప్రదర్శిస్తూ అండగా నిలిచారు. స్పిన్, పేస్‌ను నింపాదిగా ఎదుర్కొంటూ బౌలర్లను విసిగించారు. ఈక్రమంలో ఆరో వికెట్‌కు 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. ఆఖరి సెషన్‌లో స్వల్ప వ్యవధిలో ఫోక్స్, హార్ట్‌లీ (13)లను సిరాజ్ అవుట్ చేశాడు. కానీ రూట్‌కు రాబిన్సన్ జత కలువడంతో ఇంగ్లండ్ మరో వికెట్ కోల్పోకుండా రోజును ముగించింది. అంతకుముందే రూట్ కెరీర్‌లో 31వ శతకం పూర్తి చేయడంతో పాటు జట్టు స్కోరును 300 దాటించాడు.

మూలాలకు కట్టుబడి..

29, 2, 5, 16, 18, 7.. ఆధునిక క్రికెట్ అత్యున్నత ఆటగాళ్లలో ఒకడిగా చెప్పుకొనే జో రూట్ బ్యాట్ నుంచి ఇటీవల వచ్చిన పరుగులు. ఆరు ఇన్నింగ్స్‌లో కేవలం 72 పరుగులతో తీవ్ర విమర్శలు ఎదుర్కొంటున్న వేళ.. అతడు తన మూలాలకు కట్టుబడి శతకం బాదేశాడు. వాస్తవానికి మెకల్లమ్ కోచ్‌గా వచ్చాక అతడి ఆట ఎత్తుపల్లాలను చూస్తోంది. బజ్‌బాల్ గేమ్ అతడి శైలికి ఏమాత్రం సరిపోదు. అటు భారత గడ్డపై ఆ వ్యూహాన్ని నమ్ముకుని ఇంగ్లండ్ దారుణంగా దెబ్బతింటోంది. నాలుగో టెస్టులోనూ తొలి సెషన్‌లోనే ఐదు వికెట్లు కోల్పోయిన గడ్డు పరిస్థితిలో జో రూట్ తన సంప్రదాయక ఆట తీరుతోనే జట్టు పరువు కాపాడాడు. 47/2 స్కోరు దగ్గర క్రీజులోకి వచ్చిన తను ఓవైపు వికెట్లు కోల్పోతున్నా ఏకాగ్రత చెదరనీయకుండా క్రీజులో పట్టుదలగా నిలిచాడు. తన కెరీర్‌లో మూడో నెమ్మదైన (219 బంతుల్లో) సెంచరీని పూర్తి చేసి.. తమ ఇన్నింగ్స్‌ను రెండో రోజుకు తీసుకెళ్లగలిగాడు. అందుకే శనివారం ఆటలో భారత్‌కు రూట్ వికెట్ అత్యంత కీలకం కానుంది.

1 భారత్‌పై ఎక్కువ టెస్టు సెంచరీ (10)లు చేసిన బ్యాటర్‌గా రూట్. స్టీవ్ స్మిత్ (9)ను అధిగమించాడు.

3 ప్రస్తుత తరంలో కోహ్లీ (80), వార్నర్ (49) తర్వాత అన్ని ఫార్మాట్లలో కలిపి ఎక్కువ సెంచరీ (47)లు చేసిన మూడో బ్యాటర్‌గా రూట్. రోహిత్ కూడా ఇన్నే చేశాడు.

1 ఒకే జట్టుపై వెయ్యి పరుగులు+100 వికెట్లు తీసిన తొలి భారత బౌలర్‌గా అశ్విన్.





ఆకాశ్ దీప్ (3/70)

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: క్రాలే (బి) ఆకాశ్ 42; డకెట్ (సి) జురెల్ (బి) ఆకాశ్ 11; పోప్ (ఎల్బీ) ఆకాశ్ 0; రూట్ (బ్యాటింగ్) 106; బెయిర్‌స్టో (ఎల్బీ) అశ్విన్ 38; స్టోక్స్ (ఎల్బీ) జడేజా 3; ఫోక్స్ (సి) జడేజా (బి) సిరాజ్ 47; హార్ట్‌లీ (బి) సిరాజ్ 13; రాబిన్సన్ (బ్యాటింగ్) 31; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 90 ఓవర్లలో 302/7. వికెట్ల పతనం:** 1-47, 2-47, 3-57, 4-109, 5-112, 6-225, 7-245. **బౌలింగ్:** సిరాజ్ 13-3-60-2; ఆకాశ్ దీప్ 17-0-70-3; జడేజా 27-7-55-1; అశ్విన్ 22-1-83-1; కుల్దీప్ 10-3-21-0; జైస్వాల్ 1-0-6-0.

కష్టాలు దాటుకొని..

ఖుమ్రా గైర్హాజరీలో జట్టులోకి సర్రున దూసుకొచ్చిన ఆకాశ్ దీప్.. అరంగేట్ర టెస్టులోనే మూడు వికెట్లతో సత్తా చాటి టీమిండియా నయా పేస్ సంచలనంగా మారాడు. ఆర్థికంగా కష్టాలు, కుటుంబంలో వరుస విషాదాలతో మూడేళ్ల ఆటకు దూరమైన ఇతడు.. మళ్లీ బంతి పట్టి రంజీలు, ఆ తర్వాత ఐపీఎల్, ఇప్పుడు టీమిండియాలోకి ఎంట్రీ ఇచ్చాడు. బిహార్‌లోని బడ్డీ గ్రామానికి చెందిన ఆకాశ్ తండ్రి రామ్‌జీ సింగ్ ప్రభుత్వ పాఠశాల టీచర్. చదువుపైనే దృష్టి పెట్టాలంటూ నాన్న ఎంత నచ్చజెప్పినా, తనకిష్టమైన క్రికెట్‌పైనే ఆసక్తి కనబరిచిన ఆకాశ్ బంధువు సహకారంతో స్థానిక అకాడమీలో చేరి ప్రతిభకు మెరుగులు దిద్దుకున్నాడు. కానీ, కుటుంబంలో జరిగిన వరుస విషాద ఘటనలతో మూడేళ్లపాటు ఆకాశ్ బంతి పట్టలేకపోయాడు. 2015లో నాన్న రామ్‌జీ పక్షవాతానికి గురై మరణించాడు. రెండునెలల తర్వాత అన్న ధీరజ్ కూడా అనారోగ్యంతో మృతిచెందాడు. దీంతో మానసికంగా ఆకాశ్ ఎంతగానో కుంగిపోయాడు. ఇదే సమయంలో ఆర్థిక కష్టాలు చుట్టుముట్టడంతో.. ఆదాయం కోసం ఇసుక రీచ్‌ల వద్ద ట్రక్కులు అద్దెకిచ్చే వ్యాపారం చేశాడు. ఇలా మూడేళ్ల గడిచిన తర్వాత మళ్లీ క్రికెట్‌పై దృష్టి సారించిన ఆకాశ్.. యునైటెడ్ క్రికెట్ క్లబ్ (యూసీసీ) ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ఆ తర్వాత బెంగాల్ అండర్-23 జట్టులో, అనంతరం రంజీల్లో మెరుగైన ప్రదర్శన చేసి ఐపీఎల్‌కు ఎంపికయ్యాడు. ఐపీఎల్‌లో బెంగళూరు, పంజాబ్ జట్ల తరఫున ప్రతిభ చాటుకున్న 2022లో ఆసియా క్రీడల జట్టులో స్థానం దక్కించుకున్నాడు. రంజీల్లో నిలకడైన ప్రదర్శనతో జాతీయ జట్టుకు ఆడాలన్న తన కలను సాకారం చేసుకున్నాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పులివెందుల గడ్డపైనే ఉంటా

- జగన్ ఇంటి పక్కనే ఉంటా... ఏం చేసుకుంటారో చేసుకోండి
- చేసిన తప్పు సరిదిద్దుకునేందుకే అప్రూవర్‌గా మారా
- సిద్ధం సభలో వివేకా హత్య గురించి జగన్ మాట్లాడరేం?
- అవినాశ్, జగన్ ఓట్ల కోసం వెళ్తే రాళ్లు వేసే పరిస్థితి ఉంది
- బెయిలుపై విడుదలైన దస్తగిరి వ్యాఖ్యలు



భర్త దస్తగిరికి దిష్టి తీస్తున్న షబానా

కడప(క్రైం), ఫిబ్రవరి 23: "తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయాలనుకుంటే నేను మరింత స్ట్రాంగ్ అవుతా.. భయపడేదే లేదు. పులివెందుల గడ్డపైనే ఉంటా. వైఎస్ జగన్ ఇంటి పక్కనే ఉంటా. ఏం చేసుకుంటారో చేసుకోండి" అని వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అన్నారు. రెండు వేర్వేరు కేసులకు సంబంధించి మూడు నెలలకు పైగా కడప సెంట్రల్ జైలులో ఉన్న ఆయన శుక్రవారం రాత్రి బెయిల్‌పై బయటకు వచ్చారు. ఈ సందర్భంగా దస్తగిరి మీడియాతో మాట్లాడారు. "నన్ను తప్పుడు కేసుల్లో జైలుకు పంపించారు. ఎర్రగుంట్లలో నేను ఎవరినీ కిడ్నాప్ చేయలేదు. మా కుటుంబం గురించి మాట్లాడేందుకు వెళితే అక్టోబరులో నాపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారి చాలా పెద్ద తప్పు చేశానని, నేను బతికుండటమే కష్టమని అన్నారు. ప్రెస్‌మీట్లు పెట్టి అప్పటి సీబీఐ అధికారి రాంసింగ్ కొట్టి చెప్పించారని చెప్పాలని సీఐ ఈశ్వరయ్య, డీఎస్పీలు బెదిరించడంతో పాటు ప్రలోభాలకు గురిచేశారు. అప్రూవర్‌గా మారినందుకే వైసీపీ నాయకులతో పాటు పోలీసులు కూడా నన్ను భయభ్రాంతులకు గురిచేసేందుకు ప్రయత్నిస్తున్నారు. భయపడే ప్రసక్తి లేదు. చేసిన తప్పు సరిదిద్దుకునేందుకే అప్రూవర్‌గా మారాను. అక్టోబరు 31న నాపై కేసు నమోదు చేయడంతో పాటు సీఐ తీవ్రంగా కొట్టారు. నన్నెందుకు అరెస్టు చేశారని అడిగినందుకు నా భార్యాబిడ్డలను కూడా జైలుకు పంపిస్తామన్నారు. నేను జైలుకు పోకుండా ఉండేందుకు మరో ఆప్షన్ ఉందని, ప్రెస్‌మీట్ పెట్టి వివేకా హత్యకు సంబంధించి సీబీఐ అధికారులు అలా చెప్పించారని చెబితే చాలు.. మిగతాది ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎంపీ అవినాశ్‌రెడ్డి చూసుకుంటారని చెప్పారు. నేను తిరస్కరించాను. జగన్ ప్రభుత్వంలోనే అప్రూవర్‌గా మారాను. ఈ ఘటనపై జగన్ ఆ రోజే ఎందుకు ప్రెస్‌మీట్ పెట్టలేదు. నాపై కోర్టుకు ఎందుకు వెళ్లలేదు? కౌన్సిలర్ రాజశేఖర్‌రెడ్డి మా ఇంటికి వెళ్లి జైలులో ఉన్న నన్ను చంపుతామని నా భార్యను బెదిరించారు. మనోహర్‌రెడ్డి వచ్చి మాట్లాడతారని చెప్పారు. వివేకాను హత్యచేసి ప్రజలను అమాయకులను చేసి ఓట్లు వేయించుకున్నారు. పీఏ కృష్ణారెడ్డిని లొంగదీసుకున్నట్లు నన్ను లొంగదీసుకోలేరు. వారు ఎన్ని స్కెచ్‌లు వేసినా భయపడే ప్రసక్తిలేదు. కేసులకు కూడా భయపడను. అన్నింటినీ ఎదుర్కొంటా. ఎవరితో అయినా ఎంతవరకైనా ఢీకొంటా. అప్రూవర్‌గా మారడం తప్పా? ఒకసారి అప్రూవర్‌గా మారాక చనిపోయే వరకూ అలాగే ఉంటా. మాట మార్చను. అవినాశ్ కానీ జగన్ కానీ ఓట్ల కోసం వెళితే రాళ్లు వేసే పరిస్థితి ఉంది. సిద్ధం సభల్లో జగన్ అన్నీ మాట్లాడుతున్నాడు. ప్రజలకు అవి చేశాం... ఇవి చేశాం... అని చెబుతున్నాడు. ఆ సభల్లో వివేకా హత్య గురించి జగన్ ఎందుకు మాట్లాడటం లేదు? నాకు సోమవారమే బెయిలు వచ్చినప్పటికీ దాన్ని రాజకీయం చేసి వేముల ఎస్ఐ కోర్టు కానిస్టేబుళ్లతో జడ్జి వద్దకు వెళ్లారు. మరుసటి రోజు ష్యూరిటీలతో నా భార్య వెళ్లింది. అయితే దస్తగిరి ఏ-3 కాదని, ఏ-1కు మార్చామని పోలీసులు చెప్పడంతో బెయిలు ఆలస్యమైంది. ఆన్‌లైన్ ఉన్న ఎఫ్ఐఆర్‌లో ఏ-3గా ఉన్న నన్ను ఏ-1గా ఎలా మార్చారో అర్థం కావడం లేదు. నేను బయట ఉంటే వైసీపీ నేతల బండారం బయటపడుతుందనే తప్పుడు కేసులతో లొంగదీసుకోవాలని చూస్తున్నారు. అణగదొక్కాలని చూస్తే భయపడే ప్రసక్తి లేదు. గతంలో దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కొడుకు చైతన్యరెడ్డి ఆసుపత్రి పేరు చెప్పి నా దగ్గరకు వచ్చాడు. తన తండ్రి జైలులో ఉన్నాడని, తమ రాజకీయ భవిష్యత్తు బాగుపడాలంటే చెప్పినట్లు వినాలని, ఎంత డబ్బయినా ఇస్తానని చెప్పాడు. వారి మాటలకు తలవంచే పరిస్థితి లేదని చెప్పాను" అని దస్తగిరి వివరించారు. జైలు నుంచి బయటికి వచ్చిన దస్తగిరికి ఆయన భార్య షబానా దిష్టి తీశారు. అనంతరం ఎస్కార్టుతో కారులో బయల్దేరి పులివెందులకు వెళ్లారు.

అయ్యో.. ఐఆర్!

(మొదటి పేజీ తరువాయి)

అసంపూర్తిగా ముగిశాయి. దీంతో ఏపీ జేఏసీ ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తామని స్పష్టం చేసింది. ఈ ప్రభుత్వ కాలం నెల, రెండునెలల్లో ముగిసిపోతుందని వచ్చే ప్రభుత్వంలో ఇచ్చే పీఆర్సీకి ఇప్పుడెలా గ్యారెంటీ ఇస్తుందని సంఘాల నేతలు మండిపడుతున్నారు. 11వ పీఆర్సీలో ఐఆర్ కన్నా తక్కువగా రివర్స్ పీఆర్సీ ఇచ్చిన జగన్ సర్కార్.. 12 పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ ఇవ్వాల్సి ఉండగా ఆ సంప్రదాయానికి తెరదించిందని వ్యాఖ్యానిస్తున్నారు.



ఉద్యోగ సంఘాల నాయకులతో చర్చలు జరుపుతున్న మంత్రి బొత్స, సలహాదారు సజ్జల, సీఎస్

సుదీర్ఘ చర్చలు

శుక్రవారం అమరావతి సచివాలయంలో ఉద్యోగ సంఘాల నేతలతో మంత్రుల కమిటీ భేటీ అయింది. సుదీర్ఘంగా చర్చలు జరిపింది. కానీ, ఫలితం మాత్రం కనిపించలేదు. సమావేశంలో మంత్రి బొత్స సత్యనారాయణ, ఏపీజేఏసీ చైర్మన్, కార్యదర్శులు బండి శ్రీనివాసరావు, సెక్రటరీ జనరల్ హృదయరాజు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో ఉన్న పలు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు. అనంతరం, మంత్రి బొత్స, ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. ఈ నెల 12న జరిగిన సమావేశంలో ఏఅంశాలైతే చెప్పారో మళ్లీ వాటినే వల్లివేశారని ఉద్యోగ సంఘాల నేతలు పెదవి విరిచారు. ఇది మరో చాయ్ బిస్కట్ సమావేశమేనని, ప్రయోజనం శూన్యమని పెదవి విరిచారు. సంప్రదాయంగా వస్తున్న ఐఆర్ ఇవ్వడం సాధ్యంకాదని తేల్చేశారన్నారు. బకాయిల చెల్లింపులపై గత సమావేశంలో చెప్పినట్లే మార్చి, జూలైలో చెల్లిస్తామన్నారని మండిపడ్డారు. కొన్ని అంశాలపై మళ్లీ చర్చించుకుని చెబుతామని వాయిదాల పర్వం కొనసాగిస్తున్నారని నాయకులు తెలిపారు.

ఐఆర్ మా విధానం కాదు: బొత్స

మధ్యంతర భృతి(ఐఆర్) ఇవ్వడం తమ ప్రభుత్వ విధానం కాదని మంత్రి బొత్స చెప్పారు. పూర్తి స్థాయిలో పీఆర్సీనే ప్రకటిస్తామని, ఈ అంశాన్నే ఉద్యోగులకు చెప్పామని అన్నారు. "పీఆర్సీ ఆలస్యం అయితే ఐఆర్ ఇస్తారు. కానీ, సరైన సమయంలో పీఆర్సీ ఇస్తామన్నప్పుడు ఐఆర్ ఎందుకు?" అని వ్యాఖ్యానించారు. గతంలో కరోనా వల్ల పీఆర్సీ ఆలస్యం అయినందున ఐఆర్ ఇచ్చామన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేస్తామన్నారు. వైసీపీ వచ్చిన తర్వాతే 14,250 వేల మంది ఉపాధ్యాయుల నియామకం జరిగిందని, మిగిలిన 6,100 ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. తాజా భేటీలో ప్రధానంగా ఐఆర్, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్, బకాయిలు, 2004 ముందు ఉద్యోగులకు ఓపీఎస్ అమలుపై చర్చ జరిగిందన్నారు. గతంలో చెప్పిన షెడ్యూల్ ప్రకారం మార్చిలో ఏయే బకాయిలు చెల్లిస్తామని చెప్పామో వాటికి కట్టుబడి ఉన్నామన్నారు. ఇప్పటికే చెల్లింపులు మొదలుపెట్టామని, మార్చి 31లోపు పూర్తి చేస్తామని తెలిపారు. అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌కు సానుకూలంగా ఉన్నామన్నారు. ఏపీ జేఏసీ చేపట్టే చలో విజయవాడ కార్యక్రమాన్ని విరమించుకోవాలని కోరినట్టు తెలిపారు. రాబోయే కాలంలో 'నో వేకెన్సీ' అనే విధానం తీసుకురానున్నట్టు తెలిపారు.

ఇది సరికాదు: బొప్పరాజు

దశాబ్దాలుగా వస్తున్న సంప్రదాయం ప్రకారం ఐఆర్ చెల్లించాలని కోరినట్టు ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఐఆర్ ఎందుకు? పీఆర్సీనే సెటిల్ చేద్దామనుకుంటున్నామని మంత్రి చెప్పినట్టు పేర్కొన్నారు. కానీ, ఇది సరికాదని బొప్పరాజు అన్నారు. మంత్రుల కమిటీలో చర్చించిన అంశాలు పరిష్కారం కానప్పుడు ఉద్యోగ సంఘాలు సీఎం దగ్గరకు వెళ్లే అవకాశం ఉందని, సీఎం వద్దకు తీసుకెళ్లాలని కోరగా.. సీఎం మాటే చెబుతున్నామని మంత్రుల కమిటీ చెప్పిందన్నారు. ఐఆర్ మాటే లేదని, కొత్త పీఆర్సీని జూలై 31 లోపే సెటిల్ చేసే సంప్రదాయానికి శ్రీకారం చుడతామని చెప్పారన్నారు. తాము డిమాండ్ చేసిన అంశాలపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. పీఆర్సీ కమిషన్‌ను నియమించనప్పుడు ఐఆర్ ఇవ్వడం సంప్రదాయంగా వస్తోందని దానికి ఈ ప్రభుత్వం తిలోదకాలు ఇచ్చిందన్నారు. "కారుణ్య నియామక వివరాలు జిల్లాల వారీగా తెప్పించుకుని త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఒప్పంద ఉద్యోగులను దశల వారీగా రెగ్యులర్ చేస్తామని చెప్పారు" అని బొప్పరాజు వివరించారు.

ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుంది: బండి

గత సమావేశంలో చెప్పిన వాటినే ప్రభుత్వం మళ్లీ చెప్పిందని, తమ ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందని ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బండి శ్రీనివాసరావు చెప్పారు. ప్రభుత్వం చెప్పిన వాటిపై జీవోలు ఇచ్చే వరకు ఉద్యమ కార్యాచరణ కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను, తర్వాత ఇచ్చే జీవోలను బట్టి తమ జేఏసీలో చర్చించుని తదుపరి నిర్ణయం ప్రకటిస్తామన్నారు. జూలై నాటికి పీఆర్సీని చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిందన్నారు. డీఏలకు సంబంధించి ఎలాంటి ప్రకటనా చేయలేదన్నారు.

చాలా నష్టపోయాం: సీపీఎస్ ఉద్యోగుల సంఘం

ఇప్పటికే చాలా నష్టపోయామని సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు రాజేశ్ అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఉద్యోగికీ ప్రభుత్వం రూ.5 లక్షల వరకు బకాయి పడిందని తెలిపారు. సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నాయకులు నాపా ప్రసాద్ మాట్లాడుతూ.. బకాయిలు వాయిదా వేసేందుకే సమావేశాలు పెడుతున్నారని అన్నారు. ఇప్పటి వరకు 10 జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశాలు జరిగినా ఏ ప్రయోజనం లేదని సచివాలయ ఉద్యోగి రామారావు అన్నారు.

బుర్ర ఉందా.. లేదా?

ఉద్యోగులపై బొత్స, సజ్జల అసహనం

ఎన్నికల కోడ్ రాక ముందే బకాయిలు చెల్లించాలన్న సీపీఎస్ ఉద్యోగులపై మంత్రి బొత్స, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అసహనం వ్యక్తం చేశారు. "బుర్ర ఉందా.. లేదా?" అని ప్రశ్నించారు. సచివాలయ సీపీఎస్ ఉద్యోగుల సంఘం నేతలు రాజేశ్, నాపా ప్రసాద్ తదితరులు శుక్రవారం మంత్రుల కమిటీ సమావేశానికి వస్తున్న మంత్రి బొత్స, సజ్జల, సీఎస్ జవహర్‌రెడ్డిలను సచివాలయంలోని రెండో బ్లాక్‌లో కలిసి వినతిపత్రం ఇచ్చారు. కోడ్ రాకముందే బకాయిలు చెల్లించండని విన్నవించారు. దీంతో బొత్స, సజ్జల ఉద్యోగులపై చిరుబుర్రులాడారు. 'కోడ్‌కి బకాయిల విడుదలకు సంబంధం ఏంటి? బుర్ర ఉందా లేదా' అని బొత్స మండిపడ్డారు. ఇలా రోడ్ల మీద తిరగొద్దు మీటింగ్‌కి వచ్చి మాట్లాడాలన్నారు. మాకు ఆహ్వానం లేదని జేఎస్‌సీలో ఉన్న సంఘాలకే అనుమతి ఉందని సీపీఎస్ ఉద్యోగ సంఘం నేతలు చెప్పారు. "అయితే రోడ్డు మీద తిరగడం మానేసి సాయంత్రం వరకు వేచి ఉండండి" అని సూచించి మంత్రి బొత్స చరచరా వెళ్లిపోయారు.

'పీఆర్సీ'కి ఉద్యోగుల కేటాయింపు

8 నెలల తర్వాత మేల్కొన్న ప్రభుత్వం

ఎన్నికల వేళ జగన్మాయ: ఉద్యోగులు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): "ఎన్నికలకు 6నెలల ముందు చేసే శంకుస్థాపనలను నమ్మొద్దు" అని విపక్ష నేతగా చెప్పిన ప్రస్తుత సీఎం జగన్.. ఇప్పుడు అచ్చం అవే పనులు చేస్తున్నారు. ఎప్పుడో ఎనిమిది నెలల కిందట ప్రకటించిన 12వ పీఆర్సీకి శుక్రవారం ఉద్యోగులను కేటాయించారు. దీనిపై ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు మండిపడుతున్నారు. ఇదంతా ఎన్నికలకు ముందు చేస్తున్న మరో మోసమేనని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 12వ పీఆర్సీని నియమిస్తూ 2023 జూలైలో ప్రభుత్వం జీవో ఇచ్చింది. ఉద్యోగులు పోరాడడంతో 7నెలల తర్వాత సచివాలయంలో పీఆర్సీకి కార్యాలయం కేటాయించింది. మళ్లీ నెల తర్వాత తాజాగా ఉద్యోగులను కేటాయించింది. ఇదంతా ఎన్నికల వేళ జగన్మాయగా ఉద్యోగులు పేర్కొంటున్నారు.



ఇదేం పైత్యం!

యాడికి, ఫిబ్రవరి 23: వైసీపీ నేతల జగన్ భక్తి వెర్రి తలలు వేస్తోంది. ఏకంగా ఆయన ఫొటోకు దండలే వేసేస్తున్నారు. అనంతపురం జిల్లా యాడికిలో శుక్రవారం వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో సీఎం జగన్ ఫొటోకు తాడిపత్రి వైసీపీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి పూల దండ వేశారు. స్థానిక నాయకులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. బతికున్న సీఎం ఫొటోకు దండవేయడాన్ని చూసి అక్కడి జనం ముక్కున వేలేసుకున్నారు. ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

పోలీసులకు పే రివిజన్ ప్రకటించండి

- గ్రేహౌండ్స్‌తో సమానంగా ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు అలవెన్సులు పెంచండి
- ఖాకీల సమస్యలపై ప్రభుత్వానికి డీజీపీ లేఖ

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యల్ని పోలీసు దళాల అధిపతి కేవీ రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. పోలీసు సిబ్బందికి ప్రత్యేక పే రివిజన్ ప్రకటించాలని, డిప్యూటీ తహసీల్దార్ల హోదాతో సమానంగా ఎస్ఐలకు గెజిట్ ర్యాంకు ఇవ్వాలని, హెడ్ కానిస్టేబుళ్ల కేడర్‌లో వివిధ పీఆర్సీల్లో ఉన్న అసమానతలు తొలగించాలని, డ్యూటీ కిట్ (రూ.500), రిస్క్ (రూ.1000), మోటర్ సైకిల్ (రూ.2వేలు) అలవెన్సులు పెంచాలని హోం శాఖ ముఖ్య కార్యదర్శికి రాసిన లేఖలో పేర్కొన్నారు. గ్రేహౌండ్స్ పోలీసులతో సమానంగా ఏపీఎస్పీ కానిస్టేబుళ్లకు రేషన్ అలవెన్స్ ఇవ్వాలని, యూనిఫామ్ అలవెన్స్ తెలంగాణతో సమానంగా (రూ.7,500) చెల్లించాలని, కొత్తగా ఏర్పడ్డ జిల్లాల్లో తొమ్మిది చోట్ల మెడికల్ ఆఫీసర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. తన లేఖకు అనుబంధంగా గత డిసెంబరులో రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం ఇచ్చిన 13 డిమాండ్ల వినతి పత్రాన్ని జత చేశారు. వీక్లీ ఆఫ్‌లు, సిబ్బంది కొరత లాంటి సమస్యలనీ ప్రస్తావించాల్సిందని పోలీసు సిబ్బంది గుర్తు చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఏదో మభ్య పెట్టేలా కాకుండా సమస్య పరిష్కరిస్తే చాలని ఆశిస్తున్నారు.

మీడియా రక్షణకు దేవుడున్నాడు: నారాయణస్వామి

తిరుమల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మీడియాపై దాడి చేయడం రైటా, రాంగా అని నేను మాట్లాడదలుచుకోలేదు' అని డిప్యూటీ సీఎం నారాయణస్వామి అన్నారు. తిరుమల శ్రీవారిని శుక్రవారం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. 'మీడియాకు రక్షణ ఇవ్వడానికి దేవుడున్నాడు. జర్నలిస్టులపై దాడి చేయడం మంచిదని చెప్పే వ్యక్తిని కాదు. వాళ్లు బాగుండాలని కోరుకుంటున్నా' అని నారాయణస్వామి అన్నారు.

పేదల సాక్షిగా పచ్చి అబద్ధాలు!



సభ జరుగుతుండగానే వెనుదిరిగిన మహిళలు

(మొదటి పేజీ తరువాయి)

అడ్డుకునేందుకు కొందరు కోర్టులో పిల్ వేశారని, అయినా ప్రక్రియ ఆగలేదని చెప్పారు. ఆ తర్వాత సీఎం జగన్ మాట్లాడుతూ.... రాష్ట్రవ్యాప్తంగా పేదలకు పట్టాలు పంపిణీ వ్యవహారాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు 1900 వరకు కేసులు వేశారని చెబుతూ, ఒంగోలు పట్టాలు పంపిణీపై కోర్టులో పిల్ వేసింది కూడా ఆ మహానుభావుడేనని వ్యాఖ్యానించారు. అయితే నిజానికి కోర్టులో పిల్ వేసింది వైసీపీ నేత సింగరాజు రాంబాబు. గత ఎన్నికల్లో బాలినేని పక్షాన పనిచేసిన ఆయన ఆ తర్వాత ఆయనకు దూరమై రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డికి చేరువయ్యారు. ప్రస్తుతం ఆయన వైసీపీలోనే కొనసాగుతున్నారు. ఇది ప్రజలకు, వైసీపీ నేతలకు తెలిసిన నగ్నసత్యం. వైసీపీ స్థానిక నేతల మధ్య విభేదాలే దీనికి కారణం. అయినా, జగన్ మాత్రం ఆ పాపం చంద్రబాబుదే అంటూ పదే పదే వ్యాఖ్యానించటంతో వేదిక మీద ఉన్న జిల్లాకు చెందిన వైసీపీ నేతలే గాక సభకు హాజరైన వారు కూడా నివ్వెరపోయారు. అలాగే.. చిత్తూరు జిల్లా పర్యటనలో భువనేశ్వరి ఎన్నికల కురుక్షేత్రానికి మనం సైసై అంటూ... మీరూ సై యేనా అని అడగ్గా ప్రజలు సైసై అంటూ నినాదాలు చేశారు. తన పోటీపై సరదా వ్యాఖ్యలు మాత్రమే చేశారు. దీనిని కూడా జగన్ వక్రీకరించారు. "నేను ఎన్నికలకు సిద్ధం అంటే బాబు భార్య మాత్రం మా ఆయన సిద్ధంగా లేడంటున్నారు. నేను సైసై అంటే బైబై అంటున్నారు" అని జగన్ వ్యాఖ్యానించారు తన అబద్ధాలతో ప్రజలను నమ్మించేందుకు తడబడుతూ విశ్వప్రయత్నం చేశారు. ఒంగోలులో పేదలకు పట్టాలు పంపిణీ కోసమే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేరును సీఎం కనీసం ప్రస్తావించలేదు. దీంతో బాలినేని, ఆయన అనుచరులు అసంతృప్తికి గురయ్యారు.

మాగుంట దూరం

సీఎం సభకు స్థానిక ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి గైర్హాజరయ్యారు. అసంతృప్తితో ఉన్న దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, గత ఎన్నికల అనంతరం వైసీపీలో చేరిన మాజీ మంత్రి శిద్దా రాఘవరావు కూడా సభకు దూరంగా ఉన్నారు. ఉమ్మడి ప్రకాశంలో ఎక్కడ సీఎం కార్యక్రమం జరిగినా వచ్చి కలిసే చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సభ వైపు రాలేదు. ఇటీవల పర్చూరు ఇన్‌చార్జిగా ఆయనను తొలగించి వేరేవారిని నియమించటం, చీరాల టికెట్ విషయంలో ఆయన మాటను పరిగణనలోకి తీసుకోకపోవటంతో ఆమంచి అసంతృప్తితో ఉన్నారు. అద్దంకి ఇన్‌చార్జిగా తొలగించిన కృష్ణచైతన్య ఆయన తండ్రి, మాజీ ఎమ్మెల్యే గరటయ్య, మరికొందరు నాయకులు కూడా సభకు దూరంగా ఉన్నారు.

చెవిరెడ్డే ఒంగోలు ఎంపీ అభ్యర్థి

స్థలాల పంపిణీ అనంతరం స్థానిక నాయకులను జగన్ కలిశారు. చంద్రగిరి ఎమ్మెల్యే, వైసీపీ రీజనల్ కోఆర్డినేటరు చెవిరెడ్డి భాస్కరరెడ్డిని చూపిస్తూ.. 'ఈయనే మీ ఎంపీ అభ్యర్థి' అని పరిచయం చేశారు. చివర్లో వెళ్లే సమయంలో జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మార్చి తర్లుపాడు జడ్పీటీసీ సభ్యురాలు వెన్నా ఇందిరను చేయాలని జగన్ చెప్పటంతో అందరూ విస్మయం చెందారు. వెంకాయమ్మ కుమారుడు శివప్రసాదరెడ్డికి దర్శి టికెట్‌ను ఖరారు చేశారు. సీఎం ఆకస్మిక నిర్ణయంతో హెలిప్యాడ్ వద్దకు వెళ్లిన శివప్రసాదరెడ్డి...తన తల్లిని మార్చవద్దని వేడుకున్నారని సమాచారం. అయితే, ఒకరికి ఒక పదవి చాలులే అంటూ సీఎం అక్కడనుంచి వెళ్లిపోయారు.

సీఎం మాట్లాడుతుండగానే జనం పరార్

సీఎం సభ కోసం కుటుంబం నుంచి కనీసం ఇద్దరు రావాలంటూ అధికారపార్టీ నేతలు బెదిరింపులకు దిగారు. కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, వలంటీర్లు, మెప్మా ఆర్పీల ద్వారా మహిళలను భారీగా తరలించారు అందుకోసం జిల్లాతోపాటు ఇతర జిల్లాలకు చెందిన 506 ఆర్టీసీ బస్సులు, జిల్లాకు చెందిన 385 స్కూలు బస్సులు, మరికొన్ని ప్రైవేటు బస్సులను డివిజన్ల వారీగా ఏర్పాటు చేశారు. చాలామంది మహిళలు.... సీఎం ప్రసంగం ప్రారంభం కాగానే అనేక మంది వెనుతిరిగి వెళ్లడం కనిపించింది. ఒంగోలు వెలుపల పొలాల్లో రవాణా, ఇతరత్రా ఎలాంటి సౌకర్యాలు లేని ప్రాంతం కావడంతో మహిళలు అవస్థలు పడాల్సి వచ్చింది. ఎఫ్ఏ-4, ప్రీఫైనల్ పరీక్షలకు గురువారం హాజరు కావడానికి ఆర్టీసీ బస్సులు లేక విద్యార్థులు అల్లాడారు.

టీడీపీ-జనసేన తొలి జాబితా నేడే

(మొదటి పేజీ తరువాయి)

రామకృష్ణుడు, నక్కా ఆనందబాబు, అనగాని సత్యప్రసాద్ తదితరులకు పిలుపు వెళ్లింది. విషయమేంటో వారికి చెప్పకపోయినా జాబితా విడుదలపైనే సమావేశం ఏర్పాటు చేసినట్లు భావిస్తున్నారు. అభ్యర్థుల జాబితాకు సంబంధించిన అంశాలను పార్టీ నేతలతో పంచుకునే ఆనవాయితీని చంద్రబాబు అనేక సంవత్సరాలుగా పాటిస్తున్నారు. వాస్తవానికి మెజారిటీ సీట్లకు సంబంధించి అభ్యర్థుల జాబితాలను టీడీపీ, జనసేన నాయకత్వాలు చాలా రోజుల కిందటే తయారుచేశాయి. వందకు పైగా సీట్లకు అభ్యర్థుల ఎంపిక కసరత్తు పూర్తిచేశాయి కూడా. ఈ నెల రెండో వారంలోనే వీటిని విడుదల చేయాలని అనుకున్నా.. బీజేపీ కొత్తగా ఈ కూటమిలోకి రావడంతో వాయిదావేశారు. బీజేపీ నాయకత్వంతో సీట్ల సర్దుబాటుపై చర్చలు జరుగుతుండడమే దీనికి కారణం. ఆ పార్టీకి ఇచ్చే సీట్ల విషయంలో దాదాపు స్పష్టత రావడంతో ఇప్పుడు జాబితా ప్రకటనకు సిద్ధమయ్యారు. అదీగాకఈ ముహూర్తం దాటితే మళ్లీ రెండు వారాల వరకూ మళ్లీ అంత మంచి ముహూర్తం లేదని పండితులు చెప్పడంతో శనివారాన్ని ఎంచుకున్నట్లు తెలిసింది. ఈ సమాచారాన్ని బీజేపీ జాతీయ నాయకత్వానికి కూడా చేరవేశారు. శుక్రవారం ఉదయం దీనికి సంబంధించి చర్చలు జరిగాయి. ఆ తర్వాత జాబితా విడుదల ప్రక్రియ వేగం పుంజుకుంది. 28వ తేదీన తాడేపల్లిగూడెంలో ఉమ్మడిగా భారీ బహిరంగసభకు ముందు కొందరు అభ్యర్థులను అధికారికంగా ప్రకటిస్తే ఉభయ పార్టీల శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంటుందని అంచనా వేస్తున్నారు.

ఇద్దరు, ముగ్గురి విషయంలోనే సమస్య

చంద్రబాబు కుప్పంలో, పవన్ కల్యాణ్ భీమవరంలో పోటీ చేయనున్నారు. అలాగే టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు (టెక్కలి), జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ (మంగళగిరి), జనసేన రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) చైర్మన్ నాదెండ్ల మనోహర్ (తెనాలి) పేర్లు కూడా తొలి జాబితాలో ఉంటాయని ఆయా పార్టీల వర్గాలు చెబుతున్నాయి. తమ సిటింగ్ ఎమ్మెల్యేలందరికీ సీట్లు ఇస్తామని చంద్రబాబు గతంలోనే ప్రకటించారు. ఇందులో ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలకు సంబంధించి కొన్ని సమస్యలు ఉన్నాయి. ఉదాహరణకు.. గత ఎన్నికల్లో విశాఖ ఉత్తరం నుంచి గెలిచిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఈసారి సీటు మారనున్నారు. ఆయనకు చీపురుపల్లి సీటివ్వాలని పార్టీ నాయకత్వం భావిస్తుండగా.. ఆయన మాత్రం భీమిలి సీటును ఆశిస్తున్నారు. రాజమహేంద్రవరం అర్బన్‌లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానిని నిలుపుతారా లేక ఆమె భర్త వాసు పోటీచేస్తారా అనే విషయంపై పార్టీ వర్గాల్లో కొంత ఉత్కంఠ నెలకొంది. ఇలాంటివి రెండు మూడు మినహాయించి మిగిలిన సిటింగ్ ఎమ్మెల్యేల పేర్లను తొలి జాబితాలోనే ప్రకటించే అవకాశముంది.

26న వైసీపీ ఎంపీ, ఇద్దరు ఎమ్మెల్యేల చేరిక

వైసీపీకి చెందిన ఒక ఎంపీ, ముగ్గురు ఎమ్మెల్యేలు 26న (సోమవారం) టీడీపీలో చేరనున్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో చంద్రబాబు సమక్షంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి టీడీపీ తీర్థం పుచ్చుకోనున్నారు.

రాష్ట్రం కోసమే జనసేన-టీడీపీ పొత్తు

- ఇరుపార్టీల నుంచి 500 మందితో సభావేదిక
- బహిరంగ సభకు 6 లక్షలమంది వచ్చే వీలు
- ఎన్నికలకోసం 2 హెలికాప్టర్లు ఎందుకు తెచ్చారు?
- పీఎంకు మాత్రమే ఉన్న వెసులుబాటు జగన్ కోసమా?
- బాధ్యులైన అధికారులను వదలం: నాదెండ్ల మనోహర్ హెచ్చరిక
- తాడేపల్లిగూడెంలో 28న జరిగే సభ ఏర్పాట్ల పరిశీలన



పశ్చిమ గోదావరి జిల్లా ప్రత్తిపాడులో సభాప్రాంగణాన్ని పరిశీలిస్తున్న నాదెండ్ల మనోహర్

పెంటపాడు, ఫిబ్రవరి 23: రాష్ట్రాభివృద్ధి కోసమే జనసేన, తెలుగుదేశం పార్టీ కలిశాయని జనసేన పార్టీ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఎలాంటి రాజకీయ లబ్ధిని ఆశించి తాము కలిసి పనిచేయడం లేదన్నారు. ఈ నెల 28న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం నియోజకవర్గం పెంటపాడు మండలం ప్రత్తిపాడు జాతీయ రహదారి సమీపంలో జరిగే టీడీపీ-జనసేన ఉమ్మడి భారీ బహిరంగ సభా ప్రాంగణాన్ని శుక్రవారం తాడేపల్లిగూడెం జనసేన ఇన్‌చార్జి బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి ఆయన సందర్శించారు. సభా వేదిక, హెలికాప్టర్ ల్యాండింగ్ ప్రదేశాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. సభకు సుమారు 6 లక్షల మంది వస్తారని అంచనా వేస్తున్నామని, ఆ దిశగానే ఏర్పాట్లు చేస్తున్నామని మనోహర్ తెలిపారు. సభా వేదికపై ఇరు పార్టీల నుంచి సుమారు 500 మంది ఆసీనులు కానున్నారన్నారు. బహిరంగ సభకు వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చే టీడీపీ, జనసేన అభిమానులు , ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వారిని సురక్షితంగా తరలించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన తెలిపారు. సీఎం జగన్ పాలనతో ప్రజలంతా విసిగిపోయారని మనోహర్ అన్నారు. ఎన్నికల అవసరాల కోసం రెండు హెలికాప్టర్లు సీఎం ఎందుకు తీసుకువచ్చారని ఆయన ప్రశ్నించారు. "ప్రధానికి మాత్రమే సెక్యూరిటీ కారణాల వల్ల రెండు హెలికాప్టర్లు వినియోగించే అవకాశం ఉంది. ఈ విషయాన్ని అంత సులభంగా వదలబోం. దీని వెనుక ఉన్న అధికారులదే బాధ్యత. మేం అధికారంలోకి వచ్చాక ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన ప్రతి అంశంపై నా సమగ్ర దర్యాప్తు జరిపిస్తాం" అని తెలిపారు. రాష్ట్ర సంక్షేమం కోసమే జనసేన అధినేత పవన్‌కల్యాణ్... బీజేపీ తో పొత్తు కుదుర్చుకునేందుకు చూస్తున్నారన్నారు. త్వరలోనే ఎన్డీ యే పొత్తుపై స్పష్టత వస్తుందని చెప్పారు. పొత్తులో భాగంగా ఎవరికి సీటు దక్కినా ఎవరూ బాధపడరని ఒక ప్రశ్నకు సమాధానంగా మనోహర్ తెలిపారు.



సీపీఎం, సీపీఐ కార్యదర్శులతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

రామభక్తులు హామీలు మరవడం మోసం కాదా?

- తిరుపతిలో పదేళ్లపాటు హోదాను ఇస్తానన్న మోదీ ఎందుకివ్వలేదు?
- హోదా కోసం జగన్ రాజీనామాలు చేయించారా: వైఎస్ షర్మిల

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): "రామభక్తులమని చెప్పుకొనే ప్రధాని నరేంద్ర మోదీ పవిత్ర పుణ్యక్షేత్రం తిరుపతిలో రాష్ట్రానికి పదేళ్లపాటు ప్రత్యేక హోదా అమలు చేస్తానంటూ ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడం మోసం కాదా?" అని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ప్రశ్నించారు. పవిత్ర ప్రదేశాల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకోనివారు రామభక్తులెలా అవుతారని నిలదీశారు. పదేళ్లపాటు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఒక్క విభజన హామీని కూడా నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ 2014లో అధికారంలోకి వస్తుందనే అంచనాతోనే ఏపీకి ప్రత్యేక హోదా హామీ ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే పోలవరం పూర్తయ్యేదని, రాజధాని నిర్మాణం జరిగేదని, ప్రత్యేక హోదా వచ్చేదని తెలిపారు. హోదా కోసమే బీజేపీతో పొత్తు కుదుర్చుకున్నామని చెప్పిన చంద్రబాబు హోదా ఇవ్వకపోయినా ప్రశ్నించలేదన్నారు. హోదా కోసం రాజీనామాలు చేసేందుకు సిద్ధమేనన్న వైసీపీ అధ్యక్షుడు జగన్.. ఈ ఐదేళ్లలో హోదా కోసం ఒక్కరితోనైనా రాజీనామా చేయించారా? అని షర్మిల నిలదీశారు. పైగా, ప్రజా ప్రయోజనాలను తాకట్టు పెట్టి జగన్ అధికారాన్ని అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2014లో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఉంటే.. విభజన హామీలన్నింటినీ అమలు చేసేదన్నారు. ఆంధ్రరత్నభవన్‌లో శుక్రవారం సీపీఎం, సీపీఐ నేతల బృందంతో ఎన్నికల పొత్తులపై షర్మిల చర్చించారు. ఈ సందర్భంగా ప్రజాసమస్యలపై కలసి పోరాడాలని మూడు పార్టీలూ నిర్ణయించాయి.

రైట్ పర్సన్..

మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి కాంగ్రెస్‌ను వీడటంపై షర్మిల స్పందిస్తూ.. "ఆళ్ల మాకు దగ్గరి మనిషి. ఆయనపై ఒత్తిడి ఉంది. ఆళ్ల ఎక్కడున్నా సంతోషంగా ఉండాలి. ఆళ్లకు చెల్లెలుగా ఆయన పరిస్థితిని అర్థం చేసుకోగలను. రైట్ పర్సన్(మంచి వ్యక్తి).. రాంగ్ ప్లేస్‌లో ఉన్నారు" అని షర్మిల వ్యాఖ్యానించారు. కాగా, ఈ నెల 26న అనంతపురంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వస్తున్నారని తెలిపారు.

సీట్ల సర్దుబాటుపై..

రాష్ట్రంలో బలమైన రాజకీయ పక్షాలుగా ఉన్న టీడీపీ, వైసీపీలను ఎదుర్కోవాలంటే కాంగ్రెస్, వామపక్షాలు కలిసి పోటీ చేయాల్సి ఉందని నాయకులు అభిప్రాయపడ్డారు. సీట్ల సర్దుబాటుపై మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. టీడీపీ, వైసీపీలు పోటీలు పడి ప్రధాని మోదీ ముందు సాగిలపడుతున్నాయని షర్మిల విమర్శించారు. బీజేపీ, టీడీపీ, వైసీపీలను ఢీకొట్టాలంటే కాంగ్రెస్‌కు ప్రస్తుతం ఉన్న బలం చాలదన్నారు. అందుకే, వామపక్షాలతో కలసి పోరాడాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు.

అన్ని పార్టీలకు ఆర్టీసీ బస్సులు కేటాయించాలి: టీడీపీ

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అన్ని పార్టీలకు సమానంగా ఆర్టీసీ బస్సులు కేటాయించాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డికి లేఖ రాశారు. 'వైసీపీ నిర్వహిస్తున్న 'సిద్ధం' సభలకు ఆర్టీసీ బస్సులు తరలిస్తున్నారు. 18న రాప్తాడులో జరిగిన 'సిద్ధం' సభకు 3 వేలు, జనవరి 27న భీమిలి సభకు 1,000, ఫిబ్రవరి 3న దెందులూరు సభకు 1,200 బస్సులు తరలించారు. దీంతో ప్రయాణికులు గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. బస్సులు లేక విద్యార్థులు తరగతులకు హాజరుకాలేకపోతున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ బస్సులు అన్ని పార్టీలకు సమానంగా కేటాయించేలా చర్యలు తీసుకోవాలి' అని కోరారు.

చందమామపై తొలి ప్రైవేటు ల్యాండర్

చరిత్ర సృష్టించిన అమెరికా కంపెనీ ఇంట్యూటివ్ మెషీన్స్



న్యూయార్క్, ఫిబ్రవరి 23: ఎప్పుడో 1972లో అపోలో 17 మిషన్‌లో భాగంగా అమెరికాకు చెందిన వ్యోమనౌక చంద్రుడిపై దిగింది! ఆ తర్వాత మళ్లీ ఇన్నేళ్లకు.. అంటే 52 సంవత్సరాలకు అమెరికా స్పేస్‌క్రాఫ్ట్ ఒకటి చందమామను ముద్దాడింది. అయితే అది నాసా వ్యోమనౌక కాదు. 'ఇంట్యూటివ్ మెషీన్స్' అనే ప్రైవేటు సంస్థ పంపిన నౌక. చందమామపై విజయవంతంగా వ్యోమనౌకను ల్యాండ్ చేసిన తొలి ప్రైవేటు అంతరిక్ష పరిశోధనల సంస్థగా చరిత్ర సృష్టించిందా కంపెనీ. హ్యూస్టన్‌కు చెందిన ఈ కంపెనీ అభివృద్ధి చేసిన ఒడిసస్ అనే ల్యాండర్.. భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున దాదాపుగా 5 గంటల సమయంలో చంద్రుడి దక్షిణ ధ్రువం వద్ద దిగింది. నాసా ఈ ల్యాండర్‌లో ఆరు శాస్త్రీయ పరికరాలను పంపింది. ఒడిసస్ ల్యాండర్ చందమామపై దిగే సమయంలో దాంట్లోని రేంజింగ్ లేజర్ల పనితీరు దెబ్బతింది. నౌక ఎంత ఎత్తులో ఉంది, దాని వేగం ఎంత అనే విషయాలు తెలుసుకోవడానికి అవి అత్యంత కీలకం. దీంతో ఈ మిషన్‌ను పర్యవేక్షించిన శాస్త్రజ్ఞులు.. ల్యాండర్‌లో నాసా ప్రయోగాత్మకంగా పంపిన లేజర్లను నేవిగేషన్ కంప్యూటర్లకు అనుసంధానం చేయడంతో ఎట్టకేలకు ల్యాండయింది. దిగిన తర్వాత కొద్దిసేపటిదాకా దాన్నుంచి ఎలాంటి సంకేతాలూ రాకపోవడంతో అంతా ఆందోళన చెందారు. కాసేపటి తర్వాత దాన్నుంచి బలహీనంగానైనా ఒక సిగ్నల్ రావడంతో ఊపిరిపీల్చుకుని.. సంబరాల్లో మునిగిపోయారు. ఒడిసస్ ప్రస్తుతం చందమామపై స్థిరంగా ఉందని.. డేటాను, చిత్రాలను పంపుతోందని ఇంట్యూటివ్ మెషీన్స్ వెల్లడించింది. కాగా.. దీనికన్నా ముందు చందమామపై దిగిన వ్యోమనౌకలన్నీ ఆయా దేశాల ప్రభుత్వ అంతరిక్ష పరిశోధన సంస్థలు పంపినవే.

సౌరగాలి ప్రభావాన్ని గుర్తించిన 'పాపా'

ఆదిత్య-ఎల్ 1 మిషన్ మరో ముందడుగు



సూళ్లూరుపేట, ఫిబ్రవరి 23: ఇస్రో తొలి సోలార్ మిషన్ ఆదిత్య-ఎల్1 ఉపగ్రహంలోని ప్లాస్మా ఎనలైజర్ ప్యాకేజీ ఫర్ ఆదిత్య (పాపా) పేలోడ్ విజయవంతంగా పనిచేస్తోంది. ఇందులో ఉన్న అధునాతన సెన్సర్లు ఈ నెల 10, 11వ తేదీల్లో సంభవించిన పరిణామాలతోపాటు కరోనల్ మాస్ ఎజెక్షన్ల (సీఎస్ఈ) ప్రభావాన్ని గుర్తించినట్లు ఇస్రో ఎక్స్‌లో తెలిపింది. పాపా పేలోడ్‌లో రెండు సెన్సర్లను ఏర్పాటు చేశారు. అందులో ఎలక్ట్రాన్లను కొలవడానికి సోలార్ విండ్ ఎలక్ట్రాన్ ఎనర్జీ ప్రోబ్ (స్వీప్), అయాన్‌లను కొలవడానికి సోలార్ విండ్ అయాన్ కంపోజిషన్ ఎనలైజర్ (స్వీకార్) ఉన్నాయి. రెండు సెన్సర్లు సౌర పవన కణాలు ఏ దిశ నుంచి వస్తున్నాయో గుర్తిస్తాయి. ఈ సెన్సర్లు గతేడాది డిసెంబరు 12 నుంచి పని చేస్తున్నట్లు ఇస్రో తెలిపింది. ఈ కాలంలో పాపా పరిశీలనలు ఎలక్ట్రాన్లు, అయాన్ల గణనలో ఆకస్మిక పెరుగుదలను గుర్తించినట్లు పేర్కొంది. ఈ నెల 10, 11వ తేదీల్లో కూడా సౌరగాలిలో స్వల్ప వ్యత్యాసాలను గుర్తించినట్లు వెల్లడించింది. ఇదిలా ఉండగా, ఈ నెల 17న షార్ నుంచి జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపిన ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహ కక్ష్యను శాస్త్రవేత్తలు విజయవంతంగా పెంచారు. ప్రస్తుతం జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ లో ఉన్న ఇన్‌శాట్-3డీఎస్‌ను భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని జియో ఆర్బిట్ (భూ స్థిర కక్ష్య)లోకి ప్రవేశ పెట్టారు. ఈ నెల 28న ఉపగ్రహం నిర్దేశిత తుది కక్ష్యలోకి చేరనుంది.

13 తర్వాత లోక్‌సభ షెడ్యూల్!

» 543 స్థానాలకు 7 దశల్లో పోలింగ్?

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: గట్టిగా ఇరవై రోజుల్లో లోక్‌సభ ఎన్నికల తేదీలు వెలువడనున్నాయి. మార్చి 13తర్వాత ఏ క్షణమైనా ఎలక్షన్ షెడ్యూల్ వెలువడే అవకాశముందని కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) వర్గాలు శుక్రవారమిక్కడ తెలిపాయి. ఎన్నికల ప్రధాన కమిషనర్ రాజీవ్‌కుమార్ సారథ్యంలో కమిషనర్లు, ఉపకమిషనర్లు ఎన్నికల సన్నద్ధతపై ప్రస్తుతం రాష్ట్రాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మార్చి 13లోపే ఈ పర్యటనలు పూర్తవుతాయి. అవి ముగియగానే షెడ్యూల్ విడుదలవుతుందని ఈసీ వర్గాలు పేర్కొన్నాయి. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాలకు ఏడు దశల్లో పోలింగ్ జరిగే అవకాశం ఉంది. అర్హులైన ఓటర్ల సంఖ్య 96.98 కోట్లు. ప్రపంచంలోనే ఇది అత్యధికం. 18-19 ఏళ్ల నవయువత 1.85 కోట్ల మంది వరకు ఓటు నమోదు చేసుకున్నట్లు ఈసీ వర్గాలు తెలిపాయి. ఈసారి లోక్‌సభ ఎన్నికల సజావు నిర్వహణకు కృత్రిమ మేధ (ఆర్టిఫియల్ ఇంటెలిజెన్స్-ఏఐ)ని ఈసీ వినియోగించనుంది. సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫాంలలో తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే ప్రకటనలను పసిగట్టి తక్షణమే వాటిని తొలగించేందుకు వీలుగా కమిషన్‌లో ప్రత్యేక ఏఐ విభాగాన్ని ఏర్పాటుచేయడం గమనార్హం.

లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి కన్నుమూత



ముంబై, ఫిబ్రవరి 23: లోక్‌సభ మాజీ స్పీకర్ మనోహర్ జోషి (86) కన్నుమూశారు. ఈ నెల 21న గుండెపోటు రావడంతో ఆయన్ను ముంబైలోని హిం దూజా ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతున్న జోషి శుక్రవారం ఉదయం చనిపోయారు. మనోహర్ జోషి 1995-99 మధ్యకాలంలో మహారాష్ట్ర సీఎంగా పనిచేశారు. 2002-04 మధ్య కేంద్రంలో వాజపేయి ప్రభుత్వం ఉన్నప్పుడు లోక్‌సభ స్పీకర్‌గా పనిచేశారు. మనోహర్ జోషి మృతిపట్ల రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ, స్పీకర్ ఓంబిర్లా, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ సంతాపం ప్రకటించారు.

దాడుల భయంతోనే బీజేపీకి విరాళాలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర దర్యాప్తు సంస్థల దాడులకు గురైన పలు కార్పొరేట్ సంస్థలు, బీజేపీ మధ్య పరస్పర ప్రయోజనాలు సమకూర్చుకునే సంబంధాలు (క్విడ్ ప్రో కో) ఉన్నాయని కాంగ్రెస్ ఆరోపించింది. వీటిపై లోతుగా దర్యాప్తు చేయించాలని డిమాండు చేసింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లేఖ రాశారు. ఈడీ, ఐటీ, సీబీఐలు దాడులు చేసిన తర్వాతనే ఆ కార్పొరేట్ సంస్థలు బీజేపీకి విరాళాలిచ్చాయని కొన్ని ఆన్‌లైన్ వార్తా సంస్థలు వెల్లడించిన నేపథ్యంలో ఈ లేఖ రాసినట్లు వేణుగోపాల్‌తోపాటు పార్టీ మీడియా ఇన్‌ఛార్జి జైరాం రమేశ్ విలేకరుల సమావేశంలో తెలిపారు. 2018-19, 2022-23 ఆర్థిక సంవత్సరాల మధ్య దాదాపు 30 కంపెనీలు బీజేపీకి దాదాపు రూ.335 కోట్లు విరాళాలుగా ఇచ్చినట్లు ఈ వార్తా సంస్థలు వెల్లడించాయి. దర్యాప్తు సంస్థలు దాడులు చేసిన తర్వాతే ఆ కంపెనీలు విరాళాలు ఇచ్చినట్లు పేర్కొన్నాయి.

మహారాష్ట్రలో 39 సీట్లపై 'ఇండియా'అవగాహన

ముంబై, ఫిబ్రవరి 23: రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి మహారాష్ట్రలో సీట్ల సర్దుబాటుపై 'ఇండియా' కూటమిలో ఓ అవగాహన ఏర్పడింది. మొత్తం 48 స్థానాలకుగానూ 39 స్థానాలపై కాంగ్రెస్, శివసేన(యూబీటీ), ఎన్సీపీల మధ్య ఒప్పందం కుదిరినట్లు తెలిసింది. మిగిలిన 9 స్థానాలకు సంబంధించి చర్చలు కొనసాగుతుండగా, వీటిలో 8 సీట్ల విషయంలో కూటమిలో విభేదాలున్నాయి. మరోవైపు పశ్చిమబెంగాల్‌లో సీట్ల సర్దుబాటుపై తృణమూల్ కాంగ్రెస్‌తో కాంగ్రెస్ పార్టీ మరోసారి చర్చలకు సిద్ధమయినట్లు తెలిసింది. బెంగాల్‌లోని మొత్తం 42 సీట్లకు కాంగ్రెస్ 5 సీట్లు అడుగుతుండగా రెండే సీట్లు ఇస్తామని మమతాబెనర్జీ స్పష్టం చేశారు.

ప్రతివాదిగా సంబంధంలేని అధికారా..!

» మీ అజాగ్రత్తకు 30 వేలు చెల్లించండి.. పిటిషనర్‌పై హైకోర్టు ఆగ్రహం

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కోర్టు ధిక్కరణ కేసులో సంబంధం లేని అధికారిని ప్రతివాదిగా చేర్చి కోర్టుకు పిలిచేలా చేసిన ఓ పిటిషనర్‌పై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఛైర్మన్, ఎండీని ముంబై నుంచి ధిక్కరణ కేసులో కోర్టుకు పిలిపించేందుక కారణమైన పిటిషనర్‌కు రూ.30 వేలు ఖర్చులు విధించింది. కోర్టుధిక్కరణ కేసుల్లో అధికారులను ప్రతివాదులుగా చేర్చేటప్పుడు జాగ్రత్తగా ఉండాలని పిటిషనర్లు, న్యాయవాదులకు సూచించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ శుక్రవారం ఆదేశాలిచ్చారు. ఎలాంటి విచారణ లేకుండా సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్ తనను సర్వీసు నుంచి తొలగించడాన్ని సవాల్ చేస్తూ సీసీఐ గుంటూరు బ్రాంచ్‌కు చెందిన జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్ కే వికాస్ గత ఏడాది హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన న్యాయస్థానం మార్చి 31న తొలగింపు ఉత్తర్వులపై స్టే విధించింది. కోర్టు ఉత్తర్వులను అధికారులు పట్టించుకోకపోవడంతో వికాస్ కోర్టుధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. సీసీఐ చీఫ్ జనరల్ మేనేజర్‌గా లలిత్‌కుమార్ గుప్తా, గుంటూరు బ్రాంచ్ సీసీఐ మేనేజర్ స్వప్నిల్, పూర్వ మేనేజర్ సాయి ఆదిత్యను ప్రతివాదులుగా చేర్చారు. ధిక్కరణ పిటిషన్‌పై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం అధికారుల హాజరుకు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ముంబయి నుంచి లలిత్‌కుమార్ గుప్తా శుక్రవారం హైకోర్టుకు హాజరయ్యారు. ఆయన తరఫు న్యాయవాది స్పందిస్తూ లలిత్‌కుమార్ గుప్తా సీసీఐ ఛైర్మన్, ఎండీగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రతివాది తప్పుగా చీఫ్ జనరల్ మేనేజర్‌గా చేర్చారన్నారు. దీంతో సంబంధంలేని అధికారిని ప్రతివాదిగా చేర్చి కోర్టుకు పిలిపించేలా చేశారని న్యాయమూర్తి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

ఆరోపణలు ఊహాజనితం

» ఏజీ శ్రీరామ్, స్టాండింగ్ పిటిషన్‌లో హైకోర్టు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): 'అధికారాన్ని దుర్వినియోగం చేశారు. అవినీతికి పాల్పడ్డారు. అడ్వకేట్ జనరల్(ఏజీ) ఎస్ శ్రీరామ్, స్టాండింగ్ కౌన్సిల్ మనోహర్‌రెడ్డిపై సీబీఐ విచారణకు ఆదేశించండి' అని కోరుతూ న్యాయవాది గుండాల శివప్రసాద్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. పిటిషనర్ చేసిన ఆరోపణలు ఊహాజనితం, అనుమానంతో కూడినవని పేర్కొంది. గతంలో లా ఆఫీసర్‌గా నియమితుడైనట్లు పిటిషనర్ ఒప్పుకున్నాడని గుర్తు చేసింది. ఏజీగా శ్రీరామ్ వ్యవహరిస్తున్న సమయంలో శివప్రసాద్‌రెడ్డిని లా ఆఫీసర్ పోస్టు నుంచి తొలగించారని పేర్కొంది. స్టాండింగ్ కౌన్సిల్ మనోహర్‌రెడ్డి రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేసే న్యాయవాది కాదని, మంచి ట్రాక్ రికార్డు లేదని పిటిషనర్ చేసిన ఆరోపణలు ఆయనను అప్రతిష్ఠ పాలుచేసేవిగా ఉన్నాయని అభిప్రాయపడింది. ఈ తరహా శైలితో వ్యాజ్యాలు దాఖలు చేసే పిటిషనర్లకు భారీగా ఖర్చులు విధించాలని పలుమార్లు సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చిందని గుర్తు చేసింది. ప్రస్తుత వ్యాజ్యంలో పిటిషనర్‌కు రూ.లక్ష ఖర్చు విధించాల్సి ఉందని, అయితే న్యాయవాది వృత్తిలో ఉన్న వ్యక్తి పార్టీ ఇన్ పర్సన్‌గా హాజరై వాదనలు వినిపించినందున ఆ పని చేయడం లేదని పేర్కొంది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

యుద్ధానికి దూరంగా ఉండండి

త్వరలోనే స్వదేశానికి రప్పిస్తాం

» రష్యా యుద్ధంలో ఇరుక్కున్న భారతీయులకు కేంద్రం భరోసా

» సైన్యంలో సహాయకుడి ఉద్యోగం పేరిట ఏజెంట్ల మోసం

» బాధితుల్లో ఇద్దరు తెలంగాణ వాళ్లు



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: ఏజెంట్ల మాయ మాటలు నమ్మి రష్యా సైన్యంలో సహాయకులుగా చేరిన వంద మందికిపైగా భారతీయులు ఉక్రెయిన్‌పై యుద్ధంలో ఇరుక్కుపోయారనే వార్తలపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. భారతీయులు ఆ యుద్ధానికి దూరంగా ఉండాలని హెచ్చరించింది. అంతేకాక, వీలైనంత త్వరలో అందరినీ స్వదేశానికి రప్పిస్తామని భరోసా ఇచ్చింది. ఇందుకు సంబంధించి కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైశ్వాల్ శుక్రవారం ఓ ప్రకటన చేశారు. "రష్యా సైన్యంలో సహాయకుల ఉద్యోగానికి కొందరు భారతీయులు ఒప్పందాలపై సంతకాలు చేసి వెళ్లినట్టు తెలిసింది. అలా వెళ్లిన వారిని స్వదేశానికి రప్పించేందుకు భారత రాయబార కార్యాలయం రష్యాలోని సంబంధిత వర్గాలతో సంప్రదింపులు జరుపుతోంది. అప్పటిదాకా భారతీయులు జాగ్రత్తగా ఉండడంతోపాటు యుద్ధానికి దూరంగా ఉండాలని కోరుతున్నాం" అని జైశ్వాల్ పేర్కొన్నారు. కాగా, సైన్యంలో సహాయకుడి ఉద్యోగం, ఆయుధం పట్టుకోవక్కర్లేదు, భారీ వేతనమని ఏజెంట్లు చెప్పిన మాటలు నమ్మి తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, జమ్మూకశ్మీర్, పంజాబ్ రాష్ట్రాలకు చెందిన యువకులు రష్యా వెళ్లారు. వీళ్లంతా ఓ ఏడాది పాటు కచ్చితంగా ఉద్యోగంలో ఉండాలనే ఒప్పందంపై సంతకం చేసి నెలకు రూ.1.95 లక్షల వేతనానికి పనిలో చేరారు. శిక్షణ అనంతరం అక్కడి అధికారులు వీరిని వేర్వేరు సైనిక స్థావరాలకు పంపారు. ఇలా వెళ్లిన వారిలో కొందరు రష్యా సైన్యంతో కలిసి బలవంతంగా యుద్ధంలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలో కొందరికి బుల్లెట్ గాయాలు అయ్యాయి. దీంతో తాము మోసపోయామని స్వదేశానికి రప్పించాలని కోరుతూ బాధితుల్లో పలువురు సోషల్ మీడియాలో వీడియోలు పెట్టారు. దీంతో ఆయా యువకుల కుటుంబాలు తీవ్ర ఆందోళన చెందుతున్నాయి.ఇలా, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన వారిలో నారాయణపేటకు చెందిన మహ్మద్ సుఫియాన్‌తోపాటు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అస్ఫాన్ ఉన్నారు. ఇక, రష్యా-ఉక్రెయిన్ యుద్ధంలో ఇరుక్కుపోయిన 12 మంది భారతీయులను స్వదేశానికి రప్పించాలని కోరుతూ హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్రానికి ఇప్పటికే లేఖ రాశారు. తెలంగాణ, కర్ణాటక, గుజరాత్, యూపీ, కశ్మీర్‌కు చెందిన వారు యుద్ధంలో ఇరుక్కుపోయారన్నారు. ముంబై, దుబాయ్ కేంద్రంగా పని చేస్తున్న ఏజెంట్లు యువతను మోసం చేశారని ఆరోపించారు.

మా బిడ్డలను రక్షించండి!



సయ్యద్ సూఫియాన్

నారాయణపేట టౌన్, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రష్యా యుద్ధంలో చిక్కుకుపోయిన ఇద్దరు తెలంగాణ యువకుల గురించి వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఎలాగైనా తమ బిడ్డలను కాపాడాలని వారి తల్లిదండ్రులు అర్థిస్తున్నారు. ఈ ఇద్దరు యువకుల్లో ఒకరు నారాయణపేట జిల్లా కేంద్రానికి చెందిన సయ్యద్ సూఫియాన్ కాగా, మరొకరు హైదరాబాద్‌కు చెందిన మహ్మద్ అస్ఫాన్. వీరిద్దరూ బాబా అనే వ్యక్తి చేతిలో మోసపోయి రష్యాకు వెళ్లారు. సూఫియాన్ ఇంటర్ చదువుకొని జీవనోపాధి కోసం 2021లో దుబాయికి వెళ్లాడు. అక్కడ ఓ హోటల్‌లో పని చేసేవాడు. అక్కడ బాబా అనే వ్యక్తి పరిచయమై రష్యాకు వెళ్తే బాగా జీతం వస్తుందని నమ్మించాడు. రూ.3 లక్షలు ఇవ్వాలని చెప్పగా సూఫియాన్ కుటుంబీకులు అప్పుచేసి ఆ మొత్తం బాబాకు చెల్లించారు. సూఫియాన్ డిసెంబరులో దుబాయి నుంచి రష్యాకు వెళ్లాడు. అక్కడ సెక్యూరిటీ ఉద్యోగం అని చెప్పి ఆర్మీలో చేర్చారు. మహ్మద్ అస్ఫాన్ కొన్నాళ్ల క్రితం సామాజిక మాధ్యమాల ద్వారా షార్జాలో ఉండే ఫైసల్‌ఖాన్ అలియాస్ బాబాను సంప్రదించాడు. రష్యాలో సెక్యూరిటీ గార్డు, హెల్పర్ వంటి ఉద్యోగం ఇప్పిస్తానంటూ బాబా చెప్పిన మాటలు నమ్మి రూ.3 లక్షలు పంపాడు. గత ఏడాది నవంబర్ 12న అస్ఫాన్ చెన్నై విమానాశ్రయం నుంచి షార్జా మీదుగా రష్యాకు వెళ్లాడు. అక్కడ ఓ మాల్‌లో సెక్యూరిటీ గార్డుగా పని చేయాల్సి ఉంటుందని రష్యన్ భాషలో రాసిన అగ్రిమెంట్‌పై సంతకం చేయించి, శిక్షణ తర్వాత అతన్ని ఉక్రెయిన్ సరిహద్దుల్లోకి పంపించారు. డిసెంబర్ 13 వరకు తమతో మాట్లాడిన అస్ఫాన్ ఆ తరువాత మాట్లాడలేదని కుటుంబసభ్యులు చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తమ బిడ్డలను ఎలాగైనా రక్షించాలని కోరుకుంటున్నారు.

సరోగసీ నిబంధనల్లో సవరణలు

» ఇకపై దాతల నుంచీ అండం, వీర్యం

» కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: సరోగసీ ద్వారా తల్లిదండ్రులు కావాలని కలలు కంటున్న దంపతులకు కేంద్ర ప్రభుత్వం తీపికబురు చెప్పింది. సరోగసీ-2022 నిబంధనలకు తాజాగా కొన్ని సవరణలు చేసింది. గత నిబంధనల ప్రకారం.. పిల్లలు పుట్టే అవకాశం లేని వివాహిత జంటలు మాత్రమే సరోగసీని ఉపయోగించుకోవాలి. సరోగసీకి వినియోగించే అండం, వీర్యం వారివి లేదా వారి దగ్గరి బంధువులవి అయి ఉండాలి. కానీ, సవరించిన నిబంధనల ప్రకారం.. ఇప్పుడు వివాహిత జంటలో ఒక భాగస్వామి అండం లేదా వీర్యాన్ని వినియోగించలేని పరిస్థితి ఎదురైనప్పుడు.. భార్య లేదా భర్త అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారని జిల్లా మెడికల్ బోర్డు ధ్రువీకరిస్తే.. వారు సరోగసీ కోసం దాత అండం లేదా వీర్యాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతి ఇచ్చారు. వాస్తవానికి అండం, వీర్యం రెండూ ఉద్దేశించిన జంట నుంచి రావాలనే నియమాన్ని 2023లో ప్రవేశపెట్టారు. దానికి ముందు.. అండాలను దానం చేయడానికి మాత్రమే నిబంధనలు అనుమతించేవి. వీర్య దానానికి అవకాశం ఉండేది కాదు. అయితే.. పునరుత్పత్తి వ్యవస్థను ప్రభావం చేసే సమస్యలున్న మహిళ.. దాత అండాన్ని స్వీకరించి అద్దె గర్భం ధరించడానికి గతేడాది సుప్రీం కోర్టు అనుమతించింది. ఈ కీలక నిర్ణయాన్ని అనుసరించి సరోగసీ నిబంధనల్లో తాజాగా సవరణలు చేశారు. అయితే, సరోగసీ ద్వారా సంతానాన్ని పొందాలనుకునే వితంతువులు లేదా విడాకులు తీసుకున్న ఒంటరి మహిళలకు తాజా నిబంధనలు వర్తించవని కేంద్రం స్పష్టం చేసింది. సవరించిన నిబంధనల ప్రకారం ఒంటరి మహిళలు తప్పనిసరిగా వారి సొంత అండాలు, దాత వీర్యాన్ని ఉపయోగించాలి. అయితే ఈ నిబంధనే ఇప్పుడు చర్చకు దారితీసింది. సరోగసీ ద్వారా పిల్లల్ని కనేందుకు అవకాశం లేకుండా వారిని మినహాయించడంపై ఆందోళనలు వెల్లువెత్తుతున్నాయి.

నా వారాణసీ బిడ్డలను తాగుబోతులంటారా?

» రాహుల్‌పై ప్రధాని మోదీ ధ్వజం



వారాణసీ, ఫిబ్రవరి 23: ఎన్నికలు దగ్గరపడుతున్నకొద్దీ విపక్ష ఇండియా కూటమిపై ప్రధాని మోదీ విమర్శల దాడిని తీవ్రం చేస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని సొంత నియోజకవర్గం వారాణసీలో శుక్రవారం రూ.13 వేల కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, శంకుస్థాపనలు, సంత్ రవిదాస్ జయంతి పాల్గొన్న ఆయన.. బహిరంగ సభలో మాట్లాడారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పేరు ప్రస్తావించకుండా మండిపడ్డారు. వారాణాసీలో కొందరు మద్యం తాగి రోడ్డుపై పడి ఉండడాన్ని చూశానంటూ రాహుల్ ఇటీవల చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. ఇదేం భాష? అని ప్రశ్నించారు. 'నా వారాణసీ బిడ్డలను తాగుబోతులని అంటారా? వారి సొంతగడ్డపైనే కాంగ్రెస్ యువరాజు వారాణసీ యువతను అవమానించారు. మతిలేని వారి నుంచే ఇలాంటి మాటలు వస్తాయి. 20 ఏళ్లుగా వారు నన్ను దూషిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఆ అసహనం అంతటినీ యూపీ యువతపై చూపుతున్నారు. ఈ అవమానాన్ని నేను ఎప్పటికీ మర్చిపోను' అంటూ నిప్పులు చెరిగారు. యువత ప్రతిభను చూసి కుటుంబ పార్టీల నాయకులు తట్టుకోలేక.. వారి అసలు స్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నారని మోదీ వ్యాఖ్యానించారు. కాగా, బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలోనూ ప్రధాని ప్రసంగించారు. ప్రస్తుతం దేశమంతా మోదీ గ్యారెంటీ వైపే చూస్తోందని అన్నారు. యూపీలోని అన్ని సీట్లనూ ఎన్డీఏ కూటమి గెలుస్తుందని.. తమ మూడో దఫా పాలన అత్యద్భుతంగా ఉండబోతోందని పేర్కొన్నారు. కాంగ్రెస్ దశాబ్దాల పాటు అవినీతి, కుటుంబ, బుజ్జగింపు రాజకీయాలతో యూపీని అభివృద్ధికి దూరం చేసిందని మోదీ ఆరోపించారు. ఇండియా కూటమి పార్టీలు కులం పేరిట ప్రజలను దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. విపక్షాలు ఎన్నికలప్పుడే ఒక్కటిగా ప్రజల ముందుకు వస్తాయని, ఫలితాలు 'సున్నా' వస్తే విడిపోయి తిట్టుకుంటాయని ఎద్దేవా చేశారు.

రాత్రి వేళ రోడ్ షో.. ఆకస్మిక తనిఖీ

మోదీ గురువారం రాత్రే వారాణసీ చేరుకున్నారు. ఆ వెంటనే రోడ్ షోలో పాల్గొన్నారు. ఇటీవల ఇక్కడ చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అర్ధరాత్రి వేళ శివ్‌పూర్-పుల్వారియా-లహర్‌తారా మార్గ్‌ను యూపీ సీఎం యోగితో కలిసి తనిఖీ చేశారు. ఈ మార్గంలో ఉన్న ఓ బ్రిడ్జిని యోగితో కలిసి పరిశీలిస్తున్న ఫొటోలను ప్రధాని "ఎక్స్"లో పోస్ట్ చేశారు.



స్పీకర్ పోడియం వద్ద బీజేపీ సభ్యుల నిరసన

కేంద్రంతో అమీతుమీ

» ఆర్థిక వనరుల పంపిణీపై తారతమ్యం చూపవద్దని కర్ణాటక శాసనసభలో తీర్మానం

బెంగళూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పన్నులలో వాటా, గ్రాంట్ల కేటాయింపు, కరువు సాయం విడుదల వంటి అంశాల్లో కర్ణాటక రాష్ట్రానికి అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ.. ఢిల్లీలో ఇటీవల నిరసన ప్రదర్శన నిర్వహించిన కర్ణాటక కాంగ్రెస్, తన దాటిని మరింత పెంచింది. శాసనసభలో గురువారం విపక్షాలను షాక్‌కు గురి చేసేలా కేంద్రప్రభుత్వ తీరును ఖండిస్తూ ఓ తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. బడ్జెట్‌పై చర్చ ముగిసిన తక్షణం శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ రెండు తీర్మానాలను ప్రవేశపెట్టారు. కేంద్రప్రభుత్వం ఆర్థిక వనరులను ఎలాంటి తారతమ్యం లేకుండా అన్ని రాష్ట్రాలకు సమానంగా పంచాలన్నది మొదటి తీర్మానం కాగా, రైతుల పంటలన్నింటికీ కనీస మద్దతు ధర చట్టాలను ప్రవేశపెట్టాలన్నది రెండో తీర్మానం. దీనిపై ప్రతిపక్షాలైన బీజేపీ, జేడీఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. దొంగచాటుగా తీర్మానం తీసుకురావడం సరికాదని విమర్శించాయి. ప్రతిపక్షాల సభ్యులు పోడియంలోకి దూసుకెళ్లారు. ప్రధాని మోదీ నినాదాలతో సభ హోరెత్తింది.

భారతీయులకు ఐదేళ్ల దుబాయ్ వీసా

దుబాయ్, ఫిబ్రవరి 23: దుబాయ్ వెళ్లాలనుకునే భారతీయ పర్యాటకులకు మెరుగైన వీసా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు ఆ దేశ ప్రభుత్వం ప్రకటించింది. ఐదేళ్లపాటు చెల్లుబాటు అయ్యే వీసాలను జారీ చేయాలని నిర్ణయించినట్లు పేర్కొంది. దీంతో ఒకసారి వీసా తీసుకున్న భారత పర్యాటకులు ఎన్నిసార్లయినా దుబాయ్ వెళ్లిరావడానికి వెసులుబాటు కలుగుతుంది. దుబాయ్‌కు వచ్చిన తరువాత 90 రోజులపాటు ఉండవచ్చని, ఇలా ఏడాదిలో గరిష్ఠంగా 180 రోజులు ఉండడానికి అవకాశం కల్పిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

జర్మనీలో గంజాయి లీగల్

బెర్లిన్, ఫిబ్రవరి 23: జర్మనీలో ఇక గంజాయి తాగడం చట్టబద్ధం కానుంది. వినోద కార్యక్రమాల్లో భాగంగా బహిరంగంగానే తాగే అవకాశం కలగనుంది. కొత్త చట్టం ప్రకారం 19 ఏళ్లు దాటిన వారు బహిరంగంగా 25 గ్రాములు, ప్రయివేటు ఇళ్లల్లో 50 గ్రాముల వరకు గంజాయిని తాగవచ్చు. ఈ నూతన నిబంధన ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమల్లోకి రానుంది. డ్రగ్స్‌ను నిషేధిస్తూ చట్టాలు ఉన్నా యువత వీటికి అలవాటు పడ్డారని, అందువల్ల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టడానికే గంజాయిని చట్టబద్ధం చేసినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

నదులు గుల్ల



కృష్ణా నదిలో ఇసుక తవ్వకాలు

(మొదటి పేజీ తరువాయి)

ముక్తకంఠంతో చెప్పిన అంశాలవి. ఘనత వహించిన గనుల శాఖ పనితీరు ఇది. రాష్ట్రంలో ఇసుక అక్రమ తవ్వకాలపై ఎన్జీటీకి కేంద్ర ఏజెన్సీలు, జాయింట్ కమిటీలు నివేదికలు ఇచ్చిన సంగతి తెలిసిందే. "గనుల శాఖ కోరిక మేరకు ఇసుక రీచ్‌ల్లో తవ్వకాలు చేపట్టేందుకు పర్యావరణ అనుమతులు(ఈసీ) ఇచ్చే బాధ్యత మాది. పర్యావరణ పరిరక్షణ, చట్టాల అమలులో డైరెక్టర్ మైన్స్ అండ్ జియాలజీ(డీఎంజీ) నోడల్ విభాగంగా పనిచేస్తుంది. 2021 ఆగస్టులో ఎన్జీటీ ఇచ్చిన ఆదేశాలు, ఆ తర్వాత అనేక సందర్భాల్లో ఇచ్చిన మార్గదర్శకాలు, 2023 మార్చి 23న ఇచ్చిన ఈసీలు రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు, బీ1 కేటగిరీలోని 110 రీచ్‌ల్లో మైనింగ్‌ల నిలిపివేత వరకు ప్రతీ ఆదేశాన్ని అమలు చేయాల్సిందిగా గనుల శాఖ డైరెక్టర్‌కు అనేక దఫాలుగా లేఖలు రాశాం. ఈ మెయిల్స్ పంపించాం. కానీ ఏం లాభం? అక్రమ మైనింగ్ ఆగలేదు. పర్యావరణాన్ని ధ్వంసం చేస్తూ ఇసుక తవ్వకాలు జరిగాయి. నాడు జేపీ వెంచర్స్ నుంచి నేడు ఇసుక కాంట్రాక్టు తీసుకున్న ప్రతిమ, జీసీకేసీల వరకు అక్రమ మైనింగ్ బాటలోనే ఉన్నాయి. అక్రమాలను అడ్డుకోవాల్సిన గనుల శాఖ పర్యావరణ పరిరక్షణలో నోడల్ ఏజెన్సీగా ఘోరంగా విఫలమైంది".. అని ఇసుక అక్రమాలపై విచారణ జరిపిన కేంద్ర పర్యావరణ, అటవీశాఖ జాయింట్ కమిటీ, రాష్ట్ర పర్యావరణ ప్రభావ అంచనా సంస్థ(సియా), ఇంకా 2022 ఆగస్టులో ఎన్జీటీకి నివేదిక ఇచ్చిన జాయింట్ కమిటీలు చెప్పిన అంశాలివి. వీటిని పరిగణనలోకి తీసుకొనే.. పర్యావరణ అనుమతులు తీసుకున్న గనుల శాఖ అధికారులు, వారి అండతో ఇసుక తవ్వకాలు జరిపిన జేపీ వెంచర్స్, ఇతర సంస్థలు శిక్షార్హులని ఎన్జీటీ తాజా తీర్పులో వెల్లడించింది. పర్యావరణ పరిరక్షణకు, ఇసుక అక్రమ తవ్వకాల నిరోధానికి డీఎంజీ నోడల్ ఏజెన్సీగా ఉంది. ఈ సంస్థ ఏం చేయాల్సి ఉందో? ఏం చేయలేదో కేంద్ర ఏజెన్సీలు, జాయింట్ కమిటీలు ఎన్జీటీకి గత రెండున్నరేళ్లుగా ఇచ్చిన నివేదికలను పరిశీలిస్తే స్పష్టంగా అర్థమవుతోంది. నివేదికల్లోని ముఖ్యాంశాలు...

నాడు జేపీ అక్రమ మైనింగ్

1 2021 నుంచే జేపీ వెంచర్స్‌పై ఫిర్యాదులున్నాయి. పర్యావరణ పరిరక్షణను పట్టించుకోకుండా మైనింగ్ చేస్తున్నారన్న ఆరోపణలు క్షేత్రస్థాయిలో వాస్తవికంగా కనిపించాయి. నిబంధనలకు విరుద్ధంగా 2టన్నులు, అంతకుమించిన బరువు ఇసుకను ఒకేసారి తవ్వితీయగల జేసీబీలను ఆ సంస్థ ఉపయోగించింది. 2023 మార్చిలో 110 రీచ్‌ల ఈసీలు రద్దు చేసిన తర్వాత కూడా మైనింగ్ చేపట్టింది. 2023 మే 12న ఆ సంస్థ లీజు రద్దయినా ఆ ఏడాది నవంబరు నెలాఖరు వరకు ఇసుక తవ్వకాలు జరిగాయి.

1 జేపీ వెంచర్స్ సంస్థకు 2021 మే 12న ఇసుక కాంట్రాక్టు ఇచ్చారు. అదే ఏడాది ఆగస్టులో అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, పర్యావరణ విధ్వంసం జరుగుతోందని ఎన్జీటీకి ఫిర్యాదులు రాగా విచారణకు ఆదేశించింది. మేం పరిశీలించే సమయానికి అనేక రీచ్‌లు వరదముంపులో ఉన్నప్పటికీ కొన్ని అంశాలు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యాయి. రీచ్‌లలో ఏ తప్పూ జరగడం లేదని, గనుల శాఖ డైరెక్టర్ నివేదించినా ఆచరణలో అది కనిపించలేదు.

నేడూ ఈసీలు లేకుండానే..

2023 డిసెంబరు నుంచి 18 జిల్లాల్లో (ప్యాకేజీ 1,3)లో ప్రతిమ, 8జిల్లాల్లో(ప్యాకేజీ 2) జీసీకేసీ సంస్థలు ఇసుక తవ్వకాలు జరుపుతున్నాయి. సియా నుంచి ఈసీ తీసుకోకుండా మైనింగ్ చేస్తున్నాయి. ఈ తరహా మైనింగ్‌ను నిలువరించాల్సిన బాధ్యత గనుల శాఖ డైరెక్టరేట్‌దే. కానీ ఆ విభాగం అక్రమ మైనింగ్‌పై దృష్టిపెట్టలేదు. అటు గోదావరి, ఇటు కృష్ణాలో భారీ యంత్రాలతో ప్రైవేటు ఏజెన్సీలు ఇసుక మైనింగ్ చేస్తున్నాయి. పర్యావరణ అనుమతులు లేకుండా మైనింగ్ చేయడాన్ని అడ్డుకోవాల్సింది గనుల శాఖనే. కేంద్రం తీసుకొచ్చిన 'ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సస్టెయినబుల్ శాండ్ మైనింగ్ మేనేజ్‌మెంట్ గైడ్‌లైన్స్-2016, ఎన్‌ఫోర్స్‌మెంట్ అండ్ మానిటరింగ్ గైడ్‌లైన్స్ ఫర్ శాండ్ మైనింగ్-2020 మార్గదర్శకాలకు అనుగుణంగా రీచ్‌ల్లో తవ్వకాలు జరగలేదు. నోడల్ ఏజెన్సీ సరైన పర్యవేక్షణ, పరిశీలన లోపించింది. నోడల్ ఏజెన్సీ తన బాధ్యతలను సక్రమంగా నిర్వహించకపోవడంతో ఇసుక రీచ్‌ల్లో అడ్డగోలుగా ర్యాంప్‌లు, రహదారులు ఏర్పాటు చేశారు. చివరకు నదీ ప్రవాహాలను దారి మళ్లించారు. కృష్ణా నదిలో ఈ సమస్య చాలా ఎక్కువగా కనిపించింది. కొన్ని రీచ్‌లు 500మీటర్ల పరిధిలోనే ఏర్పాటు చేశారు. ఇలాంటి వాటికి ప్రజాభిప్రాయ సేకరణ తప్పనిసరి. అలాంటివేవీ లేకుండానే ఏర్పాటు చేశారు.

గనుల శాఖ చర్యలు శూన్యం

1 ఇసుక తవ్వకాల గురించి 6నెలలకోసారి గనుల శాఖ అధికారులు విజయవాడలోని పర్యావరణ శాఖ కార్యాలయానికి నివేదికలు ఇవ్వాలి. ఇసుక తవ్వకాలు ఎలా జరుగుతున్నాయి? నిబంధనల ఉల్లంఘనలు అడ్డుకోవడం, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ఇందులో ప్రస్తావించాలి. కానీ ఇలాంటి నివేదికలే ఇవ్వలేదు.

1 ఇసుక తవ్వకాల వల్ల పర్యావరణ పరిరక్షణ దెబ్బతింటుంది. ఇది సహజం అయితే, దాన్ని పునరుద్ధరించేందుకు గనుల శాఖ నిర్దిష్ట కార్యాచరణ ప్రణాళిక చేపట్టాలి. ఇందుకు నిధులు ఖర్చుపెట్టాలి. ఆ శాఖ ఇలాంటి పనేదీ చేయలేదు. రూపాయి కూడా ఖర్చుపెట్టలేదని నివేదికలు పరిశీలిస్తే అర్థమవుతోంది. రీచ్‌ల పరిధిలో భూగర్భ జలాల స్థాయిని ఎప్పటికప్పుడు అంచనా వేయాలి. కానీ గనుల శాఖ అలాంటి కసరత్తు చేయలేదు. ఏ రీచ్‌ల పరిధిలోనూ భూగర్భ వనరుల లభ్యతను పరిశీలన చేయలేదు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: **K. Srinivas**. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. **Managing Director: Vemuri Radha Krishna,** Founder: K.L.N.Prasad.



అంబేడ్కర్ స్మృతివనం దగ్గర ధర్నా చేస్తున్న ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు

బడుగు వికాసం రాయితీలు విడుదల చేయాలి

● ఎస్సీ, ఎస్టీ పారిశ్రామిక వేత్తల డిమాండ్

పటమట, ఫిబ్రవరి 23: మూడేళ్లుగా దళితులు నిర్వహిస్తున్న 7,675 ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.542.95 కోట్లు, గిరిజనులు నిర్వహిస్తున్న 1,320 ఎంఎస్ఎంఈ యూనిట్లకు రూ.82.24 కోట్లు మొత్తం రూ.625.19 కోట్లు జగనన్న బడుగు వికాసం రాయితీలు రావాల్సి ఉందని, వాటిని వెం టనే వి డుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు డిమాండ్ చేశారు. సబ్సిడీ రాయితీలు విడుదల చేయాలని శుక్రవారం అం బేడ్కర్ స్మృతివనం దగ్గర ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు ధర్నా చేశారు. ఆంధ్రప్రదేశ్ దళిత ఎంటర్ ప్రెన్యూర్స్ ఎంపవర్మెంట్ అసోసియేషన్ అధ్య క్షుడు పినమల నాగకుమార్ మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు బడుగు వికాస పథకం ద్వారా పదివేల మంది రుణాలు తీసుకుని వ్యాపా రాలు చేస్తున్నారని తెలిపారు. రాయితీలు రాక వీరంతా తీవ్రంగా నష్టపోతు న్నారని, బ్యాంక్‌ల నుంచి తీవ్ర ఒత్తిడి ఉందని వెంటనే ముఖ్యమంత్రి జగ న్మోహన్‌రెడ్డి స్పందించి రాయితీలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. 8,995 దళిత గిరిజన కుటుంబాలు ప్రత్యక్షం గాను, కొన్ని వేల కుటుంబాలు పరోక్షంగాను పరిశ్రమలపై ఆధారపడి ఉన్నాయని తక్షణమే ఈ రాయితీలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలు అన్నవరపు అవినాష్, కలపాల వికాస్, యడ్ల రాజీ వ్వర్మ, కె.యానిస్ తదితరులు పాల్గొన్నారు.



బెంజ్ సర్కిల్ దగ్గర టీడీపీ బ్యానర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

టీడీపీ బ్యానర్లు, ఫ్లెక్సీలే తొలగిస్తారా

● వైసీపీవి తొలగించరా?: తెలుగు యువత ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కిలారు శ్రావణ్

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: నగరంలో టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్యానర్లను మాత్రమే విద్యుత్, మునిసిపల్, కార్పొరేషన్ అధికారులు తొలగి స్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఉన్నా వైసీపీ బ్యానర్లను, ఫ్లెక్సీలను తొలగించడం లేదని తెలుగుయువత ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి కిలారు శ్రావణ్ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓటర్లను చైతన్యం చేసేందుకు మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ క్యాంపెయిన్‌లో భాగంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను, బ్యానర్లను చూసి వైసీపీ నాయకులు ఉలిక్కి పడ్డారన్నారు. శుక్రవారం బెంజ్‌సర్కిల్ వద్ద కార్పొరేషన్ అధికారుల ద్వారా బ్యానర్లను తొలగింపజేశారన్నారు. అధికార పార్టీకి చెందిన హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, బ్యానర్ల జోలికి వెళ్లడం లేదని పేర్కొన్నారు. వైసీపీ బ్యానర్లన్నింటినీ ఈనెల 26 లోపు తొలగించకుంటే ప్రతి బ్యానర్ వద్ద తాము ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

మాల, మాదిగలకు సమానంగా సీట్లు కేటాయించమని

చంద్రబాబుకు చెప్పండి

● వర్ల రామయ్యతో మంద కృష్ణమాదిగ

విద్యాధరపురం, ఫిబ్రవరి 23: రానున్న ఎన్నికలలో దళిత వర్గాలైన మాల, మాదిగలకు సమానంగా సీట్లు కేటాయిం చమని చంద్రబాబు నాయు డుకు చెప్పాలని టీడీపీ సీనియర్ నాయకుడు, పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్యను ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ కోరారు. శుక్రవారం వర్ల రామ య్యను నగరంలోని ఆయన నివాసంలో మంద కృష్ణమాదిగ కలిశారు. వర్ల రామయ్య అనారోగ్యం నుంచి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.



వర్ల రామయ్యను పరామర్శిస్తున్న మంద కృష్ణమాదిగ

సింధుస్నానాలకు విస్తృత ఏర్పాట్లు

కోడూరు, ఫిబ్రవరి 23 : మాఘ పౌర్ణమిని పురస్కరించు కుని శనివారం పెద్ద సంఖ్యలో పుణ్యస్నానాలు చేయనున్న నేప థ్యంలో హంసలదీవి సాగరతీరం వద్ద అధికారులు విస్తృత స్థాయి ఏర్పాట్లు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ పర్యవేక్షణలో 200 మంది బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనదారులకు ఇబ్బం దులు తలెత్తకుండా వన్ వే వి ధానం అమలు చేస్తున్నట్లు తెలి పారు. సముద్రతీరంలో, పవిత్ర సంగమ ప్రదేశంలో ప్రత్యేక వైద్య శిబిరాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక వస తులు ఏర్పాటు చేశారు. స్నానాలు ఆచరించేటప్పుడు భక్తులు ఎలాంటి అవాంఛనీయ సంఘట నలకు లోనుకాకుండా ప్రత్యేక బోట్లు ఏర్పాటు చేశారు. లోతైన ప్రాంతాల్లో భారీ గేట్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పవిత్ర సంగమ ప్రదేశంలో జల్లు స్నానాలకు కూడా ఏర్పాట్లు చేశారు. ఏర్పాట్లను డీఎల్‌పీవో జ్యోతిర్మయి, అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, పర్యవేక్షించారు. శిథిలావస్థకు చేరిన కృష్ణవేణి విగ్రహాన్ని లెజెండ్ సోషల్ సర్వీస్ అధినేత పూతబోయిన అయ్యప్ప స్వామి ఆర్థిక సౌజన్యం రూ.20 వేలతో తీర్చిదిద్దారు.



హంసలదీవిలో సుందరంగా తీర్చిదిద్దిన కృష్ణవేణమ్మ విగ్రహం



హంసలదీవి ఆలయ కోనేరులో స్వామి తెప్పోత్సవం నిర్వహిస్తున్న పండితులు

అంగరంగ వైభవంగా వేణుగోపాలస్వామి తెప్పోత్సవం

కోడూరు: హంసలదీవి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ సమీపంలోని కోనేరులో స్వామివారి తెప్పోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ధర్మాధికారి కుప్పా సుబ్ర హ్మణ్య అవధాని ఏర్పాట్లను పర్యవేక్షించారు. బ్రహ్మోత్సవాల సంద ర్భంగా ఆలయాన్ని సుందరంగా అలంకరించారు.





వన్‌టౌన్‌లో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కేఆర్ మార్కెట్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు

రైతులపై దాడులు సిగ్గుచేటు

ఢిల్లీలో 'కిసాన్ ఆందోళన్'పై దాడులకు వ్యతిరేకంగా సీఐటీయూ, కార్మిక సంఘాల ఐక్యవేదిక నిరసనలు

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: శత్రువుపై యుద్ధం చేసినట్లు రైతులపై ప్రధాని నరేంద్ర మోదీ దాడులు చేసి వారి ప్రాణాలు తీయడం సిగ్గుచేటని సీఐటీయూ నేతలు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ డిమాండ్ల ఆమోదం కోసం కిసాన్ ఆందోళన్ పేరుతో ఢిల్లీకి మార్చ్ తలపెట్టిన రైతులపై బాష్ప వాయువులు ప్రయోగించి కాల్పులు జరిపి హింసించడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. కాల్పుల్లో రైతు శుభకరణ్‌సింగ్ మరణించడంపై శుక్రవారం సీఐటీయూ నాయకులు నల్లరిబ్బన్లతో వన్‌టౌన్‌లో నిరసన తెలిపారు. శుభకరణసింగ్ చిత్రపటానికి వారు నివాళులర్పించారు. సీపీఎం ఫ్లోర్‌లీడర్ బి.సత్యబాబు, సీఐటీయూ నగర అధ్యక్షుడు వెంకట్రావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సీహెచ్ దాసు, రామారావు, ఏడుకొండలు మాట్లా డారు. నరేంద్ర మోదీ రైతు వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టారు. పదేళ్లవు తున్నా రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వలేదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు.

కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో..

కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్‌లో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రైతులపై కేంద్ర ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ శుక్రవారం నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్యబాబు, కొండ మహేష్, రమణమ్మ, లక్ష్మీకుమారి, సుబ్బారావు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పది రోజులు ప్రజల్లో..

● బీజేపీ ప్రజాపోరు యాత్ర ప్రారంభం
● పది రోజులపాటు సాగనున్న యాత్ర
● ఎమ్మెల్యేల అవినీతి, ప్రభుత్వ వైఫల్యాలే టార్గెట్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ): ఎన్నికల సమయం సమీపిస్తుండ డంతో బీజేపీ ప్రజల ముందుకు వెళ్లాలని నిర్ణయించింది. ఇప్పటికే టీడీపీ, జనసేన పార్టీలు బహిరంగ సభలు నిర్వహిస్తున్నాయి. టీడీపీ రా..కదలిరా పేరుతో సభలు నిర్వహిస్తుంటే, మరోపక్క జనసేన అధినేత పవన్ కల్యాణ్ జిల్లాల్లో పర్యటిస్తున్నారు. వైసీపీ సభలతో 'సిద్ధ'మవుతోంది. దీనితో ఓటర్ల ఇంటి తలుపు తట్టాలని బీజేపీ భావిస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లాలో రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు ప్రజాపోరు యాత్రకు శుక్రవారం నుంచి శ్రీకారం చుట్టింది. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఉన్న 14 నియోజకవర్గాల్లో పది రోజులపాటు ఈ యాత్ర సాగుతుంది. ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలు కార్యకర్తలను వెంటబెట్టుకుని ప్రజల ముందుకు బయలుదేరారు. పాలనలో వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచాలని నిర్ణయించారు. స్థానికంగా ఉన్న ఎమ్మెల్యే అవినీతి బాగోతాన్ని చూపించాలని భావిస్తున్నారు. కేంద్రం అమలు చేస్తున్న పథకాలకు పేర్లు మార్చేసి ఏవిధంగా మోసకారి కార్యక్రమాలను వైసీపీ చేపట్టిందో వివరి స్తామని బీజేపీ నేతలు చెబుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇసుక, కృష్ణా జిల్లాలో బుసక అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. కృష్ణా జిల్లాలో కృష్ణానది అనుసంధాన కాల్వల కరకట్టను ఎమ్మెల్యేల అనుచరులు ఆక్రమించుకుంటున్నారు. వైసీపీ అరాచక పాలన, ఎమ్మెల్యేల దౌర్జన్యాలను ప్రజల ముందు ఉంచడానికి బీజేపీ నేతలు సిద్ధమయ్యారు.

26 నుంచి కళాక్షేత్రంలో

దుర్గాసౌందర్యలహరి మహాశతావధానం

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో తుమ్మలపల్లివారి క్షేత్రయ కళాక్షేత్రంలో ఈనెల 26 నుంచి మార్చి 1వ తేదీ వరకు రోజూ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, తిరిగి మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దుర్గా సౌందర్య లహరి మహాశతావధానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్యత్ తరాలకు అవ ధాన ప్రక్రియలపై అవగాహన కల్పించేందుకు ద్విసహస్ర అవధాని మాడు గుల నాగఫణిశర్మతో మహాశతావధానం నిర్వహిస్తామని తెలిపారు. సం స్కృత, ఆంధ్రభాషల్లో నిష్ణాతులైన 126 మంది పండితులు ఈ కార్యక్ర మంలో పాల్గొంటారని, నగరంలో మొదటిసారిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని తెలిపారు. భాషను, సాహిత్యాన్ని, సంస్కృతిని పరిరక్షించాలని, విద్యాభాషా వికాసం, విజ్ఞాన వికాసం కలిగించాలని నిర్వహిస్తున్న ఈ కార్య క్రమానికి అందరూ ఆహ్వానితులేనన్నారు.

'చిరుధాన్యాలతో రుచికరమైన

100 రకాల వంటలు' పుస్తకావిష్కరణ

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 'చిరుధాన్యాలతో రుచిక రమైన 100 రకాల వంటలు' అనే పుస్తకాన్ని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం ఆవిష్కరించారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో ప్రతి ఒక్కరూ సులభంగా చదివి అర్థం చేసుకునేలా ఈ పుస్తకాన్ని రూపొందించి నట్లు మంత్రి తెలిపారు. వ్యవసాయశాఖ ప్రత్యేక కమిషనర్ చేవూరి హరి కిరణ్, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ శారద జయలక్ష్మి, వ్యవసాయ ఉప సహాయకులు సీహెచ్ బాలు నాయక్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సెపక్‌తక్రా రాష్ట్ర పోటీలకు పటమట విద్యార్థులు

విజయవాడ స్పోర్ట్స్, ఫిబ్రవరి 23: నెల్లూరు జిల్లాలో ఈనెల 24 నుంచి 26 వరకు నిర్వహించే 26వ సబ్ జూని యర్, జూనియర్ బాల, బాలికల సెపక్‌తక్రా అంతర్ జిల్లాల (రాష్ట్రస్థాయి) పోటీలకు పటమట కోనేరు బసవయ్యచౌదరి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు 19 మంది ఎంపిక య్యారని హెచ్ఎం కేపీ ప్రేమ్‌సాగర్ తెలిపారు. పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో క్రీడాకారులకు క్రీడాదుస్తులను ఆయన పంపిణీ చేశారు. అసిస్టెంట్ హెచ్ఎం ఎం.సీతారెడ్డి, పీఈటీ ఎస్.రమేష్, స్కూల్ డెవలప్ మెంట్ కమిటీ సభ్యులు కె.రాజేష్ పాల్గొన్నారు.



సెపక్‌తక్రా రాష్ట్ర పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్ఎం, పీఈటీలు

ఎంపికైంది వీరే..

సబ్ జూనియర్ బాలురులో ఎండీ జురీర్, కె.కుషాల్, యు.సూర్య, వి.చార్లెస్, వై.సుభాష్, బాలికల్లో వి.కావ్య, పి.హరిప్రియ, ఎస్కే ఖతీజ, కె.లావణ్య, ఆర్.అమృత, జూనియర్ బాలురులో ఎస్. కార్తీక్, ఆర్.నర్సీర్, ఎండీ. అబ్దుల్లా అహ్మద్, సీహెచ్.సూర్య కిరణ్, బాలికల్లో ఎండీ రెహనాయ్, కె.వెంకటలక్ష్మి, టి.యామినీదేవి, బి.ఉమాదేవి, కె.హనీ ఎంపికయ్యారు.



ప్రత్యేక పూజల అనంతరం అనుగ్రహ భాషణం చేస్తున్న దత్త విజయానంద తీర్థ స్వామీజీ

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన పూజ

పెదకాకాని, ఫిబ్రవరి 23: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వరస్వామి దివ్య క్షేత్రాన్ని శ్రీ అవధూత దత్త పీఠ ఉత్తరాధికారి శ్రీ దత్త విజయానంద తీర్థ స్వామీజీ (బాల స్వామీజీ) శుక్రవారం దర్శించారు. ఆయన చేతుల మీదుగా స్వామివారికి అష్టాదళ పాదపద్మారాధన పూజ నిర్వహించారు. అనంతరం స్వామి భక్తుల నుద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత లింగమనేని పూర్ణ భాస్కర్‌రావు దంపతులు, లింగమనేని రాజశేఖర్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు



అనుముల్లంక దళితవాడలో కిడ్నీ వ్యాధితో మృతి చెందిన నాగబత్తుని కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న దోనేపూడి శంకర్

కృష్ణ కుటుంబానికి రూ.10 లక్షల పరిహారమివ్వాలి

గంపలగూడెం, ఫిబ్రవరి 23: కిడ్నీ వ్యాధితో మృతి చెందిన నాగబత్తుని కృష్ణ కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షల నష్టపరిహారం ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ డిమాండ్ చేశారు. శుక్ర వారం అనుముల్లంక దళితవాడలో కృష్ణ కుటుంబ సభ్యులను ఆయన పరా మర్శించారు. అనుముల్లంకలో పది మందికి పైగా కిడ్నీ బాధితులు ఉన్నా రన్నారు. ఇక్కడ ఫ్లోరైడ్ నీటి వల్ల కిడ్నీ వ్యాధులు వస్తున్నాయన్నారు. కట్లేరు నుంచి మంచినీరు సరఫరా చేసే పైపులైన్ పనులు త్వరగా పూర్తి చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు మేకల డేవిడ్, తూము కృష్ణయ్య, షేక్ నాగుల్‌మీరా, ఉన్నం సాంబశివరావు, చెరుకూరి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

గుండాల రైల్వేస్టేషన్ శంకుస్థాపనకు రండి

● గవర్నర్‌ను ఆహ్వానించిన డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్

వన్‌టౌన్, ఫిబ్రవరి 23: గుండాల రైల్వేస్టేషన్‌ను అమృత్ స్టేషన్ పథకం కింద అభివృద్ధి చేయనున్నారని, శంకుస్థాపన కార్యక్రమాన్ని ఈనెల 26న నిర్వహిస్తున్నామని హాజరుకావాలని గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను విజయ వాడ రైల్వే డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ఆహ్వానించారు. శుక్రవారం మర్యా దపూర్వకంగా ఆయన గవర్నర్‌ను క లిశారు. అమృత్ స్టేషన్ పథకం కింద ఈనెల 26న ప్రధాని నరేంద్ర మోదీ 554 స్టేషన్లకు శంకుస్థాపన చేస్తార న్నారు. దేశం అంతటా 1500 ప్రదేశాల్లో రైలు పై ఓవర్లు, రైల్ అండర్ పాస్‌లను జాతికి అంకితం చేస్తారన్నారు.

ఏపీటీడీసీలో అక్రమాలపై హైకోర్టుకు..

● రంగం సిద్ధం చేసుకుంటున్న ఉద్యోగులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఆంధ్రప్రదేశ్ పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ)లో జరుగుతున్న అక్రమాలపై సంస్థ ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించడానికి సిద్ధమవుతున్నారు. ఉన్నతాధికారులు వ్యవహరిస్తున్న వి ధానాలపై రెండు రోజుల్లో హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. సీనియారిటీ కలిగిన ఉద్యోగులను పక్కనపెట్టి, నిబం ధనలకు విరుద్ధంగా, అడ్డగోలుగా కొత్తవారిని తీసుకోవటం, వారికి పెద్దపీట వేయటం, సంస్థలో కొంతకాలంగా వేళ్లూనుకున్న అవినీతి వ్యవహారాలు, దానికి పాల్పడిన అధికారులు, వారి స్వీయ ప్రయోజనాలు, కన్సల్టెంట్ల మాటున జరుగుతున్న దుబారా, పర్యాటక యూనిట్లను ప్రైవేటుపరం చేయ టం, ఏపీటీడీసీ రవాణా విభాగంలో ప్రైవేట్ సంస్థల పెత్తనం, పత్రికల్లో కథనాలు వస్తున్నాయన్న పేరుతో ఉద్యోగులు, సిబ్బందిని వేధించటం, బల వంతపు బదిలీలు, పనిష్మెంట్లు విధించటం వంటి వాటిపై ఉద్యోగులు కోర్టును ఆశ్రయించడానికి సిద్ధమవుతున్నారు.

అనితరుడు ఓ వినూత్న ప్రయోగం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సాహితీ చరిత్రలో అనితరుడు ఒక వినూత్న ప్రయోగమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత పాపినేని శివశంకర్ అన్నారు. జాషువా సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో బాలోత్సవ భవనంలో మువ్వా శ్రీనివాసరావు రాసిన 'అనితరుడు' కవితాంతరంగ విశ్లేషణల పరిచయ కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నిర్వహించారు. 366 వ్యాసాల్లో మువ్వా కవిత్వాన్ని పలు కోణాల్లో విశ్లే షించి అనితరుడు పేరును సార్థకం చేసుకున్నారన్నారు. మరో కవి ఖాదర్ మొహిద్దీన్ మాట్లాడుతూ సకల వర్గాల కవిత్వాన్ని తన కవితా సంపుటల్లో ప్రస్తావించిన శ్రీనివాసరావు కవిత్వాన్ని చాలా విశ్లేషణాత్మకంగా రాశా రన్నారు. డాక్టర్ గుమ్మా సాంబశివరావు, మందరపు హైమావతి, పెనుగొండ లక్ష్మీనారాయణ, వరప్రసాద్, అనిల్‌డ్యానీ పాల్గొన్నారు.



పీబీ సిద్ధార్థ కళాశాల గ్రంథాలయ విభాగం ఆధ్వర్యంలో పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రచయిత సౌమ్య తదితరులు

ది పాలిష్డ్ ఇన్‌హ్యూమన్ ట్రీట్‌మెంట్ ఫ్రం షాడోస్ టు స్పాట్ లైట్ పుస్తకావిష్కరణ

మొగల్రాజపురం, ఫిబ్రవరి 23: పీబీ సిద్ధార్థ కళాశాల గ్రంథాలయ వి భాగం ఆధ్వర్యంలో పుస్తక సమీక్ష- రచయిత పరిచయ కార్యక్రమంలో భాగంగా యువ రచయిత సౌమ్య తొలి రచన ది పాలిష్డ్ ఇన్ హ్యూమన్ ట్రీట్‌మెంట్ ఫ్రం షాడోస్ టు స్పాట్‌లైట్ అనే పుస్తకాన్ని శుక్రవారం కళా శాలలో ఆవి ష్కరించారు. కళాశాల విద్యార్థినులు జాహ్నవి, పర్వానా, హసీత పుస్తకంపై సమీక్ష నిర్వహించారు. రచయిత సౌమ్య ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ప్రతి నెలా ఒక రచయితను పరిచయం చేయడం, పుస్తక సమీక్ష నిర్వహించడం, వారి రచనలను సమాజంలోకి తీసుకురావడం చేస్తు న్నామని గ్రంథాలయ విభాగాధిపతి కె.వాణిశ్రీ తెలిపారు. ఇంగ్లీషు విభా గాధిపతి డాక్టర్ జి.శ్రీలత అధ్యక్షత వహించగా విద్యార్థులు, ఉపాధ్యా యులు పాల్గొన్నారు.

ఎన్నికల తర్వాత వైసీపీ కనుమరుగే

● కొండపల్లిలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీలో దేవినేని ఉమా

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 23 : వచ్చే ఎన్నికల తర్వాత వైసీపీ కనుమరుగు కావడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవి నేని ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం కొండపల్లి మున్సిపాలి టీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూపర్ సిక్స్ పథకాల బ్రోచర్లను ప్రజలకు పంచారు. జగన్ చేస్తున్న ఇసుక అక్రమ దోపిడీపై ఈనెల 24న టీడీపీ - జనసేన ఆందోళన చేస్తాయని ఆయన తెలిపారు. ఆరాచక, అవినీతి జగన్ ప్రభుత్వాన్ని 165 అడుగుల గోతిలో పెట్టాలన్నారు. కొండపల్లి మున్సి పాలిటీలో రూ.11 కోట్లు అవినీతి చేశారని, అడ్డగోలుగా పన్నులు వేసి దోపిడీ చేసి వైసీపీ నేతలు పందికొక్కుల్లా తిన్నారని ఆయన ఆరోపిం చారు. ఇబ్రహీంపట్నంను బూడిదపట్నం చేశారన్నారు. మైలవరంలో ఈనెల 28న 48 కంపెనీలతో కేశినేని ఫౌండేషన్ అధినేత కేశినేని శివనా థ్(చిన్ని) ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తామని, ఈఅవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. టీడీపీ కౌన్సిలర్లు, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కొండపల్లి మున్సిపాలిటీలో సూపర్‌సిక్స్ బ్రోచర్లను పంచుతున్న దేవినేని ఉమా

టీడీపీ-జనసేన కూటమిని గెలిపించండి

నందిగామ రూరల్: టీడీపీతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని రాష్ట్రం ప్రగతి పథంలో సాగాలన్నా సంక్షేమ పథకాలు అర్హులకు అందాలన్నా టీడీపీ-జనసేన కూటమిని గెలిపించుకోవాలని తెలుగుమహిళలు పిలుపునిచ్చారు. చందాపురంలో శుక్రవారం మహిళా నాయకులు మన్నే కళావతి, చెన్నుపాటి ఉషశ్రీ, మన్నే సాత్వికల ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరుగుతూ మహిళా శక్తి కరప త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శాఖమూరు స్వర్ణలత, ఉమామహే శ్వరి, నూకానమ్మ, అప్పారావు, నరేంద్ర, వీరాస్వామి, దారెల్లి బుజ్జి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఇసుక దందా నిజమే

● టీడీపీ ఆరోపణలను నిర్ధారించిన కేంద్ర సంస్థలు
● ఇసుక కొరతతో ఉపాధి లేక వందలాది భవన నిర్మాణ కార్మికులు చనిపోయారు
● టీడీపీ ప్రభుత్వమొస్తే మళ్లీ ఉచిత ఇసుక: తాతయ్య

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 23 : ప్రభుత్వ ఇసుక దందా నిజ మేనని టీడీపీ చేసిన ఆరోపణలను కేంద్ర సంస్థలే నిర్ధారించి బలం చేకూర్చాయని రాష్ట్రంలో ఇళ్ల నిర్మాణం చేసుకునే వారికి ఇసుక అందుబాటులో ఉండదని, ఇతర రాష్ట్రాలకు మాత్రం యథేచ్ఛగా తరలిపోతుందని మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆరోపించారు. ఇసుక కొరత వల్ల రాష్ట్రంలో వందల మంది ఉపాధిలేక భవన నిర్మాణ కార్మికులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని సత్యనారా యణపురంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. టీడీపీ ప్రభుత్వం వస్తే మళ్లీ ఉచిత ఇసుక వస్తుందని, కార్మికు లందరికీ ఉపాధి లభిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత పితాని శ్రీనాథ్, జనసేన నేతలు పాల్గొన్నారు.



జగ్గయ్యపేటలో బాబు ష్యూరిటీ- భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న శ్రీరాం తాతయ్య, టీడీపీ నాయకులు

టారిఫ్, ట్రూఅప్‌పైనే ప్రజాభిప్రాయ సేకరణ

» ఇతర అంశాల్లో చట్టబద్ధంగా నిర్ణయం: ఈఆర్‌సీ

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వార్షిక ఆదాయ వ్యయ నివేదికల ప్రతిపాదనల మేరకు టారిఫ్ ఆమోదం, 2022-23 ట్రూఅప్ ప్రతిపాదనలపై మాత్రమే ప్రజాభిప్రాయ సేకరణ చేపడతామని, మిగిలిన అంశాలపై కాదని ఏపీ విద్యుత్తు నియంత్రణ మండలి(ఈఆర్‌సీ) స్పష్టం చేసింది. సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకీ) ద్వారా 'అదానీ' సరఫరా చేసే 7వేల మెగావాట్ల సౌర విద్యుత్తును యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలు చేసేందుకు 2021 నవంబరు 11న ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. సెకీ ద్వారా 7వేల మెగావాట్ల అదానీ సౌర విద్యుత్తును యూనిట్ రూ.2.49 చొప్పున కొనుగోలు చేస్తూ ప్రభుత్వం, డిస్కమ్‌లు, సెకీ చేసుకున్న త్రైపాక్షిక ఒప్పందాన్ని బయట పెట్టి ప్రజాభిప్రాయ సేకరణ చేయడం లేదంటూ మీడియాలో వస్తున్న కథనాలపై ఈఆర్‌సీ శుక్రవారం వివరణ ఇచ్చింది.

బాబు మాటలే నిజమయ్యాయి

» కేంద్రం నివేదికపై జగన్, పెద్దిరెడ్డి ఇప్పుడేమంటారు?: పట్టాభి

'ఇసుకాసురుడు జగన్ ఇసుక దోపిడీతో రూ.60 వేల కోట్లు దోచేశారన్న చంద్రబాబు మాటలే నిజమయ్యాయి. ఎన్జీటీ ఆదేశాలతో రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ఉమ్మడి కమిటీ ఇచ్చిన నివేదిక అదే విషయాన్ని వెల్లడించిది' అని టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం అన్నారు. శుక్రవారం ఆయ న మాట్లాడుతూ.. 'అక్రమ తవ్వకాలను కప్పిపెడుతూ, అవాస్తవాలతో కేంద్ర సంస్థలకు ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డి లేఖలు రాశారు. ఎన్జీటీకి కేంద్ర కమి టీ ఇచ్చిన నివేదికపై జగన్, పుంగనూరు పుడింగి పెద్దిరెడ్డి నోరు విప్పాలి. తన తొత్తు, మైన్స్ డైరక్టర్ వెంకటరెడ్డితో కలిసి పెద్దిరెడ్డి మీడియా ముందుకొచ్చి నివేదికపై సమాధానం చెప్పాలి. కొద్ది రోజుల్లో ఇసుకాసురుడు జగన్‌ని ప్రజలు భూస్థాపితం చేయడం ఖాయం. మైన్ డెరెక్టర్ వెంకటరెడ్డి జైలుకెళ్లడం ఖాయం' అన్నారు.

జగన్ హామీలు ఎన్నికల స్టంటే: కొల్లు

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ఆర్నెల్ల ముందు పేదలకు ఇళ్ల పట్టాలు, ఇళ్ల నిర్మాణం అని చెప్పడం జగన్ ఎన్నికల స్టంటేనని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 'నోటిఫికేషన్ రావడానికి 10, 15 రోజుల ముందు జగన్ చేస్తున్న కార్యక్రమాలు, ప్రసంగాలపై ఎన్నికల కమిషన్ దృష్టి పెట్టాలి. అధికారుల సంతకాలు, ప్రభుత్వ ముద్రలు లేకుండా ఇచ్చే ఇంటి పట్టాలు దేనికి పనికొస్తాయో వైసీపీ నేతలు చెప్పాలి. ఎన్నికల కోసం జగన్ వేస్తున్న వేషాల్ని, ఇస్తున్న తాయలాల్ని ప్రజలు బాగా గమనిస్తున్నారు' అని కొల్లు అన్నారు.

జగన్ ఇసుక దోపిడీపై ఆందోళనలు: అచ్చెన్న

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా అక్రమ ఇసుక తవ్వకాలు జరిగే ప్రాంతాల్లో శనివారం టీడీపీ, జనసేన ఆందోళనలు నిర్వహిస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 'వైసీపీ అధికారంలోకి రాగానే టీడీపీ ఇచ్చిన ఉచిత ఇసుకను రద్దు చేసిన జగన్ ఐదేళ్లలో రూ.50 వేల కోట్లు లూటీ చేశాడు. ఈ అక్రమ ఇసుక తవ్వకాలు జరిగే 175 నియోజకవర్గాల్లో టీడీపీ, జనసేన శ్రేణులు రీచ్‌ల వద్ద నిరసనలు తెలపడంతో పాటు వైసీపీ అక్రమ ఇసుక దోపిడీని ఫొటోలు, సెల్ఫీల రూపంలో ప్రజల్లో ఎండగట్టాలి' అని అచ్చెన్న పిలుపు ఇచ్చారు.

మాట తప్పి మడమ తిప్పిన జగన్: ఎంపీ కనకమేడల

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పేదలకు ఇళ్ల నిర్మాణ హామీ ఇచ్చిన సీఎం జగన్.. మాట తప్పి మడమ తిప్పారని రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్రకుమార్ ఆరోపించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. 'ఐదేళ్లలో 25 లక్షల ఇళ్లు నిర్మించి పేదలకు ఇస్తానన్న జగన్ 4 ఏళ్ల 10 నెలల్లో కేవలం 5 లక్షల ఇళ్లు మాత్రమే నిర్మించగలిగారు. జనావాసాలకు దూరంగా మౌలిక వసతులు కల్పించకుండా పేదలని వంచించారు' అని కనకమేడల అన్నారు.

సెంటు పట్టా పేరుతో 7,000 కోట్ల అవినీతి: సోమిరెడ్డి

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సెంటు పట్టా పేరుతో జగన్ రూ.7,000 కోట్ల అవినీతికి పాల్పడ్డారని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆరోపించారు. 'చంద్రబాబు పేదలకు 2 సెంట్లు పట్టా ఇస్తే జగన్ దానిని ఒక్క సెంట్‌కు పరిమితం చేశారు. పైగా ఒంగోలు సభలోను జగన్ పదే పదే అబద్ధాలు చెప్పారు. 57 నెలల పాలనలో 14 లక్షల ఎకరాల అసైన్డ్ భూములను కబ్జా చేసిన జగన్ ముఠా పేదల ద్రోహులు కారా' అని అన్నారు.

గిరిజనులకు ద్రోహం చేస్తున్న జగన్: వరప్రసాద్

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): నకిలీ అభ్యర్థులకు టికెట్లు ఇచ్చి జగన్ నిజమైన గిరిజనులకు ద్రోహం చేస్తున్నారని, గిరిజనుల రాజకీయ హక్కులను కాలరాస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ ఒక ప్రకటనలో విమర్శించారు. బోగస్ గిరిజనురాలైన పుష్పశ్రీవాణికి ఎమ్మెల్యే సీటు, మంత్రి పదవి కట్టబెట్టి ఏజెన్సీ గిరిజన హక్కులకు గండికొట్టారన్నారు.

చైనా సరిహద్దులో అత్యాధునిక రాడార్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: రక్షణ రంగ బలోపేతానికి కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకొంది. చైనా సరిహద్దు అయిన వాస్తవాధీన రేఖ(ఎల్ఏసీ) వద్ద అత్యాధునిక రాడార్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రూ.6 వేల కోట్లు కేటాయించింది. ఈ రాడార్లను ఎల్ ఎండ్ టీ సంస్థ స్వదేశంలోనే తయారు చేయనుండడం గమనార్హం.

రఫాపై ఇజ్రాయెల్ దాడుల్లో 100 మంది మృతి

గాజా, ఫిబ్రవరి 23: దక్షిణ గాజాలోని రఫా నగరంపై ఇజ్రాయెల్ రాత్రిపూట భీకరమైన బాంబు దాడులతో విరుచుకుపడింది. దాడుల మూలంగా 24 గంటల్లో దాదాపు 100మంది చనిపోయారని, మరో 130 మంది గాయాలపాలయ్యారని గాజా వైద్యాధికారులు తెలిపారు. చాలా మంది బాధితులు శిథిలాల కింద చిక్కుకున్నారని చెప్పారు.

నూతనంగా ఎక్స్‌మెయిల్ ఆవిష్కరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23: నూతనంగా ఎక్స్‌మెయిల్‌ను తీసుకురానున్నట్లు ఎక్స్(ట్విటర్) సీఈవో ఎలాన్ మస్క్ ధ్రువీకరించారు. గూగుల్ జీమెయిల్‌ను మూసివేస్తుందంటూ వదంతులు వ్యాపించిన నేపథ్యంలో మస్క్ చేసిన ఓ ట్వీట్ ప్రాధాన్యం సంతరించుకొంది. ఆగస్టు ఒక టో తేదీ నుంచి మెయిల్స్ సేవలు నిలిచిపోతాయన్న వదంతులు వ్యాపించగా.. వీటిని గూగుల్ ఖండించింది. జీమెయిల్ సేవలు కొనసాగుతాయంది.

హోటల్‌లో వ్యభిచార రాకెట్.. బీజేపీ నేత అరెస్టు

కోల్‌కతా, ఫిబ్రవరి 23: హావడాలో వ్యభిచార రాకెట్ నడుపుతున్నారనే ఆరోపణలపై పశ్చిమబెంగాల్‌లో బీజేపీ నేత సబ్యసాచి ఘోష్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఉత్తర24 పరగణాల జిల్లాలోని సందేశ్‌ఖాలీ ప్రాంతంలో అధికార టీఎంసీ నేత షేక్ షాజహాన్, అతడి అనుచరులు స్థానిక మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారని బీజేపీ ఆరోపిస్తోంది. ఈ నేపథ్యంలో బీజేపీ నేతను అరెస్టు చేయడం ప్రాధాన్యంసంతరించుకుంది. సబ్యసాచి ఘోష్‌కు చెందిన ఓ హోటల్‌లో నిర్వహిస్తున్న వ్యభిచార రాకెట్‌ను బెంగాల్ పోలీసులు ఛేదించారని టీఎంసీ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో పోస్టు చేసింది. హావడాలోని సంక్రాలి ప్రాంతంలో మైనర్ బాలికలతో తన హోటల్‌లో వ్యభిచార రాకెట్ నడుపుతూ ఘోష్ పట్టుబడ్డారని, ఈ వ్యవహారంలో 11 మందిని అరెస్టు చేసిన పోలీసులు ఆరుగురు బాధితులను రక్షించారని తెలిపింది.

తెనాలిలో డయేరియా కలకలం!

తెనాలి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కలుషిత నీరు తెనాలిలో ఒక నిండు ప్రాణాన్ని బలి తీసుకోగా, మరో 20 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. గుంటూరు జిల్లా తెనాలి గురవయ్య కాలనీకి చెందిన బండి లక్ష్మి(60) అనే మహిళ రెండు రోజుల క్రితం మృతి చెందిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. లక్ష్మి మూడు రోజుల క్రితం వాంతులు, విరేచనాలతో తెనాలిలోని జిల్లా వైద్యశాలలో చేరింది. ఆ రోజు రాత్రి వరకు చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడికి వెళ్లిన గంటసేపటికే ఆమె చనిపోయింది. ఆమెతోపాటే మరో 15 మంది వరకు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నట్టు సమాచారం.

చిరుధాన్యాలతో మిలాన్ లోగో

విశాఖ నగరానికి చెందిన చిత్రకారుడు మోకా విజయ్‌కుమార్ చిరుధాన్యాలతో మిలాన్ లోగోను రూపొందించారు. విశాఖపట్నం వేదికగా నిర్వహిస్తున్న 'మిలాన్-2024' సందర్భంగా వారం రోజులపాటు శ్రమించి ఈ లోగోను తీర్చిదిద్దినట్టు ఆయన వివరించారు.



- వెంకోజీపాలెం (విశాఖపట్నం)



'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి నిరసనగా బెంగళూరులో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రవాసాంధ్రులు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన గూండాలను అరెస్టు చేయాలి

బెంగళూరులో ప్రవాసాంధ్రుల నిరసన ర్యాలీ

బెంగళూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అనంతపురం జిల్లా రాప్తాడులో ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేసిన గూండాలను వెంటనే అరెస్టు చేయాలని ప్రవాసాంధ్రులు డిమాండ్ చేశారు. బెంగళూరులోని యలహంకలో శుక్రవారం సాయంత్రం ప్రవాసాంధ్రులు, తెలుగుదేశం పార్టీ అభిమానులు, చేనేత కార్మిక సంఘం ముఖ్యుల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. స్థానిక చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు చిన్నప్ప, ఖాదీ బోర్డు మాజీ ఛైర్మన్ పాపణ్ణ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. వైసీపీ పాలనలో పాత్రికేయులపై దాడులు పెరిగాయని మండిపడ్డారు. శ్రీకృష్ణపై దాడిని వైసీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు ఒక్కరు కూడా ఖండించకపోవడం దారుణమన్నారు. దాడి చేసిన వారందరినీ వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తమ్, వీరభద్ర, వేణుగోపాలరెడ్డి, అప్పారెడ్డి, సుధాకరరెడ్డి, మీసాలరెడ్డి, అశోక్, నాగేంద్ర, నాగార్జున, పవన్‌కుమార్, రవీంద్ర, రమణ, మోహన్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై జరిగిన దాడిని, టీవీ5 ప్రతినిధిపై జరిగిన దాడిని ఖండించారు.

'గడప గడప'లో దగా

» జగన్ సర్కారు ఉత్తుత్తి ఆర్భాటం

» బిల్లులు ఇవ్వక ఆగిపోయిన పనులు

» గ్రామాల్లో కనీస సౌకర్యాల కల్పనకు సచివాలయానికి 20 లక్షలు మంజూరు

» ప్రజల నిరసనలు తప్పించుకునేందుకు ఎమ్మెల్యేలు, నేతలు హామీలు

» పోటీలు పడి అంచనాలు తయారీ

» పనులు చేసి చేతులు కాల్చుకున్న కార్యకర్తలు

» బిల్లుల జనరేషన్ నిలిపేసిన ప్రభుత్వం

» సచివాలయ భవనాలు, లింకు రోడ్ల పరిస్థితీ అంతే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేయడం.. కేంద్రం ఇచ్చిన నిధులనూ దారి మళ్లించడంతో గ్రామాల్లో అభివృద్ధి పడకేసింది. గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అయినా కొన్ని పనులైనా జరుగుతాయని ఆశిస్తే... జగన్ సర్కారు దీన్ని కూడా మడతపెట్టేసింది. బిల్లులు ఆపేయడంతో ఎక్కడి పనులు అక్కడ ఆగిపోయాయి. ఏడాది కిందట గడప గడపకూ ప్రభుత్వం అంటూ ఒక కార్యక్రమం చేపట్టిన సంగతి తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాలు తప్ప అభివృద్ధిని పట్టించుకోలేదన్న విమర్శలు రావడంతో ఎమ్మెల్యేలు, స్థానిక వైసీపీ నేతల ఒత్తిడితో అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు మంజూరు చేశారు. ఈ పథకం ద్వారా ప్రతి సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 13 వేల గ్రామ సచివాలయాలకు సుమారు రూ.2,600 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆర్భాటంగా ప్రకటించారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు తదితర సౌకర్యాల గురించి ప్రజల నుంచి నిలదీతలు ఎదురైనప్పుడు ఈ నిధుల నుంచి పనులు మంజూరు చేశారు. పలు చోట్ల పనులు ప్రారంభించి కొంత మేర చేశారు. బిల్లులు సీఎఫ్ఎంఎస్ ద్వారా పంపించగా మొదట్లో కొంత మేర చెల్లింపులు చేశారు. ఆ తర్వాత ఆ ఊసే లేదు. ఇప్పుడైతే ఆయా పనులకు సంబంధించిన బిల్లులు జనరేట్ చేయకుండా ఏకంగా నిలిపేశారు. గడప గడపకూ ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు ఇచ్చిన హామీలన్నీ తుస్సుమన్నాయి. ఆయా పనులు ఏమయ్యాయంటూ స్థానికులు నిలదీస్తుండటంతో గ్రామాల్లో వైసీపీ నేతలు తిరగలేని పరిస్థితి ఏర్పడింది. ఈ ప్రభుత్వంలో బిల్లుల చెల్లింపుల గురించి ఎవరిని అడగాలో తెలియక ఎమ్మెల్యేలే అయోమయంలో ఉన్నారు. సచివాలయ భవనాలు, జగనన్న కాలనీలు, ఇతర పథకాల మాదిరిగానే గడప గడపకూ ప్రభుత్వం కార్యక్రమం కూడా అటకెక్కింది.

పనుల పేరిట హడావుడి

ఎమ్మెల్యేలందరూ గడప గడపలో పాల్గొనాలని గతేడాది జగన్ పలుమార్లు ఆదేశించారు. అయితే గ్రామాల్లో తిరిగిన ఎమ్మెల్యేలకు ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. నవరత్నాలంటూ సీఎం జగన్ నెలకు ఒకటి, రెండు సార్లు బటన్ నొక్కడం మినహా అభివృద్ధి కార్యక్రమాలను పట్టించుకోకపోవడమే దీనికి కారణం. ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. చాలా గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, ఇతర వసతుల గురించి ఎమ్మెల్యేలను మహిళలు, వృద్ధులు, ప్రజలు నిలదీశారు. ఎమ్మెల్యేలను మొహం మీదనే ప్రశ్నించసాగారు. ప్రతి రోజు ఏదో ఒక గ్రామంలో వైసీపీ ఎమ్మెల్యేలు ప్రజల నుంచి చీదరింపులు, నిరసనలు, నిలదీతలు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో పలువురు ఎమ్మెల్యేలు జగన్‌కు తమ పరిస్థితి చెప్పారు. తాము గ్రామాల్లోకి వెళ్లాలంటే వాళ్లడిగిన కనీస అవసరాలను తీర్చాలని, అప్పుడే పర్యటించగలమని స్పష్టం చేశారు. దీంతో జగన్ ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేస్తున్నామని ప్రకటించారు. కలెక్టర్లు వెంటనే పనులు మంజూరుచేయాలని ఆదేశించారు. ఇదంతా జరిగి ఏడాదయింది. దీంతో గ్రామాలకు పర్యటనకు ఎమ్మెల్యేలు, నేతలు వెళ్లారు. స్థానికులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించేందుకు అక్కడకక్కడే పనులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అంతేకాకుండా వెంటనే పనులు మంజూరు చేయాలని కలెక్టర్లపై ఒత్తిడి తెచ్చారు. స్థానికంగా నేతలకు ఈ పనులను కట్టబెట్టారు. పలు చోట్ల ఆయా పనులను చేపట్టి బిల్లులు చేసుకున్నారు. ఆ తర్వాత ప్రభుత్వం బిల్లులు ఆపేసింది. ఇప్పుడు బిల్లులు పెట్టొద్దంటూ ఇంజనీర్లకు ఆదేశాలు వెళ్లాయి. దీంతో ఎక్కడా ఈ పనులు ఊసే లేకుండా పోయాయి. చేపట్టిన పనులకు బిల్లులు మంజూరు చేయించాలని స్థానిక నేతలు ఎమ్మెల్యేలపై ఒత్తిడి తెస్తున్నారు. అయితే ఎమ్మెల్యేలు కూడా నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికలు దగ్గర పడుతుండటం, సీట్ల వ్యవహారం గందరగోళంగా మారడంతో ఎమ్మెల్యేలకు స్థానిక నేతల గోడు పట్టడం లేదు. జగన్ సర్కార్ వచ్చిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా సచివాలయాలకు సొంత భవనాలను నిర్మించేందుకు ఆర్భాటంగా 10 వేల భవనాలను మంజూరు చేసింది. బిల్లులు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించిన జగనన్న ఇళ్ల కాలనీల పరిస్థితి కూడా అంతే. అటు సచివాలయ భవనాలు పూర్తికాకపోగా, ఇటు జగనన్న కాలనీల చదును పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మార్కెట్ నిధులతో గ్రామాల్లో లింక్ రోడ్లు నిర్మిస్తామంటూ రెండేళ్ల కిందట జగన్ ప్రభుత్వం ఆర్భాటం చేసింది. ఆయా గ్రామీణ ప్రాంతాల్లో మార్కెట్ సెస్ ద్వారా వచ్చే నిధులతో చేపట్టాలని రూ.1000 కోట్ల విలువైన పనులు మంజూరు చేసింది. బిల్లులు రావన్న అభిప్రాయంతో ఈ పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. వైసీపీకి చెందిన కొద్ది మంది కాంట్రాక్టర్లు పనులు చేపట్టినా బిల్లులు రాకపోవడంతో పనులు ఆపేశారు. కొందరైతే కోర్టులను ఆశ్రయించారు. బిల్లులు ఇవ్వాలని కోర్టు ఆదేశాలు జారీ చేసినా ప్రభుత్వం అమలు చేయడం లేదు. దీంతో కాంట్రాక్టర్లు వందల కొద్దీ కోర్టు ధిక్కరణ పిటిషన్లు వేశారు.



ఎమ్మెల్యే జగ్గిరెడ్డికి వ్యతిరేకంగా ఫ్లెక్సీ పెట్టి నిరసన తెలుపుతున్న మహిళలు

స్వగ్రామంలో వైసీపీ ఎమ్మెల్యేకి సెగ

» ఎంపీపీ స్కూల్‌కు తన తండ్రి పేరు

» తీవ్రంగా వ్యతిరేకిస్తున్న దళితులు

» ఆందోళనల నడుమే శిలాఫలకం ఆవిష్కరణ

» కోనసీమ జిల్లా గోపాలపురంలో ఘటన

రావులపాలెం, ఫిబ్రవరి 23: వైసీపీ కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి తన సొంత గ్రామంలో దళితుల నుంచి నిరసన సెగ తగిలింది. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి శుక్రవారం అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండలం, గోపాలపురానికి వచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ నగర్ వద్ద అవంతి ఫ్యాక్టరీ యజమాన్యం సమకూర్చిన నిధులతో నిర్మించిన ఎంపీపీ పాఠశాలను ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. అయితే, ఈ పాఠశాలకు జగ్గిరెడ్డి తండ్రి చిర్ల సోమసుందరరెడ్డి పేరు పెట్టడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. శిలాఫలకం ఆవిష్కరణను అడ్డుకునే ప్రయత్నం చేశారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద 'ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దౌర్జన్యం నశించా'లంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి దళితులు నిరసన తెలిపారు. ఒకపక్క నిరసనలు కొనసాగుతుండగానే మరోపక్క ఎమ్మెల్యే జగ్గిరెడ్డి.. అవంతి ఎండీ ఇంద్రకుమార్‌తో కలిసి పోలీసు బందోబస్తు నడుమ పాఠశాల శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముందు అక్కడే ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాల వేశారు. పోలీసులు ఆందోళన చేస్తున్న వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. కార్యక్రమం అనంతరం జగ్గిరెడ్డి అక్కడి నుంచి 'గడపగడపకు' కార్యక్రమం కోసం వెళ్లారు. సిద్ధార్థనగర్ యువకులు అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి వేసిన పూలదండలను తీసేసి పాలభిషేకం చేశారు.

షర్మిలను అరెస్టు చేశారా?: బొత్స

అమరావతి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): "అయ్యో.. షర్మిలను అరెస్టు చేశారా? తెలీదే!" అని మంత్రి బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. శుక్రవారం సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పీసీసీ చీఫ్ షర్మిల అరెస్టుపై మీడియా ప్రశ్నించగా.. "నాకు ఆ విషయం తెలియదు. ప్రభుత్వం తొందరపాటు తనంతో, దురుద్దేశంతో ఏదీ చేయదు. ప్రజాస్వామ్య బద్ధంగా వ్యవహరిస్తుంది" అని అన్నారు. అంతేకాదు, 'ప్రతిపక్ష పార్టీ ఖాళీగా కూర్చుంటుందా? ఎక్కడో ఒకచోట సభ పెట్టుకోవాలి కదా పెట్టుకోనివ్వండి. ఉత్తరాంధ్రలో సంక్రాంతి పండగ ముందు కొందరు రంగులేసుకుని వస్తారు. అలా వచ్చినట్టే ఎన్నికల ముందు ప్రతిపక్షాలు వస్తున్నాయి. నా మీద ఎవరో ఒకరు పోటీ చెయ్యాలి కదా.. గంటా శ్రీనివాసరావు పోటీ చేసినా అభ్యంతరం లేదు" అని బొత్స అన్నారు. అయితే, గంటా శ్రీనివాసరావు నియోజకవర్గం మారినప్పటికీ గెలుస్తున్నారు కదా అని ప్రశ్నించగా "ఆ సంప్రదాయం ఇప్పుడు నా దగ్గర మారొచ్చు" అని మంత్రి బొత్స వాఖ్యానించారు.

నకిలీ వరుడితో ఆమె ప్రేమ.. అసలు వరుడికి గండమై..

నిందితురాలు తృష్ణ





బాధితుడు ప్రణవ్

మ్యాట్రిమోనీ సైట్‌లో సైబర్ నేరగాడి ఫేక్ ప్రొఫైల్

» ఫొటో నచ్చడంతో చాటింగ్ చేసిన యువతి

» పెట్టుబడిగా అడిగితే పలు విడతల్లో రూ.40 లక్షలు

» సైబర్ నేరగాడి చేతిలో మోసపోయానని తెలియడంతో ఫొటో ద్వారా అసలు యువకుడి కోస గాలింపు

» పెళ్లికి ప్రతిపాదన.. తిరస్కరించిన యువకుడు

» కిడ్నాప్ చేయించి 5గంటల పాటు చిత్రహింసలు

ఉప్పల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఆమె నుంచి అతడు పైసా తీసుకోలేదు! ఆమెతో అసలు పరిచయం కూడా లేదు. ఆమె మాత్రం మనుషులను పెట్టి మరీ అతడిని కిడ్నాప్ చేయించింది. ఇస్తే రూ.40 లక్షలైనా ఇవ్వు, లేదంటే తనను పెళ్లయినా చేసుకో అంటూ హెచ్చరించింది. నోరెళ్లబెట్టిన అతడు.. నేనెందుకు డబ్బివ్వాలి? అయినా ఈ పెళ్లి గోల ఏమిటి? అని ప్రశ్నించడంతో కిడ్నాప్ చేయించిన మనుషులతోనే యువకుడిని చితగ్గొట్టించింది. ఆ చెర నుంచి ఎలాగోలా బయటపడ్డ బాధితుడు ఆ యువతి నుంచి తనను కాపాడాలంటూ పోలీసులను ఆశ్రయించాడు. ఉప్పల్ పరిధిలో ఈ ఘటన వెలుగుచూసింది. మరి.. తానివ్వని డబ్బు కోసం అతడిని ఆ యువతి ఎందుకు వేధించింది? పెళ్లి చేసుకోవాలంటూ అతడిపై ఎందుకు ఒత్తిడి తెచ్చింది? ఈ అనుమానాలు తీరాలంటే ఓ థ్రిల్లింగ్ సినిమా తరహాలో జరిగిన 'ఫ్లాష్‌బ్లాక్' లోకి వెళ్లాల్సిందే!! ఏసీపీ పురుషోత్తం రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. మాదాపూర్‌కు చెందిన బోగిరెడ్డి తృష్ణ (31) అక్కడే ఓ డిజిటల్ సంస్థను నిర్వహిస్తోంది. ఈమెకు గతంలోనే పెళ్లయినా భర్త నుంచి విడాకులు తీసుకొని దూరంగా ఉంటోంది. మళ్లీ పెళ్లి చేసుకోవాలనుకొని మ్యాట్రిమోనీ సైట్లలో వరుడి కోసం వెతకడం మొదలుపెట్టింది. భారత్ మ్యాట్రిమోనీ సైట్‌లో చైతన్య రెడ్డి పేరుతో ఓ ప్రొఫైల్‌ను చూసింది. అయితే అది ఓ ఫేక్ ప్రొఫైల్! ఎవరైనా సంప్రదిస్తే.. మాయమాటలతో అందినకాడికి వసూళ్లు చేయాలనే పక్కా పథకంతో ఓ సైబర్ నేరగాడు ఆ ప్రొఫైల్ పెట్టాడు. వరుడి ఫొటోగా ఉప్పల్‌లోని న్యూ భరత్‌నగర్‌లో నివసిస్తున్న ప్రణవ్ శిష్టా (27) అనే యువకుడి ఫొటోను పెట్టాడు. ఇవేమీ తెలియని తృష్ణకు చైతన్య రెడ్డి పేరుతో ఉన్న ఆ ఫొటో ప్రొఫైల్ నచ్చడంతో చాటింగ్ మొదలు పెట్టింది. చాటింగ్ ద్వారా ఆవలి వైపు 'వ్యక్తి' భావాలు కూడా నచ్చడంతో అతడినే పెళ్లి చేసుకోవాలనుకుంది. ఇదే మాటను చాటింగ్‌లో భాగంగా వ్యక్తీకరిస్తే ఆవలి వైపు నుంచి ఓకే అనే మెసేజ్ వచ్చింది. అయితే తానో సైబర్ నేరగాడితో చాటింగ్ చేస్తున్నాననే విషయం తెలియని తృష్ణ.. లేని చైతన్య రెడ్డితో అనుబంధాన్ని పెంచుకుంది! ఇక్కడే తృష్ణ బలహీనతను గుర్తించిన ఆ సైబర్ నేరగాడు ఆమెకు మాయమాటలు చెప్పి వసూళ్లకు తెరతీశాడు. తన వ్యాపారంలో పెట్టుబడి పెట్టాలని.. లాభాల్లో ఎక్కువ వాటా ఇస్తానని చెప్పడంతో తృష్ణ ఇట్టే నమ్మేసింది. తన ఖాతా నుంచి పలు దఫాలుగా రూ.40 లక్షలను అతడి ఖాతాకు బదిలీ చేసింది. కొన్నాళ్ల తర్వాత తన డబ్బులు ఇవ్వాలని ఆమె అడిగితే.. ఆవలి వైపు నుంచి స్పందన రాలేదు. ఫలితంగా తాను మోసపోయానని తెలుసుకున్న తృష్ణ.. 'మ్యాట్రిమోనీలోని ఫొటో' సాయంతో ఆ యువకుడు ఎవరనేది తెలుసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆ ఫొటో ప్రణవ్ శిష్టాది అని తెలుసుకుంది. అతడి ఫోన్ నంబరూ సంపాదించింది. అతడితో మాట్లాడింది. ఆ ఫొటో తనదేనని.. అయితే డబ్బులు తీసుకుంది మాత్రం తాను కాదని ఆమెకు ప్రణవ్ చెప్పాడు. కంగుతిన్న ఆమె, తనకు ఎదురైన అనుభవాన్ని పూర్తిగా అతడికి చెప్పింది. వెంటనే ప్రణవ్, సదరు మ్యాట్రిమోనీ సైట్‌పై చర్యలు తీసుకోవాలంటూ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశాడు. ఇది జరిగాక.. ప్రణవ్‌తో తృష్ణ పరిచయం పెంచుకుంది. అతడితో తరచూ మాట్లాడేది. అప్పటికే ప్రణవ్ ఫొటోను చూసి అనుబంధాన్ని పెంచుకోవడం, అతడినే పెళ్లి చేసుకోవాలని అనుకోవడంతో ఇదే మాటను ప్రణవ్‌తో చెప్పింది. ఆమె పెళ్లి ప్రతిపాదనను ప్రణవ్ తిరస్కరించాడు. ఆమెను దూరం పెట్టాడు. ఆమె నంబరునూ బ్లాక్ చేశాడు. ఎలాగైనా ప్రణవ్‌నే పెళ్లి చేసుకోవాలని అనుకున్న తృష్ణ, అతడిని కిడ్నాప్‌ఎకు ప్రణాళిక వేసింది. అతడి కారుకు ఓ ట్రాకర్‌ను అమర్చి కదలికలపై నిఘా పెట్టింది. ప్రణవ్‌ను కిడ్నాప్ చేసేందుకు తమ సంస్థలో పనిచేస్తున్న వ్యక్తిని పురమాయించింది. ఇందుకు అతడికి రూ. 50 వేలు ఇచ్చింది. ప్రణవ్ కదలికలపై నిఘా పెట్టిన సదరు వ్యక్తి మరో నలుగురితో కలిసి ఈనెల 11న ఆఫీసు నుంచి ఇంటికి వెళుతున్న ప్రణవ్‌ను అడ్డగించి కిడ్నాప్ చేశాడు. మాదాపూర్‌లో ఉన్న తృష్ణ కార్యాలయానికి తరలించి ఐదు గంటల పాటు తీవ్రంగా కొట్టారు. చివరకు బాధితుడు ప్రణవ్, తృష్ణ ఫోన్ కాల్స్‌కు స్పందిస్తానని చెప్పడంతో వదిలేశారు. వెంటనే ఈ ఘటనపై ప్రణవ్, ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలతో నిందితురాలు తృష్ణను గుర్తించి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. తృష్ణ వద్ద నుంచి సెల్‌ఫోన్‌తోపాటు బాధితుడి కారుకు అమర్చిన ట్రాకర్‌ను స్వాధీనం చేసుకున్నారు. కిడ్నాప్ చేసేందుకు తృష్ణకు సహకరించిన నిందితులు పరారీలో ఉన్నారని ఏసీపీ పురుషోత్తం రెడ్డి తెలిపారు.

ఎట్టకేలకు వీడిన వీసా అగచాట్లు

చిత్తూరు వాసి మృతదేహానికి విముక్తి

4 నెలల తర్వాత నేడు స్వదేశానికి రాక

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఎడారి నాట జననం నుంచి మరణం వరకు ప్రతిదీ వీసాతో ముడిపడి ఉన్న వ్యవహారమే! వీసా నంబర్ లేకపోవడంతో 4 నెలలుగా మార్చురీలో ఉన్న చిత్తూరు జిల్లాకు చెందిన ప్రవాసాంధ్రుడి మృతదేహం.. ఎట్టకేలకు శనివారం స్వదేశానికి రానుంది. 25 ఏళ్లకు పైగా సౌదీలో అక్రమంగా ఉంటూ కన్నవారిని, కట్టుకున్నవారిని ఒక్కసారి కూడా చూడకుండా కన్నుమూసిన ప్రవాసాంధ్రుడు చివరికి మరణించిన తర్వాతా చిక్కుల్లో పడ్డాడు. చిత్తూరు జిల్లా ఎర్రవారిపాలెం మండల కేంద్రానికి చెందిన పసుపులేటి శివయ్య 30ఏళ్లకు పైగా సౌదీ అరేబియాలో పనిచేస్తూ.. ఈ సుదీర్ఘ కాలంలో కేవలం ఒకే ఒకసారి 2001లో స్వదేశానికి వచ్చి భార్యాపిల్లలను కలిశారు. ఆ తర్వాత మళ్లీ సౌదీ వెళ్లి ఇప్పటి వరకు రాలేదు. సౌదీలో తాను పనిచేసే చోట యాజమానితో వివాదం ఏర్పడి పారిపోయాడు. ఆ తర్వాత వీసా (అఖమా) రెన్యువల్ చేయించుకోలేక.. చట్టవిరుద్ధంగా ఉంటూ పని చేసుకొంటున్న శివయ్య నవంబర్ 5న రియాధ్ నగరంలోని తన గదిలో గుండె పోటుతో మరణించాడు. ఆ సమయంలో అతడి వద్ద వీసీ, పాస్ పోర్టు కాపీలు లేకపోవడం, బయోమెట్రిక్ నమోదు చేసుకోకపోవడంతో శివయ్య గుర్తింపు, మృతదేహం తరలింపు పెను సవాల్‌గా మారింది. అతడి వివరాలు లేకపోవడంతో భారతీయ ఎంబసీ కూడా భారతీయ పౌరుడిగా గుర్తించడానికి సమస్యగా మారింది. ఈ క్రమంలో శివయ్య మృతదేహం గురించి తెలుసుకున్న సౌదీలోని సామాజిక కార్యకర్తలు ముజ్జమీల్ షేక్, సిద్ధిఖ్ తువూరు.. గత రెండు నెలలుగా నిరంతరం సౌదీ అధికారుల చుట్టు తిరిగి శివయ్య మృతదేహాన్ని దేశం నుంచి తరలించడానికి అనుమతి సాధించడంతో శుక్రవారం మృతదేహం చెన్నైకు బయలుదేరింది. చెన్నై నుంచి చిత్తూరు జిలాలోని స్వగ్రామానికి శనివారం చేరుకొంటుందని ముజ్జమ్మీల్ షేక్ చెప్పారు.

జగన్ అవకాశవాది

» ఏ పార్టీలో ఉన్నా బీజేపీకే ఓటు: మంద కృష్ణమాదిగ

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 23: సీఎం జగన్మోహన్ రెడ్డి అవకాశవాది అని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ విమర్శించారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగిన ఉమ్మడి జిల్లా ఎంఆర్‌పీఎస్, ఎంపీఎస్ ఉమ్మడి నాయకుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు మాజీ ముఖ్యమంత్రులు చంద్రబాబు, వైఎస్ రాజశేఖరరెడ్డి అనుకూలంగానే వ్యవహరించారని, అయితే జగన్ ఎస్సీ వర్గీకరణకు కనీసం రాష్ట్రం నుంచి న్యాయవాదిని కూడా పెట్టలేదని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు ప్రధాని మోదీ సానుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఆయన చొరవతోనే ఎస్సీ వర్గీకరణ విషయం సుప్రీం కోర్టులో తుది దశకు చేరుకుందని తెలిపారు. మనమంతా బీజేపీకి అనుకూలంగా ఓటేద్దామన్నారు.

ఎన్నికల కోసమే జగన్‌కు హెలికాప్టర్లు

» సీఈసీకి ఎంపీ రఘురామ ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికలలో ప్రచారం చేసుకునేందుకు భద్రతా కారణాలను సాకుగా చెబుతూ ఏపీ సీఎం జగన్ ప్రభుత్వ ఖర్చుతో రెండు హెలికాప్టర్లను ఏర్పాటు చేసుకున్నారని ఎంపీ రఘురామ కృష్ణరాజు కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఎన్నికల ఖర్చు నుంచి తప్పించుకోవడానికి వీలుగా ముందస్తు ప్రణాళిక ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ ఖర్చుతో విజయవాడ, విశాఖ పట్నంలో రెండు హెలికాప్టర్లను పెట్టాలని ఒక జీవోను జగన్ సర్కారు విడుదల చేసిందని పేర్కొన్నా రు. ఈ మేరకు ఆయన శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ రాజీవ్‌కుమార్‌కు లేఖరాశారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు హెలికాప్టర్లలో డబ్బును తరలించే అవకాశముందన్నారు.

నేడో రేపో వైసీపీకి రాజీనామా: రఘురామ

సీఎం జగన్ అనుచరులు ప్రతినెలా జిల్లాల వారీగా, ఇసుక రీచ్‌ల వారీగా రూ.వందల కోట్లు అక్రమ వసూలు చేసుకున్నారని వైసీపీ ఎంపీ రఘురామ కృష్ణరాజు అన్నారు. శుక్రవారం రచ్చబండ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'గత ఐదేళ్ల జగన్ పాలనలో ఇసుక తవ్వకాలలో రూ.40 వేల కోట్ల కుంభకోణం జరిగిందన్నారు. 'ఇందులో ప్రభుత్వ రాబడి ఎంత?, మిగిలినది ఆదాయం ఎవరు తినేశారన్నది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరం. తాడేపల్లి ప్యాలెస్ వ్యక్తులు తినేశారా? సీఎం సమీప బంధువులు తినేశారా?" అని ప్రశ్నించారు. కాగా, ఇవాళో, రేపో దిక్కుమాలిన వైసీపీకి, ఆ తర్వాత ఎంపీ పదవికి రాజీనామా చేస్తానన్నారు.

సాహితి ఇన్‌ఫ్రా కేసులో దర్యాప్తు ముమ్మరం

» ఏపీలో కోట్ల విలువైన భూములు గుర్తించి, స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రీ లాంచ్ పేరుతో హైదరాబాద్‌లో దాదాపు 3 వేల మందిని మోసం చేసిన సాహితి ఇన్‌ఫ్రా కేసులో సీసీఎస్ పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు. సాహితి ఇన్‌ఫ్రా యజమాని బూదాటి లక్ష్మీనారాయణ హైదరాబాద్‌లోనే కాకుండా గుంటూరులో కూడా ఇదే తరహాలో మోసం చేసినట్లు గుర్తించారు. పెదకాకాని మండలం కాజ లో 56 మంది రైతులకు సంబంధించిన 24 ఎకరాలు డెవలప్‌మెంట్ ఎగ్రిమెంట్ చేయించుకున్నారు. ఈ స్థలంలో భారీ భవనాలు, ఐటీ పార్కులు, విల్లాల నిర్మాణం చేస్తానని ప్రచారం చేసుకున్నారు. తర్వాత ప్రీ లాంచింగ్ ఆఫర్ పేరుతో పలువురి నుంచి కోట్లు వసూలు చేశారు. దర్యాప్తులో భాగంగా ఈ విషయాన్ని గుర్తించిన సీసీఎస్ పోలీసులు సదరు భూమిని అటాచ్ చేయించారు. స్వాధీనం చేసుకున్న స్థలంలో నోటీసు బోర్డులు పెట్టించారు.

కోర్టు వెలుపల పరిష్కరించుకోవాలి

» జ్ఞాన్‌వాపీ, మథుర వివాదాలపై అజ్మీర్ దర్గా చీఫ్ అబేదిన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి23: వారాణసీలోని జ్ఞాన్‌వాపీ, మథురలోని షాహీ ఈద్గా దర్గాలకు సంబంధించిన వివాదాలను కోర్టు వెలుపల సామరస్యంగా పరిష్కరించుకోవాలని అజ్మీర్ దర్గా చీఫ్ సయ్యద్ జైనుల్ అబేదిన్ సూచించారు. ఎలాంటి వివాదాన్ని అయినా పరస్పర అంగీకారంతో పరిష్కరించుకోవాలని చెప్పారు. ఆలిండియా సూఫీ సజ్జదాన్షిన్ కౌన్సిల్ రాజస్థాన్ యూనిట్ నిర్వహించిన 'పైగామ్-ఎ-మొహబ్బత్ హమ్ సబ్ కా భారత్' సదస్సులో ఆయన ప్రసంగించారు. పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)పై ముస్లిం సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. దీంతో భారతీయ ముస్లింలకు ఎలాంటి సంబంధంలేదని, ఇది వారిపై ఏ ప్రభావం చూపదని గుర్తించామన్నారు.

ఆంధ్రజ్యోతి

నవ్య స్మార్ట్

శనివారం • 24 ఫిబ్రవరి 2024



జీమెయిల్‌లో ఏఐ పవర్డ్ టూల్ ‘సూపర్ హ్యూమన్’

ఏఐ(ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్) పవర్డ్ ఈమెయిల్ యాప్ ‘సూపర్ హ్యూమన్’ అడ్వాన్స్‌డ్ ఫీచర్లతో ముందుకువస్తోంది. దీంతో ఉత్పాదకత పెరుగుతుంది. సమయం ఆదా అవుతుంది. ఈమెయిల్స్‌కు సమాధానం ఇవ్వడం అలాగే సులువుగా వేగంగా వాటిని పంపడంలో ఇది సహకరిస్తుంది. వారానికి నాలుగు గంటల సమయం ఆదా అవుతుందంటే ఈ ఫీచర్ పవర్ ఏమిటో ఇట్టే తెలుసుకోవచ్చు. ముఖ్యమైన టాస్కులపై దృష్టిపెట్టేందుకు యూజర్లకు వీలవుతుంది. ఈమెయిల్ మేనేజ్‌మెంట్, స్ట్రెస్ ఫ్రీ ఎక్స్‌పీరియెన్స్‌ను కలుగజేస్తుంది. ప్రధానంగా...



- యూజర్లు అందించిన కొద్దిపాటి ప్రేజులతో మొత్తం మెయిల్ డ్రాఫ్టింగ్‌కు వీలుంటుంది. సరైన పదాలతో, చాలా చక్కటి సమాధానం ఇవ్వవచ్చు.
- స్పెల్లింగ్, గ్రామర్ తప్పుల నివారణ, మిస్సింగ్ కేరెక్టర్లను పరిహరించడం, క్యాపిటల్ పదాల వినియోగం వంటివి చేస్తుంది.
- సూపర్ హ్యూమన్‌లో స్ప్లిట్ బాక్స్ ఉంటుంది. ఇది టీమ్స్‌ను విభజిస్తుంది. దీంతో కొన్ని సెక్షన్లపై యూజర్లు వెంటనే చర్య తీసుకోవాల్సిన పరిస్థితి తలెత్తుతుంది.
- స్నిపెట్ ఫీచర్ మరొకటి. తరచూ ఇచ్చే జవాబులను వేగంగా అవే వాక్యాలతో అమరుస్తుంది. ఫలితంగా సమయం ఆదా అవుతుంది.
- క్యాలండర్ ఈవెంట్లను యూజర్లు క్రియేట్ చేసుకోవచ్చు. టాస్కులను పూర్తి చేసుకోవచ్చు. ట్రాకింగ్ పనిని కూడా నిర్వహిస్తుంది. అన్నింటి కంటే ముఖ్యమైన విషయం ఇది సబ్‌స్క్రిప్షన్ టూల్. నెలకు 30 డాలర్లు చెల్లించాలి. అడ్వాన్స్‌డ్ ఫీచర్ల కోసం గ్రోత్, ఎంటర్‌ప్రైజ్ ప్లాన్స్ తీసుకోవాల్సి ఉంటుంది.



అడోబ్ ఆక్రోబాట్ పీడీఎఫ్ టూల్‌కు ఏఐ జోడింపు

అడోబ్ ఆక్రోబాట్ తన పీడీఎఫ్ మేనేజ్‌మెంట్ టూల్‌కు జనరేటివ్ ఏఐని పరిచయం చేస్తోంది. అడోబ్ ఆక్రోబాట్ మౌలికంగా పీడీఎఫ్ మేనేజ్‌మెంట్ టూల్ అన్న విషయం తెలిసిందే. దీనికి ఏఐ టూల్‌ని జతచేస్తోంది. ఫలితంగా మెరుగైన అనుభవం యూజర్లకు కలుగనుంది. ప్రధానంగా దీంతో అతి పెద్ద డాక్యుమెంట్లకు సంబంధించిన సమ్మరీ నిమిషాల్లోనే యూజర్లకు లభ్యమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా దాదాపుగా మూడు ట్రిలియన్ల మేరకు ఉన్న పీడీఎఫ్ డాక్యుమెంట్లకు ఈ ఏఐ టూల్‌తో అదనపు విలువ సమకూరనుందని అడోబ్ ఈ సందర్భంలో పేర్కొంది. ఏఐకి తోడు మెషీన్ లెర్నింగ్ టూల్స్‌ను ఈ ప్రక్రియలో అడోబ్ ఉపయోగిస్తుంది. ఫలితంగా పీడీఎఫ్ స్ట్రక్చర్ అదేవిధంగా కంటెంట్‌ను అర్థం చేసుకోవడం సులువుగా ఉంటుంది. అదనపు ఖర్చు లేకుండా ఈ ఫీచర్లను యూజర్లు ఉపయోగించుకోవచ్చు. ఈ టూల్స్‌తో డెస్క్‌టాప్‌పై ఒనగూరే ప్రయోజనాలను బ్లాగ్‌స్పాట్‌లో అడోబ్ తెలిపింది. కీ పాయింట్ల రూపంలో సమ్మరీని అందిస్తుంది. డేటా సెక్యూరిటీ ప్రొటోకాల్‌ను పాటిస్తుంది. అలాగే ఏఐ అసిస్టెంట్లకు శిక్షణ ఇచ్చేందుకు కస్టమర్ డేటాను అస్సలు స్టోర్ చేయదు. సమాచారానికి మరింత సెక్యూరిటీని సమకూరుస్తుంది.

ఐఫోన్ ‘బ్లింకిస్ట్’ వేల పుస్తకాలు చదివేయవచ్చు!

నేను లక్ష పుస్తకాలు చదివాను అంటే ఇక ఎకసక్కాలు చేయాల్సిన పనిలేదు. అలాంటివి ఇక నిన్నటి మాటలు. నిజంగానే పెద్ద సంఖ్యలో పుస్తకాలను జీవితకాలంలో చదివేయచ్చు.

అందుకు ఐఫోన్ యాప్ ‘బ్లింకిస్ట్’ తోడ్పడుతుంది. అన్నేసి పుస్తకాలు చదవడానికి లేదా పాడ్‌కాస్ట్‌లో వినడానికి సమయం లేకపోయినప్పటికీ ఇబ్బంది లేదు. ‘బ్లింకిస్ట్’ సహకారంతో అన్ని పుస్తకాలను తెలుసుకోవచ్చు. అందులో ఏముందో పట్టేయచ్చు. ఈ యాప్ మొత్తం పుస్తకాన్ని స్కాన్ చేసి కేవలం పదిహేను నిమిషాల వ్యవధిలో అందులో ఏముందో చెప్పేస్తుంది. అదేదో తెలుసుకుంటే చాలు, మొత్తం పుస్తకంలో ఏమి ఉందో పాఠకుడికీ తెలుస్తుంది.



వాస్తవానికి దీన్ని ఐఫోన్, ఐపాడ్ డివైజ్‌ల కోసం రూపొందించారు. ఇది పుస్తకాలు, పాడ్‌కాస్ట్ యూజర్లకు అర్థమయ్యేలా వివరించే యాప్. ఆడియో, టెక్స్ట్ ఫార్మేట్ రూపంలో అందిస్తుంది. కెరీర్, సక్సెస్, మైండ్‌ఫుల్‌నెస్, మతం, సైన్స్, చరిత్ర, పర్సనల్ డెవలప్‌మెంట్ సహా వివిధ సబ్జెక్టులను డీల్ చేస్తుంది. ఇందులో వేలకొద్దీ బెస్ట్ సెల్లింగ్ నాన్-ఫిక్షన్ పుస్తకాలు ఉన్నాయి. పదిహేను నిమిషాల్లో దేన్నైనా ఆకళింపు చేసుకోవచ్చు. ట్రావెలింగ్ నుంచి రిలాక్సింగ్ వరకు ఏ సమయంలో అయినా వీటిని ఆస్వాదించవచ్చు. హై క్వాలిటీ సమాచారంతో ఉంటుంది. ఇందులో షార్ట్‌కట్స్ అంటే ఇంకా తక్కువ చేసి కూడా ఉంటాయి. వాటిలోనూ విషయం మొత్తం కవర్ అవుతుంది. మొత్తమ్మీద ఈ యాప్‌లో చదివి లేదా విని ఒక పుస్తకంపై లోతైన అవగాహన కలిగించుకోవచ్చు.

మంచి అలవాట్లకు యాప్ హ్యాబిటిఫై

డిజిటల్ ప్రపంచంలో ఇదో సానుకూల కోణం. మంచి అలవాట్లను పెంపొందించుకునేందుకు ఉపకరించే యాప్ ‘హ్యాబిటిఫై’ అందులో ఒకటి. నిజానికి ఆరోగ్యకర అలవాట్లతో ఉత్పాదకత పెరుగుతుంది. ఎప్పటికప్పుడు ట్రాకింగ్‌తో తప్పులను సవరించుకోవచ్చు. లక్ష్యానికి చేరువ కావచ్చు. యాప్‌తో ట్రాకింగ్ ఎలాగంటే....

- ట్రాకింగ్ చేయాలని భావిస్తున్న వాటితో జాబితా రూపొందించుకోవాలి. రన్నింగ్, వర్కౌట్ వరకు అన్నీ లిస్ట్ చేసుకోవాలి. ఇవన్నీ దీర్ఘకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ఉండాలి. చర్యతీసుకోదగ్గవి, లక్ష్యం చేరుకోదగ్గవి ఎంచుకోవాలి.
- తదుపరి ప్రోగ్రెస్ పరీక్ష కోసం మెజర్‌మెంట్ యూనిట్‌ను క్రియేట్ చేసుకోవాలి. ప్రోగ్రెస్ ట్రాకింగ్‌లో భాగంగా వివిధ లక్ష్యాల కోసం వేర్వేరు మెజర్స్‌ను పెట్టుకోవాలి.
- క్రియేట్ చేసుకున్నవాటిని రొటీన్‌గా మార్చుకోగలగాలి. అలా చేస్తేనే వాటిపై కార్యచరణ సాధ్యమవుతుందని గుర్తించాలి.
- అప్పుడు ఈ యాప్ అలెర్ట్‌లు, రిమైండర్ ఫీచర్స్‌తో రంగంలోకి దిగుతుంది. నిర్దేశిత గడువులోగా అనుకున్న లక్ష్యసాధన దిశగా యూజర్ని హెచ్చరించగలుగుతుంది.
- ఐఫోన్, ఐప్యాడ్, యాపిల్ వాచీ, మ్యాక్స్‌లో యాప్‌ను యాక్సెస్ చేసుకోవచ్చు. ఈ యాప్‌ని ఐఓఎస్ డివైజ్‌లకు అనుగుణంగా తీర్చిదిద్దారు.



కొత్త ఫార్మేటింగ్ ఫీచర్స్

వాట్సాప్ ప్రాథమికంగా మెసేజింగ్‌కు అనువైనది. యూజర్ ఎక్స్‌పీరియెన్స్ పెంచే యత్నంలో భాగంగా ఏకంగా నాలుగు ఫార్మేటింగ్ ఫీచర్లను పరిచయం చేస్తోంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్, వెబ్, మేక్‌కు తోడు చానల్స్‌లో బుల్లెటెడ్ లిస్ట్స్, నంబర్డ్ లిస్ట్స్, బ్లాక్ కోట్స్, ఇంక్లయిన్ కోడ్‌ను ప్రవేశపెట్టింది. ఇప్పటికే ఉన్న బోల్డ్, ఇటాలిక్, స్ట్రయిక్‌త్రూ, మోనోస్పేస్ ఫార్మేట్‌లను కాంప్లిమెంట్ చేసేలా కొత్తవి ఉంటాయని ‘ద వెర్జ్’ తెలిపింది.

బుల్లెటెడ్ లిస్ట్స్: అటూ ఇటూ “ ” సింబల్స్‌తో స్పేస్ ఇచ్చుకుంటూ బుల్లెట్ పాయింట్స్‌ను క్రియేట్ చేసుకోవచ్చు.

నంబర్డ్ లిస్ట్స్: మెసేజ్‌లోని సమాచారం ఒక ఆర్డర్‌లో ఉండాలని భావిస్తే 1, 2 అంటూ అంకెలతో ఒక క్రమంలో పెట్టుకోవచ్చు.

బ్లాక్ కోట్స్: అతి పెద్ద మెసేజుల్లో బ్లాక్ కోట్స్‌తో హైలైట్ పెట్టుకోవచ్చు. సింపుల్‌గా > సింబల్‌ని టైప్ చేసి స్పేస్ ఇచ్చి ఆ పని చేయవచ్చు.

ఇంక్లయిన్ కోడ్: కోడర్స్‌కు ఇది పర్ఫెక్ట్. ప్రత్యేకించి ఒక సమాచారాన్ని తద్వారా హైలైట్ చేసుకోవచ్చు. “ ” సింబల్‌తో ఈ పనిచేయవచ్చు.

క్లాసిక్ ఫార్మేటింగ్ స్టయిల్స్ కావాలనుకునే వారికి ఈ ఫార్మేటింగ్ ఫీచర్స్ అనువుగా ఉంటాయి.



ప్లేస్టోర్‌లో ఆండ్రాయిడ్ మాల్వేర్

నాలుగువైపులా మూసేస్తే మరో పక్కనుంచి మాల్వేర్ దాడి జరుగుతోంది. తాజాగా గూగుల్ ప్లే స్టోర్‌లో మరో ఆండ్రాయిడ్ మాల్వేర్ యాప్‌ని కనుగొన్నారు. అది డేటాతోపాటు డబ్బులను తస్కరించేందుకు ఉపయోగపడుతున్న మాల్వేర్. గూగుల్ ప్లే స్టోర్‌లో అలాంటివి లక్షన్నర వరకు డౌన్‌లోడ్స్ కలిగి ఉన్నాయి. అనాట్సా బ్యాంకింగ్ ట్రోజన్ మాల్వేర్‌ని ఈ యాప్స్ వ్యాప్తి చెందిస్తున్నాయి. తద్వారా డివైజ్‌పై కంట్రోల్ సాధించి తమ పనులను చక్కబెడుతున్నాయి. ‘బ్లీపింగ్ కంప్యూటర్’ రిపోర్ట్ ప్రకారం ఇవి ఎక్కువగా ఉచిత పీడీఎఫ్, క్లీనర్ యాప్స్. ఇవి ఆండ్రాయిడ్ యాక్సెబిలిటీని, సర్వీస్‌ను పొందుతున్నాయి. ఆండ్రాయిడ్ 13, గూగుల్‌కు చెందిన సెక్యూరిటీ చెక్స్‌ను అధిగమించి మరీ పలు అంచెలుగా చొచ్చుకువస్తున్నాయి.



అలాంటి వాటిలో ‘ఫోన్ క్లీనర్ - ఫైల్ ఎక్స్‌ప్లోరర్’, ‘పీడీఎఫ్ వ్యూయర్ - ఫైల్ ఎక్స్‌ప్లోరర్’, ‘పీడీఎఫ్ రీడర్ - వ్యూయర్ అండ్ ఎడిటర్’, ‘ఫోన్ క్లీనర్: ఫైల్ ఎక్స్‌ప్లోరర్’, ‘పీడీఎఫ్ రీడర్: ఫైల్ మేనేజర్’ ఇందులో ఉన్నాయి. ఉచిత యాప్‌లన్నీ ఏదో ఒక రూపంలో డబ్బులు వసూలు చేస్తాయి.

వీటి నుంచి రక్షణ పొందాలంటే, ఉచిత యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోరాదు. అసలా యాప్ అవసరమా లేదా అన్నది మొదట ఆలోచించుకోవాలి. వేర్వేరు యాప్‌లతో డివైజ్‌ను నింపేయకూడదు. రెవ్యూ, రేటింగ్, డౌన్‌లోడ్స్ వంటివి చూసుకుని ఎంచుకోవాలి. ఆండ్రాయిడ్ డివైజుల్లో గూగుల్ ప్లే ప్రొటెక్ట్ ఉంచుకుంటే ఉన్న యాప్‌లకు తోడు మాలాసియస్ కోడ్ యాక్టివిటీని చెక్ చేస్తుంది. కొత్త యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నప్పుడు అలెర్ట్‌గా ఉండాలి.



ప్రాణాలు కాపాడిన యాపిల్ వాచీ

యాపిల్ వాచీ అచ్చంగా ఒక మనిషి ప్రాణాలు కాపాడింది. ఒక వ్యక్తి హార్ట్ రేటు గణనీయంగా తగ్గింది. వెంటనే యాపిల్ వాచీ సదరు యూజర్ని హెచ్చరించింది. అలా తాను ప్రాణాలు కాపాడుకున్నాడు. న్యూజెర్సీలో ఉంటున్న ఫ్రాంక్ హెగెర్టీ ఒక రిటైర్డ్ అకౌంటెంట్. తను యాపిల్ వాచీ ఎస్‌ఈ ‘బీ కూల్’ కొనుగోలు చేశాడు. ఒక రోజు పడుకున్న సమయంలో తన వాచీ నుంచి అలెర్ట్ వచ్చింది. హృదయస్పందన కాస్తా 30 బీట్స్ కంటే తక్కువగా నమోదైంది. వెంటనే తను హాస్పిటల్‌కు చేరుకున్నాడు. హార్ట్ పూర్తిగా బ్లాక్ అయిందని డాక్టర్లు నిర్ధరించారు. వెంటనే డాక్టర్లు చర్యలు తీసుకోవడంతో తను ప్రాణాలతో బైటపడ్డాడు.

యాపిల్ వాచీలో హార్ట్ రేటును చెక్ చేసుకోవాలంటే...

- యాపిల్ వాచీలో హార్ట్ రేట్ మానిటరింగ్‌కు టర్నాన్ కావాలి. సెట్టింగ్స్‌లోకి వెళ్ళి మొదట ప్రైవసీ అండ్ సెక్యూరిటీ తదుపరి హెల్త్‌ని సెలెక్ట్ చేసుకోవాలి.
- హార్ట్ రేట్‌ని టాప్ చేయాలి. హార్ట్ రేట్‌ని టర్నాన్ చేయాలి. హార్ట్ రేట్ యాప్‌ని ఓపెన్ చేయాలి. హార్ట్ రేటుని తెలుసుకోవాలి.

ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్ క్లిప్!



ఇన్‌స్టాగ్రామ్ సరికొత్త ఫీచర్ ‘యాప్ క్లిప్’ని పరీక్షిస్తోంది. దీంతో అవసరమైన యాప్ లేనప్పటికీ రీల్స్‌ని - యాప్ నేటివ్ ఇంటర్‌ఫేస్‌లో చూడవచ్చు. ఇది యాపిల్ క్లిప్‌తో సాధ్యమవుతుంది. ప్రస్తుతం దాన్ని ఇన్‌స్టాగ్రామ్ పరీక్షిస్తోంది. 2021లో ఒక అప్డేట్‌తో ఐఫోన్‌లోకి యాప్ క్లిప్ వచ్చింది. దీంతో సదరు ఫుల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలా వద్దా అన్నది ప్రివ్యూతో తేల్చుకోవచ్చు. బేటా టెస్టర్లకు టెస్ట్ ఫ్లయిట్ ద్వారా ఇది అందుబాటులో ఉందని ‘9టు5మేక్’ పేర్కొంది. దీంతో బ్రౌజర్ అవసరం లేకుండానే నేటివ్ యూఐతో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ చూడవచ్చు. ఇంకో విషయం, దీనికి ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ కూడా క్రియేట్ చేసుకోవాల్సిన అవసరం ఉండదు. అయితే ఆరో రీల్‌ను చూసిన తరవాత యాప్‌ని డైన్‌లోడ్ చేసుకోవాలని యూజర్ని ప్రోత్సహిస్తుంది. నిజానికి వేర్వేరు విధానాల్లో యాప్ క్లిప్స్‌ను పొందవచ్చు. యాప్ క్లిప్ ఓపెన్ అయిన తరవాత ఎనిమిది గంటల సేపు నోటిఫికేషన్స్ పంపగలదు. అలా అనుకున్నప్పుడు వీటిని డెమోలగా భావించవచ్చు.

ఇండియాలోకి శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 సిరీస్

శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 సిరీస్ ల్యాప్‌టాప్‌లు మూడు ఇండియాలోకి వస్తున్నాయి. గెలాక్సీ బుక్ 4 ప్రొ, గెలాకీ బుక్ 4 ప్రొ 360, గెలాక్సీ బుక్ 4 అల్ట్రా - మూడు మోడల్స్ వాస్తవానికి గత డిసెంబర్‌లోనే విడుదలయ్యాయి. స్పెసిఫికేషన్స్ విషయానికి వస్తే, వనీలా శాంసంగ్ గెలాక్సీ బుక్ 4 360 ముఖ్యంగా 15.6 ఇంచీల ఫుల్ హెచ్‌డి(1920 x 1080పిక్సెల్స్), సూపర్ అమోల్డ్ టచ్ స్క్రీన్ కలిగి ఉంది. ఇదే ప్రొ 360 మోడల్స్ 16 ఇంచీలు డైనమిక్ అమోల్డ్ 2ఎక్స్ యాటీ రిఫ్లక్షన్ టచ్ డిస్‌ప్లే కలిగి ఉన్నాయి. గెలాక్సీ బుక్ 4 ప్రొ 14 అలాగే 16 ఇంచీల స్క్రీన్‌తో రెండు వేరియంట్స్ ఉన్నాయి. టచ్ - సెన్సిటివ్ ప్యానల్స్ ఉన్నాయి. గెలాక్సీ బుక్ 4 360, గెలాక్సీ బుక్ 4 ప్రొ 360 వరుసగా 68డబ్ల్యుహెచ్(వాట్స్-అవర్స్), 76డబ్ల్యుహెచ్ బ్యాటరీలు ఉన్నాయి. 65 వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ సపోర్ట్ ఉంది. 14 ఇంచీల గెలాక్సీ బుక్ 4 ప్రొ 63డబ్ల్యుహెచ్ బ్యాటరీ, 16 ఇంచీల 76డబ్ల్యుహెచ్ బ్యాటరీ కలిగి ఉన్నాయి. 65 వాట్స్ చార్జింగ్ సపోర్ట్ ఉంది. ఇండియా ప్రస్తుతం ప్రీ ఆర్డర్‌కు అవకాశం కల్పించింది. మూన్‌స్టోన్, గ్రే ప్లాటినమ్ సిల్వర్ రంగుల్లో లభ్యమవుతున్నాయి. ఇంటెల్ కోర్ అల్ట్రా సీపీయూ కలిగి ఉన్నాయి. గెలాక్సీ బుక్ 4 360 రూ.1,14,990, గెలాక్సీ బుక్ 4 ప్రొ రూ.1,31,990, గెలాక్సీ బుక్ 4 ప్రొ 360 రూ.1,63,990 నుంచి ఉన్నాయి. ఫిబ్రవరి 12 నుంచి అందుబాటులో ఉన్నాయి. అయితే ఫ్లిప్ కార్ట్ లిస్టింగ్స్ ప్రకారం ఫిబ్రవరి 26 నుంచి డెలివరీ చేయనుంది.



మార్కెట్లోకి ఐకూ నియో 9 ప్రొ

ఐకూ నియో 9 ప్రొ ఇండియన్ మార్కెట్లోకి వచ్చేసింది. కంపెనీకి చెందిన లేటెస్ట్ ప్రీమియం మిడ్ రేంజ్ స్మార్ట్ ఫోన్ ఇది. క్వాల్కామ్‌కు చెందిన స్నాప్‌డ్రాగన్ 8జనరేషన్, 2 మొబైల్ ప్రాసెసర్, 12 జీబీ ర్యామ్, 256జీబీ ఇన్‌బిల్ట్ స్టోరేజీ ఉన్నాయి. ఆండ్రాయిడ్ 14-బేస్డ్ ఫన్‌టచ్ ఓఎస్ ఔటాఫ్ ద బాక్స్‌పై రన్ అవుతోంది. 6.78 ఇంచీలు 1260 x 2800 పిక్సెల్ - ఎల్‌టీపీఓ అమోల్డ్ స్క్రీన్, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు ఉన్నాయి. గేమింగ్ సమయంలో రిఫ్రెష్ రేటు 144హెచ్‌జెడ్‌గా ఉంటుంది. ఐకూ వెట్ టచ్ టెక్నాలజీ ఉంది. అంటే కొన్ని టాస్కులను యూజర్ పొడి చేతులతోనే చేయాలి. ఇందులో రెండు రేర్ కెమెరాలున్నాయి. ఒకటి సెన్సర్‌తో 50 మెగా పిక్సల్ కెమెరా. ఇంకొకటి 8 మెగా పిక్సెల్. వీడియో కాల్స్, సెల్ఫీల కోసం సెన్సర్‌తో 16 మెగా పిక్సల్ కెమెరా ఉంది. బ్లూటూత్ 5.3, జీపీఎస్, యుఎస్‌బీ టైప్-సి పోర్ట్‌కు తోడు యాక్సిలరోమీటర్, యాంబియెంట్ లైట్ సెన్సర్, ఈ-కాంపాస్, ప్రాక్సిమిటీ సెన్సర్, గైరోస్కోప్ ఉన్నాయి. 120 వాట్స్ సూపర్ వూక్ చార్జింగ్ సదుపాయం ఉంది. దీని బరువు 190 గ్రాములు. 256 జీబీ స్టోరేజికి 8జీబీ ర్యామ్ అయితే రూ.37,990కి, అదే 12 జీబీ ర్యామ్ ఉంటే 39,999 లభిస్తుంది. కాంకరర్ బ్లాక్, ఫైరీ రెడ్ రంగుల్లో ఇది లభ్యమవుతోంది. అమెజాన్, ఐకూ స్టోర్స్‌లో ఇది లభిస్తుంది. ఆఫర్లు కూడా ఉన్నాయి.



బియ్యం డబ్బాలో ఫోన్! వద్దే వద్దు

స్మార్ట్ ఫోన్ చేతిలో నుంచి జారడం సహజం. ఒకోసారి నేలపై లేదంటే నీటిలో పడొచ్చు. నీటిలో మునిగితే మాత్రం వెంటనే బియ్యం డబ్బాలో పెడితే సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తారు. అంతే కాదు అందుకు తిరుగులేని రుజువులు చెబుతారు. అయితే ఐఫోన్ నీటిలో పడితే మాత్రం దాన్ని తుడిచి బియ్యంలో పెట్టే పని వద్దని నిపుణులు చెబుతున్నారు. ఆ మేరకు ఒక డాక్యుమెంట్ ‘మేక్ వరల్డ్’లో ప్రత్యక్షమైంది. బియ్యంలో పెట్టడానికి బదులు కింది విధంగా చేస్తే మంచిదని ఆ డాక్యుమెంట్‌లో తెలిపింది. అవేంటంటే...

- ఎక్స్‌టర్నల్ హీట్ లేదంటే కంప్రెస్డ్ ఎయిర్‌తో తడిసిన ఐఫోన్‌ను డ్రై చేసే పని పెట్టుకోకూడదు.
- పత్తి(దూది) లేదా పేపర్ టవల్‌ని కనెక్టర్‌లో పెట్టకూడదు
- బియ్యం బ్యాగ్‌లో పెట్టకూడదు. అలా చేస్తే, అందులో ఉండే చిన్నపాటి దూళి వంటి కణాలు ఫోన్‌లోకి చేరి డ్యామేజ్ కావచ్చు.



అందుకు బదులు

- కనెక్టర్‌ను కిందివైపుపెట్టి ఎక్కువగా ఉన్న నీటిని తొలగించాలి. తదుపరి గాలిసోకే చోట పెట్టి ఆరనివ్వాలి.
- అలా అరగంటసేపు ఉంచిన తరవాత చార్జింగ్‌తో లైటినింగ్ లేదా యుఎస్‌బీ-సి కేబుల్ లేదా మరో యాక్సెసరీకి కనెక్ట్ చేయడం ద్వారా ఉంచాలి. పూర్తిగా డ్రై అయ్యేందుకు కనీసం 24 గంటల సమయం పడుతుంది.
- పూర్తిగా ఆరినప్పటికీ చార్జింగ్ కాకుంటే అడాప్టర్ నుంచి కేబుల్‌ని తీసేయాలి. గోడ నుంచి కూడా తీసేయాలి. తిరిగి వాటిని కనెక్ట్ చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● శనివారం 24 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

ఎంట్రెన్స్ ఎగ్జామ్స్

ఏపీ ఆర్‌సెట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(ఏపీఎస్‌సీహెచ్‌ఈ) తరపున తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ(ఎస్‌వీయూ)- రీసెర్చ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏపీ ఆర్‌సెట్) 2023-24 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా పార్ట్ టైం/ఫుల్ టైం పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న యూనివర్సిటీలు, అనుబంధ కళాశాలలు, రీసెర్చ్ సెంటర్లలో అడ్మిషన్స్ ఇస్తారు.

స్పెషలైజేషన్‌లు: అడల్ట్ ఎడ్యుకేషన్, ఆంత్రోపాలజీ, బుద్ధిస్ట్ స్టడీస్, కామర్స్, ఎకనామిక్స్, ఎడ్యుకేషన్, ఇంగ్లీష్, ఫైన్‌ఆర్ట్స్, ఫోక్‌లోర్, హిందీ, హిస్టరీ, ఇంటర్నేషనల్ అండ్ ఏరియా స్టడీస్, జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్, లా, లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్, లింగ్విస్టిక్స్, మేనేజ్‌మెంట్, మ్యూజిక్, పర్ఫార్మింగ్ ఆర్ట్స్, ఫిలాసఫీ, ఫిజికల్ ఎడ్యుకేషన్, పొలిటికల్ సైన్స్, సైకాలజీ, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, డా.బీఆర్.అంబేద్కర్ స్టడీస్, రూరల్ డెవలప్‌మెంట్, సోషల్ వర్క్, సోషియాలజీ, సంస్కృతం, తెలుగు, టూరిజం మేనేజ్‌మెంట్, ఉమన్ స్టడీస్, అప్లయిడ్ లైఫ్ సైన్సెస్, బయో కెమిస్ట్రీ, బోటనీ, కెమికల్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, జాగ్రఫీ, జియాలజీ, హోం సైన్స్, మెటీరియల్ సైన్స్ అండ్ నానో టెక్నాలజీ, మేథమెటిక్స్, ఫిజిక్స్, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ, సివిల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెరైన్ ఇంజనీరింగ్, ఫార్మసీ, బయోటెక్నాలజీ, కంపారటివ్ ద్రవిడియన్ లిటరేచర్, తుళు, మహాత్మా జ్యోతి రావు పూలే స్టడీస్, ఉర్దూ, జియో ఇంజనీరింగ్, మెటియోరాలజీ అండ్ ఫిజికల్ ఓషనోగ్రఫీ.

యూనివర్సిటీలు-సీట్లు

యూనివర్సిటీ	ఫుల్ టైమ్	పార్ట్ టైమ్
ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, గుంటూరు	155	76
ఆదికవి నన్నయ యూనివర్సిటీ, రాజమండ్రి	86	36
ఆంధ్ర కేసరి యూనివర్సిటీ, ఒంగోలు	43	37
ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం	131	70
డా.బీ.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ, శ్రీకాకుళం	15	12
ద్రవిడియన్ యూనివర్సిటీ, కుప్పం	33	30
జేఎన్‌టీయూ, అనంతపురం	86	298
జేఎన్‌టీయూ, కాకినాడ	-	426
జేఎన్‌టీయూజీ, విజయనగరం	1	14
కృష్ణ యూనివర్సిటీ, మచిలీపట్నం	33	12
రాయలసీమ యూనివర్సిటీ, కర్నూలు	2	3
ఆర్‌జీయూకేటీ, నూజివీడు	5	7
ఆర్‌జీయూకేటీ, ఆర్‌కే వ్యాలీ	5	5
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్సిటీ, అనంతపురం	45	31
శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం, తిరుపతి	69	56
శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి	114	95
విక్రం సింహపురి యూనివర్సిటీ, నెల్లూరు	31	14
యోగి వేమన యూనివర్సిటీ, కడప	84	27



అర్హత వివరాలు

- కనీసం 55 శాతం మార్కులతో సైన్స్, ఆర్ట్స్, మేనేజ్‌మెంట్, కామర్స్, లా, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అర్హులే.
- పీజీ కాలేజీల్లో ఫ్యాకల్టీ/లైబ్రేరియన్/అసిస్టెంట్ లైబ్రేరియన్‌గా కనీసం రెండేళ్ల అనుభవం ఉన్నవారు; పాలిటెక్నిక్/ప్రభుత్వ/ప్రైవేట్/అనుబంధ జూనియర్ కాలేజీలు/పాఠశాలల్లో ఫ్యాకల్టీగా కనీసం నాలుగేళ్ల అనుభవం ఉన్నవారు పార్ట్‌టైం పీహెచ్‌డీకి అప్లయ్ చేసుకోవచ్చు. వీరు సర్వీస్ సర్టిఫికెట్ అప్‌లోడ్ చేయాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఏపీ ఆర్‌సెట్ 2023-24 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. అన్నీ మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఇందులో రెండు సెక్షన్లు ఉంటాయి. మొదటి సెక్షన్లో స్పెషలైజేషన్‌కు సంబంధించిన రీసెర్చ్ మెథడాలజీ నుంచి 70 ప్రశ్నలు, రెండో సెక్షన్లో సంబంధిత సబ్జెక్ట్ నుంచి 70 ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు ఉంటుంది. నెగెటివ్ మార్కులు లేవు.

ఇందులో అర్హత పొందాలంటే జనరల్ అభ్యర్థులకు కనీసం 50 శాతం మార్కులు, రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం మార్కులు రావాలి.

- ఈ టెస్ట్‌లో అర్హత పొందినవారిని మాత్రమే ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 60 మార్కులు నిర్దేశించారు.
- టెస్ట్ స్కోర్, ఇంటర్వ్యూ స్కోర్ ఆధారంగా అభ్యర్థుల ర్యాంక్ లిస్ట్ రూపొందిస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1500; బీసీ అభ్యర్థులకు రూ.1300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 19
- **దరఖాస్తులో కరెక్షన్స్:** ఏప్రిల్ 4 నుంచి 7 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** ఏప్రిల్ 10 నుంచి
- **పరీక్ష కేంద్రాలు:** ఏపీలోని అన్ని జిల్లా కేంద్రాలు, హైదరాబాద్
- **ఏపీ ఆర్‌సెట్ నిర్వహణ:** ఏప్రిల్‌లో
- **వెబ్‌సైట్:** cets.apsche.ap.gov.in/rcet

టీఎస్ పాలిసెట్

హైదరాబాద్‌లోని స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రెయినింగ్(ఎస్‌బీటీఈటీ)- పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్(టీఎస్ పాలిసెట్) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ/ఎయిడెడ్/ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాలిటెక్నిక్ కళాశాలలు; ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఇంజనీరింగ్ కాలేజీలు నిర్వహిస్తున్న పాలిటెక్నిక్ కళాశాలల్లో ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ స్టేట్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ(పీజేటీఎస్‌ఏయూ) అందిస్తున్న అగ్రికల్చరల్ డిప్లొమా కోర్సులు, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సింటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ) అందిస్తున్న హార్టికల్చరల్ డిప్లొమాలు, పీవీ నరసింహారావు తెలంగాణ వెటర్నరీ యూనివర్సిటీ(పీవీఎన్ఆర్‌టీవీయూ) అందిస్తున్న యానిమల్ హజ్‌బెండ్రీ అండ్ ఫిషరీస్ డిప్లొమా కోర్సుల్లో కూడా ఈ టెస్ట్ ద్వారానే అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా ప్రోగ్రామ్ వ్యవధి విభాగాన్ని అనుసరించి మూడేళ్లు/రెండేళ్లు ఉంటుంది.

విభాగాలు

మూడేళ్ల డిప్లొమాలు: సివిల్ ఇంజనీరింగ్, ఆర్కిటెక్చరల్ అసిస్టెంట్‌షిప్, మెకానికల్ ఇంజనీరింగ్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్, హోమ్ సైన్స్, మెటలర్జికల్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, ప్రింటింగ్ టెక్నాలజీ, ప్యాకేజింగ్ టెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్ అండ్ బిగ్ డేటా, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అండ్ సెక్యూరిటీ, ఎంబెడెడ్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ వీడియో ఇంజనీరింగ్, బయో మెడికల్ ఇంజనీరింగ్, లెదర్ అండ్ ఫ్యాషన్ టెక్నాలజీ, లెదర్ గూడ్స్ అండ్ ఫుట్‌వేర్ టెక్నాలజీ, టెక్స్‌టైల్ టెక్నాలజీ, కెమికల్ ఇంజనీరింగ్(ఆయిల్ టెక్నాలజీ/పెట్రో కెమికల్స్/ప్లాస్టిక్స్ అండ్ పాలిమర్స్), సిరామిక్ ఇంజనీరింగ్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్

రెండేళ్ల డిప్లొమాలు: అగ్రికల్చర్, ఆర్గానిక్ అగ్రికల్చర్, యానిమల్ హజ్‌బెండ్రీ, ఫిషరీస్, హార్టికల్చర్

అర్హత: తెలుగు రాష్ట్రాలకు చెందిన స్టేట్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(ఎస్ఎస్‌సీ), సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ), ఇండియన్ కౌన్సిల్ ఫర్ సెకండరీ ఎడ్యుకేషన్(ఐసీఎస్ఈ), నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్(ఎన్ఐఓఎస్), ఏపీ ఓపెన్ స్కూల్ సొసైటీ(ఏపీఓఎస్ఎస్), తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టీఓఎస్ఎస్), ఇతర రాష్ట్రాల బోర్డుల నుంచి మేథమెటిక్స్ ఒక సబ్జెక్టుగా పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

- అగ్రికల్చర్/హార్టికల్చర్/వెటర్నరీ డిప్లొమా ప్రోగ్రామ్‌లలో చేరాలంటే పాఠశాల స్థాయిలో కనీసం నాలుగేళ్లు గ్రామీణ ప్రాంతాల్లో చదివి ఉండాలి. విద్యార్థుల వయసు 2024 డిసెంబరు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

టీఎస్ పాలిసెట్ 2024 వివరాలు

- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో మొత్తం 150 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. మేథ్స్ నుంచి 60 ప్రశ్నలు; ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు ఇస్తారు. అగ్రికల్చర్/హార్టికల్చర్/వెటర్నరీ డిప్లొమాల్లో చేరాలనుకొనేవారు మాత్రమే బయాలజీ ప్రశ్నలు అటెంప్ట్ చేయాలి. ప్రశ్నలను పదోతరగతి సిలబస్ ఆధారంగా ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. నెగెటివ్ మార్కులు లేవు. పరీక్ష సమయం రెండున్నర గంటలు. ప్రశ్నపత్రం తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో ఉంటుంది. లాగ్ టేబుల్స్, క్యాలిక్యులేటర్స్, పేజర్స్, సెల్‌ఫోన్‌లను పరీక్ష హాల్‌లోకి అనుమతించరు.
- ఈ టెస్ట్‌లో అర్హత సాధించాలంటే 30 శాతం మార్కులు రావాలి. ఎస్‌బీటీఈటీ డిప్లొమా అభ్యర్థులకు మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ మార్కులను; అగ్రికల్చరల్ డిప్లొమా అభ్యర్థులకు మేథ్స్ (స్కేలింగ్ డౌన్ టు 30 మార్క్స్), ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ మార్కులను పరిగణనలోకి తీసుకుంటారు. అంటే మొత్తం 120 మార్కులకుగాను కనీసం 36 మార్కులు రావాలి.
- టీఎస్ పాలిసెట్‌లో రెండు రకాలుగా ర్యాంక్‌లు ప్రకటిస్తారు. ఎస్‌బీటీఈటీ పాలిటెక్నిక్ కళాశాలలు అందిస్తున్న డిప్లొమా ప్రోగ్రామ్‌లలో చేరేవారికి ఎంపీసీ ర్యాంక్; అగ్రికల్చరల్ పాలిటెక్నిక్‌లలో చేరేవారికి ఎంబైపీసీ ర్యాంక్ ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.250
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 22
- **టీఎస్ పాలిసెట్ 2024 తేదీ:** మే 17
- **ఫలితాలు విడుదల:** ఎగ్జామ్ పూర్తయిన పన్నెండు రోజుల తరవాత
- **వెబ్‌సైట్:** www.polycet.sbtet.telangana.gov.in

లిటిల్స్




మీకు తెలుసా?

- ఈము పక్షిలా ఉండే ఈ పక్షి పేరు సదరెన్ కాసోవరి. ఆస్ట్రిచ్ జాతికి చెందినది.
- టర్కీ కోడిలా ఉంటుంది. హానర్డ్ హెడ్ అని పిలుస్తారు దీని మీద ఉండే కొప్పు లాంటి చర్మాన్ని.
- 170 సెం.మీ పొడవు ఉండే ఈ పక్షి ఎత్తు మాత్రం 1.8 మీటర్లు ఉంటుంది. బరువు 58 కేజీల వరకు ఉంటుంది. ఇవి భూమిమీద 49 వేల పక్షులు మాత్రమే ఉన్నాయి.
- ఆస్ట్రేలియా, ఇండోనేషియా, న్యూ గినియా ప్రాంతాల్లో మాత్రమే ఉంటాయివి
- ఈ పక్షులు రెయిన్ ఫారెస్టుల్లో ఉండటానికి ఇష్టపడతాయి. అప్పుడప్పుడు సవన్నా గడ్డిభూములు, పండ్లు అధికంగా ఉండే చోటకు కూడా వస్తాయి.



- వీటి కాళ్లు, గోళ్లు బలమైనవి. ముక్కుతో పట్టుకుని కాళ్లతో చీలిస్తే ఏ జంతువు అయినా చచ్చిపోవాల్సిందే. అంత బలిష్టమైనది. మెల్లగా నడిచినట్లే ఉంటుంది కానీ గంటకు 50 కి.మీ వేగంతో పరిగెత్తుతుంది.
- వీటి అరుపు గట్టిగా ఉంటుంది. దూరానికి వినపడుతుంది. ఇవి కేవలం 3 లేదా 5 గుడ్లు మాత్రమే పెడతాయి. మగ పక్షులు నేలమీదనే గూడు కడతాయి. రెండు పక్షులు గుడ్లమీద యాభై రోజులు పొదుగుతాయి.
- పిల్లలకు 9 నెలలు వచ్చే వరకూ పెంచుతాయి.
- ప్రపంచంలోనే అతి పెద్ద పక్షిలో రెండో స్థానం. వీటి పంచ్ కరాటే కిక్‌లా ఉంటుంది. కాబట్టి ఇవి డేంజరస్.
- 1517 వ సంవత్సరంలో యూరప్‌లోని రుడాల్ఫ్ అనే చక్రవర్తి ఈ పక్షులను తొలిసారి పెంచాడు.
- మనుషుల్ని సునాయసంగా చంపేస్తాయి.
- వీటి జీవనకాలం 12 ఏళ్లనుంచి 40 ఏళ్లే.


5 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి



సరైన నీడ ఏది?



డైలీ సుడోకు - 238

		8						3
				5		6	8	
3	1		4			5		
2			5	7				
	9		8		6		3	
				4	2			6
		6			7		5	1
	7	9		3				
1						9		

సుడోకు - 237 సమాధానం

7	1	6	5	8	4	9	2	3
8	2	4	9	3	6	1	7	5
3	9	5	2	1	7	8	4	6
2	5	1	4	9	3	6	8	7
9	4	7	6	5	8	3	1	2
6	3	8	1	7	2	5	9	4
4	6	3	8	2	9	7	5	1
5	7	9	3	4	1	2	6	8
1	8	2	7	6	5	4	3	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

జాబ్ కార్నర్

సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 3000

ముంబయిలోని సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్(రిక్రూట్‌మెంట్ అండ్ ప్రమోషన్ డివిజన్) సెంట్రల్ ఆఫీస్.. దేశవ్యాప్తంగా రీజియన్లవారీగా బ్యాంకు శాఖల్లో అప్రెంటిస్ శిక్షణకు దరఖాస్తులు కోరుతోంది.

ఆంధ్రప్రదేశ్‌లో ఖాళీలు: 100 (గుంటూరు-40, విజయవాడ-30, విశాఖపట్నం-30)

తెలంగాణలో ఖాళీలు: 90(హైదరాబాద్-58, వరంగల్-38)

శిక్షణ కాలం: ఒక సంవత్సరం

అర్హత: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా విభాగంలో గ్రాడ్యుయేట్ డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హత కలిగి ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 31 నాటికి 20 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు; బీసీలకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టయిపెండ్: నెలకు రూరల్/సెమీ అర్బన్ శాఖలు రూ.15,000. పట్టణ శాఖలు రూ.15,000. మెట్రో శాఖలు రూ.15,000.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, మెడికల్ ఫిట్‌నెస్, ధ్రువపత్రాల పరిశీలన, రూల్ ఆఫ్ రిజర్వేషన్ అనుసరించి ఎంపిక చేస్తారు.


రాత పరీక్ష: ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. 1. క్వాంటిటేటివ్, జనరల్ ఇంగ్లిష్, రీజనింగ్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్. 2. బేసిక్ రిటైల్ లయబిలిటీ ప్రొడక్ట్స్ 3. బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్ 4. బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ 5. బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ అంశాల్లో ప్రశ్నలు అడుగుతారు.

దరఖాస్తు రుసుము: రూ.800. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్/మహిళా అభ్యర్థులకు రూ.600; దివ్యాంగులకు రూ.400.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: మార్చి 6

ఆన్‌లైన్ పరీక్ష తేదీ: మార్చి 10

వెబ్‌సైట్: www.centralbankofindia.co.in/en



సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్‌లో...

ఖాళీలు 1425

బిలాస్‌పూర్(ఛత్తీస్‌గఢ్)లోని కేంద్ర బొగ్గు గనుల శాఖకు చెందిన సౌత్ ఈస్టర్న్ కోల్‌ఫీల్డ్స్ లిమిటెడ్(ఎస్ఈసీఎల్)... కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: గ్రాడ్యుయేట్ ఇంజనీర్(మైనింగ్/ఎలక్ట్రికల్/మెకానికల్/సివిల్/ఎలక్ట్రానిక్స్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీరింగ్). డిప్లొమా(మైనింగ్/మైనింగ్, మైన్ సర్వేయింగ్/మెకానికల్/సివిల్ ఇంజనీరింగ్)

అర్హత: సంబంధిత ఇంజనీరింగ్ విభాగంలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి

కనిష్ఠ వయోపరిమితి: 18 సంవత్సరాలు

ఎంపిక విధానం: విద్యార్హతల్లో సాధించిన మార్కులు, ఉత్తీర్ణత సంవత్సరం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 27

వెబ్‌సైట్: www.secl-cil.in/index.php

ఆయిల్ ఇండియాలో సూపరింటెండెంట్‌లు

ఖాళీలు 16

అసోంలోని ఆయిల్ ఇండియా లిమిటెడ్...కింద పేర్కొన్న గ్రూప్-సి కేడర్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సూపరింటెండెంట్ ఇంజనీర్

అర్హత: ఇంజనీరింగ్ డిగ్రీ లేదా పీజీ(పెట్రోలియం ఇంజనీరింగ్/టెక్నాలజీ) ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 మార్చి 11 నాటికి 32 ఏళ్లు మించకూడదు

వేతనం: నెలకు రూ.80,000 - రూ.2,20,000

ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మార్చి 11

వెబ్‌సైట్: https://www.oilindia.com

ఎయిర్‌పోర్ట్స్ అథారిటీలో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌లు

ఖాళీలు 490

న్యూఢిల్లీలోని ప్రభుత్వరంగ సంస్థ...ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా...దేశవ్యాప్తంగా ఉన్న ఏఏఐ కార్యాలయాల్లో కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

1. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఆర్కిటెక్చర్): **3 పోస్టులు**
2. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - సివిల్): **90 పోస్టులు**
3. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఇంజనీరింగ్ - ఎలక్ట్రికల్): **106 పోస్టులు**
4. జూనియర్ ఎగ్జిక్యూటివ్ (ఎలక్ట్రానిక్స్): **278 పోస్టులు**
5. జూనియర్ ఎగ్జిక్యూటివ్(ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ): **13 పోస్టులు**

అర్హత: సంబంధిత విభాగంలో బీఈ, బీటెక్/ఎంసీఏ ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ గేట్ 2024 స్కోరు ఉండాలి.

వయోపరిమితి: 2024 మే 1 నాటికి 27 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు; దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

దరఖాస్తు రుసుము: రూ.300. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజు చెల్లింపు నుంచి మినహాయింపు ఉంటుంది.

దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: ఏప్రిల్ 2

దరఖాస్తుకు చివరి తేదీ: మే 1

వెబ్‌సైట్: www.aai.aero/

మహీంద్రా లా స్కూల్‌లో వర్క్‌షాప్, కాన్ఫరెన్స్

మహీంద్రా యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ లా ఒక వర్క్‌షాప్, మరో సదస్సు నిర్వహిస్తోంది. 'డేటా గవర్నన్స్ ఇన్ ద ఏజ్ ఆఫ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్'పై ఈ నెల 29న వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. అదే విధంగా 'రివల్యూషనరీ టెక్నాలజీస్ అండ్ ఎవల్యూషనరీ లాస్: చాలెంజెస్ అండ్ ఆపర్చ్యూనిటీస్'పై అంతర్జాతీయ సదస్సును మార్చి 1, 2 తేదీల్లో జరుపుతోంది. దీనికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖులు హాజరవుతున్నారు. అటు లా ఇటు సాంకేతికతకు మధ్య వారధిగా ఉండటానికి నేడు సమాజం ఎదుర్కొంటున్న పలు సవాళ్లను ఈ సదస్సులో చర్చించనున్నారు. వీటికి సంబంధించి మరిన్ని వివరాల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

వెబ్‌సైట్: https://www.mahindrauniversity.edu.in/one-day-international-conference-on-revolutionary-technologies-and-evoloutionary-laws-challenges-and-opportunities/

బిట్స్ పిలానీ డబ్ల్యుఐఎల్పీ - పీజీ డిప్లొమాలు

ప్రసిద్ధ సాంకేతిక విద్యా సంస్థ - బిట్స్ పిలానీకి చెందిన వర్క్ ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్(డబ్ల్యుఐఎల్పీ) విభాగం మూడు సరికొత్త పీజీ డిప్లొమా ప్రోగ్రామ్‌లను ప్రకటించింది. కెరీర్‌కు ఎలాంటి బ్రేక్ ఇవ్వకుండానే ఈ కోర్సులను చేసే అవకాశాన్ని బిట్స్ కల్పిస్తోంది. మార్చి 18లోపు వీటికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ స్మార్ట్ మొబిలిటీ:** స్మార్ట్ మొబిలిటీ కాన్సెప్టులు, టెక్నాలజీలు, పాలసీలపై సమగ్ర అవగాహన కల్పించే విధంగా ఈ ప్రోగ్రామ్‌ని మలిచారు. మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-smart-mobility.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఎలక్ట్రికల్ వెహికల్స్:** ఎలక్ట్రిక్ వెహికల్స్ డిజైన్, ఎనర్జీ మేనేజ్‌మెంట్ టెక్నిక్స్, ఈవీ రెగ్యులేషన్స్ తదితరాలను కలుపుతూ ఈ ప్రోగ్రామ్‌ని తీర్చిదిద్దారు మరిన్ని వివరాలకు - https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-electric-vehicles.php
- **పీజీ డిప్లొమా ప్రోగ్రామ్ ఇన్ ఆటోమోటివ్ సైబర్ సెక్యూరిటీ:** సైబర్ సెక్యూరిటీ సిస్టమ్స్‌పై సంపూర్ణ అవగాహన కలిగించే విధంగా ఈ కోర్సును మలిచారు. మరిన్ని వివరాలకు- https://bits-pilani-wilp.ac.in/pgd/post-graduate-diploma-in-automotive-cybersecurity.php